C

తానము పెళ్ళాము దానికి

నేను ఆడి

ఎం. ఎన్. రావు

చరక్కు

920.00954
INN

తెలుగు వి ద్యార్థి ప్రచురణలు

C.I

AOUA101B 120

V.R. NARLA
D.P.R.I.
Acc. No.
LIBRARY

రా మ మో హ న్ రా య్

భారత సమాజాన్ని ఆధునీకరణ చేయాలని తలపెట్టే వారందరూ రామమోహనరాయ్ నుండి కావలసినంత వుత్తేజం పొందవచ్చు. మహమ్మదీయుల పాలన పలచబడి, ఆంగ్లేయులు పాదుకుంటున్న రోజుల్లో, రామమోహనరాయ్ 'రాజా'గా బ్రతికి సామాన్యులను సంస్కరించ ప్రయత్నించాడు. అందు వలన ఆయనతో నాంది పలకటం ఔచిత్యాన్ని పాటించి నట్లుంటుంది.

భారత రాజధాని కలకత్తాలోవున్న రోజులవి. 1774మే 22న నేటి పశ్చిమ బెంగాల్ రాష్ట్రపు హుగ్లీజిల్లా రాధానగర్ గ్రామంలో ఒక పిల్లజమిందారు కుటుంబపు సంపన్నపుత్రుడుగా రామమోహన్‌రాయ్ జన్మించాడు తండ్రి రమాకాంత్ పట్టుదలగల సనాతనుడు. తల్లి తరిణీదేవి పంతంపాటించే స్త్రీ. నాడు కచేరీ భాష పర్షియన్. మాతృభాష బెంగాలీ. ఆ రెండిటితో పాటు ఆరబిక్‌లోకూడా అభ్యాసం చేసి, వయస్సుకు మించిన చురుకుదనం చూపి, రామమోహన్ తొమ్మిదవయేటనే పై చదువులకు సిద్ధమయ్యాడు. అప్పటికి దగ్గర విద్యానిలయం పాట్నాలో వుండటంచేత, సంపన్నత కలసి రావటంతో, అక్కడకు పంపించబడ్డాడు. మూడేళ్ళపాటు శ్రమించి ఆరబిక్, పర్షియన్ భాషలు అధ్యయనంచేసాడు. అసలీయన పాట్నాలో చదువుకై పంపబడలేదని వ్రజేంద్రనాథ బెనర్జీవంటి వారి వాదనల

ిషయం ఆలావుంచి, అక్కడ అరిస్టోటల్, యూక్లిడ్‌లను తుణ్ణంగా ఆకళింపు జేసుకున్నాడనటానికి ఆధారాలు లేక పోలేదు ఎంత నిష్ణాతుడైనప్పటికీ పర్షియన్ ఆరబిక్ భాషలు స్వదేశీ సంస్కృతి, తత్త్వం పట్టుబడటానికి తోడ్పడవు గదా. అందుకని 14వ ఏటే కాశీవెళ్ళి యథాశక్తి సంస్కృతం చదివాడు మొత్తంమీద 16వ సంవత్సరంవరకూ జీవితం యీ భాషాధ్యయనంలోనే గడచింది. అప్పటికి ఆంగ్లం చవిచూడనే లేదు. అయినా ఫరవాలేదు. బుర్రకు పదునుపెట్టే తర్కం కొంత పట్టుబడింది. గ్రంథరచనకు ఉపక్రమించి, పర్షియన్‌లో "తహ్ఫత్ మువాహిద్దీన్" వ్రాసి, పీఠికను ఆరబిక్‌తో అలంకరించి, ఉభయ భాషా ప్రావీణ్యతను కనబరచాడు.

పీఠికలో తన పర్యటనానుభవాలు ఉదహరించి, ఎక్కడ చూచినా పరమాత్మలో నమ్మకం కనబడుతున్నదనీ, సృష్టి స్థితికి అతనే మూలం అని అంగీకరిస్తున్నట్లున్నారనీ చెప్పాడు. అయితే ఆ యీశ్వరునికి ఎవరిష్టం వచ్చినట్లు వారు గుణగణాలు అంటగడుతున్నారు. దీన్నిబట్టి తేలిందేమంటే భగవంతుడు ఒక్కడేనని మానవులందరూ అంగీకరించటం సహజం. అక్కడ నుండి విజృంభించి సంప్రదాయ బద్ధమైన మతాచారాలు పరిహరించి, చిత్రిక బట్టటానికి పూనుకున్నాడు. మొండి వాదాలూ కుతర్కాలూ చీల్చి చెండాడలేదుగాని, ఆయన తర్కానికి అవి బలిగావటం మొదలెట్టాయి. ఏమైనాసరే చిట్టచివరకు అందరూ తమ అంతరాత్మతో సత్యాసత్యాలను విడమరచి చూడగలరనీ, యీ విశ్వానికంతటికీ నియమబద్ధపు మూలంగావుండే భగవంతుడిని గ్రహిస్తారని విశ్వాసాన్ని ప్రకటించాడు. ఆనాటికి అదే

చాలాగొప్ప. మానవుడి సహజస్వభావానికీ, దైనందిన ఆచారాలకూ తేడా చూపటం యీ స్థాయిలో రామమోహన్ కృషిలో భాగం. ఇందులో ముస్లిం తత్వ ప్రభావం స్పష్టంగా కనబడుతుంది. ఆచారాలు మతానివి. మేధస్సు దైవానిది. మనుషులలో కొంతకాలానికి మేధస్సు నిలబడుతుంది. ఆచారాల పస బయటపడుతుంది మానవుడు గుడ్డిగా తోటి మనిషిని అనుకరించే బదులు, దైవమిచ్చిన వివేచన ద్వారా మంచి చెడులను వేరుచేసి నిశితంగా చూడగలగాలి.

ఈ గ్రంథంలో రామమోహన్ మూఢనమ్మకాలను, అలౌకిక వాదాలనూ గర్హించాడు, ఖండించాడు. చనిపోయిన వాళ్ళు బ్రతకటం, స్వర్గానికి ఎగరటం వంటివి తోసిపుచ్చాడు. కార్యకారణసంబంధంపై నొక్కిపెట్టాడు ప్రత్యక్ష ప్రమాణానికి ప్రాధాన్యత యిచ్చాడు. వ్యక్తులు చెప్పారనే శ్రుతి ప్రమాణాలను శంకించాడు అధికారయుతంగా కొందరు వ్యక్తులు చెప్పినవి ప్రమాణంగా నమ్మాలంటే వారిలో వైవిధ్యాలు విపరీతంగా కనిపిస్తున్నయ్. అసలు అలాంటి వ్యక్తులు నిజంగా వున్నారో లేదో ఆధారాలులేవు. కనుక వారిపై ఆధారపడటానికి వీల్లేదన్నాడు. యీవిషయంలో అల్ ఘజాలి, దాదూదయాల్, కబీర్ ప్రభావం కనిపిస్తున్నది.

"తత్తల్" చిన్నగ్రంథం, చిన్నతనంలో వ్రాసింది. అయినా, రామమోహన్ భావసాహసానికి ప్రాతిపదిక. ఏకేశ్వర భావంనుండీ, ఆచారవ్యవహారాలు నిర్దాక్షిణ్యంగా ఖండించటం వరకు గ్రంథంపెట్టిన ఒరవడి. అతని జీవితాంతం కొట్టొచ్చినట్లు చూడొచ్చు

అనేక విధాలుగా 'తప్పల్' రామమోహన్ జీవితంలో మలుపు త్రిప్పింది. కుమారుని భావాలు తెలుసుకొని తండ్రి యింటినుండి గెంటివేశాడు అసహనానికీ పరాకాష్ఠ యీరీతిలో వుంటుంది. ఇల్లువిడిచి, సమాజమే పదిలంగా భావించి, దేశాటన చేస్తూ, అనుభవం యినుమడిస్తుండగా, టిబెట్టు వెళ్ళి లామా బుద్ధిజం అధ్యయనంచేశాడు. అంతవరకు ఫరవాలేదు. కాని తనస్వంత భావాలు గట్టిగా చెప్పటంలో వాదించటంలో, శాంతి కాముకమైన లామాలు వుగ్ర రూపందాల్చి. రామమోహన్‌కు నిర్యాణదశ ప్రాప్తింపజేయబోగా, ఒకస్త్రీ ప్రాణదానంచేసింది. స్త్రీల సమస్యలు పట్టించుకోటానికి బహుశ యిది ఒకకారణం కావచ్చు. ఇదంతా నాలుగుసంవత్సరాలు పట్టింది.

తండ్రి తరిమేశాడేగాని, పుత్రవాత్సల్యం పోగొట్టుకోలేక, అన్వేషించి, ఇంటికిపిలిపించి రామమోహన్‌కు వివాహం చేశాడు. మొత్తం రామమోహన్ జీవితంలో మూడు బాల్య వివాహాలు చేసుకున్నాడు. మొదటిభార్య చనిపోగా, మిగిలిన యిరువురితో అతని కాపురం అంతంత మాత్రంగానేవున్నది. ఉత్తరోత్తరా బాల్యవివాహాలు నిరసించటానికి కావలసినంత అనుభవం సంతరించుకున్నాడు. ఈ స్థితిలోనే, తన జీవితపు వెలితిని నిపటానికి గ్రీక్, హీబ్రూ, లాటిన్, ఆంగ్లం అభ్యసించ ప్రారంభించాడు. 1803 లో తండ్రి చనిపోగా, తల్లి ప్రాతికూల్యం వలన జమిందారు కుమారుడైన రామమోహన్ మర్షిదాబాద్ వెళ్ళి వుద్యోగం చేసుకొని బ్రతకవలసి వచ్చింది. భార్య, పసివాడితో రంగపూర్ కలెక్టర్ కార్యాలయంలో చిన్న వుద్యోగిగా ప్రవేశించి, కొన్నాళ్లు రాంఘర్, భగల్

పూర్‌లో ప్రవాసోద్యోగాలేవోచేసి, చివరకు రంగపూర్‌లోనే దివాన్‌దాకా దేకించగలిగాడు. ఆనాటికి అది చాలా గొప్ప. ఒకదశాబ్దంపాటు అందులో పనిచేసి, ముందుగానే రిటైర్ అయ్యాడు.

ఈలోగా ఒకదారుణం జరిగింది. 1811 లో తన అన్న జగన్‌మోహన్ చనిపోయాడు. భర్తతోపాటు చితిపై కాలిపోవటం ఆనాటి హైందవ స్త్రీల ఆచారం. అది అమానుషంగా కనబడింది రామమోహన్‌కు. వదినను బ్రతిమాలాడు ఆ పని చేయొద్దని. అమ్మో, యింకేమన్నా వుందా? సంఘం వెలివెయ్యదూ? వంశ ప్రతిష్ఠ పోదూ! నలుగురిలో తలెత్తుక తిరిగేడేలా? ససేమిరా వదిన ఒప్పుకోలేదు. నలుగురితోబాటు తనూ ఆహూతి కావాల్సిందే అన్నది వదిన. ఇదంతా సంఘాన్ని చూచేగాని, చావాలని మనసులోవుండికాదు. చితిపై దహించుకపోతుండగా భరించలేక లేవటానికి ప్రయత్నించింది. అరిచింది. కేకలు పెట్టింది. అవేవీ వినబడకుండా మేళతాళాలు మ్రోగించారు. తాళిగట్టేటప్పుడు అపస్వరాలు వినబడనీయకుండా యిలాటి మేళం మనకు అలవాటేగా. చితిపై లేవనీయకుండా వెదురుకర్రలుబెట్టి నొక్కారు. చూస్తుండగా భస్మమైపోయింది పదిన. చలించిపోయాడు రామమోహన్. మనుషులేనా వీళ్ళు? ఆ సమయంలో ఏమిచేయజాలకపోయినా ఆపిమ్మట ఆ దారుణ ఘాతుకాలను ఆపటానికి వదిన సహగమనం వుపకరించింది! ఏపైనా సరే యిది రూపుమాపాలని నిర్ధారించుకున్నాడు.

దివాన్‌గా వుంటూ చిన్న సమావేశాలు జరిపేవాడు. కాని పట్టణాల్లో చేసే కార్యక్రమాలే రాణిస్తయ్. ఆనాడు

రంగపూర్ యేమంత గొప్పనగరంగనుక. మహా అయితే మన మేజరు పంచాయతీ అంత. సౌకర్యాలు సరిగాలేని రోజులు. రామమోహన్ అప్పటికీ తనకు సంతృప్తికరంగా ధనార్జన చేశాడు. 42 వ సంవత్సరంలో పదవీ విరమణ చేసి, కలకత్తా చేరుకున్నాడు 1814 లో. అంతలో తండ్రిపరంగా ఆస్తికూడా కలసింది. ఇక రంగంలో దిగి కార్యక్రమాలు చేపట్టాడు.

రంగపూర్‌లో ఆంగ్లేయుల పరిచయం, ఆంగ్లభాషాభ్యాసం రామమోహన్ కలకత్తా వుద్యమాలకు బాగా వుపకరించాయి. వేదాలు, ఉపనిషత్తులు ఆంగ్లంలోకి అనువదించాడు. బెంగాలీలోకి వేదాంతసారంతోపాటు, కేన, ఈశ, కఠ, ముండకోపనిషత్తులు అనువదించాడు. ఏ కేశ్వరోపాసనకు మద్దత్తుగా తోడ్పడేటందుకు యివన్నీ అతనికి సాధనాలైనయ్. బైబిల్‌లో క్రైస్తుప్రబోధం మాత్రం బెంగాలీలోకి అనువదించాడు. హిందువులు, క్రైస్తవులు మహమ్మదీయులు రామమోహన్ రాయ్ ప్రభావాన్ని గుర్తించటం మొదలుపెట్టారు.

1815 లో ఆత్మీయ సభను స్థాపించి, తరచు సమావేశాలు జరపటంతో కొందరు ఏకేశ్వరవాదులు కూడారు. క్రైస్తవులతో సన్నిహిత పరిచయం కలిగింది. క్రైస్తవుల మూర్తి త్రయవాదనను ఖండించి, ఏకేశ్వర వాదన చేయగా కొందరికి ఆగ్రహంకలిగింది. విలియం ఆదం అనే క్రైస్తవ ప్రచారకుడు రామమోహనరాయ్ వాదన ప్రభావానికిలోనై, యీ పరిధిలో చేరి, ఒక సంస్థనుకూడా స్థాపించాడు. కాని అది పురిటి సంధిగొట్టి పోయింది.

సతీ సహగమనం వినగానే రామమోహన్ జ్ఞప్తికి వస్తాడు. ఈ అమానుష హైందవాచారానికి వ్యతిరేకంగా బెంగాలీ, ఆంగ్లంలో కరపత్రాలు వేయటంతో వాదన రగులుకున్నది. 1818 లో ప్రారంభమైన ప్రచారం వాదోపవాదాలతో తర్జనభర్జనలతో ఒక దశాబ్దం సాగింది. పై చేయి రామమోహన్‌దే గావటం స్త్రీలు స్మరించవలసిన చారిత్రక సంఘటన. ఆంగ్లేయ పాలకులు స్వదేశ మతాచారాలజోలికి రాకుంటే మంచిదని తమ తొలిక విధానంగా పెట్టుకున్నారు. స్వదేశీయులనుండే ఆందోళన వచ్చేసరికి ఆనాటి గవర్నర్ జనరల్ విలియం బెంటింగ్ శాసనం చేయటానికి అనుకూలత వ్యక్తపరచాడు. ఈలోపు శాస్త్రీధారాలతో సతీ సహగమనం అసంబద్ధమని ప్రచారం చేశాడు రామమోహన్. ప్రజాభిప్రాయానికి శాసనం జోడిస్తేగాని ఛాందసాన్ని ఛేదించటానికి వీలుపడదు. భర్తతో పాటు భార్య చనిపోకపోతే ఆమెకు రాగల అగచాట్లు, సమాజం దృష్టిలో చిన్నచూపు యివన్నీ సతీ సహగమనవాదులు వల్లె వేశారు. వాటిని పూర్వపక్షం చేస్తు, శీలం ఒక్క స్త్రీ విషయంలోనేనా అని మూలానికి వెళ్ళి ప్రశ్నించాడు రాయ్. మగవారి న్యాయాలు స్త్రీలను బలి పెట్టకూడదన్నాడు. అయిష్టంగా చితిపై చనిపోవటం అమానుషంగా వేర్కొన్నాడు. 1828 లో కూడా బెంగాల్ రాష్ట్రంలో 518 సహగమనాలు జరిగాయి.

1829 లో ఆంగ్లేయ పాలకులు సతీ సహగమనాన్ని నిషేధిస్తూ శాసనం చేయటం రామమోహన్‌రాయ్‌కు విజయం గావచ్చు గాని, భారత పునర్వికాసోద్యమానికి మాత్రం తొలి

మెట్టు. శాసనం చేయగానే పని పూర్తికాలేదు. సహగమనం కొనసాగనివ్వవలసిందిగా కోరుతూ, శాసనాన్ని తొలగించమని, హైందవ పండితులు ఇంగ్లండ్ పార్లమెంటుకు విజ్ఞప్తి సమర్పించారు. రామమోహన్‌రాయ్‌కు ఇంగ్లండ్ ప్రయాణం తగిలింది. ఎన్నోవిధాల అది వుపకరించింది. 1832 జులైలో పార్లమెంటు హైందవ పండితుల విజ్ఞప్తి తృణీకరించింది. రామమోహన్‌రాయ్ అప్పుడు అక్కడే వున్నాడు.

ఇంగ్లండ్ వెళ్ళేముందు రామమోహన్ చాలా కార్యక్రమాలు విస్తృతంగా సాగించాడు. గ్రంథాలు వ్రాశాడు ఆంగ్లంలో పత్రిక పెట్టాడు. దశదిశలుగా వ్యతిరేకతల్ని యెదుర్కొన్నాడు. ముద్రణాయంత్రం స్థాపించాడు. 1815లో స్థాపించిన ఆత్మీయ సభ 1819లో ఆగిపోయింది.

రామమోహన్ చేపట్టిన కొన్ని సాంఘిక కార్యక్రమాలు, ప్రచారాలు పరిశీలించాలి.

బెంగాల్ కులీన వంశాలలో బహుభార్యాత్వం ప్రతిష్టగా వుండేది. ఆచారబద్ధమై అలవాటుగా మారిన యీ సంప్రదాయంపై ధ్వజమెత్తి, యిది హైందవ శాస్త్రపద్ధతి కాదంటూ "ప్రాచీనకాలంలో స్త్రీల హక్కులు" అనే కరపత్రం ప్రచురించాడు. అయితే, యీ ఆచారాన్ని శాసన బద్ధంగా కాక, ప్రచారంతో పోగొట్టటానికే యిష్టపడ్డాడు. విధవా పునర్వివాహాలలో కూడా యించుమించు యీ ధోరణే అవలంభించాడు. ప్రచారంతో సంఘం సంస్కరించబడితే కావలసిందేమున్నది?

రామమోహన్‌రాయ్‌ను అనేక విషయాలలో గుర్తు పెట్టుకోటమే గాక అనుసరించాలి. 20 వ శతాబ్దంలో కూడా ఆయ నంతగా ఆధునికత చదువుకున్నవారిలో లేదు మరి. భారత సమాజం ఐరోపాతో పాటు ముందంజ వేయాలని, అందుకు ఆధునిక విజ్ఞానం అవసరమనీ, కనుక ఆంగ్ల విద్య తప్పనిసరి అని వాదించాడు. 1817 లోనే యీ వాదన చేశాడు. కలకత్తాలో సంస్కృత కళాశాల వద్దని, ఆంగ్ల కళాశాల మొదలు పెట్టించి, పునర్వికాస బీజం పెట్టాడు. 1822 లో తానే ఒక ఆంగ్ల పాఠశాల స్థాపించాడు. సంస్కృ తంలో నిష్ణాతుడు గనుక, యేది యెంత అభిలషణీయమో బేరీజు వేసుకోగలిగాడు. ఆయనకు దురుద్దేశాలు అంటగడితే యిక చెప్పజాలం.

ఆ నాడు గవర్నర్ జనరల్ లార్డ్ అమ్‌హెర్స్ట్‌కు తన వాదన వినిపించి. ఆంగ్ల కళాశాల ఆవశ్యకత నొక్కిచెప్పి, హైందవ పండితుల వాదన పూర్వపక్షం చేయటంలో కృత కృత్యుడై, 1823 లో ఆంగ్ల కళాశాల స్థాపనకు తోడ్పడ్డాడు. దేశీయులు బాగుపడాలంటే గణితం, భౌతిక రసాయనిక, శారీరక విజ్ఞాన శాస్త్రాభ్యాసం అవశ్యకమని, ప్రతిభావంతులచే వీటిని బోధింపజేయాలనీ, ఆధునిక గ్రంథాలతోపాటు పరిశో ధనా పరికరాలు అందజేయాలనీ కోరాడు. సంస్కృత వ్యాకరణం, హైందవ తత్త్వం చదువుకోదలచిన వారు స్వేచ్ఛగా చదవొచ్చుగాని. ప్రభుత్వం మాత్రం ఆంగ్లాన్ని ప్రోత్సహించి, దేశీయుల పురోభివృద్ధికి తోడ్పడమని కోరాడు.

సంస్కృతంలో లోతుపాతులు తెలిసిన వ్యక్తి యిచ్చిన సలహా అది. గమనార్హం.

ప్రాయకంగా రామమోహన్ సంస్కర్త. కొన్ని సందర్భాలలో ఆయన అభిప్రాయాలు రాజకీయ శాస్త్రానికి కూడా సంబంధించి లేకపోలేదు. అందులో స్వేచ్ఛ ఒకటి. విదేశీయుల పాలన పోవాలని, దేశీయులు విముక్తులు కావాలని ఆశించి, గ్రీక్ నేపిల్స్ దేశీయ పోరాటాలను సమర్థించాడు. ఫ్రెంచి విప్లవంతో ఎనలేని వుత్తేజం పొందాడు.

ఐర్లండ్ పోరాటానికి సానుభూతి వ్యక్త పరచాడు. స్పెయిన్‌లో రాజ్యాంగబద్ధమైన ప్రభుత్వం యేర్పడితే ఉప్పొంగిపోయాడు, విందు చేశాడు. ఇంగ్లండ్ ఓడ ప్రయాణంలో ఫ్రెంచి ఓడపై పతాకం చూసి, అక్కడకు వెళ్ళి, గౌరవ సూచకంగా వందన సమర్పణ చేసి, విప్లవానికి తన జేజేలు చెప్పాడు.

ఇంత చేసినవాడు, స్వదేశానికి సంబంధించి కొంత తిరకాసులోపడి, ఆంగ్లేయుల పాలనను సమర్థిస్తూ, కొంత కాలం పాటు కొనసాగాలని ప్రార్థించాడు. ఆంగ్లేయుల విజ్ఞానంతోగాని స్వదేశీయులు బాగుపడరని ఆయన దృఢమైన అభిప్రాయం. మేధావులు, శీలవంతులైన ఐరోపీయులు భారత దేశంలో స్థిరపడటానికి అవకాశం వుండాలన్నాడు. దేశాభ్యున్నతి దృష్ట్యా యివి అవసరమని స్వానుభవంతో చెప్పాడు.

పత్రికా స్వాతంత్ర్యాన్ని అదుపులో పెడుతూ ఆంగ్లేయ పాలకులు చేసిన నిర్ణయాలను పునః పరిశీలించమని, పత్రికా

స్వాతంత్ర్యం చాలా అవసరమనీ ఆక్రందించాడు. కలకత్తా ప్రముఖుల సంతకాలతో జార్జి చక్రవర్తికి విజ్ఞప్తి పంపాడు. సుప్రీంకోర్టుకు మరొక విజ్ఞప్తిని సమర్పించి విఫల ప్రయత్నాలు చేశాడు.

స్త్రీలకు ఆస్తి హక్కు వుండాలంటూ, హైందవ ధర్మ శాస్త్రాలు సోదాహరణగా చూపాడు. హిందువులకు యిది కంటకమే అయింది! శాస్త్రం ప్రకారం భర్త చనిపోతే కుమారునితోపాటే భార్యకూ సమానమైన ఆస్తి హక్కు వుండాలి. కాని నాటి బెంగాల్‌లో ఆచారంగానూ, కోర్టు నిర్ణయాలద్వారానూ పురుషులకే సర్వాధికారాలు వుండటంతో, రామమోహన్‌రాయ్ తిరుగుబాటు చేశాడు. సమానత్వపు హక్కులకు పునాది ప్రాతిపదికలు పలికాడు.

న్యాయచట్టాలు సంస్కరించవలసిన ఆవశ్యకత కూడా నొక్కి చెప్పాడు. ఇంగ్లండ్ పార్లమెంట్ సెలక్ట్ కమిటీ ముందు ప్రాతఫూర్వకంగా సుదీర్ఘ సాక్ష్యం సమర్పించాడు. దేశ మంతటికీ ఒకే నేరచట్టం వుండాలన్నాడు. నేరం చేస్తే ముఖాలు, వంశాలు, మతాలు చూచి శిక్ష వేయరాదని తాత్పర్యం. భారత రెవిన్యూ, జ్యుడిషియల్ సిస్టం "ది ఇండియన్ పెజంట్రీ" అనే రెండు భాగాలుగా ఈయన సాక్ష్యం గ్రంథస్థమైంది. కొన్ని ముఖ్యమైన సూచనలు: పాలన నుండి న్యాయ విధానం వేరుపరచాలి; చట్టం చేసేముందు ప్రజాభిప్రాయం సేకరించాలి; దేశీయులను ఉన్నతోద్యోగాలలో నియమించాలి; పాలకులకు 22 సంవత్సరాల కనీస వయఃపరిమితి వుండాలి;

కౌలుదారులకు రక్షణ కల్పించాలి; శాశ్వత కౌలుదారీ చట్టం వుండాలి; దేశీయు సైనికులను చేర్చుకోవాలి—యిత్యాదులు.

రామమోహన్ జీవితంలో అత్యంత ముఖ్యమైనదీ, మత సంస్కరణలో చేర్చొనదగినదీ బ్రహ్మసమాజ్ స్థాపన. 1828 ఆగస్టు 25 లాంఛనంగా కలకత్తాలో ప్రారంభించబడిన బ్రహ్మ సమాజ్ 1830 జనవరి 23 న స్థిరపడింది. రామచంద్ర విద్యా వగీష్, కాశీనాథ్‌రాయ్, ద్వారకానాథ్ ఠాగోర్, ప్రసన్న కుమార్, తారాచంద్ర చక్రవర్తి, చంద్రశేఖర్ డే గారలు రామమోహన్‌కు తోడుగా నిలబడ్డారు. సనాతన హిందువులు యీ సమాజ్‌ను గర్హించారు. వెలివేసినట్లుగా పరిగణించారు. వ్యక్తిగత నిందలు చేశారు. కాని రామమోహన్ తట్టుకుని నిలబడి ఈదాడు. అయితే, స్థాపించిన అచిరకాలంలోనే ఇంగ్లండు వెళ్ళి మరి తిరిగి రాలేదు, లేకుంటే సమాజ్ చరిత్ర మరొక విధంగా వుండేదేమో!

ఢిల్లీలో నామమాత్రపు మొగల్ పాదుషా ప్రాంతాలను ఆంగ్లేయులు స్వాధీనపరచుకున్నారు. వాటిని తిరిగి యిప్పించమని కోరటానికి పాదుషా తన పక్షాన వకాల్తా యిచ్చి, 'రాజా' బిరుదు యిచ్చి, ఇంగ్లండ్ పంపించాడు. ఆ విధంగా ఇంగ్లండ్ వెళ్ళే అవకాశాన్ని వినియోగించుకున్నాడు రాయ్. మిత్రు లంతా చందాలువేసి ఐదువేలు ప్రోగుచేసి యివ్వబోగా, తృణీ కరించాడు. సముద్ర ప్రయాణం చేయరాదనే హైందవ సంప్రదాయాన్ని లెక్కచేయక బయలుదేరాడు. త్రోవలో తుఫాన్ బాధితుడయ్యాడు. 1830 నవంబరు 15 న బయలుదేరి 1832 ఏప్రిల్ 8 న యింగ్లండ్ చేరుకున్నాడు. లివర్‌పూల్,

మాంచెస్టర్ చూస్తూ లండన్ వెళ్ళి, అనధికార భారత రాయ బారిగా ఘనస్వాగతాలు పొందాడు. పోయిన అసలుపని తప్ప, మిగిలినవి సాధించాడు. కొద్ది రోజులపాటు ఫ్రాన్స్ సందర్శించాడు. ఆరోగ్యం క్షీణించగా, బ్రిస్టల్‌లో ఒక ఆంగ్ల మిత్రురాలు మిస్ కాజిల్ గృహంలో వుంటూ 1833 సెప్టెంబరు 27 న మరణించాడు. ఆయన సమాధి బ్రిస్టల్‌లో యాత్రాస్థలం కాలేదుగాని, జ్ఞాపక చిహ్నంగా వుండేట్లు నిర్మించాడు ద్వారకానాథ్ ఠాగోర్.

References on pp 27

దేవేంద్రనాథ టాగోర్

బ్రహ్మసమాజ్‌ను గురించి తెలుసుకోవాలంటే ముగ్గురు వ్యక్తుల జీవితవిశేషాలు అర్థంజేసుకోవాల్సిందే. రామమోహన రాయ్ సృష్టికర్త. స్థితిగతులు చూచింది దేవేంద్రనాథ్. లయ విన్యాసకర్త కేశవచంద్రసేన్.

బ్రహ్మసమాజ్ స్థాపించిన వెంటనే ఇంగ్లండ్ వెళ్ళి శాశ్వతంగా తిరిగిరాలేని రామమోహన్‌రాయ్ కొందరు అనుచరులకు సమాజపుపనిని అప్పగించి వెళ్ళాడు. రామచంద్ర విద్యావగీష్ నమ్మకంగా సమాజాన్ని సజీవంతో వుంచగలిగాడే గాని, పెంచి పోషించలేకపోయాడు. ఆ సమయంలో దేవేంద్ర నాథ్ ప్రవేశించి బ్రహ్మసమాజ్‌ను మరికొన్నాళ్లుబ్రతికించాడు.

దేవేంద్రనాథ్ సంపన్నకుటుంబంలో జన్మించాడు. (1817) చిన్నప్పటినుండి నాయనమ్మ కథల ప్రభావంతో పెరిగాడు. అందువలన దైవచింతన జాస్తిగావుండేది. దీనికి తోడు రామమోహన్‌రాయ్ స్థాపించిన పాఠశాలలో విద్యా భ్యాసం చేసినందున ఏకేశ్వరవాదన వంటబట్టింది. సంస్కృతం బాగా చదువుకున్నాడు. ఈశ, కేన, కఠ, ముండక, మాండూ క్యోపనిషత్తుల ప్రభావం యీయనపై హెచ్చుగాపడింది. కలకత్తా హిందూకళాశాలలో తత్త్వశాస్త్రభ్యాసం చేశాడు. యూనియన్ బ్యాంక్‌లో వుద్యోగంచేశాడు. రామమోహన్ రాయ్‌తో కించిత్తు పరిచయంవున్నా, ఆయన కుమారుడు

రామప్రసాద్ రాయ్‌తో సన్నిహిత సంబంధంవున్నది. తా త్త్విక ప్రభావంతో, జిజ్ఞాసువుగా "త త్త్వరంజని" అనే సభను స్థాపిం చాడు. అదే "త త్త్వబోధిని"గా తర్వాత నామకరణ మొనర్చ బడింది. వేదాంతజ్ఞానాన్ని, శా స్త్రార్థాలను ప్రచారంచేయటం యీసభ ప్రధానోద్దేశం. బ్రహ్మసమాజ్ భావాలు నచ్చటంవలన 'త త్త్వబోధిని' సభను 1941 లో బ్రహ్మసమాజ్‌లో విలీనం చేయటమేగాక, అందులో తాను ప్రధానపాత్ర వహించటం మొదలుపెట్టాడు దేవేంద్రనాథ్. సంస్క-రణల జోలికిపోక, కేవలం ప్రార్థనతోనే సరిపెట్టుకున్నాడీయన. సంపన్నత, చిత్త శుద్ధివలన కొందరిని ఆకర్షించినా, కుటుంబంలో వారు బ్రహ్మ మతస్థులు కాలేకపోయారు. బ్రహ్మసమాజ్‌ను గురించి దేవేంద్రనాథ్ స్పష్టమైన అభిప్రాయాలు వెలిబుచ్చుతూ, యిది హిందువులకే పరిచితమన్నాడు. ఇతరులు చేరకూడదనికాదు. చేరకపోవచ్చునని ఆయన వుద్దేశం. నిజంకూడా అంతే.

దేవేంద్రనాథ్ ప్రవేశించేనాటికి బ్రహ్మసమాజ్ అంట రాని తనం పాటిస్తూనేవున్నది. వేదపఠనం జరుగుతుండే గది లోకి సూద్రుల్ని ప్రవేశింప నిచ్చేవారుకాదు. బయట వేదికపై మాత్రం అందరూ సమానమే. దేవేంద్రనాథ్ వచ్చి సమాజ ప్రచారానికి 'త త్త్వబోధిని' పత్రిక పెట్టాడు. శంకరవేదాంతం తృణీకరిస్తూ ఏకేశ్వరవాదం చెప్పారు. వేదప్రచారం బాగా చేశారు. రామమోహన్‌రాయ్ సూచించాడంటూ, గాయత్రి మంత్రం సహసూజప్రార్థనలో నిత్యకృత్యం గావించాడు. అయితే యిది జటిలంగా వున్నందున, ఉపనిషత్తులనుండి కొన్ని సులభ

మైన మంత్రాలు సేకరించి గ్రంథస్థంచేశారు. వేదాలు చదివి రావటానికి నలుగురిని కాశీపంపాడు. బ్రహ్మధర్మం వ్రాశాడు.

దుర్గపూజ జరిగే రోజులో ప్రతిసంవత్సరమూ యాత్ర చేసి వచ్చేవాడు దేవేంద్రనాథ్. తండ్రి మరణిస్తే శ్రాద్ధంపెట్ట నందుకు బంధువుల ఆగ్రహానికి గురై, ఆర్థిక యిబ్బందులు యెదుర్కొని, మహర్షిగా చలామణి అయ్యాడు. బ్రహ్మ సమాజ్‌ను హైందవంచేశాడు. కేశవచంద్రసేన్ రాకతో యీ పరిస్థితికి కొంత అడ్డుకట్టపడింది. సంస్కర్తగాని దేవేంద్ర నాథ్ చాలా సంస్కరణలపట్ల మౌనంవహించి వుండేవాడు. చివరకు సనాతనులకు లొంగిపోయాడు.

కేశవ్ చంద్ర సేన్

కేశవ్ చంద్రసేన్ వక్త. సంస్కర్త. తోకచుక్కవలె సాంఘిక రంగంలో కనబడి చూస్తుండగా అదృశ్యమైనవాడు. 1838 నవంబరు 19 న కలకత్తాలో జన్మించిన సేన్ హిందూ కళాశాలలో విద్యాభ్యాసం గావించాడు. 1856 లో పరీక్ష వ్రాసే సమయంలో ప్రక్కవిద్యార్థి లెక్కలపత్రం చూస్తూ తన జవాబులతో పోల్చుకుంటుండగా పట్టుబడ్డాడు. అహం దెబ్బ తిన్నది. ఉద్దేశాలు యెలావున్నా, కాపీ కాపీయేగదా! అధికారుల దృష్టిలో. దానితో అసలు లెక్కలకు ఉద్వాసనపలికి నైతిక తత్వాభ్యాసంచేశాడు. గింజుకున్నా రాని లెక్కలకన్నా మనస్సుగల తత్వం అతన్ని ఆకర్షించింది.

1857 లో అంటే 19 సంవత్సరాలకే బ్రహ్మసమాజ్ ప్రభావం పడగా, అందులోచేరి ప్రచారకుడుగా ప్రధానపాత్ర స్వీకరించాడు. నాటకసమితి స్థాపించి సమాజలక్ష్యాలను ప్రజానీకానికి నచ్చచెప్పే ప్రయత్నంచేశాడు. బ్రతుకుదెరువుకు కాక పోయినా బాంక్ ఆఫ్ బెంగాల్‌లో నెలకు 25 రూపాయల జీతంతో వుద్యోగంచేశాడు కొన్నాళ్లు. ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడగల ప్రతిభ అబ్బింది. అది సమాజానికి బాగా తోడ్పడింది. 1860 లో ప్రథమ రచనకూడా ప్రచురించాడు.

బ్రహ్మసమాజ్‌కు ఆచార్యుడుగా (1862 ఏప్రిల్ 18) అనేకచోట్ల పర్యటనలుచేసి, సమాజాన్ని పెంపొందించాడు.

దేవేంద్రనాథ్ ఠాగూర్ చేయలేని సంస్కరణలు ఎన్నో కేశవ్ ఇనుమడించిన యవ్వనోద్రేకంతో చేయగలిగాడు. కాని వారి గాఢమైత్రి ఆట్టేకాలం సాగలేదు. దేవేంద్రనాథ్ ప్రధానంగా ఆధ్యాత్మికవాది. ప్రార్థనతో సరిపెట్టుకున్న వ్యక్తి. కేశవ్ చంద్ర వుద్రేకి, వుత్సాహవంతుడు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలు సంస్కరించాలనే ఆసక్తి వుండటమేగాక, ఆచరణలో చూడాలనే అభిలాషపరుడు. బాల్యవివాహం చేసుకున్న కేశవ్ స్వానుభవంతో బాల్యవివాహాలు పోవాలని, స్త్రీలకు కనీసం 14, పురుషులకు 18 సంవత్సరాలు రానిదే వివాహం చేయరాదని ప్రచారంచేశాడు. ప్రభుత్వం యీ విషయంలో చట్టం చేయాలనే వుద్దేశం వెలువరించాడు. చివరకు సాధించగలిగాడు. ఈ చట్టాన్ని అప్పట్లో బ్రహ్మచట్టం అనేవారు కూడా (1872 చట్టం 3) విధవా వివాహాలు ప్రోత్సహించాడు. వేదప్రమాణాన్ని త్రోసిపుచ్చాడు. బ్రహ్మసమాజ్ ఆచార్యులు యజ్ఞోపవీతాన్ని తీసెయ్యాలన్నాడు. రామమోహన్‌రాయ్ స్థాపించిన నాటినుండీ బ్రహ్మసమాజ్ ఆచార్యులుగా కులీన బ్రాహ్మణులే వుండేవారు. ఆ సంప్రదాయం వుల్లంఘించటానికి కేశవ చంద్రసేన్ కారణభూతుడయ్యాడు. అంతర్వర్ణ వివాహాలు ప్రోత్సహించి, చేయించాడు. కరువునివారణ సహాయ కార్య క్రమాలెన్నో చేపట్టాడు. ఇదంతా చూసీచూడనట్లు పోతున్న దేవేంద్రనాథ్ ఠాగూర్ చివరకు జంధ్యం దగ్గర పట్టుబట్టాడు. కేశవచంద్రకూడా తెగిందాకాలాగాడు. దానితో యిరువురూ విడిపోయారు స్నేహంగా. 1866లో ఇండియా బ్రహ్మసమాజ్

సాపించాడు సేన్. ఠాగోర్ అనుచరులు ఆది బ్రహ్మసమాజ్‌గా చలామణి అయ్యారు. చీలికకు ఆ విధంగా నాందియేర్పడింది.

ఇండియన్ మిర్రర్ (ఆంగ్లం), ధర్మతత్త్వ (బెంగాలి) పత్రికలద్వారా వుధృతంగా ప్రచారంచేస్తూ, క్రైస్తవము ప్రభావితుడై వుపన్యాసాలతో వుద్భూతలూగిస్తూ, 'జీసస్ క్రైస్ట, ఐరోపా, ఆసియా' అనే విషయమై నూతన దృక్పథాన్ని రూపొందించాడు. ఆయన్ను క్రైస్తవమతంలోకి మార్చాలనే వృధాప్రయత్నం కొందరు చేయకపోలేదు.

ప్రచారోత్సాహంలో ఆరోగ్యాన్ని చూచుకొనక పాడు చేసుకున్నాడు కేశవ్. చైతన్య, క్రైస్తుప్రభావం కొట్టొచ్చి నట్లు కేశవ్‌పై కనిపించింది. "జీవనవేద"రచనలో యిది బాగా చూడొచ్చు.

బ్రహసమాజ్‌లో సంస్కరణలు తెచ్చి. సమాజాన్ని మార్చటానికి ప్రయత్నించిన కేశవ్, చీలికలతో, తానూమారి, అంతకు ముందు అంతగాలేని భక్తిభావాన్ని బాగా పెంపొందించుకున్నాడు. సంస్కరణల వాసనలు సన్నగిల్లినవ్. 1868 లో ప్రార్థననిమిత్తం కేశవ్ మందిరంకూడా నిర్మించారు. కొందరు కేశవ్‌నే ఆరాధ్యదైవంగా చూడటంప్రారంభించారు. ఈ సడించేవారు సరేసరి.

ఒకసారి సముద్రప్రయాణంచేసి సిలోన్ దర్శించిన కేశవ సేన్, బంధువులకు దూరమై, మరోసారి సముద్రపు ప్రయాణం చేసి ఇంగ్లండ్ వెళ్ళాడు 1870 లో. ఆయన భావాల ప్రభావం అప్పటికే ఇంగ్లండ్‌లో వ్యాపించి వున్నందున, చక్కని

స్వాగతం లభించింది. ఏకేశ్వరవాదులు ఘనంగా సత్కరించారు. తన వాగ్ధాటితో ఆశ్చర్యముగ్ధుల్ని చేశాడు కేశవ్.

మొదటినుండీ ఆంగ్లేయులన్నా, వారి పాలన అన్నా కేశవ్‌కు సదభిప్రాయంవున్నది. భారతీయులు ఆంగ్లపాలనపై విశ్వాసం వుంచాలని, దేశం క్లిష్టపరిస్థితుల్లో వున్నప్పుడు వెలుగు చూపిన ఖ్యాతి ఆంగ్లేయులదని, ఇదంతా దైవికమని కేశవ్ భావించి, వెల్లడించాడు.

'న్యూడిస్పెన్సేషనే' పత్రికలో యీ అభిప్రాయాలు వ్రాశాడు. కాని దేశానికి స్వాతంత్ర్యం అవసరమనీ, వర్ణవ్యవస్థ పోవాలనీ, సాంఘిక స్వేచ్ఛకావాలనీ వ్రాశాడు. ఐరోపాలో వస్తున్న మార్పుల్ని ప్రచారంలో జొప్పిస్తుండేవాడు. ప్రజలకు విద్య చెప్పాలనే తహతహతో 'సులభసమాచార్' సాధనంగా వినియోగించాడు. స్త్రీల అభివృద్ధికి కృషిచేసిన ప్రముఖుడుగా కేశవ్‌ను పేర్కొనవచ్చు. స్త్రీలు వున్నత విద్యాభ్యాసం చేయాలని అతని వుద్దేశ్యం. ఇంగ్లండ్‌లో జాన్‌స్టూవర్ట్ మిల్‌తో సంభాషణలు జరిపాడు. యథాశక్తి తనభావాలు ప్రచారంచేసి దేశానికి తిరిగివచ్చాడు.

రామకృష్ణ పరమహంసతో పరిచయమైన తర్వాత తన మిత్రులను, ఆంగ్లేయులను రామకృష్ణ బహుళప్రచారం పొంద టానికి తొలిదశలో కేశవ్‌కూడా తోడ్పడ్డాడు అనుకోకుండా.

దయానంద సరస్వతితో చర్చలు జరిపాడు. ఢిల్లీలో జరిగిన ఒకచర్చలో వేదప్రమాణం విషయమై వీరికి అంగీకారం

కుదరలేదుగాని లేకుంటే బ్రహ్మసమాజ్ ఆర్యసమాజ్ కలసి పోయేవేమో!

ఇంతలో ఒకవ్యక్తిగత సమస్య కేశవ్‌ను బ్రహ్మసమాజ్‌కు దూరంచేసింది. బ్రిటిష్ ప్రభుత్వంవారి అజమాయిషీలోపుటూ, ఇంగ్లండ్‌లో విద్యాభ్యాసంచేస్తున్న కూబ్‌బీహార్ మహారాజా అప్పటికి మైనరే. ఆయనకు వివాహంచేసే బాధ్యత ప్రభుత్వమే స్వీకరించి, కేశవచంద్రసేన్ కుమార్తె నిమ్మని అడిగారు. ఆ అమ్మాయికి యింకా 14 సంవత్సరాలు రాలేదు. కేశవ చంద్రవాదన ప్రకారం వధూవరులిద్దరికీ వివాహవయస్సులేదు. ఈ విషయమై ఎన్నోచర్చలు జరిగాయి. తర్జనభర్జన చేశారు. కాని కేశవచంద్ర వివాహానికి అంగీకరించి, వధూవరులు కలసి కోటానికి యేర్పాట్లుచేసి. యిరవురి ఆమోదం పొందాగు. ఇది కేశవ్ అనుచరులకు చెళ్లున చరచినట్లనిపించింది. ఆశ్చర్య పోయారు. కారణమడిగితే దైవసంకల్పమన్నాడు. ఆ నెపంతో ఏపనైనా యెవరైనా చెయ్యొచ్చుగా!

ఇదేపని మరొకరుచేస్తే తాను వ్యతిరేకిస్తానంటూ తన విషయం మాత్రం దైవనిర్ణయమన్నాడు కేశవ్. వివాహం జరిగిన అనంతరం మిత్రులంతా భరించలేక సాధారణ బ్రహ్మ సమాజ్‌ను స్థాపించుకున్నారు దానితో చీలికలు మూడు అయ్యాయి. కేశవ్ అప్పటికే సమాజ్‌కు చాలాదూరంగా జరిగాడు. ఈసంఘటనతో యింకాదూరమై 'న్యూడిస్పెన్సేషన్' ప్రారంభించాడు. అన్ని మతగ్రంథాలనుండి శ్లోక సంగ్రహాన్ని ప్రకటించాడు. క్రైస్తవ వాసనలు జాస్తిగా ద్యోతకమైనయ్.

క్రైస్తవుల నామకరణ విధానంవంటివి ప్రవేశపెట్టాడు. ప్రతి మతంలోనూ సత్యం వున్నదంటూ విశ్వమతం కాంక్షించాడు. ఇవన్నీ మానసిక విలక్షణాలు. అయితే 41 సంవత్సరాలకే కేశవ్ మరణించాడు (1884). బ్రహ్మసమాజ్ అయనతో ఋణదశపట్టిందనొచ్చు. 1883 బెంగాల్ సంవత్సరాది సందేశంలో విశ్వజనీనత కావాలని, అసూయ తొలగించుకోవాలని, అన్ని పవిత్ర మతగ్రంథాలు అంగీకరించాలని. దైవసాన్నిధ్యానికి కృషి చేయాలని చెప్పాడు. జీవితంలో విరక్తికి యివిపరాకాష్ఠ.

References on PP27

బ్రహ్మ సమాజ్

బ్రహ్మసమాజ్ 1828 ఆగస్ట్ 20 న రామమోహన్ రాయ్‌చే స్థాపించబడింది. మరో రెండు సంవత్సరాల అనంతరం, 1830 జనవరి 23 న లాంఛనప్రాయంగా ప్రారంభోత్సవం చేసుకున్నారు. కాని అదే సంవత్సరం నవంబరులో రామమోహన్‌రాయ్ ఇంగ్లండ్ వెళ్ళి, మరల తిరిగి రాలేదు. ప్రారంభించినప్పుడు రాయ్‌కు చేదోడు వాదోడుగా నిలచింది రామచంద్ర విద్యావగీష్, కాళీనాథ్‌రాయ్, ద్వారకానాథ్ ఠాగోర్, ప్రసన్నకుమార్, తారాచంద్ర చక్రవర్తి, చంద్ర శేఖర్ డే గారలు. వీరంతా ఆ నాటి కలకత్తా సమాజంలో పేరుగలవారు, పలుకుబడిగలవారు గావటంచేత, సనాతన హిందువుల వ్యతిరేకతకు ఎదురీది, వత్తిడికి నిలబడి తట్టుకోగలిగారు. రామమోహన్ నిష్ర్కమణతో రామచంద్ర విద్యావగీష్ ఆభారాన్ని శిరసా వహించాడేగాని, ఆయన శక్తి యుక్తులు చాల్లేదు. దేవేంద్రనాథ్ ఠాగోర్‌తో పరిచయమై ఆయన చేబడితేగాని సమాజం నిలబడలేదు. దశాబ్ద తర్వాత గాని యీ మార్పు రాలేదు. దేవేంద్రనాథ్ వచ్చిన తర్వాత సమాజానికి ఆధ్యాత్మికత బాగావచ్చి, ఆర్థికపుష్టి చేకూరింది. సమాజం మాత్రం స్థాణువుగానే వున్నది. ఎదుగుబొదుగు లేదు. ప్రార్థనలు, వేదపఠనం మొదలై నవి వచ్చాయి. ఇది 1842 తర్వాత సంగతి. 1857 లో కేశవచంద్రసేన్ వచ్చి

చేసి బ్రహ్మసమాజ్‌లో అనేక సంస్కరణలు తీసుకవచ్చి. కదలిక తెచ్చాడు. సమాజంలో ఆచార్యులు జంధ్యం ధరించ నక్కరలేదన్నాడు—కులీనబ్రాహ్మణులే ఆచార్యులుగా వుండ నక్కరలేదన్నాడు. బాల్యవివాహాలు మంచిదికాదనీ, విధవా పునర్వివాహాలు చేసుకోవచ్చనీ, అంతర్వర్ణ వివాహాలు ప్రోత్స హించాలనీ ఆచరణలో చూపాడు.

బ్రహ్మసమాజ్‌లో రెండు వర్గాలు బయలుదేరాయి. ఒక హిందువులకు సన్నిహితంగావుండే సనాతనవర్గం. దేవేంద్ర నాథ్ ఠాగోర్ దీనికి నాయకుడు. సంస్కరణలు ఆట్టే చేపట్టకపోగా, చేస్తున్నవారినికూడా వ్యతిరేకించారు వీరు. చివరకు బ్రహ్మసమాజ్ రెండుగా చీలిపోయింది ఒక చిన్న విషయమై. సమాజ్ ఆచార్యులు జంధ్యం వేసుకోనక్కర లేదంటూ, అవి లేని ఇరువురు ఆచార్యులను నియమించాడు కేశవచంద్రసేన్. చూసీచూడనట్లు పోయే దేవేంద్రనాథ్ ఠాగోర్‌ను రెచ్చగొట్టి. ఆయన అనుచరులను యీ పద్ధతిని వ్యతిరేకింపజేశారు. దానితో కేశవచంద్రసేన్ బయటపడి ఇండియా బ్రహ్మసమాజం అని నామకరణం చేయగా, మిగిలిన వారు ఆది బ్రహ్మసమాజ్ అనుకున్నారు. కాని యిది ఆట్టే రోజులు సాగలేదు. కేశవచంద్రసేన్ తన ఆశయాలకు భిన్నంగా మైనారిటీ వెళ్ళని కుమార్తెను మైనారిటీ తీరని కూచ్ బీహార్ మహారాజాకు యిచ్చి వివాహం చేసినందుకు నిరసనగా ఆయన అనుచరులు వెళ్ళిపోయి సాధారణ బ్రహ్మ సమాజ్ స్థాపించారు. ఆ తర్వాత కేశవచంద్రసేన్ బ్రహ్మ సమాజ్‌కు బాగా దూరమయ్యాడు.

ఈ విధంగా బ్రహ్మసమాజ్ చీలికలతో నామమాత్రంగా నిలచింది. ఈ ముగ్గురు నాయకుల తర్వాత సరైన నాయకు డెవరూ మళ్ళీ నిర్మాణ రంగంలోదిగి బ్రహ్మసమాజ్‌ను పునరుద్ధరించలేదు. నాటికీ నేటికీ ఆ సమాజ్ జీవచ్ఛవం వలె మనగలుగుతున్నది.

బ్రహ్మసమాజ్ భారతదేశంలో పునర్వికాసానికి నాంది పలికింది. వేదప్రమాణం కాదని, ఋషులవాక్కు ప్రోసిపుచ్చి, వివేచనకు అగ్రస్థానం యిచ్చిన సమాజ్ యిది. క్రైస్తవులలో, మహమ్మదీయులలో హిందువులలో గల ఏకేశ్వరవాదాన్నే యీ సమాజ్ ప్రధానంగా స్వీకరించింది. పవిత్ర గ్రంథాలలో కూడా యిందుకు అనుకూలంగా వుండేవాటిని క్రోడీకరించి శ్లోకసంగ్రహాన్ని ప్రకటించారు. వేదాలలో సమాజానికి బలాన్నిచ్చేసమాచారానికై దేవేంద్రనాథ్ ఠాగోర్ అన్వేషించి విఫలుడై, తానే ఒక గ్రంథం వ్రాశాడు. బ్రహ్మసమాజానికి అదే ప్రమాణగ్రంథమైంది బ్రహ్మధర్మవ్యాఖ్యానమది.

బ్రహ్మసమాజ్ సూత్రాలు

1. భగవంతుడు ఒక్కడే.
2. భగవంతుని ప్రార్థించటంలోనే ముక్తి లభిస్తుంది.
3. వేదాలు ప్రమాణంకాదు.
4. విగ్రహారాధన, శ్రాద్ధకర్మలు, యజ్ఞయాగాదులు, పూజలు అవసరంలేదు.
5. పునర్జన్మ లేదు.

6. మానవులందరూ ఒకటే. కుల, మత విభేదాలు కూడదు.

7. మూఢనమ్మకాలు పోగొట్టుకోవాలి.

కేశవచంద్రసేన్ క్రైస్తవుల ఆచారాలను కొన్నిటిని బ్రహ్మసమాజ్‌లో ప్రవేశపెట్టాడు. నామకరణరీతి అందులో ఒకటి. దేవేంద్రనాథ్ ఠాగోర్ హిందువులకు సన్నిహితంగా జరిగి గాయత్రీ మంత్రాన్ని రోజూ జపించమన్నాడు. రామమోహన్‌రాయ్ యివేవీ అనుసరించక, దైవప్రార్థనతోనే, సరిపెట్టుకున్నాడు.

బ్రహ్మసమాజ్ ప్రార్థనకు అత్యంత ప్రాముఖ్యతనిస్తుంది. రామమోహన్‌రాయ్ ప్రార్థనలో తరచు కళ్ళనీళ్ళుపెట్టేవాడు. ఆ సంప్రదాయాన్ని సమాజికులు అట్టిపెట్టారు.

క్రమేణా హిందూసమాజానికి లొంగిపోయి, ఓడిపోయింది బ్రహ్మసమాజం. క్రైస్తవులను, మహమ్మదీయులను తదితర హైందవేతరులను ఆకర్షించలేదు సరిగదా, హిందువుల విమర్శలకు నిలబడలేకపోయింది. అయితే బెంగాల్‌లో అనేక మంది నాయకులను వుత్తేజితులను గావించింది. యీసమాజం.

ఉదాహరణకు: రవీంద్రనాథ్ ఠాగోర్, ద్విజేంద్రనాథ్ సీల్, జగదీష్ చంద్రబోస్, ప్రతాప్ చంద్రమజుందార్, ఆనంద్ మోహన్‌బోస్, బిపిన్ చంద్రపాల్, చిత్తరంజన్‌దాస్, సరళా దేవి చౌదురాణి, రామానంద్ ఛటర్జీ, కృష్ణకుమార్ మిత్ర, ఎస్. పి. సిన్హా, నాగేంద్రనాథ్ ఛటర్జీప్రభృతులు సమాజంచే

ప్రభావితులైనవారే. కొందరు సమాజంలోపనిచేశారు. అయినా సమాజం విస్తృతంకాలేదు. సరిగదా నానాటికీ క్షీణించింది. దేశంలో అక్కడక్కడా బ్రహ్మసమాజ్ వాసనలు లేకపోలేదు. అవన్నీ నామమాత్రమే.

నేడు బెంగాల్‌లో బ్రహ్మసమాజ వివాదాస్పదంగా పరిణమించింది. వారిసంఖ్య స్వల్పం. వీరిని వెలివేసినవారిగానే పరిగణిస్తున్నారు హిందువులు. అడపదడప అంతర్వర్ణ వివాహాలు మాత్రం జరుగుతున్నయ్. అయితే బ్రహ్మసమాజ సభ్యులు హిందువులతో పోల్చి చూస్తే నిస్సందేహంగా అభ్యుదయవాదులే. కాని నేడు బ్రహ్మసమాజ్ స్థానం అచ్చులలో 'ఌ'ల స్థానమే.

REFERENCE BOOKS

1. **S. D. Collect** Life and Letters of Raja Rammohan Roy, Ed: Hem Chandra Sarkar, 1913 A.C. Sarkar, Calcutta.

2. **Ram Mohan Ray** his life, writing and speeches 1925 G. A. Natesan & Co., Madras.

3. **F. Max Muller** Ram Mohan to Ramakrishna Susil Gupta (India) Ltd., Calcutta 1952.

4. **J. K. Mujumdar** Raja Ram Mohan Roy and Progressive Movements, 1941 Art Press, Calcutta.

5. **Jogendra Chandra Ghosh** (ed) The English works of Raja Ram Mohan Roy (3 Vol.) 1901 Sreekantha Roy, Calcutta.

6. **Iqbal Singh** RamMohan Roy, 1958 Asia, Bombay.

7. **Satish Chandra Chakravarthi** The father of Modern India, Ram Mohan Roy 1935 Centenary Commemoration Volume, Calcutta.

8. **Ram Mohan Roy** Tuhfatul Muhahiddin tr: Moulv i Obaidullah 1949 Sadharan Brahma Samaj, Calcutta.

9. **Dr. Kalidas Nag & D. Barman** (Ed.) The English works of Ram Mohan Roy 1951 Sadharan Brahma Samaj, Calcutta.

10. **Satyendranath Tagore** (Tr.) The Autobiography of Maharshi Devendranath Tagore 1916 Macmillan & Co., London.

11. **P. C. Mozoomdar** The life of Keshub Chunder Sen 1891 Thacker, Spink & Co., Calcutta.

JOURNALS

1. **Mihir Sinha** "Brohmoism in Retrospect" Quest No. 38, 1963 Bombay-1.

2. **Nirmal Mukherjee** "Rammohan, Islam and Deism" Humanist Review No. 3,1969 Bombay-7.

దయానంద సరస్వతి

ఆంగ్లేయుల పాలనా ప్రభావం యింకా సోకని గుజరాత్‌లో దయానంద సరస్వతి 1824 లో జన్మించాడు. ఉత్తర భారత్‌లో అప్పటికి క్రైస్తవుల కన్నా, ముస్లింల ప్రభావం బాగా పాదుకపోవటమేగాక, హిందువు లనేకమంది ముస్లింలలో చేరారు. ఆ వాతావరణంలో పుట్టి పెరిగిన మూలశంకర్ (తర్వాత దయానంద సరస్వతి) తండ్రి ఆధ్వర్యాన వేదాలు నాలుగూ వల్లెవేశాడు. చిన్నతనంలోనే విగ్రహారాధనపై యేవగింపు చూపాడు. ఉపవాసాల వంటి ఆచారాలు ఈసడించుకున్నాడు. వేద ప్రమాణంపై బాగా గురి కుదిరింది. వ్యాకరణాది శాస్త్రాలు అభ్యసించాడు. కాని ఆంగ్లంజోలికి పోలేదు. వివాహం తలపెట్టగా తప్పించుకొని, పర్యటన ప్రారంభించాడు. సన్యాసిదుస్తులు ధరించాడు. ఎందరినో కలసి చర్చలు జరిపి, తృప్తికర సరైన గురువుకై అన్వేషించి, చివరకు విరజానందను గురువుగా భావించి రెండున్నర సంవత్సరాలు శుశ్రూష చేశాడు. హిందూ ధర్మశాస్త్రం, తత్త్వం బాగా ఆకళింపు చేసుకున్నాడు. ఇతర విషయాలజోలికి పోలేదు. హైందవ మతప్రచారం, మత వ్యాప్తికై దీక్ష బూనాడు. దీనికితోడు ముస్లింద్వేషం, వ్యతిరేకత కలసి, ద్విగుణీకృతోత్సాహంతో పని చేశాడు. ముందు హిందువులలో సంస్కరణ తేవాలని తలపెట్టి అనేక

ఆచారాలను ఖండిస్తూ ప్రచారంచేసాడు. వర్ణాశ్రమధర్మం వుండాలిగాని కులాలు పోవాలన్నాడు. అంటరానితనం కూడదన్నాడు. కలకత్తాలో దేవేంద్రనాథ్ ఠాగోర్, కేశవ చంద్రసేన్‌లతో సంప్రదింపులు జరిపాడు (1872). ఢిల్లీలో సర్ సయ్యద్ అహమ్మద్‌ఖాన్, కేశవచంద్రసేన్‌తో మళ్ళీ చర్చలుజరిపి మతానికి ఒక ప్రాతిపదికకై ప్రయత్నించి వేదాల విషయంలో పేచీరాగా విఫలమయ్యారు (1877). అంతకు ముందు కాశీలో పండితులను ఢీకొన్నాడు. సంస్కృతం హిందీ భాషలో నిష్ణాతుడు. వేదాలను హిందీలో బహుళ ప్రచారం చేయటంలో, ప్రజలకు మతభావాలు వారిభాషలో అందించటంలో అందెవేసిన చెయ్యి అనిపించుకున్నాడు. 1882 లో గోరక్షా సమితి యేర్పాటుచేసి, జీవకారుణ్యానికై ప్రచారం చేశాడు. హిందువులుగా మార్చటానికి అవకాశం వున్నదంటూ శుద్ధి కార్యక్రమాలు ప్రారంభించి, ముస్లింలుగా మారినవారిని తిరిగి హిందువులలో చేర్చాడు.

బ్రహ్మసమాజ్ ప్రారంభించిన పునర్వికాసోద్యమానికి అడ్డుకట్టలు వేసి, కేవలం హైందవోద్ధరణ, వేదప్రచారం మాత్రమే చేశాడు. ఒకవైపున సనాతన హిందువులనుండి వ్యతిరేకత వున్నా, ఎదుర్కొని నిలబడి, కట్టుదిట్టమైన నిర్మాణ కృషి చేశాడు.

దయానంద సరస్వతి జీవితంలో గుర్తు పెట్టుకోదగిన విషయం బొంబాయిలో (1875 ఏప్రిల్ 10) ఆర్యసమాజ్ స్థాపన. తర్వాత రెండు సంవత్సరాలకే లాహోర్‌లో సమాజ్‌కు రాజ్యాంగ నియమావళి రూపొందించాడు.

అనేక సాంఘిక సంస్కరణలు చేపట్టిన ఆర్యసమాజ్ ముస్లింల ఆధిక్యత వున్నచోట బాగా బలపడింది. వ్యాపించి ది. వారు చేపట్టిన శుద్ధి కార్యక్రమం యిందుకు దోహదకారి. వీరోచితంగా ముస్లిం వ్యతిరేకతతో పని చేయాలనే హిందువులకు ఆర్యసమాజ్ జీవం పోసింది. దానికి మూల పురుషుడు దయానంద్. 1877 నుండి 1883 వరకూ నిర్విరామంగా దేశ పర్యటనచేసి, ఆర్యసమాజ్ ప్రచారంచేసి, 59 సంవత్సరాలకు మరణించాడు.

ఆర్యసమాజ్ గురించి పరిశీలించేముందు దయానంద భావాలు కొన్ని ప్రస్తావించటం సబబు.

దయానంద ఏకేశ్వరవాది, వేదప్రమాణం తిరుగులేని దన్నాడు. యోగాభ్యాసంద్వారా సగుణ బ్రహ్మసాన్నిధ్యం పొందొచ్చునని నమ్మాడు. అద్వైతం, మాయావాదం తృణీకరించాడు. భగవంతునితోపాటు ఆత్మ, ప్రకృతికూడా శాశ్వతాలన్నాడు.సృష్టిప్రళయాలక్రమం నిత్యమంటూ,అది దైవలీలగా వేర్కొన్నాడు. అదే ప్రయోజనవాదం. ఆత్మకు విశిష్టత ముక్తదశలోనూ వుంటుంది. ఆదశనుండి వెనక్కు రానూవచ్చు. వేదాలు సర్వజ్ఞం పవిత్రం. వాటిలో అన్ని వున్నాయ్.

కులం నిర్ణయించవలసింది పుట్టుకవలనగాక మానసికస్థితి ననుసరించే ఆచరణలోవున్న కులవ్యవస్థపోయి, వర్ణాశ్రమధర్మం నిలబెట్టాలి. వేదజ్ఞానంలేని బ్రాహ్మణుడు కేవలం పుట్టుకతోనే ద్విజుడుకాజాలడు. వేదజడులు బ్రహ్మణులనిపించుకోటానికి అనర్హులు. వేదాలు చదవటానికి అందరూ అర్హులే. అంటరాని

తనం అమానుషం. వేదాలకు హిందీలో వ్యాఖ్యానంకూడా చెప్పాడు దయానంద. దయానంద్ భావాలు "సత్యార్థ ప్రకాశిక"లో పూర్తిగా మాడొచ్చు.

భారతదేశం పతనం గావటానికి తికళీలం లోపించటమే కారణమనీ, అది పునరుజ్జీవింపజేస్తే అంతా చక్కబడుతుం దన్నాడు. భారతదేశం ఆర్యావర్తం. పుణ్యభూమి, అయినా విదేశీపాలన పుండటం దురదృష్టం. స్వరాజ్యసాధనకు దేశీయ భాషలు బాగా వినియోగించుకోవాలి :

రాజరికం విషయమై దయానంద కొన్ని సూచనలు చేస్తూ, మనుస్మృతి, వేదాలు మేళవించి, ధర్మానుసారంగా పాలించే రాజ్యం కావాలన్నాడు. రాజుకూడా ఎన్నుకోబడా లని సూచించాడు. తాత్వికుల సలహా పాటించాలని పాలకులకు సలహాయిచ్చాడు. గ్రామం కేంద్రంగా సంక్షేమరాజ్యం నిర్మించాలనీ, కేవలం అహింసాయుతంగా అవసరమైన మేరకు శిక్షలు పుండాలన్నాడు. దైవశాసనాలకు అత్యంత ప్రాధాన్యత యివ్వాలని పులుముడువాదం చెప్పాడు. దైవశాసనాలకూ మానవశాసనాలకూ వైరంవస్తే, ఆధిక్యత దైవశాసనానికే పుండాలంటూ ఆయోమయవాదం జొప్పించాడు.

ఇక సంస్కరణల విషయానికొస్తే బాల్యవివాహాలకు, బహు భార్యాత్వాన్ని వ్యతిరేకించాడు. అంటరానితనం పోవా లన్నాడు. వేదాలు అందరూ చదవాలన్నాడు. ప్రజలు మాట్లాడుకునే భాషలో వేదాలు ప్రచారంచేశాడు. దీనితోపాటు

కరువు నివారణ కార్యక్రమాలు, విద్యాభివృద్ధి పథకాలు, సాంఘిక సేవలు చేపట్టాడు.

దయానంద జీవితంలో కొన్ని పర్యాయాలు థియోసఫీ ప్రభావం పడింది. మాడంబ్లాటోవిస్కీ పరిచయమయింది. కాని ఆయన దీక్ష అంతా హైందవ మతోద్ధరణే అయినా ఆయన పంథా సనాతనులు అంగీకరించనందున, ఆర్యసమాజ్ పెట్టాల్సి వచ్చింది. అయితే అది హిందూసమాజంలో ఒక భాగంగానే ప్రవహించింది గాని బ్రహ్మసమాజంవలె స్వతంత్రించలేదు. పైగా అధికార ప్రమాణాలను కట్టుదిట్టంచేసి, మానవుని స్వేచ్ఛకు ఆటంకమయింది. పునర్వికాసానికి అది చాలా విరోధి. దేశప్రజల్లో శాస్త్రీయజ్ఞానానికి జాప్యం పెంచాడు దయానంద. అదొక మలుపు. అనుకోకుండా. ముస్లిం న్యతిరేకతతో, ఆధునీకరణకు అడ్డుపడి తీరని ఆపచారంచేశాడు. హిందూయిజాన్ని సైనికతత్వంతో మలచప్రయత్నించాడు.ఫాసిజపుబీజాంకురాలు వెశాడు దేశంలో.

ఆర్య సమాజ్

ఆర్యసమాజ్ దయానంద సరస్వతి రూపకల్పన. 1875 ఏప్రిల్ 10 న బొంబాయిలో స్థాపించబడిన సంస్థ. రెండుసంవత్సరాలు అనంతరం లాహూర్‌లో ఒక ప్రణాళిక, నియమావళి రూపొందించుకున్నది. మత ప్రాతిపదికలో ఐక్యత సాధించాలని బ్రహ్మసమాజ నాయకులతో ముస్లిం నాయకులతో జరిపిన చర్చలు విఫలమైనయ్. థియోసఫీ తత్త్వం పూర్తిగా నచ్చలేదు. ఆ పరిస్థితులలో తన భావాలకు ఒక సంస్థ కావలసి వచ్చింది దయానందకు. హిందువులలో దురాచారాలు చూశాడు. వాటిని సంస్కరించాలన్నాడు. సంస్కరణద్వారా ఆధునీకరణ చేయాలనే తలంపు లేదు. హైందవత్వం వీరోచితంచేసి, దేశమంతటికీ వేదపరిమాణం అంగీకరింపచేసి. ముస్లిం క్రైస్తవ ప్రచారం అడ్డుకొని, వేదసనాతనత్వం, అట్టి పెట్టాలనేది మూలం. ఆర్యసమాజ్ దశసూత్రాలు పరిశీలిస్తే యీ విషయం స్పష్టపడుతుంది :

1. జ్ఞానానికి మూలం భగవంతుడు.

2. భగవంతుడు సర్వజ్ఞుడు, సర్వాంతర్యామి, సర్వశక్తివంతుడు.

3. జ్ఞానానికి మూలం వేదం, ఆర్యులు వాటిని పఠించి. బోధించి, ప్రచారం చేయాలి.

4. సత్యాన్ని స్వీకరించటానికీ, అసత్యాన్ని త్యజించటానికి సంసిద్ధంగా వుండాలి.

5. ధర్మానుసారమే అన్నిపనులూ చేయాలి.

6. భౌతిక, సాంఘిక, ఆధ్యాత్మిక రంగాలలో మంచిని చేకూర్చటమే లక్ష్యం.

7. అందరినీ ప్రేమతో చూచి, న్యాయం చేకూర్చాలి.

8. అజ్ఞానాన్ని విసర్జించి, జ్ఞానాన్ని స్వీకరించాలి.

9. స్వలాభాపేక్షతో గాక అందరి సంక్షేమానికి కృషి చేయాలి.

10. సమాజ నియమాలకు కట్టుబడాలి. వ్యక్తిగత స్వేచ్ఛ వుండాలి.

భగవంతుడు, ఆత్మ, ప్రకృతికి సత్యాలుగా ఆర్యసమాజ్ గుర్తించింది. వీటి వునికికి కారణాలు చెప్పి, నమ్ముతుంది. ఆలోచనకు మూలమైన 'నేను' అనేది జీవాత్మకు మూలం. చైతన్యరహిత పదార్థాన్ని నడిపించే చైతన్యత వున్నది. చైతన్యంగల అనేక ఆత్మలున్నయ్ కనుక వీటికిమించిన పరమాత్మ వున్నది.

ఆర్యసమాజ్ అద్వైతాన్ని, మాయావాదాన్ని తృణీకరిస్తుంది. అవతారాలు నమ్మరు. ఆచారాల నెన్నిటినో త్యజించమని చెప్పిన ఆర్యసమాజ్ కొన్ని కొత్త ఆచారాలు వేదోక్తంగా ప్రవేశపెట్టింది.

చనిపోయినవారికి శ్రాద్ధం, తర్పణం అనవసరమంటారు. ఉపవాసాలకు ఆధ్యాత్మిక విలువ లేదన్నారు. శాఖాహారం మంచిదన్నారు. స్త్రీ పురుష భేదం తరతమ భేదం లేదంటూ వర్ణాశ్రమధర్మం మాత్రం వుండాలన్నారు. అయితే పుట్టుక వలన కులనిర్ణయం జరగకూడదనీ, గుణ కర్మ స్వభావాల ననుసరించి విభజన వుండాలనీ చెప్పారు. సమాజంలో వ్యక్తుల మధ్య విధులు, హక్కుల కేటాయింపుకు వర్ణ వ్యవస్థ తోడ్పడు తుందని వీరి నమ్మిక. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య కులాల వారు, వేదపఠనానికీ, యజ్ఞాలు చేయటానికీ, తద్భిన్నమైన వారు శూద్రులనీ చెప్పారు. మానవ జీవితంలో బ్రహ్మచారి ఆశ్రమం ఒక్కటే తప్పనిసరి. మిగిలినవి ఆయా వ్యక్తుల ఉష్టానుసారం ఆచరించవచ్చు.

హిందువులుగా మారే అవకాశం ఎవరికైనా వుంటుంది. దీనికై 'శుద్ధి' కార్యక్రమాన్ని రూపొందించారు ఆర్య సమాజికులు. రాజస్తాన్‌లో చాలామందిని హిందువులుగా 'శుద్ధి' చేశారు.

దయానంద అనంతరం ఆర్యసమాజ్‌లో శాఖాహార మాంసాహార నియమాల విషయమై తీవ్ర వాదోపవాదాలు జరిగి, చీలికలకు దారితీసింది. ఆహారనియమాలు కూడా ఎలా వుండాలో శాసించే సమాజం నియంతృత్వ లక్షణాలు గలదను కోవాలి.

పార్టీ రాజకీయాల జోలికిపోకపోయినా, వీరశైవ పార్టీలకు అండగా నిలచింది యీ సమాజం. ఇటీవల వీరి

లక్ష్యాలూ,కొన్ని మతపక్షలక్ష్యాలు చాలా సన్నిహితమైనందున చాలామంది ఆర్యసమాజికులు రాజకీయాల్లో ప్రవేశించారు. వీరి ముస్లిం వ్యతిరేకత సెక్యులరిజానికి బాగా అడ్డుపడింది. క్రమేణా దేశంలో ఆర్యసమాజ్ ప్రభావం క్షీణిస్తున్నది. ఆధునికత బొత్తిగా లేకపోవటమే అందుకు ప్రబలకారణం.

REFERENCE BOOKS

1. **Ganga Prasad Upadhyaya**: The Origin, Scope and Mission of the Arya Samaj. 1940 Arya Samaj, Chowk, Allahabad.

2. **Lajpat Roy**: A History of the Arya Samaj. 1967 Longmans, London (Ed. Ram Sharma).

3. **Haravilas Sharada**: Life of Dayananda Saraswathy. 1946 Ajmer.

4. **Dayananda Saraswathy**: Light of Truth, Tr: G. P. Upadhyaya, 1947 Cal Press, Allhabad.

JOURNALS

1. **V. K. Sinha**: "Militant Hindu Nationalism" Humanist Review, No. 4, 1969 Bombay-7.

రామకృష్ణ పరమహంస

రామకృష్ణ ప్రభావం వలన వివేకానంద దేశ విదేశాలలో వేదాంత ప్రచారంచేశాడు. ఇంకా అనేకమంది చదువుకున్న వాగు రామకృష్ణ శిష్యులయ్యారు. కొందరు ఆయన్ను పిచ్చి వాడన్నారు. కొందరు తటస్థంగావున్నారు. సామాన్యులపై రామకృష్ణ ప్రభావం చాలావున్నది. దేశంలో రామకృష్ణ పద్ధతి అనుసరించి అనేకమంది యోగులు, సన్యాసులు బయలుదేరి అనుభూతులు పొందామంటూ, చిన్న మఠాలు స్థాపించారు. ఆధునిక భారతదేశం రామకృష్ణ ధోరణివలన యెలా గమించిందీ తెలుసుకోవటం అవసరం.

పశ్చిమబెంగాల్ రాష్ట్రములోని హుగ్లీజిల్లా కమర్పుకర్ అనే కుగ్రామంలో ఒక పురోహితునికి జన్మించాడు రామకృష్ణ. తల్లిదండ్రులు పెట్టిన పేరు గదాధర్. 1883 ఫిబ్రవరి 20 న జన్మించాడని మాక్స్‌ముల్లర్ వ్రాయగా 1836 ఫిబ్రవరి 17న పుట్టినట్లు స్వామి శారదానంద పేర్కొన్నారు. అదే మంత ప్రధానమైనవిషయం కాకపోవచ్చుగాని. కుగ్రామంలో పరిశోధనకు లభించే ఆధారాలు యెలావుంటాయో దీనినిబట్టి వూహించవచ్చు. రామకృష్ణ గురించిన చిన్ననాటి గాథలు కూడా యించుమించు యిలాంటివే. కనుక వాటి నాధారంగా ఒక నిర్ణయానికి రాజాలం.

లభించిన రచనలలో సామాన్య విషయాల నాధారంగా రామకృష్ణ జీవన విశేషాలు కొన్ని తెలుసుకోవచ్చు.

రామకృష్ణ పుట్టిన గ్రామం చాలా చిన్నది. పురోహితుడుగా ఆ గ్రామంలో రామకృష్ణ తండ్రి ఖుదీరాం ఛటోపాధ్యాయ అందరిమన్ననలకు పాత్రుడయ్యాడు. కమ్మర్లు, వడ్రంగి, గొల్లకాపరులు మొదలైన వారితోవున్న ఆగ్రామంలో చిన్న విధిబడివుంటే అందులోనే రామకృష్ణ విద్యాభ్యాసం చేశాడు కాని చదువు అబ్బలేదు. లెక్కల్లో బొత్తిగా సున్నా. పూరికి వెళ్లే రహదారి ఆ గ్రామం ప్రక్కగా వెళ్ళటం వలన, సన్యాసులు, యోగులు తరచు ఆ గ్రామంలో విశ్రాంతి తీసుకుంటుండేవారు. కుర్రవాడుగా రామకృష్ణ వారి చెంతకు వెళ్ళి, వారి మాటల వలన దైవం, యోగం, భక్తి మొదలైన విషయాలు నేర్చుకుంటుండేవాడు. గ్రామంలో కథాకళి పద్ధతులలో చెప్పిన అనేక గాథలు విని, మననం చేసుకున్నాడు. ఊరివెలుపల పిల్లలందరూ నాటకాలు అనుకరిస్తూ ఆటలు ఆడుకునేవాటిలో రామకృష్ణకూడా పాత్రవహించాడు. కంఠం బాగావుండటం, కుర్రవాడు అందంగా కనబడటం, పురోహితుని పుత్రుడుగావటం, అతను పాడగలగటం. కథలు ముచ్చటగా చెప్పగలగటం వలన ఆవూళ్ళో స్త్రీలను ఆకర్షించాడు. తరచు వారితో ముచ్చట్లాడుతూ, వారిని మెప్పిస్తూండేవాడు. స్త్రీల మధ్య మసలుతూ, స్త్రీవేషంకూడా వేశాడు చిన్నతనంలోనే. ఇవన్నీ రామకృష్ణ జీవితంలో వృత్తరోత్తరా చాలా ప్రముఖ పాత్ర నిర్వహించాయి. కుటుంబ సంప్రదాయాలు, ఆచారాల ప్రకారం ప్రార్థనలు, పూజా పునస్కారాలు, తరచు వుపవాసా

లుండటం రామకృష్ణకు అలవాటైంది. అతనిచేష్టలుకూడా స్త్రీలకు సన్నిహితంగా వుండేవి. 8 వ యేటనే మూర్ఛవచ్చి పడిపోయాడు. అన్నతోపాటు కలకత్తా వెళ్ళేలోగా మూడు పర్యాయాలు మూర్ఛలురాగా తల్లిదండ్రులు ఆయన ఆరోగ్యాన్ని గురించి ఆందోళనచెందారు. మూర్ఛవచ్చి పడిపోయినప్పుడు చెవిలో చాలాసేపు దైవనామస్మరణచేస్తే స్పృహ వస్తుండేది. రామకృష్ణకు వీధిబడిలో కొంచెం బెంగాలీ తప్ప మరేదీ అంటలేదు. జ్ఞాపకశక్తి మాత్రం బాగావుండటం వలన విన్నవీ కన్నవీ తిరిగి చెప్పగలిగేవాడు. చిన్నతనంలోనే తండ్రి మరణించాడు. అన్న పౌరోహిత్యానికి చేదోడువాదోడుగా వుండటానికి కలకత్తా చేరుకున్నాడు. రాణిరాస్‌మణి నిర్మించిన దేవాలయానికి పురోహితుడుగా తనఅన్న వుండటం రామకృష్ణకు యిష్టంలేకపోవటానికి కారణం రాస్‌మణి శూద్ర కులానికి చెందటమే. అప్పటికి తన కులఔన్నత్యం రామకృష్ణలో తొణికిస లాడుతూంది. సొంతంగా వంట చేసుకున్నాడు. అన్న చనిపోగా తానే పురోహితుడయ్యాడు దక్షిణేశ్వరాలయానికి.

పురోహితుడుగా రామకృష్ణ తన కర్తవ్యాన్ని సరిగా నిర్వర్తించలేకపోవటానికి ఆయన అనారోగ్యమేగాక. మానసిక విలక్షణాలెన్నో తోడుపడ్డయ్. మూర్ఛలు తరచు రావటం, వచ్చినప్పుడు చాలాసేపు తెలివితప్పి వుండటం, దేహం క్రమేణా శుష్కించి పోవటంతో ఆయుర్వేద చికిత్స పొందాడు గాని ప్రయోజనం లేకపోయింది. మానసిక చికిత్స యింకా బహుళ ప్రచారంలోకి రానిరోజులవి. పూజలు మానేశాడు.

కాళిని తల్లిగా భావించటం ప్రారంభించాడు. పెళ్ళిచేస్తే జబ్బు కుదురుతుందని ఐదేళ్ళ శారదామణి నిచ్చి బాల్యవివాహం చేశారు పెద్దలు. ఆమెతో కాపురంచేసేదేముంటుంది ? సంవత్సరంన్నర తిరగకముందే మళ్ళీ దక్షిణేశ్వరాలయానికే వచ్చి చేరాడు. అప్పటికే వేరే పురోహితుడిని యేర్పరచటంతో యితనికి పూర్వపు అనుభూతులు, లక్షణాలు తిరగ దోడటం మొదలుపెట్టాయి. స్త్రీ లందరూ తల్లితో సమానం అనేవాడు. స్త్రీ స్పర్శ, సాంగత్యం గిట్టేవికాదు. దైవాన్ని స్త్రీగా భావించి అనుభూతి పొందేవాడు. మానవ సహజమైన కామ ప్రవృత్తి విపరీతంగా అణచుకోవటం, ఆ విషయం మరల రాకుండా వుండాలనుకోటంతో, అది మరోరూపంలో తలెత్తి వెర్రితలలు వేసేది. దాని ఫలితమే స్త్రీపట్ల రామకృష్ణ ప్రవర్తన విలక్షణం. ప్రతి స్త్రీని తల్లి అనుకోటానికి విపరీత కామపరివృత్తి కారణం,

స్త్రీని చూడగానే వచ్చే కామవాంఛను మాతృభావంగా మార్చుకుంటేగాని, ఆ వాంఛ అణగిపోదన్నమాట. ఇదొక విలక్షణం. సామాన్యులకు లేని వైపరీత్యం. మనసులో అణచుకొన్న కామప్రేరణల సంఘర్షణ బాగా హెచ్చుగా వున్నప్పుడు అది మరొకరూపంలో వెల్లడించటానికి స్త్రీ భావంగా వెల్లడించుకున్నాడు. తానే స్త్రీగా భావించుకొని వైష్ణవ సంప్రదాయంలో భగవంతుని ధ్యానించటం, తాంత్రికరీతుల్లో కామకేళి కూడా సరిగా యిలాంటి ప్రేరణలు బహిర్గతం గావటమే. ఇంద్రియాలను సద్వినియోగం చేయటంద్వారా జన్మకుగల సార్థకత సాధించుకోవాలని తాంత్రిక తత్త్వం చెబుతుంది.

కామేచ్ఛ బలవత్తరమైనది గనుక విచక్షణతో వినియోగించాలని సారాంశం. రామకృష్ణ తాంత్రికవిద్యను అభ్యసించటానికి ఒక భైరవి స్త్రీని గురువుగా స్వీకరించాడు. రాధగా మధురానుభూతులు పొందాడు. దైవాన్ని స్త్రీగా చూడటమే గాక, బ్రహ్మయోనిని త్రికోణపు వెలుగుగా చూశాడు. ఇదంతా కామపరివృత్తి అణచుకోవటం వలన కలిగిన వైపరీత్యమే. కామం సహజ వాంఛ. అది అసహజంగా తీర్చుకున్నాడు రామకృష్ణ. అయితే ఆధ్యాత్మికత ముద్ర పడింది గనుక ఫరవాలేదు. అదే మామూలు వ్యక్తులుచేస్తే పాపాత్ములుగా పరిగణిస్తారు. దైవసాన్నిధ్యంగా పేరొక్కని కామవాంఛ తీర్చుకుంటే మధురప్రేమ అన్నారు. ఇదే రామకృష్ణ స్త్రీ భావ రహస్యం, అదొక మానసిక విలక్షణం.

ఇతర స్త్రీల స్పర్శ కలిగితే శారీరకంగా విపరీతపు బాధ అనుభవించే రామకృష్ణ, భైరవికి శిష్యుడై తాంత్రికసాధన చేశాడు. అప్పటికీ అతను మహాభావస్థితికి చేరుకున్నాడని, దైవాంశ సంభూతుడనీ భైరవి వెల్లడించింది. ఆ తర్వాత ఒక వైష్ణవ సన్యాసివద్ద కొన్ని సాధనలు అభ్యసించాడు. ఒక అద్వైత సిద్ధాంతి చెంత నిర్వికల్ప సమాధి పొందాడు. వివిధ మతాల భక్తి తత్త్వాల్ని గ్రహించి, అనుకరించాడు.

భర్తతో కాపురం చేద్దామని వచ్చి విఫలురాలైన శారదామణికి షోడశపూజ చేసి ఆమెలో దైవాన్ని చూశాడు. వీటన్నిటికీ మానసిక వివరణ ముందే జరిగింది.

డబ్బు, ముఖ్యంగా లోహం తాకితే పక్షవాతం వచ్చి నట్లయ్యేది. ఇది మరొక విపరీత లక్షణం. డబ్బు యిహలోక

వాంఛలకు దారితీసి, ఆధ్యాత్మికతకు అడ్డొస్తుందనే భావనపై మనసు బాగా లగ్నం చేయటంవలన యిలా జరుగుతుంది. ఏ విషయంపై నైనా దృష్టి కేంద్రీకరిస్తే, సామాన్యంగా మెదడులో జరిగే క్రమం తారుమారౌతుంది. రామకృష్ణలో యిది విపరీతమై మానసిక విలక్షణం శారీరక రుగ్మతను కలిగించే టంత ప్రమాదంగా పరిణమించింది. అందుకేడబ్బును, గంగలో పారేశాడు.

రామకృష్ణుని గురించి సామాన్య ప్రజలలో ప్రచారం యెలావున్నా, ప్రారంభంలో వున్నతవర్గాలు ఆకర్షించేటట్లు చేసింది కేశవ చంద్రసేన్, ఆ తర్వాత వివేకానంద. వివేకానందను తొలిచూపుల్లోనే యిష్టపడి, అతన్ని ప్రేమించి, అతను కొన్నాళ్ళురాకపోతే విరహబాధపడేవాడు రామకృష్ణ. ఇలా స్వజాతిని ప్రేమించటం కామలక్షణ వైపరీత్యంగా ఆధునిక ప్రవర్తనా విజ్ఞానం చెబుతున్నది. వివేకానందను పురుషునిగా తాను స్త్రీగా భావించిన సందర్భాల్లో రామకృష్ణునిలో లేక పోలేదు.

బెంగాలీ తప్ప మరొక భాషరాని రామకృష్ణ మాటల్ని క్రోడీకరించి ప్రచురించారు ఆయన శిష్యులు. ఆయన భాష అంతగా బాగుండేది కాదని, పి. సి. మజుందార్ అభిప్రాయం.

చివరకు గొంతు కాన్సర్ తో రామకృష్ణబాధపడుతుంటే, మనసు కేంద్రీకరించి నయం చేసుకోమని వివేకానంద కోరగా, "అమ్మ, అందరి నోటిద్వారా నీవు తినటంలేదా అన్నది" అని సమాధానం సొగసుగా చేతకాని తనాన్ని సమర్థించుకున్నాడు రామకృష్ణ.

విజ్ఞానులు, మేధావులపట్ల రామకృష్ణ అయిష్టత ప్రకటించటానికి కారణం ప్రాయకంగా అతనిలో చదువు. దాని లోతు పాతులు లోపించటమే. ఆయన్ను చూడటానికి వచ్చిన వారంతా శిష్యులుగా లేదు. ఆయన్ను వున్మాదుడు అన్నవారు, తలవూపి పదోలే అనుకున్నవారూ వున్నారు. కాని వారిని గురించి శిష్యగణం ప్రచురించిన వాటిలో మనకు ప్రస్తావన కనిపించదు.

రామకృష్ణ 50 సంవత్సరాలకే 1886 లో కలకత్తాలో కాన్సర్ తో మరణించాడు. ఆయన ప్రభావ ఫలితం మాత్రం దేశ విదేశాలలో పాదుకున్నది.

వేదాంత సారాన్ని విన్నంత కన్నంత వివరించాడు రామకృష్ణ. ఆయన కొత్తగా చెప్పింది యేమిలేదుగాని, పామర ప్రజలకు సైతం ఆకర్షణీయమైన రీతిలో, పోలికలతో, తత్త్వ సారాన్ని నుడివాడు. దాన్నే చిత్రిక బట్టి శిష్యులు మన కందించారు.

వివేకానంద

రామకృష్ణ పరమహంసను గురువుగా భావించి, వేదాంత తత్త్వాన్ని ప్రచారంచేసి, మఠాలను స్థాపించి, దేశంలో మతాన్ని బాగా తిరగదోడిన వ్యక్తి వివేకానంద. అసలు పేరు నరేంద్రనాథ్ దత్త. 1863 జనవరి 12 న కలకత్తాలో జన్మించాడు. కలకత్తాలోనే పట్టభద్రతవరకు విద్యాభ్యాసం. న్యాయశాస్త్రంచదివాడు. అందమైన పురుషుడు. ఆకర్షనీయుడు. శరీర వ్యాయామం బాగా చేసి పోషించాడు. బ్రహ్మసమాజ్ ప్రభావం ఆయనపై తొలిరోజుల్లోవుండేది.

వివేకానంద దేవుణ్ణి గుడ్డిగా నమ్మేవాడు కాదని, ప్రతిదీ ప్రశ్నించి, సందేహం వెల్లడించేవాడని ప్రతీతి. ఇది వాస్తవం. అలాంటి వివేకానందకూడా రామకృష్ణలో గొప్పతనాన్ని చూచాడు గనుక మిగిలిన వారంతా ప్రశ్నించ కూడదని తాత్పర్యం. ఇక్కడ క్రొంత పరిశోధన. వివరణ అవసరం. వివేకానంద ఎఫ్. ఎ. చదువుతుండే రోజుల్లో ఆంగ్లకవిత్వం బోధిస్తున్న ఉపాధ్యాయుడు రామకృష్ణ గొప్పతనాన్ని గురించి తరగతిలో చెప్పటం అతనిపై తొలి ప్రభావాన్ని అవ్యక్తంగా చూపెట్టింది. ఆ పిమ్మట కర్ణాకర్ణిగా రామకృష్ణ గురించి తెలుసుకున్నాడు. చూడాలనుకున్నాడు. జిజ్ఞాసువుగా తనకు గల సందేహం: దేవుడిని చూచినవారెవరై నావున్నారా అని ధైర్యంగా చూచామన్న వారెవరూ వివేకానందకు కనిపించ

లేదు. అతని సందేహం అలానేవున్నది. సందేహం అసనమ్మకం కాదు. సరైనమ్మకమైన ఆధారం లభిస్తే అతనిలో విపరీతమైన భక్తి కుదురుతుంది. చదువుకున్నవారిలో వుండే సందేహపు ముసుగు కేవలం తాత్కాలికం. వివేకానంద తననమ్మకాలను తగిన ఆధారంకొరకే అన్వేషిస్తున్నాడు. అతిగా సందేహించటం ఒక విలక్షణ మనోపరివృత్తి. డోలాందోళితంగా వుండే మనస్సు ధృఢపరచటానికి సందేహం ఒక పూత. వివర్శ నమ్మకానికీ లొంగిపోయినప్పుడుగాని ముందే మనస్సులో గాఢంగా స్థిరపచుకున్న భావాలు వెల్లడిగావు. వివేకానందలో యిదే జరిగింది. రామకృష్ణుడు తాను దైవాన్ని చూస్తున్నా నని ధైర్యంగా చెప్పగా, వివేకానందకు తృప్తి హాయి కలిగి సందేహం నివృత్తిఅయి, వెంటనే నమ్మకం యేర్పడి. శిష్యు డయ్యాడు, విమర్శలో విజ్ఞానదృష్టి లోపిస్తే. కొన్ని సూచన లకు యిట్టే లొంగిపోవటం కద్దు. రామకృష్ణ దైవాన్ని ప్రత్యక్షంగా చూచానంటే వివేకానంద నమ్మాడేగాని, ఎలా చూచాడోనని ఆపైన సందేహించలేదు. అదే నమ్మకంలో విశేషం. అప్పటినుండి తన సందేహాలకు రామకృష్ణ చక్కని సమాధానం అయ్యాడు. తండ్రి చనిపోయి, కుటుంబభారంలో బీదరికం అనుభవిస్తున్న రోజుల్లో వివేకానంద ఆధ్యాత్మికత యినుమడించింది.

తల్లిదండ్రులు తలపెట్టిన వివాహ ప్రయత్నాన్ని విర మింపజేసి, వివేకానంద భారతదేశంలో బాగా పర్యటించి, విశేషానుభవం గడించాడు. 1893 లో షికాగోలో జరిగిన మత సమావేశం వివేకానంద జీవితంలో ఒకమలుపు. వక్తగా

అక్కడ రాణించి, అమెరికా, ఐరోపాలలో పర్యటించి వేదాంత ప్రచారం చేసి, అనేకమంది శిష్యులను, శిష్యురాండ్రను పొందాడు. మాక్స్‌ముల్లర్ వంటి పండితులను కలసి మాట్లాడాడు. దేశంలో రామకృష్ణ మఠం స్థాపించి సాంఘిక సేవా కార్యక్రమాలకు పురికొల్పాడు. రెండవ పర్యాయం విదేశీ పర్యటన చేశాడు. 39 సంవత్సరాలకే (1902 జూలై 4) మరణించాడు.

అద్వైత వేదాంతాన్ని బోధించిన వివేకానంద కొత్త తత్వాన్ని చెప్పకపోయినా, కొత్తగా చెప్పినట్లు చూపి, చాలామందిని ఆకర్షించాడు. సాంఘిక రంగంలో అనేక మూఢాచారాలను ఖండించాడు. కుల మత తేడాలను గర్హించాడు. బీదవారి వుద్ధరణకు ఆక్రందించాడు. మతం పేరిట జరిగే అనేక దురాచారాలను ఖండించాడు. సముద్ర ప్రయాణాన్ని నిషేధిస్తూ హిందువు లనుసరించే ఆచారాలను ఈసడించి తానే స్వయంగా సముద్ర ప్రయాణం చేశాడు.

వివేకానందయొక్క తత్త్వాన్ని పిండినిగ్గు తేలిస్తే మూడు ప్రభావాలు కనిపిస్తయ్. అద్వైత వేదాంతం. రామకృష్ణ పరమహంస, స్వానుభవం. ఆయన రచనలన్నిటిలో యివి ప్రస్ఫుటంగా వెల్లడౌతయ్. బ్రహ్మ ఒక్కటే సత్యమనీ సచ్చిదానంద అనేవి బ్రహ్మగుణాలు గాక, బ్రహ్మ వునికి అనీ వివేకానంద చెప్పాడు. మాయ వాదాన్ని అంగీకరించి, కాలం, ఆకాశం, కార్యకారణ సంబంధాలు కేవలం జగత్తుకు సంబంధించినవన్నాడు. వివేకానంద మాయ సిద్ధాంతభాష్యం

'జ్ఞానయోగంలో' చూడొచ్చు; విశ్వమంతా ఒక్కటే; అదే బ్రహ్మ విశ్వంగా మారిన బ్రహ్మనే ఆత్మ అంటాం. బ్రహ్మ సారమే జీవం.

ఒక వైపున వేదాంతసారాన్ని చెబుతూనే హైందవ మతాన్ని సమర్థిస్తూ భారతదేశ ఔన్నత్యాన్ని నొక్కి వక్కాణిస్తూ, ప్రపంచానికి భారతదేశం సందేశం యిస్తుందని చెప్పాడు. ఒక రకంగాచూస్తే వివేకానంద చెప్పేది ఆధ్యాత్మిక సామ్రాజ్యవాదం. భౌతికంగా ఔన్నత్యంలేని భారతదేశాన్ని పురికొల్పి, ఆధ్యాత్మికత గొప్పతనం చూపి, యువకతరాన్ని రెచ్చగొట్టటానికి వివేకానంద ప్రవచనాలు తోడ్పడ్డయ్. భారతజాతి మేధస్సు మతంలోనూ తాత్త్విక చింతనలోనూ ద్యోతకమయ్యాయని చెప్పాడు. భారత ఔన్నత్యాన్ని పాడుచేసిన పురోహితవర్గం స్థానే, పౌందిక సమన్వయం రూపొందించగల వర్ణాశ్రమాల్ని పునరుద్ధరించాలన్నాడు. పెత్తందారీ తనాన్ని కాలదన్ని, ప్రజలకు వైదికజ్ఞానం అందుబాటులో వుండాలన్నాడు. ఆధ్యాత్మిక మానవత్వం కాంక్షించాడు. అంటరానితనాన్ని పోగొట్టాలన్నాడు; సాంఘిక చైతన్యం క్రమంగా తీసుకొచ్చి, కాలదోషం పట్టిన ఆచారాలను తొలగించుకోవాలని హెచ్చరించాడు. హింసాయుతమైన మార్పులుగాక పరిణామ క్రమంలో శాంతియుత చైతన్యం రావాలన్నాడు. ప్రతి జాతికీ ఒక విశిష్టత వున్నదంటూ, మతం భారతదేశానికి ప్రత్యేకతగా చూపాడు. మిగిలినవన్నీ ద్వితీయస్థాయిలో పెట్టాడు. కనుకనే మత ప్రాతిపదికలపై జాతీయపునాదులు వేయ ప్రయత్నించాడు. భారతజాతి పునరుజ్జీవనం పొందాలంటే గతంలో

గల మత వుత్సాహం మళ్ళీ వెల్లివిరియా లన్నాడు. స్వేచ్ఛ ప్రాయికంగా అవసరమన్నాడు. అన్నిటినుండీ స్వేచ్ఛకోరిన వివేకానంద మతంనుండి. దైవంనుండి. ఆధ్యాత్మికతనుండి స్వేచ్ఛను చూడలేకపోయాడు. అలాగే అధికారవాదాన్ని ఖండించాడేగాని. తాను కొన్ని తత్వాల. అధికారాన్ని. రామకృష్ణ అధికారాన్ని అంగీకరించాడు. స్వేచ్ఛకు హద్దులు విధించాడు. మానసికంగా.

వివేకానంద రచనల్లో, ఉపన్యాసాలలో వుద్వేగం జాస్తి; ధైర్యాన్ని గురించి, బలాన్ని గురించి తరచు ప్రస్తావించేవాడు. గతాన్ని చూపి ప్రజల్ని వుత్తేజితుల్ని గావించటానికి వుద్రేకపూరిత దేశభక్తి ప్రదర్శించాడు. రాజకీయ ఆర్థిక విషయాలలోకి పోలేదుగాని, వేద ప్రజలనుచూచి, వారి కనీసావసరాలు తీరుదే ముక్తి లేదన్నాడు జీవిత పోరాటాల అనుభవంనుండి ధ్యాన, ఆధ్యాత్మిక అనుభవాలు పొందిన వివేకానంద సత్యాన్ని కనుగొనాలని బ్రహ్మచర్యం అవలంభించాడు. జీవితంనుండి దూరంగా పారిపోయే విధానమది. బ్రహ్మచర్యంలో అణచుకొన్న కోర్కెలు నమ్మకంలో తీర్చుకున్నాడు. బ్రహ్మచర్యం అంటే సహజ కామవాంఛను కృత్రిమంగా అణచుకోవటమే. ఆ వాంఛ అసలే లేకుండా చేయటం అసంభవం. అలాచేసే హాని కలుగుతుంది—శరీరానికి మనసుకూ. వివిధ రూపాల్లో దాని ప్రభావం కనబడుతుందికూడా. ఏ వాంఛనైనా సాధారణ మానవుడు కొన్నిహద్దుల్లో పెట్టుకుంటాడు గాని అసలు అణచలేడు. అణచ ప్రయత్నిస్తే. ఆ విషయంపైనే దృష్టి లగ్నంచేయాలి తెలిసో తెలియకో. బ్రహ్మచర్యం

కృత్రిమంగా అలవాటైతే హిస్టీరియా లక్షణాలు వస్తాయ్. రామకృష్ణలో కనిపించిన యీ లక్షణాలు, వివేకానందలో మరో రూపం దాల్చి, మతవాదం అతిగా బోధింపజేసింది.

REFERENCE BOOKS

1. **Swami Saradananda :** Sri Ramakrishna The Great Master, 1952 Sri Ramakrishna Math, Madras.
2. **Christopher Isherwood :** Ramakishna and his disciples 1965 Advaita Ashram, Calcutta.
3. **Sayings of Sri Ramakrishna :** 1949 Sri Ramakrishna Math, Madras.
4. **Swami Nikhilananda :** Ramakrishna 1948 Harper and Brothers Publishers, London.
5. **The Complete Works of Swamy Vivekananda:** 1948 Advaita Ashram. Almola (8 Vol.)
6. **What Religion is in the words of Swami Vivekananda :** 1962 Ed. John Yale, Phoenix House, Ltd., London.
7. **Swami Agehananda Bharati :** The Ochere Robe 1961 George Allen & Unwin, London.
8. **P. Spratt :** Hindu Culture and Personality 1966 Manaktalas, Bombay.
9. **Max Muller :** Ramakrishna 1951 Advaita Ashram, Calcutta.

అనిబిసెంట్

భారతదేశంలో రాజకీయ, మత రంగాలను కొంతవరకు ప్రభావితంచేసి. ధైర్యసాహసాలు పద్రర్శించి చాలా విషయాలలో ఏకాకిగా నిలబడిన విశిష్టవ్యక్తి అనిబిసెంట్. ఆమెజీవితం యెన్నో వంకలు తిరిగింది. చివరకు మతంలో(థియోసఫీ)లో రూఢిగా నిలచింది.

1893 లో, భారతదేశానికి రాకపూర్వం అనిబిసెంట్ జీవనగరంగం క్లుప్తంగా తెలుసుకుంటే, అవగాహనకు తోడ్పడుతుంది. 1847 అక్టోబరు 1న ఐర్లండ్‌లో జన్మించి, ప్రైవేట్‌గా విద్యాభ్యాసంచేసి, ఒక ఆంగ్లికన్ మతగురువును వివాహమాడి, విడాకులిచ్చింది 1873 లో జరిగిన యీ యెడబాటు అనంతరం అనేక సిద్ధాంతాలు ఆమెను ఆకర్షించాయి. హేతువాది, నాస్తికుడు అయిన చార్లెస్ బ్రాడ్లాతో సన్నిహితంగా కొనాళ్ళు వుంటూ, తానూ నాస్తికురాలైంది. ఆ రోజులోనే కుటుంబ నియంత్రణ ప్రచారం చేసింది. నూతన దంపతుల అంతరంగిక జీవితం గురించి బ్రాడ్లాతో కలసి ఒక గ్రంథం వ్రాసినందుకు శిక్ష అనుభవించింది-అశ్లీల నేరంక్రింద. 1885 నాటికి ఫేబియన్ సోషలిస్టుగా, బెర్నార్డ్ షాకు దగ్గరై, అవర్ కార్నర్ అనే పత్రిక నడిపింది. 1889 లో ఫేబియన్ వ్యాసావళి ప్రచురించింది. మార్క్సిస్ట్ సోషల్ డెమొక్రటిక్ ఫెడరేషన్‌లోచేరి, ప్రముఖపాత్ర నిర్వహించింది. ఇంగ్లండ్ కళాశాలలో స్త్రీలు

చేరేవిషయమై పట్టుబట్టి కృత కృత్యురాలైంది. స్త్రీలకు సమానహక్కులు ఇవ్వాలని పోరాడింది. చిన్నపిల్లలకు ఉచిత విద్య గరపాలని, ఉచితభోజన సౌకర్యాలు పేదపిల్లలకు అంద జేయాలనికోరింది. సంఘసంస్కర్త్రగా, సమ్మోనాయకురాలిగా, వక్త్రగా పేరుపొందింది.

ఇదంతా థియోసఫీవాసనలు సోకని అనిబిసెంట్ జీవిత గాథ.

1889 లో మదాంబ్లావట్‌స్కీ "సీక్రెట్ డాక్ట్రిన్"తో థియోసఫీపట్ల ఆకర్షితురాలైంది. అదొక పెద్దమలుపు—ఆమె జీవితంలో. 1891 లోనే బ్లావట్‌స్కీ మరణించటంతో, థియోసఫీ వుద్యమంలో ప్రముఖపాత్ర నిర్వహించే బాధ్యత అనిబిసెంట్ స్వీకరించింది.

1893 లో అనిబిసెంట్ భారతదేశం వచ్చింది. గత జన్మలలో తాను భారత దేశస్థురాలినని పేర్కొన్నది. హైందవ మతాన్ని అవలంబించింది. కాశీలో కేంద్ర హిందూ కళాశాల స్థాపించి హిందూమత, సంస్కృతి ప్రచారానికి తోడ్పడింది. భారతదేశంలో దివ్యజ్ఞానాన్ని ప్రచారంచేస్తూ 1907 లో థియోసఫీ సమాజానికి అధ్యక్షురాలైంది. మద్రాసు అడయార్ యీమెకు ప్రధానకేంద్రం. 1909లో జిడ్డు కృష్ణమూర్తి అనే 13 సంవత్సరాల కుర్రవాడిని అతని అన్నతోసహా స్వీకరించి, అతను యుగపురుషుడౌతాడని కలలుగని, తండ్రి అనుమతితో దత్తత చేసుకొని, అడయార్‌లో వారిని లెడ్‌బీటర్ అజమాయిషిలో వుంచింది. కృష్ణమూర్తితో లెడ్‌బీటర్ కామ కేళికి అలవాటుపడగా ఆ రహస్యం తెలిసి మౌనంవహించింది అనిబి

సెంట్. చివరికది రభసగామారి, న్యాయస్థానంలో తండ్రి తన కుమారుని తిరిగి యిప్పించమని కోరగా, థియోసఫీ సమాజం కదలిపోయింది; చాలామంది సమాజానికి దూరమయ్యారు. మద్రాసు హైకోర్టు తీర్పులో కోర్టు ఆధ్వర్యాన ఆ బాలురు వుండాలనగా ఆమె ప్రీవీకౌన్సిల్‌కు వెళ్ళి, చివరకు నెగ్గింది. కాని థియోసఫీ చరిత్రలో, అనిబిసెంట్ జీవితంలో అదొక పెద్ద మచ్చగానే మిగిలింది. మొదటినుండీ పురుషులతో ఆమె సంబంధం కామప్రవృత్తితోనే వుండేదని బి. పి. వాడియా స్పష్టంచేశాడు. (పుట 465—దిలాస్ట్ ఫోర్ లైవ్స్ ఆఫ్ అనిబిసెంట్—ఆర్థర్ హెచ్. నెదర్‌కాట్, దియూని వర్సిటీ ఆఫ్ షికాగో ప్రెస్) జిడ్డుకృష్ణమూర్తిని ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జి విశ్వ విద్యాలయాలలో చేర్పించి, యుగపురుషునికి తగిన విద్యగరపా లనే కోరిక ఆమెకు తీరనేలేదు. తీరా 1929 లో జిడ్డు కృష్ణ మూర్తి అసలు సమాజానికే కట్టుబడకూడదని, స్వేచ్ఛగావుండా లంటూ అనిబిసెంట్‌కు దూరమయ్యాడు; దిగమ్రింగుకొని, తన జోస్యం విఫలమైనందుకు మళ్ళీ మాట్లాడలేక వూరుకున్నది. అతీతశక్తుల జోస్యాలన్ని యిలానే వుంటయ్.

బ్లావట్‌స్కీ థియోసఫీకి మరికొంత అయోమయాన్ని చేర్చింది అనిబిసెంట్. మొత్తం ఏడుజాతులు పరిణమిస్తాయనీ, ఆర్యజాతి అందులో ఐదవదనీ, మధ్య ఆసియా దానికి స్థావర మనీ, ప్రపంచంలో అవతారాలు వుంటాయనీ భారతదేశం ప్రపంచానికి యేదో సందేశం యిస్తుందనీ, మొదలైన వెన్నో తనవాగ్ధాటితో ప్రచారంచేసింది. వ్రాసింది. ఎనిమిది విధాలైన వ్యక్తులుంటారని నిర్ధారించింది. దైవత్వం వీరిలో ప్రతిబింబి

స్తుందట. ఇదంతా బ్లావట్‌స్కీ సీక్రెట్ డాక్ట్రిన్ మూలంగానే విస్తరించింది యీమెలో. జీవితంలో థియోసఫీ ప్రభావం అనిబిసెంట్ పైగాఢమైన ముద్రవేసింది. ఈమె ప్రవేశించిన తర్వాత భారతదేశంలో థియోసఫీ బాగావ్యాపించింది. జిడ్డు కృష్ణమూర్తి అపవాదుతో కొంత దెబ్బతిన్నప్పటికి ఆమె బ్రతికి వున్నన్నిరోజులూ థియోసఫీని బాగా బ్రతికించిందనే అనాలి.

భారతదేశంలో అనిబిసెంట్ కేవలం మతపరంగానేగాక, స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని కొంత రాజకీయ సేవ చేసింది. బహుశ తన పూర్వ వాసనలు పోగొట్టుకోలేక యిలా చేసి వుండొచ్చు. ఒకప్పుడు మత నిబంధనలనుండి బయటబడి చార్లెస్ బ్రాడ్లావుద్యమంలో స్వేచ్ఛకై పోరాడిన అనిబిసెంట్, భారతదేశానికికూడా స్వేచ్ఛ అవసరమని భావించింది. సోషలిస్ట్‌గా సహకారాన్ని వ్యక్తిత్వాన్ని కాపాడాలనే దీక్ష ఆమెలో యింకా పోలేదు. నిస్వార్థులైన వ్యక్తులు నిష్కామకర్మచేస్తే ప్రజాస్వామ్యం బాగుపడుతుందినీ, కేవలం విచక్షణారహితమైన ప్రాతినిధ్యపు ప్రజాస్వామ్యంతో ప్రయోజనంలేదనీ అభిప్రాయపడింది.

జాతికి ఆధ్యాత్మిక జీవితం ప్రాయికంగా వుంటుందని ఆమె నమ్మింది. భారతదేశంలోనూ అలాంటి జాతీయత కావాలని కోరింది. జాతి దై వాంశగా ప్రతిబింబిస్తుందని అనిబిసెంట్ వుద్దేశ్యం. ఈ గుణం ప్రతిజాతిలో ఒక్కొక్క రీతిలో ద్యోతకమౌతుందని చెప్పింది. జాతి అనేది వ్యక్తిదశలలో ఒకటిగా పరిగణించింది. దానినుండి అంతర్జాతీయ దశకు పయనిస్తారని అనుకున్నది.

ఈ భావాలతో అనిబిసెంట్ భారత రాజకీయాలలో దిగింది.

1913 నుండి 1919 వరకూ భారత రాజకీయరంగంలో ప్రధానపాత్ర వహించింది అనిబిసెంట్. ఇతరుల పోరాటానికి ఆమెకూ ఒక ప్రధానమైన తేడా యేమంటే, తాను బ్రిటిష్ పౌరురాలిననే భావంలోలగా తొంగిచూస్తూనే వుండేది అనిబిసెంట్‌లో. బ్రిట్రిష్ సామ్రాజ్యం నానాజాతి సమతికి మూలం అని అమెనమ్మిక. 1916 లో హోంరూల్ లీగ్ స్థాపించి ప్రచారంచేసింది. యుద్ధసమయంలోనూ ప్రచారం ఆపనందుకు బ్రిటిష్‌వారి జైళ్ళల్లో కారాగారవాసం అనుభవించింది. గాంధేయపంథాను మొదటినుండీ తీవ్రంగా వ్యతిరేకించింది. సహాయ నిరాకరణోద్యమం, సత్యాగ్రహం మొదలైన మార్గాలు అనుకోకుండా హింసకు దారితీస్తాయని, ప్రత్యామ్నాయం లేకుండా చేపట్టే యిలాంటి చట్టవ్యతిరేక చర్యలు అరాజకత్వాన్ని నెలకొల్పుతాయనీ సంఘ వ్యతిరేక శక్తులు విజృంభిస్తాయని. జాతి వైషమ్యాలు పెంపొంది సర్వసౌభ్రాతృత్వ భావానికి అడ్డుపడతాయని అనిబిసెంట్ చిత్తశుద్ధితోభావించింది. గాంధి తన విధానాలలో అస్పష్టంగా, వూహాలోకంలో విహరిస్తున్నాడనీ, వాస్తవవాది కాదని వేరొక్కన్నది. అతని నిరాహారదీక్షలు మొదలైన చర్యల్ని శంకించింది.

భారతదేశానికి స్వాతంత్ర్యంకావాలంటూనే, ఇంగ్లండ్‌లో సంబంధం మనువు శాసనంగా చెప్పి, పులుముడువాదం ప్రవేశ పెట్టింది. ఆధ్యాత్మిక నిచ్చెనమెట్లలో బ్రిటిష్ సామ్రాజ్యంపొత్తు ఒక భాగమని అయోమయ కారణం చెప్పింది. దానితో

అనిబిసెంట్ చిత్తశుద్ధి శంకించవలసి వచ్చింది. ఏమైనా ఆమె భారతదేశంకోసం జైలుకుకూడా వెళ్ళి, త్యాగం చేసినందున, 1917 లో కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎన్నికచేశారు. అయినా అచిరకాలంలోనే ఆమె కాంగ్రెస్ నాయకులకు దూరమైంది. గాంధి వుద్యమాలముందు అనిబిసెంట్ వాదనలు నిలవలేదు. ఆమె రూపొందించిన కామన్వెల్త్ ఇండియా బిల్లు బ్రిటిష్ కామన్స్ సభలో 1925-26 సంవత్సరాలలో చర్చించారు.

అనిబిసెంట్ మంచి ప్రచారకురాలు, వక్త, పట్టుదలగల కార్యదక్షురాలు. 380 గ్రంథాలు, కరపత్రాలు వ్రాసింది. ఇతరులతో కలసి 26 రచనలు ప్రచురించింది. రచనలన్నీ ఉద్విగ్నంగా చక్కని శైలిలో వుంటయ్. ఇండియా ఏనేషన్, హౌ ఇండియా రాట్‌హార్ ఫ్రీడం.అనేవి భారతదేశాన్ని గురించిన పెద్దరచనలు. ది ఇండియన్ ఐడిల్స్ అనేది భారత సాంఘిక విషయాల పరిశీలకగ్రంథం. మతపరమైన ఆమెరచనలు మద్రాసు థియొసాఫికల్ ప్రచురణ సంస్థవారు ముద్రించి ప్రచారంలోకి తెచ్చారు. అమెరికా, ఐరోపా, ఆసియా, ఆస్ట్రేలియాలలో విస్తారంగా పర్యటించి థియోసఫీ సమాజాభివృద్ధికి కృషిచేసింది. ఈ సమాజాన్ని యెంతపోషించిందో అంతగా చీల్చటానికికూడా ఆమె కారణమైంది చివరకు. 1933 సెప్టెంబరు 21 న అడయారు థియోసఫీ కేంద్రంలో మరణించింది. బ్రతికుండగానే క్షీణిస్తున్న ప్రభావం, మరణంతో బొత్తిగా లేకుండాపోయింది. ఆతర్వాత థియోసఫీ సమాజంలో చీలికలు, ఎన్నికలపోటీలు మొదలైన వాటితోపాటు, అనిబిసెంటు పైనిశిత విమర్శలెన్నో వచ్చాయి.

భారతదేశంలో వున్న ఆధ్యాత్మిక ఆయోమయ తత్త్వాలకు మరికొంచెం జోడించి ప్రమాణాలతో నిమిత్తలేని అశాస్త్రీయ అజ్ఞానాన్ని విస్తరింపజేసి, జిజ్ఞాసువులను సైతం జోకొట్టినట్టుగా తయారుచేసింది అనిబిసెంటు. వాగాటిని ఆయుధంగా వినియోగించుకుని, లేనిపోనికట్టుకథలతో కలలతో, అలౌకిక శక్తుల పేరిట మేథావులకు సైతం అజ్ఞానాన్ని దివ్యంగా అందించింది. దేశపురోగతిని నాలుగు దశాబ్దాలపాటు ఆపటంలో యధాశక్తి చిత్తశుద్ధితో కృషిచేసింది.

References on pp 61

థియోసఫీ (దివ్యజ్ఞానం)

భారతదేశంలో మతాలు, మూఢ నమ్మకాలు, అలౌకిక శక్తి వాదనలు, యోగ విద్యలు విపరీతంగా వ్యాపించి, ప్రజలు పునర్వికాసాన్ని సైతం త్రోసిపుచ్చిన రోజుల్లో, యివి చాలవన్నట్లుగా థియోసఫీ దిగుమతి అయింది. ఏది వచ్చినా జీర్ణం చేసుకునే జాతి గనుక, థియోసఫీని కొందరు అనుసరించారు. అదొక పలుకుబడిగల సమాజంగా కొన్నాళ్లు చలామణి అయింది.

థియోసఫీ వాదాన్ని, సమాజాన్ని ప్రారంభించింది, ఒక రష్యన్ స్త్రీ బ్లావట్‌స్కీ. 17 సంవత్సరాలప్పుడే తన కన్నా బాగా పెద్దవయస్సుగల వ్యక్తిని పెళ్ళాడి, కొన్ని మాసాలకే అతన్ని వదలేసి, ప్రపంచ పర్యటన చేస్తూ, విశేషాను భావాలు గడించింది. 1831 లో ఆమె జననం. రెండవ పర్యాయం పర్యటిస్తూ, న్యూయార్క్‌కు వెళ్ళి ఆల్కాట్, విలియంజడ్జి అనేవారి సహకారంతో దివ్యజ్ఞాన సమాజాన్ని 1875 నవంబరు 17న స్థాపించి, తాను కార్యదర్శిణిగా వున్నది. థియోసఫీ సమాజ లక్ష్యాలు.

1. జాతి, లింగ, కుల, మత, రంగు విచక్షణా రహితంగా మానవులలో సౌభ్రాతృత్వం యేర్పరుచుట.
2. మతం, తత్త్వం, విజ్ఞానశాస్త్రాలన్నిటిని పోల్చి పరిశీలించేరీతులు పెంపొందించుట.

3. ప్రకృతిలో, మానవునిలో బహిర్గతంగాని నియమాలు. ప్రతిభా వ్యుత్పన్నతలు కనుగొనుట.

బ్లావట్‌స్కీ 'ది సీక్రెట్ డాక్ట్రిన్' అనే గ్రంథంలో థియోసఫీ గురించి విపులంగా వ్రాసింది.

విశ్వ మంతటికి చెందిన సర్వ శక్తివంతమూ, శాశ్వతమూ అయిన అనంత మూలస్వరూపం వున్నది. అది ఆలోచనకు భావనకూ అతీతం.

విశ్వం అనంతమైనది. ఆద్యంతాలు లేనిది. అందులో మార్పులన్ని దైవలీలలు.

ఆత్మలన్నీ అనంతాత్మతో తాదాత్మ చెందేవే. ఆత్మ పునర్జన్మలతో జీవనయాత్ర చేస్తుంది. కర్మ ఫలితంగా యిలా జరుగుతుంది.

1879 లో ఆల్కాట్‌తో గలసి బ్లావట్‌స్కీ భారతదేశం వచ్చి, థియోసఫీ స్థాపించి, ప్రచారం చేసింది. 1883లో థియోసఫీ సమాజం అడయార్, మద్రాస్‌లో ప్రారంభించారు. ఈ సమాజంలో లెడ్‌బీటర్, సిన్నెట్, మీడ్, భగవాన్‌దాస్, శ్రీపర్ణికాశ, జినరాజదాస ప్రభృతులు ప్రముఖపాత్ర వహించారు. అడయార్‌లో ప్రపంచ కేంద్రం యేర్పరచారు. అనిబిసెంట్ వచ్చిన తర్వాత దేశంలో థియోసఫీ బహుళ ప్రచారం పొందింది.

అన్ని మతాలలో దైవత్వం వున్నది గనుక వాటిపట్ల సహనంతో వ్యవహరించాలంటారు. ప్రతి మతాన్ని జాగ్రత్తగా

పరిశీలించాలి. మతాలలోకి మనుషుల్ని మార్చే ప్రయత్నం కంటే మతాన్ని ఆచరించటం మంచిది. శాంతి, సత్యం థియోసఫీ మూలసూత్రాలు. సత్యానికి మించిన దైవం లేదని వారి ఆశయం.

భగవంతుడు ఒక్కడే. ఆత్మ శాశ్వతం. దైవ నియమమే విశ్వాన్ని పాలిస్తున్నది. ఈ జగత్తులో సంపూర్ణ మానవులున్నారు. వారినుండే గొప్ప ప్రబోధికులు వస్తారు. దివ్యజ్ఞానం వారి సొత్తు. సృష్ట్యాదిలో గాఢాంధకారం అలుముకొని వుండేది. సృష్టి సూత్రం కార్యాచరణకు పూనుకోగానే దివ్యవెలుగు ప్రసరించింది. అందులోనుండి త్రిమూర్తులు వచ్చారు. తర్వాత సప్త మండలాలు వచ్చాయి.

ఈ విధంగా సృష్టి క్రమాన్ని వివరించ ప్రయత్నించింది థియోసఫీ.

పునర్జన్మ లున్నాయని వీరు నమ్ముతారు. మానవుడు ఆదిమ దశనుండి పరిణమిస్తూ ఋషులౌతారని చెప్పారు. వారి వారి కర్మల ననుసరించి పునర్జన్మలు వుంటయ్.

1891 లో బ్లావట్‌స్కీ మరణించింది. అమెరికా, ఇంగ్లండ్, ఇండియాలలో థియోసఫీ పాదుకున్నది.

REFERENCE BOOKS

1. **Madame Blavatsky :** Collected Works (7 Vol.) Theosophical Publishing House, Adayar, Madras.
2. **Arthur H. Nethercot :** The last four lives of Annie Besant, 1963 The University of Chicago Press.

3. **Annie Besant :** How India Wrought for freedom 1951 Theosophical Publishing House, Madras.

4. **C. Jivarajadasa :** First Principles of Theosophy 1956 Theophical Publishing House, Madras.

5. **Annie Besant :** India, A Nation, 1930. The Theosophical Publishing House, Madras.

బాలగంగాధర్ తిలక్

స్వాతంత్రోద్యమంలో దేశభక్తి ఉగ్రస్వరూపం దాల్చటానికి, పాత ఆచారాలు తిరగదోడటానికి ప్రధానపాత్ర వహించిన బాలగంగాధర్ తిలక్ జీవితమంతా వివాదాస్పదమే. ఆయన ప్రభావం యెందరిపై వున్నదో, వ్యతిరేకత కూడా యించుమించు అలాగే వున్నది. అలాంటి వ్యక్తిత్వాన్ని గురించి వ్రాయటం కత్తిపై సాము.

1856 జులై 23 న మహారాష్ట్రలోని రత్నగిరిలో జన్మించిన తిలక్ అసలుపేరు కేశవ్ అయినా, నేడది నామ రూపాలు లేకుండా పోయింది. పుట్టింది సనాతన సంప్రదాయ కుటుంబంలో. తాత నేర్పిన విరోచిత గాథల ప్రభావం గాఢంగా వున్నది. మెట్రిక్ చదివేనాటికే తల్లి దండ్రు లిరువురూ చనిపోగా, మామ పెంపకంలో బి. ఎ., ఎల్. ఎల్. బి. పూర్తి చేశాడు. 16 సంవత్సరాలకే బాల్య వివాహం చేసుకున్నాడు. లెక్కలు, సంస్కృతం ప్రత్యేకాసక్తిగల విషయాలు. చదువు పూనాలో. ఎల్ఫినిస్టన్ కళాశాల (బొంబాయి) వాతావరణంలో యిమడలేకపోయాడు. తిలక్ నాటికి పూనా హైందవ కేంద్రంగా పేరొందింది. ఆప్రభావం తిలక్‌పై జాస్తి. 1880లో న్యూ ఆంగ్లపాఠశాల స్థాపించారు. అదే వుత్తరోత్తరా దక్కన్ ఎడ్యుకేషనల్ సొసైటీగా రూపాంతరం చెందింది.

1880 నుండి ఒక దశాబ్దంపాటు ఆచార్యుడుగా పని చేశాడు. మరాఠ అనే ఆంగ్లపత్రిక, కేసరి పేరమరాఠి పత్రికలను తిలక్ భావప్రచార సాధనాలుగా వినియోగించాడు. 1889లో భారత జాతీయకాంగ్రెస్‌లో ప్రవేశిస్తూనే అందరికీ స్థానం వుండాలన్నాడు ఆపార్టీలో. బొంబాయి లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యుడుగా, పూనా మునిసిపాలిటీ సభ్యుడుగా, బొంబాయి విశ్వవిద్యాలయఫెలోగా కృషిచేశాడు. కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఎన్నికకావటానికి చేసిన ప్రయత్నాలు మూడు పర్యాయాలు విఫలంకాగా, ఎన్నుకోబడిన సంవత్సరం ఆస్థానం అక్రమించలేక పోయాడు. బ్రిటిష్‌ప్రభుత్వంపై ప్రజల్ని రెచ్చగొట్టాడనే నేరంక్రింద రెండుమార్లు జైలుకెళ్ళి, గ్రంథాలు వ్రాయగలిగాడు. తనపై అవాకులు వ్రాసిన లండన్ టైమ్స్ సంపాదకుడు సర్ వేలం చైన్‌కిరాల్‌పై పరువునష్టం దావాకై లండన్ వెళ్ళి విఫలుడయ్యాడు. గోఖలే, ఆగార్కర్, పరంజిపే, గాంధి, రనడే, తెలాంగ్, భండార్కర్, ఫిరోజ్‌షా మెహతా, సురేంద్రనాథ్ బెనర్జీలతో తీవ్ర అభిప్రాయభేదాలు వుండేవి. అనిబిసెంటుతోకలసి హోంరూల్‌లీగ్ కార్యక్రమం చేపట్టాడు. లజపతిరాయ్, బిపిన్ చంద్రపాల్, సావర్కార్ ప్రభృతులతో కలసి పనిచేయగలిగాడు, 1920 ఆగస్ట్ 1 న మరణించాడు. ఇది సంక్షిప్త జీవనస్రవంతి. ఇక జీవనతత్త్వం పరిశీలనార్హం.

తిలక్ తత్త్వం

తిలక్ ఆద్యంతాలూ హిందువు. వేదాలు ఉపనిషత్తులు, గీతపై నమ్మకంగలవాడు. పైవంపైనేగాక హైందవ ఆచా

రాలు, సంప్రదాయాలు వాఛించిన వ్యక్తి, భక్తి ఆవశ్యకత గమనించాడు. సనాతన హిందూమతాన్ని చూచిగర్వించాడు. కేవలం మానసికంగా గర్వించటంగాక. అవన్నీ తిరగదోడి, చైతన్యత తెచ్చాడు. కర్మయోగంలో ప్రబల నమ్మకం చూపాడు. దైవం, ఆత్మ, ప్రకృతి విలీనంగావటమే మత మన్నాడు. వేదకాలంలో హిందూదేశం ఐక్యంగా, ఒక జాతిగా మనగలిగిందనీ, ఆ పరిస్థితి తిరిగిరావాలని అభిలషించాడు. ఆధునిక విజ్ఞాన శాస్త్రంకూడా సనాతన ధర్మాన్ని సమర్థిం స్తున్నదని నమ్మాడు. వేదప్రమాణాలు నమ్మిన వ్యక్తి హిందువు అని నిర్వచించాడు. దేశం యావత్తూ ఒక బలవత్తర మైన హిందూదేశంగా మారాలని కాంక్షించాడు.

తిలక్ తన తత్త్వాన్ని బలపరచటానికి అనేక రచనలు చేశాడు. అందులో అతిముఖ్యమైనవి గీతారహస్యం. ఆర్యులు ఆర్కిటిక్ ధృవంనుండి వచ్చారనేసిద్ధాంతం, వేదాంగజ్యోతిష్యం. హిందూయిజం. యింకా మరాఠా, కేసరి పత్రికలలో ప్రాసిన రచనలు—ఇవి ప్రాతిపదికలుగా తిలక్ చర్యలు, భావాలు, రాబట్టవచ్చు.

గీతనుండి పోరాటాన్ని రాబట్టాడు తిలక్. మాండలే కారాగారంలో ప్రాసిన గీతారహశ్యంలో కర్మయోగాన్ని నొక్కి వక్కాణించాడు. సన్యసత్వాన్ని తృణీకరించాడు. సమాజానికి దూరంగాపోయి, మానవులతో సంబంధంలేని రీతుల్ని త్రోసి రాజన్నాడు. గీతననుసరించి వ్యక్తులు తమ బాధ్యతలు నిర్వర్తించాలని ఆయన వ్యాఖ్యాన సారాంశం.

జీవితానికి పూర్తిగా దోహదంచేయగలిగింది కర్మయోగమని భావించాడు. తద్వారా సాంఘిక రాజకీయరంగాలలో సాహసోపేతచర్య చూపి. నిష్కామ కర్మద్వారా అహం పోగొట్టుకొని. ఆధ్యాత్మ సాధనచేయగలమని తిలక్ నమ్మాడు.

ఖగోళశాస్త్రాధారాలతో వేదమంత్రాల కాలాన్ని క్రీస్తు పూర్వం 4500 అని, ఆర్యులు ఆర్కిటిక్ ధృవంనుండి వచ్చారని వ్రాశాడు. వీటిలో ఆయన పాండిత్య ప్రతిభవున్నంతగా వాస్తవం లేదన్నది నేటి సత్యం.

తిలక్ రాజకీయ, మతభావాలు, ఆచరణలు పరిశీలించటం, పై అభిప్రాయాల దృష్ట్యాసులభం.

రాజకీయాలలో అతివాది. సనాతన మతతత్వాన్ని ఆధునిక రాజకీయాలకు జోడించి, జాతీయవాదం. దేశభక్తి వుగ్రరూపం దాల్చటానికి తోడ్పడి, కొన్ని మలుపులలో నిలబడిన వ్యక్తి తిలక్.

అంటరానితనం పోగొడతానని, అందుకు కృషిచేస్తానని ప్రమాణం చేయవలసిందిగా తిలక్‌ను కోరగా నిరాకరించాడు. తనకు వ్యవధిలేదన్నాడు. (టి. వి. పర్వతే. బాలగంగాధర్ తిలక్ పుట 45 న వజీవన్. అహమ్మదాబాద్ 1958) కాని కొన్ని సంఘటనలుచూస్తే అంటరానితనంపై నమ్మకం వున్నదని పిస్తుంది. 1890 అక్టోబరు 4 న ఒకానొక క్రైస్తవ మిషనరీ యింట్లో బిస్కెట్లుతిని టీ త్రాగినవారిలో తిలక్‌తోబాటు గోఖలే. రనడేకూడా వున్నాడు. సనాతన హిందువులు యీ సంఘటన పట్ల ఆందోళన చేయటంలో శంకరాచార్య

న్యాయస్థానం యిచ్చిన తీర్పుననుసరించి, ప్రాయశ్చిత్తం చేసుకొని కాశీయాత్ర చేయటానికి తిలక్ అంగీకరించాడు. ఇక్కడ ఆధునిక పరిస్థితులబట్టి తప్పొప్పులు నిర్ధారించేకన్నా అంటరాని తనంపై తిలక్‌కు నమ్మకం వున్నదనీ అలాగే మ్లేచ్ఛులుగా భావించబడే వారినుండటీ త్రాగటం పాపంగా అగీకరించటం ఆయన నమ్మకాలను అనుకూలంగావున్నదని చెబితేచాలు.

పూనాలో జరిగిన మరొక సంఘటన శారదా సదన్‌లో విద్యార్థినిలు క్రైస్తవులుగా మారటాన్ని తిలక్ నిరసించి, ఆ సంస్థతోగల సంబంధాలను తెగత్రెంపులు చేసుకోటం. ఆ సదస్థిలోగల యిరువురు బాల్యవితంతువులు ఐచ్ఛికంగా క్రైస్తవులుగా మారటానికి అంగీకరించారనే వార్తతో కేసరి పత్రికలో తిలక్ తీవ్రంగా విమర్శలుచేశాడు. ఆ సదన్ నడుపు తున్న రాంభాయి యీ విషయంలో సమర్థించుకుంటూ, ఆర్థికంగా స్త్రీ విద్యకు హిందువులు సహాయపడక పోవటంపలన, క్రైస్తవులనుండి సహాయంస్వీకరించక తప్పలేదన్నది. ఆ ప్రస్తావన మినహాయించి క్రైస్తవులుగా మారటం ఘోరం అని మాత్రమే తిలక్ ప్రచారంచేశాడు. ప్రత్యామ్నాయాల ప్రసక్తి పట్టించుకోపోటానికి సాంఘిక సంస్కరణలపై దృష్టి లేకపోవటమే

1891 లో ఒకబిల్లు ప్రవేశపెడుతూ ఆనాటి బ్రటిష్ ప్రభుత్వం వివాహంచేసుకోటంలో అంగీకారం తెలియజేసే వధువు వయస్సు పదినుండి పన్నెండుకు పెంచింది. తిలక్ వ్యతిరేకిస్తూ, హిందూ ఆచారాలలో జోక్యం తగదన్నాడు. 1918 లో విఠల్‌భాయి పటేల్ ఇంపీరియల్ కౌన్సిల్‌లో

హిందూ వివాహ బిల్లు ప్రవేశపెడుతూ, అంతర్వర్ణ వివాహం ప్రోత్సహించాలనే ప్రతిపాదన చేయగా తిలక్ ఆ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించాడు. వారసత్వంలో చిక్కులొస్తాయి గనుక వ్యతిరేకిస్తున్నాని సంజాయిషీ చెప్పుకొన్నాడు.

సాంఘిక సంస్కరణలకుగాక రాజకీయ స్వాతంత్ర్యానికి ప్రముఖస్థానం ఇచ్చాడు తిలక్. కనుకనే కులతత్వం పోగొట్టటానికి కృషి చేయలేదనటం సరికాదు. కులాన్ని నమ్మిన వ్యక్తి గనుకనే అంతర్వర్ణ వివాహాలను వ్యతిరేకించాడు. తిలక్ సంఘ సంస్కర్తకాదు. పాతవ్యవస్థ తిరగదోడిన వ్యక్తి.

గణపతి వుత్సవాలు. శివాజి వీరారాధన తిరగదోడి, మహారాష్ట్రంలో హిందుసులను ఐక్యపరచటానికి ఆయుధాలుగా వాడటానికి తిలక్ సిద్ధపడటంలో కొన్ని ప్రధానకారణా లున్నయ్, గణపతి వుత్సవాలు ఆంగ్లేయులకు వ్యతిరేకంగానూ, శివాజీ ఆరాధన మహమ్మదీయులకు వ్యతిరేకంగానూ హిందువు లను సంఘటితపరచాలని తిలక్ వుద్దేశం. ఇందులో కొంతవరకు కృతకృత్యుడయ్యాడని చెప్పాలి. తిలక్ కాలంలో మహా రాష్ట్రలో జరిగిన హిందూ—ముస్లిం కలహాల సందర్భంగా బ్రిటిష్ ప్రభుత్వం ముస్లింలను సమర్థించిందని తిలక్ వాదన. హిందువులను సంఘటితపరచటానికి మత నినాదమే శరణ్యమని. గణపతి, శివాజి వుత్సవాలు పేరుతో వుద్యోగాలకు విజ్ఞప్తి చేయ గలిగాడు. శివాజీని దైవం అన్నాడు ఆయన సమాధి మరామ్మత్తు చేయింటంలో పాత్ర వహించాడు. శివాజి చర్య లన్నీ సమర్థించాడు. మరాఠి చరిత్రనుండి వుత్తేజం పొందాడు. గతంగల దేశానికి భవిష్యత్తు కూడా వుంటుందని తిలక్

నమ్మాడు. కనుక గతాన్ని తిరిగి తేవాలని ఆయన వుద్దేశం. తిలక్ రంగంలో దిగక పూర్వం నామ మాత్రంగా వుండే గణపతి, శివాజి వుత్సవాలలో వుద్రేకం, జాతీయత దేశభక్తి యిత్యాదులెన్నో రంగరించటంతోపాటు ముస్లిం, ఆంగ్ల వ్యతిరేకతకూడా చక్కగా జొప్పించాడు. ప్రతి హిందువు శివాజి వుత్సవంలో పాల్గొనాలన్నాడు. తిలక్ ధోరణి ముస్లింలను జాతీయ జీవనంలో క్రమేణా హిందువులకు దూరంచేయటంలో పునాదులు వేసింది. ఈ వుత్సవాల వుద్వేగం ఎంతవరకు పోయిందంటే, గోఖలేవంటి నాయకులను వూరేగింపులో దూషించేవారు. ఆ విషయం తెలిసే తిలక్ మౌనంవహించాడు. ప్రభుత్వజోక్యం అక్కరలేదన్న తిలక్ తానుగా యే సంఘ సంస్కరణనూ చేపట్టకపోగా, ఆగార్కర్, రనడేవంటివారిపై తీవ్రవిమర్శలుచేశాడు. దీని సారాంశం తిలక్‌కు హిందూ సమాజంలో మార్పులు రావటం యిష్టంలేదనే. శాస్త్రాల ప్రభావం అంత పెచ్చుగావున్న దాయనపై. పుట్టి పెరిగిన వాతావరణంనుండి స్వేచ్ఛాపూరిత పరిస్థితులలోకి రాలేక పోయాడు.

ఇక తిలక్ కృషి రాజకీయ రంగంలో చెప్పుకోదగినంత వున్నది. ముఖ్యంగా చదువుకున్న కొద్దిమందికే పరిమితమైన కాంగ్రెస్ సంస్థలో చైతన్యం రావటానికి తిలక్ చాలబాధ్యుడనవచ్చు. అక్కడమాత్రం వుగ్రస్వరూపి. ఎవరికీ లొంగని వాదన చేశాడు. ఫలితం చీలికలు.

1889 లో తిలక్ కాంగ్రెస్ ప్రవేశం చేశాడు. అప్పటినుండి యించుమించు ప్రతియేటా సమావేశాలకు తప్పక వచ్చే

వాడు. ఇంపీరియల్ కౌన్సిల్‌కు పరోక్షపు ఎన్నికలు జరగా
లని, భారతీయులు ఆయుధాలు ధరించటానికి అనుమతి యివ్వా
లని తీర్మానాలు పెట్టాడు. జిన్నాను యింగ్లండ్ పంపించాలనే
ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ అతని అనుభవం చాలదన్నాడు.
ఇవన్నీ ముస్లిం వ్యతిరేకతలుగా వుపయోగిస్తాయనటంలో
సందేహంలేదు. త్యాగంచేసి అయినాసరే స్వదేశీవస్తువులు
వినియోగించాలన్నాడు. సంవత్సరానికో మారు సమావేశం
కావటంగాక, ప్రజాభిప్రాయాన్ని సమీకరించటానికి తఅచుకలవా
లనే తిలక్ అభిప్రాయంకాంగ్రెస్ వారు అంగీకరించలేదు.ఆంగ్లేయు
లకు విజ్ఞప్తులు చేసి ప్రయోజనం లేదని తిలక్ వుద్దేశం.
1905లో బెంగాల్ విభజన జరిగిప్పుడు తిలక్ యితర బెంగాలీ
నాయకులతో సహా బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిలబడ
టంతో అఖిలభారత స్థాయికి వచ్చాడు. 1907 సూరత్
కాంగ్రెస్ నాటికి బిపిన్ చంద్రపాల్ తిలక్ పేరు అధ్యక్ష
స్థానానికి ప్రతిపాదించగా మితవాదులు దాదాభాయిని గెలిపిం
చారు. ఇక్కడనుండి చీలిక బాహాటమై, పోరాటం వీధిన
బడింది. తిలక్ పక్షంలో లజపతిరాయ్, బిపిన్ చంద్రపాల్,
అరవిందఘోష్ వుండేవారు. స్వరాజ్యం కొరకు స్వదేశీ వస్తు
వుల బహిష్కరణ, జాతీయవిద్య, సాధనలుగా తిలక్ పక్షం
పేర్కొన్నది.

దేశీయులకు వుద్రేకపూరితమైన ప్రసంగాలు చేశాడు
తిలక్. బ్రిటిష్‌వారికి భారత పరిస్థితులు వివరించటం, రాజ్యాంగ
బద్ధమైన ఆందోళన పనిచేయవన్నాడు. స్వయం శక్తిపై
సంఘటితంగా నిలబడి పోరాడాలన్నాడు. స్వరాజ్యం జన్మ

హాక్కుగా ప్రకటించాడు. స్వాతంత్ర్యంకోసం హింసాయుత చర్యలకు తలపడినవారిలో, వుద్యమాలతో తిలక్‌కు సన్నిహిత సంబంధం వుండేది. అహింసను ఆయన అంగీకరించలేదు. రెండు మారులు ఆయన రచనలు, వుపన్యాసాలు ప్రజల్ని రెచ్చగొట్టే విగా వున్నాయనే నెపంతో బ్రిటిష్ ప్రభుత్వం తిలక్‌ను జైల్లో పెట్టింది. రానురాను, తిలక్ బ్రిటిష్ సామ్రాజ్యాన్ని వ్యతిరేకించటం లేదంటూ, రాజు ఆధ్వర్యాన స్వరాజ్యం కోరుతున్నామన్నాడు. గోఖలేను దేనికైతే వ్యతిరేకించాడో, ఆ పద్ధతులనే చివరిరోజుల్లో తానే అవలంభించాడు. అనిబిసెంట్‌తో గలసి 1916 లో హోంరూల్ వుద్యమాన్ని ప్రారంభించాడు. ఔధ్యతాయుత సహకారర యివ్వాలనే నినాదం యిచ్చాడు. ఉద్వేగం పనిచేయదని, వివేచన కావాలని చివరి రోజుల్లోగాని తిలక్‌కు అవగాహన కాలేదు. బ్రిటిష్‌వారికి విజ్ఞప్తులు చేయనారంభించాడు. రాజకీయ పోరాటంలో గాంధేయపంథా ఆయనకు నచ్చలేదు.

తిలక్ ప్రప్రథమంగా దేశంలో, ముఖ్యంగా మహారాష్ట్రలో మధ్యతరగతి ప్రజల్ని రాజకీయాలపట్ల చైతన్యత చూపటం పట్ల ఆసక్తుల్ని గావించాడు. సాంఘిక చైతన్యం పట్ల వుదాసీనత వహించి, సనాతన ధర్మాన్ని కాంక్షించిన తిలక్ 1921 లో చనిపోవటంతో, గాంధి తిరుగులేని నాయకుడయ్యాడు.

REFERENCE BOOKS

1. **Bal Gangadhar Tilak :** Srimad Bhagavadgita Rahasya or Karma Yoga Sastra. (Tr.) Bhalchandra Sitaram Sukthankar 1936 Tilak Bros., Poona.

2. **Bal Gangadhar Tilak :** The Arctic Home in The 1956 Tilak Bros., Poona.

3. **T. V. Parvate :** Bal Gangadhar Tilak 1958 Navajivan, Ahmedabad.

సయ్యద్ అహమ్మద్ ఖాన్

మొగలాయి సామ్రాజ్యం పతనావస్థలోపడిన రోజుల్లో, వున్నత ముస్లిం సంప్రదాయాలుగల వంశంలో సయ్యద్ అహమ్మద్‌ఖాన్ 1817 అక్టోబరు 17 న ఢిల్లీలో జన్మించాడు. సంప్రదాయబద్ధంగా చదువుతున్నప్పటికీ ముస్లింల సేవలో మాత్రం గడపదలచుకోపోవటం అప్పటికి విశేషమే. తండ్రి మరణానంతరం గుమాస్తాగా జీవితం ఆరంభించి, ఈస్టిండియా కంపెనీలో మునిసిఫ్‌గాచేరాడు. చదువుకునేరోజుల్లోగాని, వుద్యోగ కాలంలోగాని సయ్యద్ జీవితంలో చెప్పుకోదగిన విశేషాలులేవు. 1846 నుండి 54 వరకు ఢిల్లీ కోర్టులో పని చేశాడు. ఆ సమయంలో ఢిల్లీ శిల్పకళను ఆసక్తితో పరికించి, వాటి శిధిలావస్థను తిలకించి విపులంగా ఒక గ్రంథంవ్రాశాడు. దీని ప్రభావం వలననే రాయల్ ఏషియాటిక్ సొసైటి గౌరవ సభ్యుడయ్యాడు.

1857లో సిపాయీలతిరుగుబాటు సయ్యద్ అహమ్మద్ జీవితంలో ఒక పోరాటానికి నాంది. ఆయన విప్లవకారణాలు పరిశీలించి కొన్ని నిర్ణయాలకువచ్చాడు. ప్రభుత్వ లక్ష్యాలపట్ల ప్రజల అజ్ఞానం. హిందువులకు అభ్యంతరకరమైన చట్టాలు చేయటం, ప్రజాజీవనంపట్ల ప్రభుత్వం అలక్ష్యం, దేశానికి తగిన పాలనగురించి ఆలోచించకపోవటం, సైనికులలో నాయకత్వ లోపం యీ తిరుగుబాటుకు మూలకారణాలన్నాడు. దేశీయు

లను శాసనసభలలో ప్రవేశింపపోవటంకూడా మరొక కారణంగా పేర్కొన్నాడు. ఇవన్నీకూడి చివరకు సైనిక తిరుగుబాటుగా పరిణమించిందని ఆయన భావం. ఈ విషయాలన్నీ విపులంగా చర్చిస్తూ ఒక చిన్నగ్రంథం వ్రాసి ప్రచురించాడు. పాలకులకు పాలితులకుమధ్య పొరపొచ్చాలు యేర్పడ్డాయని, అవితొలగిస్తే బ్రిటిష్‌పాలన బాగా కొనసాగుతుందని నమ్మాడు.

ఈ సమయంలో ముస్లింల అజ్ఞానం, వెనుకబడినతనం శ్రద్ధగా గ్రహించిన అహమ్మద్, వారి పరిస్థితి బాగుపరచాలను కున్నాడు. శాస్త్రీయ వివేచనాత్మక దృక్పథం విద్యావ్యాప్తి అవసరమని భావించాడు. మతంలో, సంఘంలో సంస్కరణలు అభిలషించాడు. ప్రవక్త మహమ్మద్ జీవితం, బైబిల్ వ్యాఖ్య, ఇస్లాం వ్యాసాలు రచించాడు.

1863 లో వుద్యోగరీత్యా ఘజీపూర్‌లో వుంటూ సాహిత్య విజ్ఞానశాస్త్ర సమాజాన్ని స్థాపించాడు ఆంగ్ల గ్రంథాలను ఉర్దూలో అనువదింపజేసి, ప్రాచ్య పాశ్చాత్య భావ సమ్మేళనం చేయాలని తలపెట్టాడు. కొద్దిమంది హిందువులు కూడా సయ్యద్ ప్రయత్నానికి తోడ్పడ్డారు! చరిత్ర, వ్యవసాయంలో ముస్లింలలో విద్యాభ్యాసం బహుళప్రచారం చేయాలనే సదుద్దేశంతో 1861 లో మురాదాబాద్‌లో ఒక ఆంగ్ల పాఠశాల స్థాపించాడు. పాశ్చాత్యుల కళలు, విజ్ఞానం ముస్లింలు కూడా నేర్చుకోవాలని సయ్యద్ ఆకాంక్ష.

1866 లో బ్రిటిష్ ఇండియన్ సంఘాన్ని స్థాపించి, బ్రిటిష్ పార్లమెంటుతో సన్నిహిత సంబంధం పెట్టుకోవా

లన్నాడు. భారతీయులు ధైర్యంగా తమ అభిప్రాయాలు వెల్లడించాలన్నాడు. ఉద్యోగంలో వుంటూ సయ్యద్ యీ ధోరణి అవలంబించటం గమనార్హం.

ఆద్యంతాలు సయ్యద్ బ్రిటిష్ వారికి శ్రేయోభిలాషిగా వున్నందున ఆయన ప్రసంగాలు, రచనలు అన్నీ సలహాలుగానే స్వీకరించబడినయ్. కాని సనాతన ముస్లింలు అతన్ని వేరుగా చూచారు. భారత ముస్లింల పతనావస్థ గమనించిన సయ్యద్ ఒకానొక దశలో ఈజిప్ట్ వెళ్లిపోవాలని నిర్ణయించుకొని తర్వాత మానేశాడు.

కుమారుడు ఇంగ్లండ్ వెడుతుంటే, ఆ అవకాశాన్ని పురస్కరించుకొని సయ్యద్ కూడా తోడుగా వెళ్ళి, చిరకాలంగా వున్న కోర్కెను తీర్చుకున్నాడు (1869). ఇంగ్లండ్‌లో విద్యా విధానం పరిశీలించి, భారతదేశంలో అలాంటి పద్ధతిలో ముస్లింలకు ఒక విశ్వవిద్యాలయం స్థాపించాలని నిర్ధారించుకున్నాడు. బ్రిటిష్ మ్యూజియంలో ప్రాచ్య భండాగారం తిరగేసి తనకు కావలసిన ప్రవక్త మహమ్మద్ జీవిత విశేషాలు సంతరించుకున్నాడు. ఆంగ్లేయుల ఆచార సంప్రదాయాలు తిలకించాడు. భారతీయులతో పోల్చి చూస్తే ఆంగ్లేయుల సంస్కృతి, నాగరికత చాలా వున్నతదశలో కనుగొన్నాడు. వీటన్నిటి ఫలితంగా ఆంగ్లేయులకు సన్నిహితు డయ్యాడు. ముస్లింలను ఆ దశకు తీసుకురావాలని నిశ్చయించుకున్నాడు. తత్ఫలితంగా దేశానికి తిరిగి రాగానే ఒక పత్రిక ప్రారంభించాడు. ముస్లింలు హేతుపద్ధతిలో నడవాలని, ఆచారాలు అలవాట్లు మార్చుకోవాలని బ్రాశాడు. వారి ఆగ్రహాని

ఎం. ఎన్. రాయ్‌వరకు

గురయ్యాడు. కొందరు మాత్రం ఆకర్షితులయ్యారు, మతా చార్యుల వ్యాఖ్యలు విమర్శించాడు సయ్యద్. క్రైస్తవ ముస్లిం మతాలు పూర్తిగా వ్యతిరేకమైనవి కావన్నాడు. స్త్రీల పరదాను గర్హించాడు. బానిసత్వాన్ని పోగొట్టాలన్నాడు. జెహాద్ ద్వారా యుద్ధాన్ని ప్రకటించటాన్ని త్యజించాడు.

అసాధారణ పరిస్థితిలో తప్ప బహుభార్యాత్వం అక్కర లేదన్నాడు. టీకాలను సమర్థించాడు. ఇదంతా సనాతన ముస్లింలను రెచ్చగొట్టి. ఆగ్రహపరులగావించింది. సయ్యద్‌ను చంపుతామని బెదిరించారు. క్రైస్తవుడని దూషించారు. అయినా అహమ్మద్ ధైర్యంగా నిలబడి కొందరి అండతో తన సంస్కరణ వాదాన్ని కొనసాగిస్తూ పత్రికను 1870 నుండి 1876 వరకూ నడిపాడు.

ముస్లింలను ఆధునికులుగా చేయటానికి పాశ్చాత్య విజ్ఞానం ఒక్కటే మార్గమని గ్రహించిన సయ్యద్ ఆలీఘడ్‌లో పాఠశాలతో ప్రారంభించి (1875) ఆంగ్లో ప్రాచ్య కళాశాలగా పెంపొందటానికి (1877) కృషి చేశాడు. అప్పటికే ప్రభుత్వ సేవనుండి బయటబడిన సయ్యద్ పూర్తిగా విద్యారంగాభి వృద్ధికి వినియోగించాడు. పబ్లిక్ సర్వీస్ కమీషన్ సభ్యుడుగా నియమితుడై భారతసివిల్ సర్వీస్ అట్టిపెట్టాలని పోరాడాడు.

1885 లో భారత జాతీయ కాంగ్రెసు స్థాపించబడగానే, ముస్లింలు దానికిదూరంగా వుండాలని సయ్యద్ విజ్ఞప్తిచేశాడు. కాంగ్రెసుకు వ్యతిరేకంగా యునైటెడ్ ఇండియన్ పేట్రియాటిక్ అసోసియేషన్ స్థాపించాడు (1888) కాని సయ్యద్

ప్రభావం ముస్లింలందరిపై పడలేదు. చాలామంది ముస్లింలు కాంగ్రెసులోచేరారు. ఉత్తర భారతావనిలో కొన్ని ప్రాంతాలకు, అదీ వున్నత సంపన్న ముస్లింలకే సయ్యద్ భావాలు పరిమితమైనయ్. జీవితపు చివరిదశలో మాత్రం కాంగ్రెసుపట్ల కొంత సుముఖతచూపాడు. కాంగ్రెసును వ్యతిరేకిస్తూ ముస్లింలను బ్రిటిష్‌వారికి అనుకూలగా వుండమని చెప్పిన సయ్యద్‌ను పాలకులు బాగా గౌరవించి, బిరుదులు ప్రదానం చేశారు.

సాంఘిక విషయాలనుండి ఇస్లాంను వేరుపరచాలనే సయ్యద్ ఉద్దేశం. ఖురాన్‌కు అన్యధా వుండే వాటిని ఇస్లాంగా భావించి అనుసరించ నవసరంలేదనటం ఆయన ముఖ్యసంస్కరణావాదం. హేతువుకు నిలబడి ఖురాన్ వ్యాఖ్యానించాలని, క్రైస్తవులతో కలసి భోజనం చేయవచ్చునని చెప్పటమేగాక ఆచరించినందుకు, మతంనుండి బహిష్కరించబడ్డాడు.

సయ్యద్ అహమ్మద్‌ఖాన్ కేవలం ముస్లింల శ్రేయోభిలాషి. వారిని అధునాతనం చేయాలని, సాంఘిక దోషాలు పోగొట్టాలని, యిదంతా ఇస్లాం ఖురాన్ పరిధిలోనే జరగాలని అభిలాషించాడు. ఈ భావాలు కొద్దిమందిని మార్చినయ్. కాని మతాచార్యుల తాకిడికి ఆయన భావాలు నిలబడలేదు. కాని ఆలీఘడ్ మాత్రం దిన దినాభివృద్ధి చెంది, ముస్లింల విద్యాకేంద్రంగా మారి ది సయ్యద్ జాతీయవాదికాదు పూర్తిగా హేతువాదికూడాకాదు. బ్రిటిష్ ప్రభావం వలన కొంతవరకు అధునాతనుడై ఆగిపోయాడు. ముస్లింలను సరిగా వినియోగించుకోలేదని, అవకాశాలు యివ్వలేదనీ అప్పుడప్పుడూ బ్రిటిష్ వారిని మందలించి, వారి మెప్పుపొందాడు. తన

MEMORIAL LIBRARY V.V.R. DELHI Acc. No.

వివేచనా దృష్టిని సారించి ఇస్లాంకు అన్యాయం చేయలేకపోయాడు. ముస్లింలలో అధికసంఖ్యాకులకు ఆయన ధోరణి నీరుగార్చినప్పటికీ కలిగించింది. 1898 మార్చి 27న ఆయన మరణించిన సమయానికి తొలి భారత ముస్లిం సంస్కర్తగా మహమ్మదీయులు భావిస్తున్నారు.

REFERENCE BOOKS

1. **Sir Syed Ahmed :** The Present State of Indian Politics 1888 Pioneer Press, Allahabad.

2. **Sir Syed Ahmed :** The Causes of the Indian revolt.

3. **J. M. S. Baljon Jr. D. D. :** The Reforms and Religions Idees of Sir Sayyid Ahmad Khan, 1964 Sh. Muhammad Ashraf, Lahore.

4. **W. C. Smith :** Modern Islam in India Ripon Printing Press, Lahore 1947.

5. **Ramgopal :** Indian Muslims Asia, Bombay 1959.

6. **Ramgopal :** Eminent Mussalmans G. A. Natesan & Co , Madras 1926.

అరవింద ఘోష్

ఆధునిక భారత తత్త్వవేత్తగా, యోగిగా పరిగణించబడుతున్న అరవిందఘోష్ జీవిత పరిణామం అనేక మలుపులు తిరిగింది తండ్రి కృష్ణధన్ ఘోష్ నాస్తిక డాక్టరు. తల్లి స్వర్ణలత వున్మత్తతతో బాధపడిన సంసారస్త్రీ. ఆరుగురు సంతానంలో అరవిందుడు మూడవవాడు. భారతీయభావాలు సచ్చక పాశ్చాత్య ప్రభావంతో సంతానాన్ని తీర్చిదిద్దాలనే తలంపుతో, డార్జిలింగ్ ఆంగ్లో-యిండియన్ పాఠశాలలో అరవిందునకు చదువు చెప్పించాడు ప్రాథమికదశలో. 1877-79 లో రెండు సంవత్సరాలపాటు సాగిన డార్జిలింగ్ చదువు సందర్భంలోనే అరవిందునకు ఒకపర్యాయం అంతా అందకారంగా కనిపించింది. చీకటి అంతా క్రమేణ్మస్తున్నట్లు అనుభూతివచ్చింది. ఈలక్షణాన్ని డాక్టర్ల ద్వారా పరిశీలింపజేసినట్లులేదు. ఎందుకో చెప్పజాలం గాని, యిలా చీకటిని చూడడమనే లక్షణం వుత్తరోత్తరా యింగ్లండ్‌లోనూ అప్పుడప్పుడు కనిపించింది. దీనిని తమస్సుగా వ్యాఖ్యానంచెప్పాడు, 1889 లో అరవిందుడు. ఆంగ్ల వాతావరణం. చదువుల నిమిత్తం 1879 లో యింగ్లండ్ వెళ్ళి, కుటుంబాన్ని అక్కడ యేర్పాటుచేసి వచ్చాడు తండ్రి. తర్వాలోనే తల్లి స్వదేశానికి తిరిగివెళ్ళగా. ముగ్గురు అన్నదమ్ములు డ్రేవిట్‌ను అజమాయిషిలోవుంటారు అరవిందునకు అతనేలాటిన్, ఆంగ్లం బోధిస్తాడు. అప్పటికి అతనికి మాతృభాష బెంగాలీరాదు.

డార్జిలింగ్‌లోవుండగా యింట్లో సేవకులుకూడా ఆంగ్లంలోనే మాట్లాడేవారు. మిస్ అక్‌రాడ్ అనే ఒకామె అరవిందను సెంట్‌పాల్ పాఠశాలలో చేర్పించింది. అప్పుడు అతని పేరు అరవింద ఆక్‌రాడ్ ఘోష్. ఇతన్ని క్రైస్తవునిగా మార్చాలనే ప్రయత్నం కొంతజరిగింది. తరచు క్రైస్తవ దేవలయానికి వెళ్ళి, ప్రార్థనలు చేస్తుండేవాడు. సంరక్షకుల అజమాయిషీ ప్రభావం దీనికి కారణమనవచ్చు. ఈయన లండన్ జీవితం ఆరు సంవత్సరాలు పూర్తికాగానే (1884-90) కేంబ్రిడ్జిలోచేరాడు. అక్కడే తొలిసారి బెంగాలి అభ్యసించటం ఆరంభించాడు. ఇండియన్ మజ్లిస్ అనే సంఘ కార్యదర్శిగావున్నాడు. భారతదేశాన్ని గురించి కొంత తెలుసుకోటం మొదలుపెట్టాడు. చిన్నప్పటినుండీ కవితలో ఆసక్తివుండేది. అతని అన్న మనోమోహన్ ప్రభావంతో గ్రీక్, లాటిన్ చదవటంలో ఆసక్తి చూపాడు తల్లిదండ్రుల ప్రేమకు దూరంగావున్న అరవిందుడు చిన్న తనంనుండీ విచారంగావుండేవాడు. దీనికితోడుతండ్రి పంపేడబ్బు చాలీ చాలనిస్థితిలో పెట్టగా, విలాసాలకు వీలుండేదికాదు అవకాశం వున్నప్పుడు ఒక్కోకమారు ఎక్కడికైనా వాహ్యాళి వెళ్ళేవాడు. మాంసాహారం, సిగరెట్లు త్రాగటం, పేకాట అరవిందని నిత్య అలవాట్లు. ఇంగ్లండ్ చలి అరవిందునకు గిట్టేదికాదు. సరైన దుస్తులుకూడా వుండేవికాదు ఆర్థిక దుస్థితివలన. మొత్తం 14 సంవత్సరాల ఇంగ్లండ్ జీవితంలో ఆ దేశం అరవిందునకు ఒక వ్యాపారదేశంగానే కనిపించింది. సాహిత్య ప్రభావం గాఢంగా నాటుకున్నది. ఐ. సి. ఎస్. పరీక్షల్లో వుత్తీర్ణుడైకూడా, గుర్రపుస్వారీ చేయజాలక, అనర్హుడయ్యాడు ఒకసారి గుర్రంపై

నుండి పడ్డాడు. స్వారీలో శిక్షణపొందటానికి ఆర్థిక పరిస్థితితే అడ్డుపడింది. కుమారుడు ఐ. సి. ఎస్. లో వుత్తీర్ణుడై గొప్ప వుద్యోగంచేస్తాడని ఆశించిన తండ్రి, కుమారుడు ఒక ఓడ ప్రమాదంలో చిక్కుకొని, భారతదేశం తిరిగి వస్తూ చనిపోయాడనే వార్తవిని, అకాలమరణం చెందాడు. అందువలన తండ్రిని చూడలేకపోయాడు అరవిందుడు. ఇంగ్లండ్‌లోనే బరోడా సంస్థానాధిపతితో ఒక వుద్యోగంచేయటానికి అంగీకరించి, నెలకు 200 రూపాయలకు ఒప్పుకున్నాడు. 1893 లో జరిగిన యీ మలుపు బహుశ అరవిందుని జీవితంలో నిస్పృహా నిరాశలు యినుమడించటానికి ద్యోతకంచేసివుండొచ్చు. పైగా బరోడాలో చిల్లరపనులు అనేకం చేయాల్సి రావటం, తన ప్రతిభకు సాన పెట్టుకునే అవకాశం లేకపోవటం మరొక అశనిపాతం అరవిందునకు బరోడా కళాశాలలో ఆంగ్లం, ఫ్రెంచి బోధించే అవకాశం లభించిన తర్వాత కొంత వుపశమనం కలిగిందేమో బెంగాలీ భాష బాగా నేర్చుకున్నాడు బరోడాలో. 'ఇందు ప్రకాశ్' అనే పత్రికలో తీవ్రంగా వ్యాసాలు వ్రాయటం రనడేవాటి తీవ్రత తగ్గించాలనటంతో ఆసక్తి ఒకపాలు తగ్గింది. కాంగ్రెస్ రాజకీయాల మితవాదం ఆదినుండే అరవిందునకు ఆట్టేనచ్చలేదు. అరవింద అతివాదం యెక్కడనుండి వచ్చింది?

బరోడాలో జతీన్ బెనర్జీ విప్లవకారునితో పరిచయమైంది. ఇతర విప్లవకారులతో సన్నిహితుడయ్యాడు. అదిగాక యేటా పూజా సెలవులకు బెంగాల్ వెళ్ళి వచ్చేవాడు. కాళీపూజ, ప్రజలవుత్సాహం. బెంగాలీయుల వీరారాధన గమనించాడు. రహస్య సంఘాలలోచేరి, గీతపై కత్తిపెట్టి ప్రమాణంచేశాడు.

ఇవన్నీ అరవింద బరోడా జీవితపు విప్లవధోరణికి సూచనలు. అక్కడే సిస్టర్ నివేదితతో పరిచయమైంది.

1901 లో అరవిందకు మృణాళినితో వివాహమైంది. ఆమె వయస్సు అప్పటికి పదానాలుగు సంవత్సరాలు. అరవింద ప్రాయం 21 సంవత్సరాలు. వివాహానికి శుద్ధి చేసుకోవాలంటే నిరాకరించాడు.

బరోడా జీవితంలో అరవింద ఒక సిద్ధాంతం ప్రతిపాదించాడు. "భవాని మందిర్" అనే పుస్తకం వ్రాశాడు. అడవులలో ఒక భవాని మందిరం నిర్మించి, కొందరు విప్లవ కార్యకర్తల్ని శిక్షితులజేసి దేశానికి అర్పించాలని అందులో సారాంశం. తన ఆశయాన్ని యితర విప్లవ నాయకులతో చర్చించాడు. నివేదిత వ్రాసిన 'కాళి' అనే గ్రంథ ప్రభావంతో బాటు, బెంగాల్, సంప్రదాయంలోగల చండిక, మాత మొదలైన వీరోచిత మత విషయాలు దృష్టిలో పెట్టుకొని "భవాని మందిర్" సూచన చేశాడు. ఆచరణలో అమలు జరగలేదు. యీ భావన జపాన్ దేశాన్ని ఆదర్శంగా స్వీకరించి జాతి శక్తిని వెల్లడించాలని వ్రాశాడు. భవాని మందిర్‌లో శిక్షణ పొందబోయేవారికి కఠిన నియమాలు, కొంతయోగం జోడించి చెప్పాడు.

1904 లో వైస్-ప్రిన్సిపాల్‌గా స్థాయి పెరిగింది. ఆసక్తి రాజకీయాలలో. భార్య బరోడాలో వుండకపోవటం వలన బ్రహ్మచారి జీవితమే కొనసాగింది. మృణాళిని బ్రహ్మ సమాజికురాలు. ఆమెను తన మార్గం అనుసరించమనీ, త్యాగం

చేయటానికి సిద్ధపడమని జాబులు వ్రాస్తూ, తనపై నమ్మకం వుంచితే తన శక్తి యిస్తానన్నాడు. భర్త జీవితంతో సాధనగా వుపకరిస్తానని భగవంతుని ప్రార్థన చేయమన్నాడు. బ్రహ్మ సమాజం వలన పవిత్ర విషయాలు వినే సహనం కోల్పోయా వంటూ డాంబెను. తన వుత్తరాలు రహస్యంగా వుంచమని నొక్కి చెబుతాడు. మొత్తంమీద ఆమెతో సక్రమంగా కాపురం చేయలేకపోయాడు. ఉగ్రరాజకీయాలు, ఆధ్యాత్మిక చింతన సంసారం చేయనివ్వలేదు. భార్యకు తరచు జాబులు వ్రాయ లేదు. తనను అర్థంచేసుకోమని బంధువుల యెత్తిపొడుపులు ఖాతరు చెయ్యవద్దనీ చెబుతూ, ఆమెనుండి ప్రోత్సాహం ఓదార్పుకోరాడు. 1906 లో కలకత్తా జాతీయ కళాశాల ప్రిన్సిపాల్‌గా, 'వందేమాతరం' పత్రిక సంపాదకుడుగా కృషి చేశాడు. బరోడాలోవుండగా తరచు యోగులనుకలుసుకోటం, అనుభవాలు పొందటం జరుగుతూనేవున్నది. ఆయన్ను ఆధ్యా త్మిక రంగంలోకి సంపూర్ణంగా దింపినది విష్ణుభాస్కర్ లేలే అనే మరాఠా యోగి.

కాంగ్రెస్‌లో అరవిందఘోష్, తిలక్, బిపిన్ చంద్రపాల్, లజపతిరాయ్ అతివాదులుగా చలామణి అయ్యారు. బహిష్క రణోద్యమంలో అరవిందుని పాత్ర చాలావున్నది. అతని దృష్టిలో దైవం, దుర్గరూపంలో మూర్తీభవించింది. బ్రిటిష్ వారికి విజ్ఞప్తులుచేయటం అతనికి బొత్తిగా యిష్టంవుండేదిగాదు. కాంగ్రెస్‌తో మితవాదులకు వ్యతిరేకంగా నూతన పథం యేర్పరచారు. బహిష్కరణోద్యమం అంటే ప్రభుత్వానికి చట్టబద్ధంగా సహకరించక పోవటమని నిర్వచించాడు. స్వరాజ్య

మంచే స్వాతంత్ర్యమేనని. విదేశీ అదుపులు లేని స్వేచ్ఛాయుత పాలన అని చాటింది అరవిందుడే. భారతీయులు పాలనలో పాల్గొనటం, శాసనసభల్లో ప్రవేశించటానికి అనుమతి వుండటం వలన ప్రయోజనం శూన్యమని అభిప్రాయపడ్డాడు. జాతికి స్వేచ్ఛ ముఖ్యంగనుక, అది కాపాడుకోటానికి యే మార్గమైనా అనుసరించవచ్చునని సిద్ధాంతీకరించాడు విప్లవం రావాలంటే ఒక కేంద్రశక్తి అవసరమని ఆయన భావించాడు. మాతృ భూమికి త్యాగం కావాలంటూ, రక్తధారబోసి అయినా ఆమె జ్యోతి వెలిగించాలన్నాడు. నియంతృత్వం అనేపదం వాడక పోయినా, యించు మించు ఆ లక్షణాలన్నీ కావాలన్నాడు.

1907 లో సూరత్ కాంగ్రెస్ సమావేశం ముందు అతివాదులందరికీ విజ్ఞప్తిచేస్తూ మితవాదులకు వ్యతిరేకంగా 'జాతీయసభ' యేర్పడాలన్నాడు అరవిందుడు. దీని ప్రథమ సమావేశం 1907 డిసెంబరు 28 న హరిపూర్‌లో జరిగింది. కాంగ్రెసును వశపరచుకొని. దానిని పూర్తిగా విచ్ఛిన్నం చేయాలని అరవిందుని ఆలోచన, సూరత్ కాంగ్రెస్ సమావేశంలో రభసకు, చీలికకు కారణం తానే అని ఆయన అంగీకరించాడుకూడా. 300 మంది అతివాదులు అరవిందుని అధ్యక్ష తన సమావేశమై, భవిష్యత్తు పథకం రూపొందించటానికి ఒక సంఘాన్ని నియమించి, స్వదేశీ. స్వపరిపాలన జాతీయ విద్య, విదేశీ వస్తు బహిష్కరణలపై తీర్మానం చేసినా, మళ్ళీ యెన్నడూ ఆ సమావేశం ఆశించిన పని జరగలేదు. వారు సమావేశం జరపలేదు. ఉద్రేకమేగాని వివేచనలేని ధోరణే యిందుకు కారణం.

ఆంగ్లేయుల రాజకీయ భావాలు భౌతిక వాదం చుట్టూ పెంపొందాయని, అవి భారతీయ సంస్కృతికి పనికిరావని అరవిందుని పుద్దేశం మితవాదుల కాంగ్రెసు ప్రజాస్వామిక వ్యతిరేక పథంగా చిత్రించాడు. విదేశీ పెత్తనం లేని పూర్తి స్వతంత్రం తన పుద్దేశం దేశ ప్రజలకు యిచ్చిన చివరి రాజకీయ పత్రంలో పేర్కొన్నాడు.

1908 మే నుండి 1909 మే వరకు ఒక సంవత్సరం పాటు జైలులో పెట్టబడిన అనంతరం, నేరం నిరూపణ గాక విడుదల గావించబడిన అరవిందుని రాజకీయ ధోరణిలో చాలా మార్పు వచ్చింది. ఉగ్రఅరాచకవాదుల చర్యలు ఖండించటం ప్రారంభించాడు. చట్ట బద్ధమైన ప్రభుత్వంపై ద్వేషం లేకుండా పోరాటం సాగించమన్నాడు. స్వరాజ్యం లక్ష్యంగా ప్రభుత్వంతో సహకరించి, ఒడంబడికకు రావటానికి అతివాదులు సిద్ధమే నన్నాడు. అరవిందుని ధోరణిలో వచ్చిన యీ మార్పు ఆశ్చర్యకరమైనదే.

బెంగాలీలో 'ధర్మ" ఆంగ్లంలో "కర్మయోగ" అనే పత్రికలుచేపట్టి. నిర్వహిస్తున్న అరవిందుని అరెస్టు చేయవచ్చుననే వార్త 1910 లో ఆయన్ను చందర్ నాగోర్‌కు పారిపోయేట్లు చేసింది. ఎప్రిల్ 4 న రహస్యంగా పాండిచేరి చేరుకున్నాడు. రాజకీయరంగంనుండి పూర్తిగా విరమించుకుని, ఆధ్యాత్మిక పరిధిలో ప్రవేశించాడు. రాజకీయాల గురించి అప్పుడప్పుడు వ్రాసినా, అవి తాత్వికంగానే వున్నయ్ అనేక ఆర్థిక బాధలకు గురై "ఆర్య' అనే తాత్విక పత్రిక స్థాపించి, పాల్ రిచర్డ్, అతని భార్య సహ

కారంతో దానిని 6 సంవత్సరాలపాటు నిర్వహించాడు. 1914 లో మీరారిచర్డ్ అరవిందుని ఆకర్షించింది. ప్రతిరోజుసాయం కాలం కొబ్బరితో చేసిన తీపిపదార్థాలు తెచ్చిపెట్టేది. కోకో కలిపియిచ్చేది. ప్రతి ఆదివారం ఆమెయింటికి విందుకై అర విందుడు వెళ్ళేవాడు రాత్రి 10 గంటలవరకు సంభాషించుకునే వారు. మొదటి ప్రపంచ యుద్ధకాలంలో ఫ్రాంస్ వెళ్ళిన మీరా రిచర్డ్ తిరిగి 1920 లో వచ్చి అరవిందుని ఆశ్రమానికి అధిపతిగా బాధ్యతలన్నీ స్వీకరించింది. "ఆగ్యన్ స్టోర్స్" ప్రారంభించటానికి ఆమె పెటుబడి పెట్టింది. 37 సంవత్సరాల వయస్సులో అరవిందునిచే ఆకర్షితురాలైన మీరా రిచర్డ్ 48 సంవత్సరాలకు అతనిచెంత పూర్తిగా వుండటానికి నిశ్చ యించుకొని, భర్తను పిల్లల్ని స్వదేశంలో వదలి వచ్చింది. ఆధ్యాత్మిక సాధనలో అరవిందునకు అండదండలుగా నిలబడింది.

1918 లో అనిబిసెంట్ కోరగా "భారత జాతీయవాది" అనే ప్రచ్ఛన్న పేరుతో ఆంగ్లేయుల సంస్కరణలపై వ్యాసం వ్రాస్తూ అవి చిక్కుల్ని తెచ్చిపెడుతాయన్నాడు. స్వరాజ్య పార్టీ స్థాపిస్తూ, తనకు ఒకప్పుడు అడ్వొకేట్‌గా పనిజేసిన చిత్తరంజన్‌దాస్ సందేశం అడిగితే, నిరాకరిస్తూ, తాను స్వరాజ్య పార్టీకి మౌనంగా సహాయం చేస్తున్నట్లు పేర్కొ న్నాడు. రాజకీయాల్లోకి రమ్మని పత్రిక సంపాదకత్వం స్వీకరించమని తిలక్ కోరగా నిరాకరించాడు. 1925 లో అతివాదులైన లజపతిరాయ్ ప్రభృతులతో చర్చలు జరిపాడు. మొత్తంమీద రాజకీయాలపట్ల ఆసక్తి క్రమేణా సడలిందనే

చెప్పొచ్చు. 1950 డిసెంబరు 5న పాండిచేరిలోనే మరణించాడు.

అరవిందుని తత్త్వం:

పుదుచ్చేరిలో ప్రశాంతంగా కాలం గడుపుతూ, అరవిందుడు తన తాత్త్విక, యోగ చింతలను 'ఆర్య' అనే పత్రికలలో పుంఖాను పుంఖంగా వ్రాశాడు. వ్రాతలో కవిత కనిపిస్తుంది. ఆంగ్లం సరళంగాదు. నారికేళ పాకం. శాఖా చంక్రమణం. దివ్యజీవనం, మానవాళి ఆదర్శం, పూర్ణ యోగం అనే గ్రంథాలలో ఆయన తత్త్వం విస్తృతంగా వుంటుంది. సారాంశం యిది:

సత్యమంతా ఒక్కటే. అది బ్రహ్మ ఉనికి, చైతన్యం; సగుణ నిర్గుణం, భౌతిక, మానసిక ఆధ్యాత్మిక లక్షణాలన్నీ బ్రహ్మ స్వరూపమే. పదార్థం, జీవితం, మనస్సు, ఆత్మకూడా బ్రహ్మలో భాగమే. పరస్పర విరుద్ధంగా కనిపించవచ్చుగాని అంతా ఒకే సత్య స్వరూపం. బ్రహ్మ పారమార్థికమూ, లోకముకూడా. బ్రహ్మ సత్యం సచ్చిదానంద లక్షణం. అదే శివలీల.

అరవిందుడు తత్త్వం ప్రకారం మానసిక పరిధి స్వల్పమైనది. దానితో అనూహ్యమైన బ్రహ్మసత్యాన్ని చూడ ప్రయత్నించటం అసాధ్యం. బ్రహ్మను నిర్వచించటం 'ఫలానా' అనిగాని, ఫలానాకాదు అనిగాని చెప్పటం సరిగాదు.

సృష్టి శూన్యంనుండి జరగలేదు. బ్రహ్మనుండి ఆవిర్భవించింది. కనిపించే ప్రతిదానిలోనూ బ్రహ్మసత్యం అంతర్లీనంగా ఇమిడివుంటుంది. బ్రహ్మనుండి జగత్తు యెలా ఆవిర్భావం చెందిందో గ్రహించాలంటే మానవుని స్థాయిపెరిగి, అతిమానవ స్థాయి రావాలి. సచ్చిదానంద బ్రహ్మకు, జగత్తుకూ వారధి అతీత మానసికస్థాయి. బ్రహ్మనుండి అతీత మానసికస్థాయి, పై స్థాయి మనస్సు. దివ్యజ్ఞానం, మనోవిజ్ఞానం, వున్నతమనస్సు. మనస్సు. ఆత్మ, ప్రాణం, పదార్థం యీ క్రమంలో దైవశక్తి అవరోహణ క్రమంలో అన్నిటా యిమిడివుంటుంది. ఇది తిరగేస్తే పరిణామక్రమం వుంటుంది. పదార్థం నుండి ప్రాణం పరిణమించట మంటే, పదార్థం లేకుండాపోవటం కాదుగా. మార్పు చెందుతుంది. అంతే. అంటే పైస్థాయి గర్భతంగా క్రిందిస్థాయిలో లేనిదే యీ విధంగా ఆవిర్భవించటం కుదరదు. ఇలా చూచుకుంటూపోతే సచ్చిదానంద స్థాయి లభిస్తుంది. పరిణామం అంటే వునికిలోగల చైతన్యస్థాయి పెంపొందటం. విప్పారటం, వున్నతస్థాయికిచేరటం. సమన్వయీకరణ పరిణామ లక్షణాలు. అతి మానసికదశలో మానవుడు రూపుమాసిపోడు. మార్పుచెందుతుంది. ఆధ్యాత్మిక దృష్టి విప్పారి, వాస్తవాన్ని గ్రహించే అతిమానవుడు శివశక్తిని కనుగొంటాడు. అలా పైదశకు వెళ్ళిన అతిమానవుడు తాను ఆనందిస్తూ తృప్తిపడక, బ్రహ్మ సత్యాన్ని పదార్థపు వునికిలోకి తెచ్చి, పదార్థమంతా దివ్యత్వంగా మార్చటానికి తోడ్పడతాడు. అది పూర్ణయోగం. అప్పుడు డబ్బు, కామం. రాజకీయం,

ఆరోగ్యం, ఆర్థికత అంతా దివ్యస్థాయికి చేరుకుంటుంది. దైవ లీలలో అంతర్భాగమౌతుంది.

జరిగేది జరుగక మానదని వూరుకుంటే పరిణామక్రమం పూర్తిగావటానికి చాలాకాలం పడుతుంది. దైవదృష్టిలో పాలు పంచుకొని, తోడ్పడటం మానవకర్తవ్యం. సాధన ద్వారా యిది సాధ్యం. దీన్ని పూర్ణలేక విశ్వయోగం అనొచ్చు. మానవునిలో సమన్వయదృష్టి వుంటేగాని దైవకార్యానికి చేదోడు కాలేడు. అంటే భౌతిక నైతిక స్వభావాల పొందిక, సమన్వయదృష్టి సాధించుకోవాలి. పరిణామక్రమంలో క్రమేణా దైవం బహిర్గతమౌతుంటుంది. అరవిందుని పూర్ణయోగంలో ఆచరణ, ధ్యానం, చైతన్యత, వివేచనతో పరిణామంలో ఆరోహణ అవరోహణాల్ని గ్రహించటం ప్రధానాంశాలు. మానవుని లక్ష్యం దివ్యమానవుడుగా దైవకార్యానికి తోడ్పడటమైతే, దాని సాధనకు పూర్ణయోగం తోడ్పడు తుందంటాడు అరవిందుడు.

భారత తాత్వికరంగంలో యింతకుముందే చెప్పబడిన జ్ఞాన, కర్మ, రాజ, హఠయోగాలు, వైష్ణవ తాంత్రిక, వేదాంత పద్ధతులు పరిశీలించి, సిద్ధి, శుద్ధి, ముక్తి, భుక్తి మార్గాలు పరికించి, వీటన్నిటినీ తన పూర్ణయోగంలో సమన్వయించా నన్నాడు అరవిందుడు. అచంచలత, స్థిరత్వాలు, శాంతి, మౌనం తన యోగలక్షణాలుగా పేర్కొన్నాడు. సాయుజ్య, సద్ధర్మ, సామీప్యముక్తి మార్గాలన్నీ యిందులో వున్నాయన్నాడు. పూర్ణయోగాన్ననుసరించి అన్నమయ, ప్రాణమయ మనోమయ జీవులను చైత్య పురుషులు గావించటం ప్రథమదశ. ఆధ్యాత్మిక

దృష్టి సచ్చిదానంద లక్షణాలు మూర్తీభవించటం రెండోదశ. తృతీయదశ అతీత మానవదశ. అతను పూర్ణయోగి. ఇక్కడ సాధ్యం,సాధన,సాధకుడు,అనేభేదంపోయి అంతాద్వైవంగాగ్రహించబడుతుంది. పూర్ణయోగ సాధనకు చిత్తశుద్ధితో కూడిన తృష్ణ, ఆత్మవికాసం, దైవానికి సంపూర్ణంగా అర్పించటం అవసరం.

పరిణామదశలో తరువాతదశ అతీత మానవజాతి ఆవిర్భవించటం. భూమిపై ధర్మరాజ్యస్థాపనకు వీరు తోడ్పడతారు. పరిణామం అతిమానవస్థాయితో అంతంకాదు. ఇంకా వున్నత స్థాయిలు వున్నయ్.

బ్రహ్మకు ఒక స్వరూపాన్ని లక్షణాన్ని అమర్చి పరిమితంగా చూడటం దృష్ట్యా ఆలోచిస్తే. జగత్తుమాయ అనొచ్చు. కాని సచ్చిదానంద స్వరూపంగా గ్రహిస్తే. మాయ కూడా దైవలీల అని తెలుసుకోవచ్చు. ఆ స్థితిలో మానవుడు సుఖదుఃఖాలను సమంగా స్వీకరించగలడు. అది సాధించటానికే అరవిందుడు పూర్ణయోగంచెప్పాడు.

చరిత్ర, సంస్కృతి: పరిణామం ప్రయోజనంలో కూడినది గనుక, చరిత్రా అంతే. బ్రహ్మ చరిత్రద్వారా బహిర్గతమౌతుంటాడు. భారతదేశంలోని బెంగాల్ జాతీయ వాదంలో యిది స్పష్టంగా కనిపించింది. భారతదేశం స్వాతంత్ర్యం పొందటం దైవవేచ్ఛ. జాతీయోద్యమంలో దైవమే అసలు నాయకత్వం వహిస్తున్నాడు. భారతీయులు యీ పోరాటంలో బ్రిటిష్‌వారి క్రింద శిక్షణ పొందుతున్నారు. భారతదేశచరిత్రకు భేదాలు సూచన ప్రాయమైనవి.

నాగరికత ప్రాణాన్ని సూచించే విధానం సుఖంగా బ్రతకటం నాగరికతలక్ష్యం. ఇందులో సృజనాత్మక శక్తులు సంస్కృతికి పరిధికి, మానసికరంగానికి చెందినవి. వీటన్నిటికంటె సచ్చిదానంద గొప్పది.

భారతదేశంలో సనాతనధర్మమే జాతీయత. సాంస్కృతిక ఐక్యత అంతర్లీనంగా భారతదేశంలో వున్నది. సాహిత్యం, కళ, మతం, ధ్యానంలో యిది ద్యోతికమౌతుంది. జాతీయవాదానికి ముఖ్య ప్రాతిపదిక మానసికమైనది. జాతికి ఒక ఆత్మవుంటుంది. విదేశీయుల పాలనలో జాతి ఆత్మ అంధకారంలోవున్నది. అది మరలా చైతన్యవంతంకావాలి అంటాడు అరవిందుడు.

జాతీయ వాదానికి మతాన్ని జోడించటంద్వారా అరవిందుడు గతాన్ని తిరగదోడటంలోనూ, యువకులను రెచ్చగొట్టటంలోనూ ప్రధానపాత్ర వహించగలిగాడు. ఆధ్యాత్మిక రంగంలో భారత ప్రాభాన్యం ఆధిక్యత నొక్కిచెప్పి. ఆధ్యాత్మిక సామ్రాజ్యవాదంచెప్పాడు. ఆధ్యాత్మిక రంగంలో ప్రపంచాన్ని జయించటానికి భారతదేశం నాయకత్వం వహించాలన్నాడు. ప్రపంచాన్ని కాపాడగలది భారతదేశమని నమ్మాడు. జాతీయత ఆధారంగా మానవజాతి ఐక్యత సాధించవచ్చునని ఆశించాడు.

గతాన్ని తిరగదోడటంలో అరవిందు నంతగా భారత ఆధునిక తత్త్వ రచయిత లెవ్వరూ తోడ్పడలేదు. వర్తమానాన్ని భవిష్యత్తును విస్మరించి, గతంపై ఆధారపడేగుణంతో బాధపడుతున్న భారతీయులకు అరవిందుని ఆదర్శవాదం యింకా మత్తుమందువలె పనిచేస్తుంది. వేదాల్లో గీతలోనే సర్వస్వం

వున్నదనుకునే ధోరణి అశాస్త్రీయ ధోరణి ప్రబలింపజేస్తుంది. అరవిందుని జాతీయవాదం భారతజాతి ఆధిక్యతను సూచిస్తున్నది; దీనికి మారుపేరే ఫాసిజం దానికి యెంత ఆధ్యాత్మిక ముసుగు వేసినా, వాస్తవానికి మిగిలేది జాత్యా హంకారమే. ఒకజాతి అహంకారాన్ని ఖండిస్తూ, మరొకజాతి అహంకారాన్ని రెచ్చ గొట్టటంసంకుచిత ధోరణి.

అరవిందుడు చెప్పినప్రకారం పరిణామక్రమం జరుగు తుందనీ, అతీత మానవుడు వస్తాడనటానికి ఆధారాలు యేమిటి అని ప్రశ్నించుకుంటే అరవిందుని పైనమ్మకం వుంచటమేనని సమాధానం చెప్పుకోవచ్చు. తత్త్వంపేరిట యేదైనాచెప్పొచ్చు రుజువుచేయవలసిన భాధ్యత తత్త్వవేత్తలకు లేదుగా.

అరవిందుడు ఆ అతివాద రాజకీయాల్లో సాధించజాలని భవానీ మందిర్ ఆశయం తన ఆశ్రమద్వారా సాధించాలను కున్నాడు. ఆధ్యాత్మిక వుగ్రవాదిగామారాడు. భారతదేశీయులు ప్రపంచానికి మార్గదర్శకులుగా అతీతదశలో వుంటారని వూహించటం యితర మానవులను కించపరచటమే పరోక్షంగా ఆయన ఒక విధంగా ఆధ్యాత్మిక సామ్రాజ్యవాది, ఆధ్యాత్మిక ఫాసిస్టు అనొచ్చు.

REFERENCE BOOKS

1. **Sri Aurobindo :** The Life Divine (2 Vol.) Sri Aurobindo Ashram, Pondicherry.

2. **Sri Aurobindo :** The Synthesis of Yoga (2 Vol.) Sri Aurobindo Ashram, Ponddicherry.

3. **Sri Aurobindo :** The Ideal of Human Unity Sri Aurobindo Ashram, Pondicherry.

4. **Sri Aurobindo :** Foundations of Indian Culture Sri Aurobindo Ashram, Pondicherry.

5. **Sri Aurobindo :**

6. **A. B. Purani :** The Life of Sri Aurobindo 1964 Sri Aurobindo Ashram, Pondicherry.

7. **Haridas Chandhuri :** Sri Aurobindo, The Prophet of Life Divine 1960.

8. **Sri Aurobindo :** On Himself and on the Mother Sri Aurobindo Ashram, Pondicherry.

9. **Daniel Argor :** Moderates and Extremists in the Indian Nationalist Movement 1967, Asia, Bombay.

దాదాభాయ్ నౌరోజి

భారతజాతీయ కాంగ్రెస్ పుట్టకపూర్వమే స్వాతంత్ర్యం కోసంగాకపోయినా భారతీయుల బాగోగులకై పోరాడిన వ్యక్తి దాదాభాయ్ నౌరోజి. రాజకీయాలను వ్యాపారంలో రంగరించి, చివరకు వ్యాపారంవదలి ఆర్థిక రాజకీయ విషయాలలో భారతావని గురించి ఆంగ్లేయులకు చెప్ప ప్రయత్నించాడు నౌరోజి. 1825 సెప్టెంబరు 4 న బొంబాయిలో ఒక పార్శి కుటుంబంలో జన్మించిన నౌరోజికి దాదాభాయి అనేది హిందువుల పేరుగా పెట్టటం యెందుకో తెలియలేదు. తండ్రి పలన్‌జీదోర్డి జొరాస్ట్రియన్ పురోహితుడు. ఎల్‌ఫిన్ స్టైన్ కళాశాలలో విద్యాభ్యాసం గావించి, దాదాభాయి 27 సంవత్సరాలకే అదే కళాశాలలో గణితశాస్త్రాచార్యుడుగా నియమించబడటం ఆ రోజుల్లో భారతీయులు గర్వించదగిన విశేషం. ప్రతిభకు ప్రథమస్థానం యిచ్చినరోజులవి. కాని మూడుసంవత్సరాలు తిరగకముందే విద్యారంగం వీడి, వ్యాపారనిమిత్తం ఇంగ్లండ్ వెళ్లాడు దాదాభాయ్. ఇది 1855 నాటి సంగతి. వ్యాపారం వ్యక్తిగత విషయమైనా, దాదాభాయ్ ఇంగ్లండ్ వెళ్ళటం భారతీయులకు ఎంతో ఉపయోగకారి అయింది. భారతదేశ స్థితిగతులను విడమరచి ఆంగ్లేయులకు చెప్పనారంభించాడు నౌరోజి. లండన్‌లోవున్న ప్రముఖ సంస్థలన్నిటిలో సభ్యుడయ్యాడు. పార్శిల విషయమేగాక, భారతీయుల ఆర్థికదుస్థితి

అవగాహన చేసుకొని, గణిత శాస్త్రాచార్య వాసనలు పోనీక, లెక్కలతోసహా స్వదేశ పరిస్థితి పాలకులకు విడమరచి చెప్పాడు. దాదాభాయి నౌరోజి జీవితంలో ఇదిపెద్దప్రయత్నం. ఆంగ్లేయులను సరిగా విద్యాధికులనుచేస్తే, భారతదేశంగురించి నచ్చజెపితే, దేశపాలనలో చాలామార్పులు తెస్తారని ఆయనకు అపార నమ్మకం రాజ్యాంగబద్ధంగా వ్యవహారం గడపాలనే అభిప్రాయం గలవాడు.

1857 లో జరిగిన సిపాయీల తిరుగుబాటు ఫలితంగా, భారతీయులకు ఆంగ్లప్రభుత్వం యిచ్చిన హామీలు, ఈస్టిండియా నుండి పరిపాలన ఇంగ్లండ్ ప్రభుత్వానికి హస్తగతం గావటంతో, నౌరోజిలో చాలా ఆశలు వచ్చినయ్, తరచు భారతీయులపట్ల ఆంగ్లేయుల హామీలను ఇంకితెస్తూ వారి నైతిక మనస్తత్వానికి విజ్ఞప్తిచేస్తుండేవాడు.

లండన్‌లో ఇండియన్ సొసైటీస్థాపించి, అదొకప్రచార సాధనంగా వినియోగించాడు. ఐ. సి. ఎస్. భారత విద్యార్థులకు సంస్కృతం, ఆరబిక్ భాషల్లో మార్కులు తగ్గిస్తే పోరాడి కృతకృత్యుడయ్యాడు. మార్కులకోటా పెంచటంలో, ఆసియా వాసులు తక్కువవారు అనే వాదన ఖండిస్తుండేవాడు. ఒకానొక దశలో ఆంగ్లేయయువతులతో సన్నిహితంగా తిరగటం తల్లికి అనుమానంగాతోస్తే, యింటికివచ్చి తన శీలాన్ని రుజువు చేసుకోవలసి వచ్చింది నౌరోజికి!

దాదాభాయ్ నౌరోజ్ కృషిఫలితంగా ఆయనకు భారత దేశంలో బహుళప్రచారం లభించింది. 1878 లో బరోడా

మహారాజు ఆహ్వానంపై దివాన్ (ప్రధానమంత్రి)గాచేరి, ఆంగ్లేయులకూ రాజుకూగల వ్యవహారాల్లో తలదూర్చి. ఆరోగ్యం చెడగొట్టుకున్నాడు. 13 మాసా: అనంతరం ఆ వూబిలోనుండి బయటపడి ప్రజారంగంలో ప్రవేశించి, బొంబాయి మునిసిపల్ కార్పోరేషన్ సభ్యుడుగా ఎన్ని కయ్యాడు, (1875 జులై 26). టౌన్ కౌన్సిల్ సభ్యుడుగా మునిసిపల్ వ్యవహారాలు పట్టించుకొని, యిమడలేక 1876 లో రాజీనామాయిచ్చాడు. 1885 ఆగస్టులో బొంబాయి లెజి స్లేటివ్ కౌన్సిల్ సభ్యుడయ్యాడు. ఆ సంవత్సరంలోనే ఇంగ్లండ్‌లో పార్లమెంట్‌కు పోటీచేసి ఓడిపోయాడు. మొత్తం ఇంగ్లండ్‌లో యిలా నాలుగు పర్యాయాలు పోటీచేసి, ఒక్క సారి లిబరల్ అభ్యర్థిగా 4 ఓట్లతో గెలుపొందాడు (1892). అదే పెద్దవిశేషం. భారతీయుడని సభ్యుడుగా ఎన్నుకోవటం ఆంగ్లేయుల లిబరల్ తత్త్వానికి నిదర్శనగా యీ సంఘటన చూపొచ్చు. భారతజాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడుగా 1886, 1893, 1906 లో ఎన్నికయ్యాడు. అనిబిసెంట్ కోర్కెపై హోం రూల్‌లీగ్ అధ్యక్షుడుగా చివరిదశలో కొంత కృషి చేశాడు. బొంబాయి విశ్వవిద్యాలయం డాక్టరేట్ యిచ్చి 1916 లో సన్మానించింది. 1917 లో బొంబాయిలో మరణించాడు.

బ్రిటిష్‌పాలనవలన మొత్తంమీద భారతదేశానికి యెంతో మేలుచేకూరిందనే విశ్వాసంగలవాడు దాదాభాయ్. ఈ ప్రాతిపదికతో ఆరంభించి, తరచు ఆంగ్లేయుల బాధ్యతలు విస్మరిస్తున్నారని ఆయన వాదన దేశాన్ని సైసికంగా అణచినా, మాన

సిక శక్తుల్ని అదుపులో పెట్టలేరనేవాడు. భారత ఆర్థికపరిస్థితులు సక్రమంగా వినియోగిస్తే అటు యింగ్లండ్‌కూ లాభాలు చేకూర తయ్. భారతీయులపరిస్థితీ మెరుగౌతుందని నౌరోజీవాదన. న్యాయం, స్వేచ్ఛకై నిలబడిన ఇంగ్లండ్, ఆ సూత్రాలను భారతదేశంలో విస్మరించినందునే దేశీయులు బీదరికాన్ని అనుభ విస్తున్నారన్నాడు. 1858 లో ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం మతసహనం, స్వేచ్ఛ, చట్టంద్వారా అందరికీ సమానత్వం, ప్రతిభకు గుర్తింపు అమలుజరగాలి. అవి ఆచరణలో మాపమని నౌరోజి అందోళన సారాంశం. ఆ కార్యక్రమంలో భారతీయుల వ్యాపారాభివృద్ధి జరిగి, పాలనా వ్యవస్థ బాగుపడి వుభయ తారకంగా మారుతుందని దాదాభాయ్ వుద్దేశం. భారతదేశ బాగుకే ఆంగ్లేయుల పాలనవున్నదని కనుక దేశంలో పేదరికం రూపుమాపుటం వారి విధి అని నౌరోజి చెప్పాడు.

సామ్రాజ్య వాదం, వలస వాదపులోతు పాతులు గ్రహించగలిగినప్పుతే నౌరోజి ఆందోళన మరొక తీరులోవుండేది. భారతీయుల ఆర్థిక పరిస్థితి బాగుపరుస్తారనే నమ్మకం ఆంగ్లేయులపై వుంచే వాడుకాదేమో. మచితనమేగాని రాజకీయపు యెత్తుగడలజోలికిపోని నౌరోజి ఆక్రందన అడవికాచిన వెన్నెలయింది.

దాదాభాయి భావాలు చక్కగా పొందుపరచబడ్డాయి. "పావర్టీ అండ్ అన్ బ్రిటిష్ రూల్ యిన్ ఇండియా" అనే రచనలో. దినివలన బ్రిటిష్‌వారిలో చైతన్యం కలుగకపోయినా, భారతీయులులో కొందరికి కనువిప్పు అయింది.

భారతదేశంలో ఆర్థిక దుస్థితిపై సమాచారం సేకరించి, వివరణచేసి, సిద్ధాంతీకరించి, వాదనచేసిన గ్రంథం యిది. దీని సారాంశ మేమంటే దేశంలో బ్రిటిన్ వారి పాలనా వ్యవస్థకు అయ్యేఖర్చు, సైనికుల పోషణకు వ్యయం, పన్నుల భారం వీటి అన్నిటి ఫలితంగా భారతసంపద తుడిచిపెట్టుకపోతున్నదనీ భారతీయులు బీదరికంలో కొట్టుమిట్టాడుతున్నారనీ నౌరోజి సోదాహరణంగాచూపాడు. దీనికి పరిష్కార మార్గాలను సూచిస్తూ, భారతీయులను సాధ్యమైనంతవరకు పాలనలో ప్రవేశ పెట్టాలి. పెట్టుబడులు ఇంగ్లండ్‌నుండి రావడంతోపాటు, దేశీయులనూ ప్రోత్సహించాలి. ఇది జరగాలంటే 1858 ప్రకటన అమలుజరపాలి.

శాసనసభలలో, పాలనలో భారతీయులు క్రమేణా పెచ్చుకావాలని, స్వదేశీవస్తువుల వాడకం పెరగాలని నౌరోజి అభిప్రాయపడ్డాడు. ప్రథమ ప్రపంచయుద్ధంలో బ్రిటిష్‌వారిని సమర్థించాడు. బ్రిటిష్‌వారిద్వారా భారతీయులకు మంచి చేకూర్చాలనే తాపత్రయం నౌరోజి జీవితమంతా చూడొచ్చు.

సురేంద్రనాథ్ బెనర్జీ

ఆంగ్లేయుల పాలన దైవకృతంగా భావించిన నాయకుల శ్రేణికే చెందుతాడు సురేంద్రనాథ్ బెనర్జీ. 1848లో కలకత్తాలో జన్మించిన బెనర్జీ, 1868లో పట్టభద్రుడై, లండన్ విశ్వవిద్యాలయంలో చదివి, 1869 లో ఐ. సి. ఎస్. ప్యాసై అసిస్టెంట్ మాజిస్ట్రేట్‌గా నియమితుడయ్యాడు భారతదేశంలో. (సిల్హాట్‌లో) కాని ఆ ఉద్యోగ నిర్వహణలో అవినీతి చర్యలకు పాల్పడినట్లు తప్పుడు నివేదిక సరిదిద్దినట్లు రుజువై నందున పదవి పోగొట్టుకున్నాడు. దింపుడు గళ్ళాసతో యింగ్లండ్ వెళ్ళి అప్పీలుచేసుకున్నా నిష్ప్రయోజనమైంది. దాంతో సురేంద్రనాథ్ తిరుగుబాటుచేశాడు. ఒక పర్యాయం (1883) న్యాయమూర్తిని విమర్శించినందుకు జైలుశిక్ష అనుభవించాడు. ఆంగ్లాచార్యుడుగా ఒకటి రెండు సంస్థలలో పనిచేసి, చివరకు తానే ఒక పాఠశాల స్థాపించాడు. ఉత్తరోత్తరా అది లార్డ్ రిప్పన్ కళాశాలగా పెంపొందటానికి బెనర్జీ కృషేకారణం.

రాజ్యాంగ బద్ధంగా పోరాటం సాగించాలనే భావాలతో రాజకీయాల్లో దిగి 1876 లో జులై 26 న కలకత్తాలో ఇండియన్ అసోసియేషన్ స్థాపించాడు. 'బెంగాలి' పత్రికా సంపాదకుడుగా కొన్నాళ్లు పనిచేశాడు. 1876 నుండి 1899 వరకు కలకత్తా కార్పొరేషన్‌లో ప్రముఖపాత్ర వహించాడు. ఇంగ్లండ్‌లో ప్రజాభిప్రాయాన్ని భారత్ సంస్కరణలకు అనుకూలంగా

చేసుకోటానికి ప్రయత్నించిన ప్రముఖులలో ఈయన పాత్ర ప్రముఖమైనది. నాలుగు పర్యాయాలు బెంగాల్ శాసనసభకు ఎన్నికయ్యాడు. కాంగ్రెస్ అధ్యక్షుడుగా రెండుమారులు వున్నాడు (1895,1902) 1918లో కాంగ్రెస్‌నుండి విడిపోయి అఖిలభారత లిబరల్ సమాఖ్య అధిపతి అయ్యాడు. మాంటేగ్ ఛెంస్ఫర్డ్ సంస్కరణలు వ్యతిరేకిస్తామని కాంగ్రెస్ వారన్నప్పుడు బెనర్జీ యిలా ప్రవర్తించాడు. 1925 ఆగస్టు 6న మరణించాడు.

ఆంగ్లేయులపాలన దైవేచ్ఛగా భావించిన సురేంద్రనాథ్, భారతీయుల ప్రేమాభిమానాలు పొందటానికి ఆంగ్లేయపాలకులు చేయవలసిన కృషి గురించి యదాశక్తి చెప్పాడు. ముఖ్యంగా పరిపాలనలో సంస్కరణలు తెస్తే, భారతీయులు ఆంగ్లేయుల పట్ల కృతజ్ఞతతో వ్యవహరిస్తారన్నాడు. ప్రజావాక్యమే దైవ వాక్యం గనుక, భారతీయుల నమ్మకపోవటంబ్రిటిష్‌వారి పిరికితన మన్నాడు. తగుజాగ్రత్త వహించటంలో తప్పులేకపోవచ్చు గాని, అనుమానించేటంత స్థాయికి దిగిజారటం మంచిదికాదని హెచ్చరించాడు. రాజకీయాలో నీతి వుండాలన్నాడు.

భారతకాంగ్రెస్ రాజకీయాలలో సురేంద్రనాథ్ మిత వాది. హింసకు వ్యతిరేకి. బలవంతంగా గాక చట్టబద్ధంగా మార్పులకై ఆందోళనచేసి, క్రమేణా సంస్కరణలు తేవాలని ఆయన భావన. ఈ దృష్ట్యా భారతీయులను ఎక్కువరోజులు పాలించాలంటే, వారి ఆదరాభిమానాలు చూరగొనాలని మరీ మరీ హెచ్చరించాడు. ఆంగ్లేయులు యీ విషయంలో శ్రద్ధ వహిస్తే, వారికేగాక, భారతీయుల అజ్ఞానాన్ని మౌఢ్యాన్ని

తొలగించటంలో తోడ్పడినవారౌతారన్నాడు. ప్రజాభిప్రాయానికి ఇంతవిలువ యివ్వటం మంచిదని ముందుచూపుతోచెప్పాడు.

భారతీయుల గతం గొప్పది, వున్నతమైనది కనుక, ఆ మార్గంలో పయనించి నైతిక పంధా పుణికిపుచ్చుకోవాలని యువకులకు సురేంద్రనాథ్ సలహాయిచ్చాడు. గతంలో భారత దేశపు మానవ విలువను అనుసరిస్తే దేశానికి భవిష్యత్తువున్నదని నమ్మాడు. పునర్వికాసం కావాలని ఆయన వాదన సారాంశం. భారతదేశపు ఐక్యత కాంక్షించాడు. దేశ పురోగతికి ఐక్యత తప్పనిసరి అన్నాడు. భారతదేశం భాగుపడటానికి సురేంద్ర నాథ్ సూచించిన మార్గాలలో, బీదవారికి పన్ను మినహాయింపు, ఆర్థిక బాధలనుండి రైతులవిముక్తి, ప్రభుత్వ సేవలలో భారతీయుల నియామకం, క్రొత్తపరిశ్రమల స్థాపన, భూమిని తిరిగి సర్వేచేయించటం కొన్ని వీటితోపాటుస్వదేశీవస్తువులను ప్రోత్సహిస్తూ, విదేశీవస్తువులను స్వదేశీయుల అవసరాలకు అనుగుణంగా మలచుకోటం అవసరమని నొక్కిచెప్పాడు.

భారతదేశపు గతాన్ని తిరగదోడటంగాక, అందులో మనకవసరమైనంతవరకు స్వీకరించి, వుత్సాహాన్ని పొందాలని, తద్వారా ఉజ్జ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చునని సురేంద్రనాథ్ ఉద్దేశం. రాజకీయ స్వాతంత్ర్యం అవసరమనీ, ఆర్థికాభివృద్ధి జరిగితేగాని యిది సాధ్యంకాని, రాజకీయ స్వేచ్ఛతోగాని ప్రజలమేధస్సుకు సానబెట్టజాలమని చెప్పాడు. కనుక స్వపరిపాలన కావాలన్నాడు. దీనికి నైతికబలాన్ని యివ్వటానికి గతంలో మతభావాలను అనేకంచూపాడు. గతాన్ని

చూపి ప్రజల్ని ఉత్తేజితుల్ని చేయటానికి తన వక్తృత్వ ప్రతిభల్ని చక్కగా వినియోగించాడు బెనర్జి.

తన భావాలను ప్రచారం చేయటానికి స్వదేశమంతా పర్యటించటమేగాక, ఇంగ్లండ్‌లోనూ తిరిగి వుపన్యాసాలిచ్చాడు. సురేంద్రనాథ్. జీవితంలో ఆద్యంతాలూ రాజ్యాంగబద్ధంగా వుండాలనే ధోరణి మాత్రం పోనివ్వలేదు. పాశ్చాత్య రచయితల ప్రభావం, ఇంగ్లండ్ రాజ్యాంగ ప్రభావం బెనర్జిపై బాగా వున్నాయి. ఇంగ్లండ్ పాలనతో ఇండియాను బాగుపరచాలని ఆక్రందించిన నాయకుడాయన.

మహదేవ గోవిందరనడే

మహారాష్ట్రలో వుజ్జ్వలంగా వైకొస్తున్న నైతిక, సాంఘిక శక్తులకు రూపకల్పనచేసి, ప్రాతినిధ్యం వహించిన మేధావిరనడే. ఆయన దేశభక్తి విప్లవపంథాతో ద్యోతకమైంది. మతంలో గూడుకట్టుకున్న మౌఢ్యాలు కాలదోషంపట్టిన ఆచారాలు, సంప్రదాయాలు పోవాలని రనడే కృషి చేశాడు. ప్రజల్లో విప్లవాత్మక భావాలు వుంకేగాని విదేశీపాలన తొలగించి పురోగమనాన్ని సాధించలేమని గ్రహించిన వ్యక్తి రనడే.

1842 జనవరి 18న ఒక సనాతన కుటుంబంలో జన్మించిన రనడే, మహారాష్ట్రకు చెందినవాడు. కొల్హాపూర్‌లో విద్యాభ్యాసం పూర్తిగావించుకొని, పున్నత విద్యకు బొంబాయి ఎల్ఫిన్‌స్టైన్ కళాశాలలోచేరి ఎం. ఎ., ఎల్ ఎల్. బి. పూర్తి చేసుకున్నాడు. అదే కళాశాలలో ఆర్థిక చరిత్ర ఆచార్యుడుగా పనిచేశాడు. (1868-70) 30 సంవత్సరాలకే సబ్ జడ్జిగా నియమితుడై పూనాచేరి చాలా ప్రధానపాత్ర నిర్వహించారు. అంతకు పూర్వమే ప్రార్థన సమాజ్ సార్వజనిక సభలు స్థాపించబడి కొనసాగుతుండగా రనడే కృషితో వాటికి ప్రాధాన్యత పెరిగింది. దయానంద సరస్వతిని ఆహ్వానించి ఉపన్యాసాలిప్పించినందుకు సనాతనుల ఆగ్రహానికి గురై తట్టుకున్నాడు. జీవితంలో రెండు వివాహాలు చేసుకున్నాడు. తొలి భార్య

చనిపోగా, రెండవవివాహం విధవను చేసుకోనందుకు. చెప్పటమే గాని, చేతల్లో చూపడని కొందరు విమర్శించారుకూడా. 1885 లో బాంబాయి లెజిస్లేటిల్ కౌన్సిల్‌కు నియమించ బడ్డాడు. హైకోర్టున్యాయమూర్తిగా బొంబాయిచేరి సాంఘిక, ఆర్థిక రాజకీయభావాలు వెల్లడిస్తూ అనేకమందిని ప్రభావితుల్ని చేశాడు

1887 లో భారతజాతీయ సాంఘిక సభను స్థాపించి కాంగ్రెసు సమావేశాలతోపాటు యేటా సభలు జరుపుతుండే వారు. 1890 లో పశ్చిమ భారత పారిశ్రామిక సమితి ప్రారంభించిన రనడే, రాజకీయాల్లో మోడరేట్.

బాల్యవివాహాలు పోవాలని, విధవావివాహాలు జరగాలని, క్రమేణా సంఘం సంస్కరించబడాలని రనడే సిద్ధాంతాలు. స్త్రీలకు సమాన స్వేచ్ఛ. హక్కులు కావాలని వాదించాడు. వంశపారంపర్యత పోగొట్టి వికేంద్రీకరణతో కూడిన ఆర్థిక సంస్కరణ కాంక్షించాడు. మతాచారాలు తిరగదోడటం కూడదంటూ, పాత రూపుమాసిపోయిందనీ. సంస్కరించుకుంటూ పూర్వ ఆంగీకరిస్తు పోవాలని ఆధునీకరణ సూచించాడు. అంటరానితనం ఆర్యులు తెచ్చిన కులవ్యవస్థ గర్హించాడు. ముస్లింలనుండి ఆంగ్లేయులనుండి నేర్చుకోవలసిన విషయాలెన్నో వున్నాయన్నాడు. ఆంగ్లేయులపాలన వలన దేశానికి యెంతో మేలు చేకూరిందనే నమ్మిక వ్యక్తంచేసిన వారి వరుసలో రనడే కూడా వున్నాడు.

రనడే చదువుకునే రోజుల్లోనే మరాఠి ప్రత్యేకంగా పఠించాడు. ఆంగ్లం సరేసరి. సొంతకృషితో సంస్కృతం అభ్య

సించాడు. ప్రార్థన సమాజ్‌లో వారం వారం ప్రార్థనలు చేసినా అన్ని మతాలతో కలసి అందరి వ్యక్తులలో స్నేహం చేసేవాడు. ఛాందసంలేదు, మతభావాలు వ్యక్తిపరంగావుంచి, రాజకీయాల్లోకి రాసివ్వగూడదనే సెక్యులరిస్ట్ రనడే.

దైవంలో, ప్రార్థనలో నమ్మకస్తుడు. భక్తివుద్యమ ప్రభావితుడు. అవతారాలపట్ల అపనమ్మకంగలవాడు. ఆయన పరమత సహనం ఆర్యసమాజ్ వుపన్యాసాలను దయానందచే పూనాలో యిప్పించినప్పుడే వెల్లడైంది. సంఘంలో మార్పులు విప్లవంతోనూ, ప్రాణభ్యుతితోనూగాక, కాలక్రమేణా ప్రజల్ని విద్యాధికుల్ని చేయటంద్వారా తేవాలని రనడేవుద్దేశం. న్యాయ మూర్తిగా చట్టబద్ధతనుకాంక్షించాడు.

చరిత్రలో కొత్త వ్యాఖ్యానం చూచిన వ్యక్తి రనడే. సంఘటనల కేటలాగుగా కాక అర్థవంతమైన మార్పులుగా చరిత్రను అతికినవ్యక్తి ఆయన "రైజ్ ఆఫ్ది మరాఠా పవర్" అనే గ్రంథంలో వ్రాస్తూ భారతచరిత్రలో మహారాష్ట్రుల విశిష్ట పాత్ర గణనీయమైనదిగా పేర్కొన్నాడు. నైతిక విలువల్ని సామ్రాజ్యవాదాన్ని ముడివేశాడు. శివాజి చరిత్రలో న్యాయంమూర్తిభవించిన రాజకీయవేత్తగా శివాజీని ప్రస్తుతించాడు. జాతీయ జీవనోత్తేజంలో మరాఠాశక్తి విశిష్టమైన దన్నాడు. ప్రజలలో వెల్లువగా వచ్చిన రాజకీయ, మత సాంఘిక చైతన్యతకు ప్రతిబింబమే మరాఠా సామ్రాజ్యమని రనడే వుద్దేశం. సామ్రాజ్యవాదంలో నైతిక విలువలు అన్వేషించిన చరిత్రకారుడు రనడే.

రనడేకూడా చరిత్రలో దైవనిర్ణయం ప్రకారం సంఘటనలు జరుగక మానవంటూ భారతదేశం పురోగమించక తప్పదని విశ్వసించాడు. అయితే అంతటితో ఆగక విజ్ఞానశాస్త్రాలలో, పౌర పాలసలో భారతీయులు ప్రతిభనుచూపలేదని నెపం వేశాడు. బ్రిటిష్‌వారు భారతదేశాన్ని పాలించటంకూడ దైవేచ్ఛ అంటూ, ఆ అవకాశం వినియోగించుకొని దేశీయులు సాంఘిక చైతన్యత పుంజుకోవాలన్నాడు. చట్టబద్ధమైన స్వేచ్ఛ కావాలని రనడే సిద్ధాంతం.

భారతదేశంలో ఆర్థిక వ్యవస్థకు సాంఘిక దృక్పథం జోడించాలేగాని. ఐరోపా అనుభవాల దృష్ట్యా పాలించటానికి పిల్లేదని రనడే నొక్కిచెప్పాడు. అందరికీ మంచిని చేకూర్చాలంటే సాంఘిక పరిణామక్రమం పరిశీలిస్తుండాలన్నాడు. భారత దేశంలో బహుళార్థ ఆర్థికవిధానం వుండాలంటూ, అవసరమైతే విదేశీయులు యిక్కడ స్థిరపడేటట్లు చేయాలన్నాడు. కేవలం వ్యవసాయంమీదనే ఆధారపడక, పారిశ్రామికరగాన్ని పెంపొందించాలంటూ కాలదోషం పట్టిన ఋణవిధానం తొలగించాలన్నాడు. సాంఘిక జడత్వం వదలి కొత్తవిధానాలు అవలంబిస్తు ఆర్థికరంగాభివృద్ధికి భారతీయులు ముందంజ వేయాలని ప్రోత్సహించాడు.

రనడే భావాలు ఆనాడు విప్లవాత్మకమైనవే. న్యాయమూర్తిగా ఆయనపాత్ర అప్పటికే విశిష్టమైనది.

REFERENCE BOOKS

1. **D. G. Karve,** RANADE 1912, Arya Bhushan Press, Poona-4.

2. **P. J. Jagirdar,** Studies in the Social thought of Mahadev Govind Ranade 1963

3. **T. V. Parvate,** Mahadev Govind Ranade 1963 Asia Publishing House, Bombay

4. **M. G. Ranade,** K. T. Telang, Rise of Maratha Power and other essays 1961 Bombay University

గోపాలకృష్ణ గోఖలే

ప్రజాజీవితంలో వివేచన కావాలని, ఆధునిక ప్రజాస్వామిక సంక్షేమ రాజ్యానికి స్వేచ్ఛ ప్రాతిపదిక అని చాటిన ఉపాధ్యాయుడు, రాజ్యాంగవేత్త గోపాలకృష్ణ గోఖలే. 48 సంవత్సరాల జీవితంలో ఎందరినో ప్రభావితులను గావించి, గాంధిచే గురువనిపించుకొని హుందాగా ప్రవర్తించిన నాయకుడాయన. కనుకనే కేకలుపెట్టి, వుద్రేకపూరిత ఉపన్యాసాలు యిచ్చిన నాయకులంతగా గోఖలే బహుళప్రచారం పొందలేదు భారత సమాజంలో.

మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో 1866 మే 9 న జన్మించిన గోఖలే బొంబాయి ఎల్ఫిన్‌స్టన్ కళాశాలలో 1884 నాటికి పట్టభద్రుడయ్యాడు. దక్కన్ ఎడ్యుకేషన్ సభ్యుడుగా 1886 నుండి తన పాత్ర నిర్వహిస్తూ, పూనా ఫెర్గూసన్ కళాశాలలో చరిత్ర, ఆర్థికశాస్త్రాచార్యుడయ్యాడు. పూనా ప్రజాజీవితంలో ప్రముఖస్థానం ఆక్రమించుకొని, సార్వజనిక సభపత్రిక, సుధారక్ అనే పత్రికకు సంపాదకుడుగావున్నాడు. రనడేను గురువుగా భావించి, ఎన్నోవిషయాలు ఆస్వాదించాడు. ఫిరోజ్ షామెహతాతో కలసి పనిచేశాడు. గోఖలే జీవితంలో తొలిభాగమంతా యించుమించు యే కొద్దిమందికో తప్ప, అజ్ఞాతంగానేవున్నది. 1902 నుండి గోఖలే నిర్వహించిన కార్యక్రమాలు ఆయన్ను సమాజానికి పరిచితుడిని చేసాయి.

ఇండియన్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌కు 1902 లో సభ్యుడయ్యాడు. జీవితంలో యేడుపర్యాయాలు ఇంగ్లండ్ వెళ్లి వివిధ ప్రముఖ ఘట్టాలలో తన ప్రతిభ చూపాడు.

కాంగ్రెస్ రాజకీయాలలో 1889 నుండీ శ్రద్ధాసక్తులు చూపుతూ 1905 లో అధ్యక్షుడై, 1907 లో మితవాదిగా తిలక్‌ను వ్యతిరేకిస్తూనే, కాంగ్రెస్‌లో ఐక్యత కాంక్షిస్తూ, అది చూడక పూర్వమే 1915 లో చనిపోయాడు.

గోఖలే నాస్తికుడు కాకపోవచ్చుగాని. ఆస్తికుడు మాత్రంకాదు. వివేచన ఆమోదించినందున వచ్చిన సందేహం ఆయన్ను మూర్ఖభావాలకు దూరంగా వుంచింది. కనుక భారత దేశపు గతంలోకిపోయి అయోమయాన్ని వృద్ధిచేయకుండా, ఆధునికభావాలతో ఆలోచించాడు. చట్టబద్ధంగా వుండాలనేది గోఖలేమూలసూత్రాలలో ఒకటి. బ్రిటన్‌తో సంబంధం తెగతెంచుకోవాలనుకోలేదుగాని, తప్పనిసరి అనుకున్నాడు. భారతదేశాన్ని అధునాతనం చేయటానికి యీ అవినాభావసంబంధం అవసరమని ఆయన చిత్తశుద్ధితో నమ్మాడు. అంతమాత్రాన విదేశీపాలన పూర్తిగా అంగీకరించలేదు. రాజ్యాంగబద్ధంగా ఆందోళన చేయటాన్ని, స్వదేశీ వుద్యమాన్ని సమర్థించాడు; దేశంలో ఆంగ్లేయులతో సమానంగా భారతీయులుండే అవకాశంరావాలి. భారతదేశ ప్రతిపత్తి యితరదేశాలవలె గౌరవించబడాలి. అర్జీలు, ప్రాతినిధ్యం, ప్రజాభిప్రాయాన్ని చూపటం, పన్నులుచెల్లించక పోవటం అనేవి రాజ్యాంగబద్ధమైన అందోళనగా గోఖలే ఆమోదించాడు. ఈ పద్ధతిలో స్వాతంత్ర్యం సాధించిన దేశం

గతంలో లేకపోయినా భారతదేశం మార్గదర్శకత్వం వహించ వచ్చునని ఆయన వుద్దేశం,

హిందూసమాజంలోని అంటరానితనాన్ని గర్హిస్తూ, న్యాయం, మానవత్వం అనే ప్రాతిపదికకు అది వ్యతిరేక మన్నాడు. ఒకప్రక్క దక్షిణాఫ్రికాలో నల్లవారిని అవమాన పరుస్తున్నందుకు తెల్లవారిని వ్యతిరేకిస్తూ, మరోవైపు భారత దేశంలో అంటరానితనం ఆచరించటం విరుద్ధంగా కనిపిస్తుం దన్నాడు.

ఎన్నికలు సాధారణంగా జరగాలంటూ, మతం, కులం ఆధారంగా ప్రాతినిధ్యం వుండకూడదన్నాడు. ఎన్నికలలో ప్రాతినిధ్యంలేని జాతులకు జనాభా ప్రాతిపదికపై కొన్నిస్థానాలు కేటాయింపవచ్చునన్నాడు.

విద్యార్థులు రాజకీయాలపట్ల చైతన్యవంతంగా వుండాలే గాని కార్యరంగంలోకి దూకరాదని ఆనాడే సలహాయిచ్చాడు.

గోఖలేపై బర్క్ ప్రభావంజాస్తి. వివేచన వాస్తవాలు గమనించటం ఆయనకిష్టం. ప్రజాజీవితంలో నిష్క్రియాపరత్వం అవసరమంటాడు. ప్రభుత్వం భౌతికంగానేగాక, ప్రజలనైతిక సత్తాను పెంపొందించేదిగా వుండాలని అభిప్రాయపడ్డాడు. దీనికి గాను ప్రజలందరూ అక్షరాస్యులుగా వుండాలని, 1912 లో ప్రాథమిక నిర్బంధ విద్యాబిల్లు ప్రవేశపెట్టాడు, బిల్లు ఓడి పోయినా, గోఖలే వాదన గెల్చింది.

పాశ్చాత్య విద్యలో అత్యుత్తమమైన వన్నీ మన విద్యా విధానంలో పొందుపరచాలంటూ, ఇంగ్లండ్ చరిత్ర ప్రజాస్వా

మిక భావాలను యిస్తుందనీ, భారత చరిత్ర అంతా రాజరికాల తేదీలకు మించి యేమీలేదనీ చెప్పాడు. ప్రజలలో వుత్సుకత జనింపజేయటంలో, ఆధునీకరణ గావించటంలో ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలన్నాడు. బ్రిటిష్‌పాలన ఒకవిధంగా చూస్తే, భారతీయులకు స్వయంపాలనలో శిక్షణవంటిదన్నాడు. భారత ప్రజల సమస్యల పరిష్కారానికై 1905 లో సర్వెంట్స్ ఆఫ్‌యిండియా సొసైటీ స్థాపించాడుకూడా. రాజకీయాల్లోకి మతం రానివ్వకుండా వుంచాలనే సెక్యులర్ ధోరణి గోఖలేది. కనుకనే మతప్రాతి పదికగా రెచ్చగొట్టిన తిలక్‌తో భేదించాడు. ప్రజాస్వామిక సమాజం సెక్యులర్ పునాదులపై నిర్మించబడా లని, విదేశీవస్తువులను బహిష్కరించాలనే నినాదం విద్వేషాలను రెచ్చగొట్టి, మానవులమధ్య స్పర్ధలకు తావిస్తుందని అన్నాడు.

ఆర్థికరంగంలో గోఖలే కృషి గణనీయమైనది. భారతీయుల ఆర్థికదుస్థితి వివరిస్తూ పండించే ప్రాంతం తగ్గిపోవటం, మరణసంఖ్య హెచ్చటం, కరువు కాటకాలతో పంటలు నాశనం గావటం సోదాహరణంగా లెక్కలతోచూపాడు. దీనికి కొన్ని పరిష్కారాలు సూచిస్తూ శిస్తు తగ్గించమనీ, ధరలబట్టి శిస్తు మారే విధానం ప్రవేశపెట్టాలనీ చెప్పాడు. వ్యవసాయ బ్యాంకులు స్థాపించాలనీ, తక్కావీ రుణాలివ్వాలనీ సూచించాడు.

ఆర్థిక విషయాలలో గోఖలే నిర్మాణాత్మక సూచనలు అమూల్యమైనవి. వ్యయం, పన్నులు, అభివృద్ధికర బడ్జెట్ విషయాలలో విశేషకృషిచేశాడు. ప్రభుత్వం వ్యయంవిషయమై తీవ్ర ఆందోళనచేసి, ఒక విచారణ సంఘాన్ని నియమించ

మన్నాడు. సైనిక ఖర్చు తగ్గించాలనీ, భారతీయుల్ని హెచ్చుగా వుద్యోగాలలో నియమించాలనీ స్వతంత్రంగా 'ఆడిట్' చేసే అవకాశం వుండాలని సూచించాడు.

సంక్షేమ రాజ్యానికి తగిన పథకాలు, సూచనలు వూహించి సూచించాడు గోఖలే. ఉచిత ప్రాథమిక నిర్బంధ విద్య కావాలనటం యిందులో ఒక భాగమే.

REFERENCE BOOKS

1. **Gokhale, G. K.** Speaches and Writings of G. K. Gokhale 1962 Vol. I, Economic Deccan Sabha, Poona.
2. **A. B. Shah,** S. P. Iiyar (Ed.) Gokhale and Modern India 1966, Manaktalas, Bombay.
3. **R. P. Patwardhan and D. V. Ambekar** (ed.) Gopalakrishna Gokhale, Speeches and Writings 1962 Asia Publishing House, Bombay (Vol. I Ecom.)
4. **D. B. Mathur,** Gokhale, A political biography 1966 Manaktalas, Bombay.

రవీంద్రనాథ్ ఠాగోర్

భారతదేశాన్ని ప్రపంచానికి పరిచయం చేయటంలో అద్వితీయ పాత్రనిర్వహించి, ప్రకృతి—సమాజం—మనిషి సంబంధాన్ని రమణీయంగా చూపిన కవి రవీంద్రనాథ ఠాగోర్ మానవతపై నొక్కివెట్టి, విశ్వ ఐక్యతకై అన్వేషణ చేసిన మనీషి. ఠాగోర్ భారతీయులకు గర్వకారణం. గాంధీని కొన్నాళ్ళకు ప్రపంచం మరచిపోతుందేమోగాని ఠాగోర్ను మానవాళి విస్మరించజాలదు.

బ్రహ్మసమాజ్ నాయకుడు దేవేంద్రనాథ్ ఠాగోర్ 14వ సంతానంగా రవీంద్రనాథ్ 1861 మే 7వ తేదీ కలకత్తాలో జన్మించాడు. 8 సంవత్సరాలకే పిల్లకవిత లల్లటం మొదలెట్టిన రవీంద్రుడు, తల్లిదండ్రుల ఆప్యాయత కొరవడినందున, వదిన దగ్గర వాత్సల్యం చవిచూశాడు. బాల్యావస్థ అంతా సేవకుల చేతుల్లో గడచింది. సంపన్న కుటుంబంగనుక అవసరాలకు లోటురాలేదు. బడిచదువుకు వత్తాసుగాయింట్లో పాఠాలు వల్లెవేయించారు. తండ్రిచెంత కొంచెం సంస్కృతం, ఆంగ్లం, కాస్త ఖగోళం మొదలైన విషయాలు నేర్చుకోటం విశేషం. తండ్రిని చూడటమంటేనే పండుగవలెవుండేది. రాజరికపు లక్షణాల ఆప్యాయతలవి.

పధ్నాలుగు సంవత్సరాలకు కవిత్వం వ్రాయటమేగాక, అచ్చుగావటంతో రవీంద్రలో ఆసక్తి యినుమడించింది. సంజీవని

సభవంటి రహస్య సభలో సభ్యుడయ్యాడు. పాఠశాలలో చదివే ఆంగ్లానికి, స్నేహితురాలు అన్నాతో మాట్లాడటం ద్వారా సానబట్టి, వుత్తరోత్తరా ఆమెతో సన్నిహితుడయ్యాడు. ఉద్వేగ పూరితులైన కవుల రచనలపట్ల ఆకర్షితుడయ్యాడు. 18 వ యేట లండన్‌లో విద్యాభ్యాసానికి వెళ్ళి. అసంపూర్తిగా స్వదేశానికి మరుసటిసంవత్సరమే తిరిగొచ్చాడు (1880).

రవీంద్రునిపై బ్రహ్మసమాజ్ ప్రభావంజాస్తి. ఏటా జరిగే సమాజ్ వార్షికోత్సవానికి కుటుంబసభ్యులంతా వుత్సాహంతో వేడుకలు జరుపుకునేవారు. 20 వ యేటనుండీ భక్తి గీతాలు వ్రాశాడు రవీంద్ర. సాధారణ బ్రహ్మసమాజంవారు యీ గేయాల్ని పాడుకుంటారు. ఆది బ్రహ్మసమాజ్‌కూడా కొన్ని గేయాలు వాడుకుంటారు. కాని బెంగాలీయు లందరూ రవీంద్రకవిత ఆలాపిస్తారు. ఇంచు మించు రెండువేలకుపైగా గేయాలు వ్రాసిన రవీంద్రుడు, భక్తిరక్తి మేళవించటమేగాక, మతరహిత గేయాలు, దేశభక్తిపాటలు యెన్నో వ్రాశాడు.

పిల్లలకవిత ప్రత్యేకంగా పేర్కొనదగినది. ముఖ్యంగా భార్య చనిపోయినప్పుడు, తన కుమార్తె మంచములోవున్నప్పుడు వ్రాసిన శిశు కవిత హార్ద్రంగా వుంటుంది.

21 వ యేట నుండే విశ్వ జనీనతపట్ల మొగ్గుచూపనారంభించాడు; మృణాలిని దేవిని వివాహమాడాడు అప్పుడే. తనకు వాత్సల్యం అంటే యేమిటో చవిచూపినవదిన కాదంబరి కాలంచేసింది. 1884 లో ఆది బ్రహ్మసమాజానికి కార్యదర్శిగా

హైందవ వుద్యమాలగురించి బంకించంద్రతో వాదోప వాదాలకు దిగాడు. సాంఘిక మతస౦బంధమైన వాదనలకు పూనుకున్నాడు. భక్తిగీతాలకు గుర్తింపు రావటమేగాక బహుమతులు రావటం మొదలెట్టాయి. హిందువులలో బాల్యవివాహ వ్యవస్థను తీవ్రంగా గర్హించాడు నాటకాలలో వేషాలుకట్టాడు. మాతృ భాష బోధనా భాషగా వుండాలని వాదించాడు. వంగీయ సాహిత్య పరిషత్ ఉపాధ్యక్షుడయ్యాడు. జానపదసాహిత్యాన్ని ప్రోదిచేయనారంభించాడు. 1898లో బాలగంగాధర్ తిలక్‌ను బ్రిటీష్ ప్రభుత్వం అరెస్టుచేసినందుకు నిరసన వ్యాసం ప్రకటించాడు. భారతి పత్రిక సంపాదకుడుగా పుంఖాను పుంఖ రచనలు చేశాడు. 1901లో వంగ దర్శన్ పత్రికకు సంపాదకత్వ బాధ్యత స్వీకరించాడు.

ప్రశాంతత, ధ్యానం ఆశయాలుగా శాంతినికేతన్ పాఠశాల స్థాపించి, నడపటంలో అనేక ఆర్థిక యిబ్బందులకు గురయ్యాడు.

1904 నుండి రాజకీయాలపట్ల ఆసక్తి బాగా పెరుగగా, స్వదేశీ సమాజ్ శీర్షికక్రింద అనేక వ్యాసాలు వ్రాసి, గ్రామీణ పునర్నిర్మాణా వశ్యకతను, పరస్పర సహాయావశ్యకతను నొక్కి చెప్పాడు. సమాజ పరంగా నిర్మించవలసిన రాజ్యానికి పథకం వేశాడు. గ్రామాలలో సేవచేయటానికి వీలుగా ప్రత్యేకాను భవం పొందమని విద్యార్థులకు సలహాయిచ్చాడు. భారతకళా సమాజస్థాపనలో వుత్సాహం చూపాడు.

1905లో బెంగాల్ విభజన జరిగినప్పుడు నిర్మాణాత్మాక మైన సహాయ నిరాకరణ చేయాలని ఠాగోర్ సూచించాడు.

స్వదేశీ వస్తువులు బహిష్కరణతోపాటు తగులబెట్టటం అనేక హింసాయుతచర్యలు గమనించి గర్హించాడు, రాగోర్ ఉద్రేక పూరిత వాతావరణంలో వివేచనకై విజ్ఞప్తిచేశాడు. జాతీయ విద్యావిధానానికి ప్రాతిపదికలు వేయటానికై స్థాపించబడిన కౌన్సిల్‌లో ప్రముఖపాత్ర వహించాడు. దేశంలోని రాజకీయ అరాచకత్వం సహించలేక 1907లో రంగనిష్క్రమణచేసి అనేక దూషణలకు తట్టుకున్నాడు 1908 లో వంగరాష్ట్ర సమావేశానికి అధ్యక్షత వహించాడు. బాంబులువేయటం వంటి చర్యలకు పూనుకోవద్దని దేశీయులకు విజ్ఞప్తిచేశాడు. తత్త్వ బోధిని పత్రికకు 1911 లో సంపాదకత్వ బాధ్యతలును స్వీకరించాడు కలకత్తాలో జరిగిన 28 వ కాంగ్రెస్ సమావేశంలో పాడటానికి 'జనగణమన' గేయంవ్రాసాడు. హిందూతత్వంలో గల ఔన్నత్యాన్ని సంస్కరణ వాదులు వమ్ముచేస్తున్నందుకు చింతించాడు. 1912 లో గీతాంజలి ప్రకటించాడు. మరుసటి సంవత్సరంలోనే నోబెల్ బహుమానం అందుకున్నాడు. అప్పనుండి బెంగాలీయులు రవీంద్రను వీరారాధన చేయనారంభించారు. కీర్తిప్రతిష్టలు యినుమడించాయి. వెర్రిగా పేరు వచ్చింది. అనేక భాషల్లో ఆయన రచనలు అనువదించబడినయ్.

1916 లో జపాన్ వెళ్లి వుగ్రజాతీయ వాదాన్ని ఖండిస్తూ ప్రసంగాలుచేసి, జపానీయుల ఆగ్రహానికి గురైయ్యాడు. అమెరికాలో జాతీయతపై తాత్త్విక వుపన్యాసాలు చేశాడు. 1918 లో సాంస్కృతిక ప్రచారంచేసి రమ్మని తిలక్ యిచ్చిన సలహాను తృణీకరించాడు. దయాబాయి పటేల్ ప్రవేశపెట్టిన అంతర్వర్ణ వివాహబిల్లును సమర్థించాడు.

శాంతినికేతన్‌ను విశ్వభారతిగా మార్చాడు. గాంధీ ప్రారంభించిన సహాయనిరాకరణ వుద్యమాన్ని విమర్శించి, దేశీయుల ఆగ్రహానికి పాత్రుడయ్యాడు. 1926 లో ముసోలినీని కలసి ఆయన్ను శ్లాఘిస్తూ వ్రాయటంలో, ఫాసిజాన్ని బలపరుస్తున్నాడనే విమర్శలు వచ్చాయి. కాని ఫాసిజాన్ని, వుగ్రజాతీయవాదాన్ని ఖండిస్తూ 'మాంచెస్టర్ గార్డియన్' పత్రికలో తన అభిప్రాయాలు స్పష్టంచేసి, సందేహాలు నివారించాడు. బ్రిటీష్ ప్రభుత్వం పంజాబ్‌లో దేశీయులపట్ల చూపిన ప్రవర్తనకు నిరసనగా తన 'నైట్‌హుడ్' బిరుదును త్యజించాడు. అయితే చరఖావడికితే వచ్చే స్వరాజ్యం నిలబడదని అభిప్రాయపడ్డాడు. చీలిపోయిన బ్రహ్మసమాజాన్ని కలపాలని విఫల ప్రయత్నం చేశాడు. రష్యా పర్యటనలో ఆ ప్రజలు ఒక దశాబ్దంలో సాధించిన ప్రగతిని శ్లాఘించి ముఖ్యంగా తరతమ భేదాలు లేకుండా అందరికి చదువుచెప్పించి విజ్ఞానాన్ని విస్తారజేయటాన్ని స్తుతించాడు. అయితే ద్వితీయ ప్రపంచ సంగ్రామంలో ఫిన్లండ్‌పై సోవియట్ రష్యా దాడిని ఖండించాడు. మొత్తం పన్నెండుమారులు విదేశాలలో పర్యటించి భారతదేశాన్ని గురించేగాక, అనేక విషయాలలో తన అభిప్రాయాలు నిష్కర్షగా వెల్లడించాడు.

ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం ప్రత్యేకంగా డాక్టరేట్ గౌరవపట్టా యిచ్చి ఆయన్ను గౌరవించింది. విదేశీపర్యటనలో బెర్ట్రాండ్ రసెల్, బెర్నార్డ్‌షా, రోమారోలా, ఐన్‌స్టీన్ వంటి ప్రముఖులను కలసి విషయాలెన్నో చర్చించాడు. 80 యేళ్ళ

వయస్సులో 1941 ఆగస్టు 7 న కలకత్తాలో మరణించాడు రవీంద్రుడు.

రవీంద్రుడు యేకాంతాన్ని కాంక్షించిన వ్యక్తి. వివేచనకు ప్రాముఖ్యత నిచ్చిన మనీషి. మూకస్వామ్యానికి లొంగని వాడు. ప్రాక్పశ్చిమ సత్సంబంధాలకు అన్వేషించాడు. పాయి కంగాకవి. ప్రకృతినిచూచి తన్మయుడైన రచయిత. అరమరికలు లేకుండా మనిషిస్థానాన్ని సమాజంలో, ప్రకృతిలోగుర్తించాడు. అందరినీ గుర్తించమన్నాడు. రాజకీయపక్షాలకు దూరంగా వున్నా, రాజకీయాలను అంటరానివిగా చూడక, అవసరమైనంత మేరకు పట్టించుకున్నాడు.

రవీంద్రుని వ్యక్తిత్వ ప్రతిబింబం విశ్వభారతి (శాంతినికేతన్.) ఆయన కవిత, చిత్రలేఖనం. రచనలు శాశ్వతకీర్తిని తెచ్చిపెట్టాయి.

ఇక రవీంద్రుని తాత్త్వికభావ ప్రభావం పరిశీలిద్దాం.

చరిత్రకు అర్థం:

టాగోర్ ఒక క్రమపద్ధతిలో తత్త్వంగాని చరిత్రగాని వ్రాసినవాడుకాదు. కాని ఆయన రచనల్లో ఆక్కడక్కడ ఆయా సందర్భాలలో వ్రాసినవి చూస్తే కొన్ని ముఖ్యమైన భావాలు గోచరిస్తయ్. చరిత్ర విషయంలో యిలాంటి ప్రయత్న మే జరిగింది.

భారతదేశంలో అనేక యుద్ధాలు కలహాలు జరిగాయికాని వీటిమధ్య సమన్వయ ప్రయత్నం ఎప్పుడూజరుగుతూనేవున్నది.

భిన్నత్వంలో సమన్వయత్వానికి కృషిజరిగింది. వ్యక్తిత్వాన్ని చంపకుండా, అందరికి చెందిన సాధారణ విషయాల ఐక్యతకు అన్వేషణజరిగింది. సమాజంలో, మతాలలో, ప్రజలలో, రాజకీయ ఆర్థికరంగాలలో విపరీత వైవిధ్యాలున్నా సమైక్యత, సమన్వయంకొరకు ప్రయత్నాలు జరగటమే యిందుకు వుదాహరణ.

భారత చరిత్ర రాజకీయ ప్రధానంగాక సాంఘిక సాంస్కృతిక సంబంధమైనది దీని ఫలితంగా భారత సంస్కృతి సమాజకేంద్రంగా గలది. కనుక నేడు స్వదేశీసమాజ్ కావాలి. స్వపరిపాలన దీని లక్ష్యం కేవలం స్వాతంత్ర్యం, స్వరాష్ట్రం వుంటేనే చాలదు. సమాజపరంగా సహకారం, సమైక్యత. స్వయంశక్తిపై ఆధారపడటం ప్రధాన లక్షణాలుగా పాలనా వ్యవస్థవుండాలి. సాంఘిక విచ్ఛిన్నతకు తోడ్పడే పద్ధతి అమానుషమైనది. గర్హించదగినది.

భారత సమాజంలో కులవ్యవస్థల వలన శక్తియుక్తులు, చైతన్యత, జీవనాబలం అంతా కరగిపోయింది. తత్ఫలితంగా దేశం వలసరాజ్యంగా మారింది. కులం, ప్రాంతీయత, అధికార దుర్వినియోగం. సంకుచితత్వం మొదలైనవన్నీ సమాజ వ్యతిరేకాలు, అమానుషాలు. ఇవి సమైక్యతను విచ్ఛిన్నంచేసి, దేశాన్ని తాకట్టుపెట్టాయి. కేవలం ధనంతో కండబలంతో ఎవరూ గొప్ప వారుకాలేరు. భారత సమాజం ఆదినుండీ శాంతి కాముకత్వాన్నే వాంఛించింది.

విదేశాలపై ద్వేషంతో, కోపంతో వేరుబడి 'నన్ను ముట్టుకోకు' అనే అంటరానితనం అవలంబిస్తే యేసమాజమూ

బాగుపడదు. స్వయంకృషితోపాటు పొరుగువారి సహకార సంపర్కాలు తోడ్పడతయ్‌కూడా. సొంతవిషయాలు రాణించేందుకు యితరులుకూడా సహాయపడతారన్న సత్యాన్ని మరువకూడదు.

భారతదేశ చరిత్రలో యింకా సారవంతమై నేటికీ అక్కరకొచ్చే విషయాలనే ఠాగోర్ పేర్కొన్నాడు.

సాంఘిక, రాజకీయ భావాలు :

రవీంద్రపై ప్రభావంచూపిన విషయాలు అనేకంవున్నయ్ ఉపనిషత్తులు, బ్రహ్మసమాజం, వైష్ణవభక్తి, సూఫీతత్వం; యింకా ప్రాచ్య పాశ్చాత్య రచయిత లెందరో ఠాగోర్‌పై గాఢముద్ర వేయటం గమనించాలి. వాటినుండి అతనురాబట్టిన మూలసూత్రమేమంచే, మానవుడ యేకాకికాదు. అతనికి ప్రకృతినుండి యింకా బొడ్డూడలేదు. ప్రకృతి—సమాజం—మానవుని అవినాభావసంబంధం గుర్తించాలి. చైతన్యావస్థ కంటికి అంతర్లీనంగా ఒకశక్తివున్నది. కనుక మానవులంతా భగవంతునిబిడ్డలే. చైతన్యావస్థను వున్నతస్థాయికి తీసుకుపోగలిగితే చిన్న కలహాలు సంకుచిత భావాలు విస్మరించి, మానవుడు వున్నతవిలువలు గ్రహించగలుగుతాడు. భిన్నత్వంలో ఏకత్వంవున్నది. ఆ ఏకత్వమే దైవం. అది నిరాకారం, నిర్గుణం. అయితే వ్యక్తి దైవంలో కలసినా తన వ్యక్తిత్వాన్ని అట్టిపెట్టుకుంటాడు. అది వ్యక్తి విశిష్టత.

వ్యక్తి ప్రతిభా వ్యుత్పన్నతలు విప్పారటానికి ఆటంకపడే పద్ధతులు వ్యతిరేకించాలి. అలాగే వ్యక్తుల సమూహాలను స్వయంగా పాలించుకోకుండా అడ్డుపడే రీతులుకూడా పనికి రావు. వ్యక్తిగౌరవం, వ్యక్తిత్వం గుర్తించిన సమాజాలే వున్నంతగా విలసిల్లినవి, కనుక వ్యక్తిగౌరవం అత్యంత ప్రముఖ స్థానం ఆక్రమించుకొంటుంది. అంతమాత్రాన సమాజాన్ని విస్మరించాలనికాదు. భారత సమాజం వ్యక్తి ప్రతిభలను గుర్తిస్తూ, రాజ్యానికి ప్రాధాన్యత యివ్వనందునే గతంలో గొప్ప స్థితికి చేరుకోగలిగింది. రాజ్యాలలో ఒడిదుడుకులు యెన్ని వచ్చినా, సమాజం చెక్కుచెదరకుండా వుండటానికి వ్యక్తి గౌరవానికి భంగం వాటిల్లకపోవటమేనని ఠాగోర్ అభిప్రాయం.

భారతసమాజంలో మాయని మచ్చలు కులం, అంటరానితనం—సమాజ ప్రగతికి ఆటంకంగా నిలచినవి. స్త్రీలను అట్టడుగున వుంచిన సమాజ చివాట్లలుకూడా భారత చరిత్రలో వున్నయ్. భారత చరిత్రలో యీ లోపాలు తొలగించుకుంటే గతంలోని కొన్ని సత్సంప్రదాయాలు తిరగదోడుకోవచ్చు. సమాజానికి ప్రాధాన్యత యివ్వటం యిందులో అత్యంత ప్రధాన విషయం.

భారతసంప్రదాయ సమాజంలో వ్యవసాయం ముఖ్యవృత్తి అనేకం గ్రామాలలో పెంపొందటంతో స్వయంపోషకంగా నడచింది. వ్యవసాయం, పరిశ్రమలు చేదోడువాదోడుగా వుంటూ ఆర్థిక సమన్వయాన్ని తెచ్చాయి. తత్ఫలితంగా భారతీయు

లలో ఒక తృప్తి, తాత్వికచింతనకు దారితీసింది. ఈ సంతృప్తి ధోరణి ప్రమాదకరంగా పరిణమించి, నూతనాన్వేషణ చేయనీయకుండా, జడత్వానికి దారితీయటంతో భారత సమాజ ప్రగతి ఆగిపోయింది. మళ్ళీ పాశ్చాత్య సమాజంతో సమానంగా పురోగమించటానికి, కాలానుగుణమైన మార్పులు చేపట్టాలి. యంత్రాన్ని విరివిగా వినియోగించాలి.

నేడు ప్రకృతికి మానవుడు దూరమౌతున్నాడు. యాంత్రికమైన పట్టణజీవనంలో మరవలె మారుతున్నాడు. వ్యక్తిత్వం రమణీయతల్ని విస్పారజేసుకోటానికి ప్రకృతితో సంబంధం అట్టిపెట్టుకోటం మంచిది. మరీ పెద్ద పట్టణాలూ మంచిదికాదు. అలాగని కేవలం కుగ్రామాలూ పనికిరావు. మధ్యస్థంగావుండే చిన్న బస్తీలు సరైనవి. అలాంటిచోట ప్రకృతి సంబంధం వుండొచ్చు. యంత్రాల ప్రగతి సాంధించవచ్చు. దీనికితోడు సహకార పద్ధతి జీవనతత్త్వంగా స్వీకరిస్తే భారతదేశపు దారిద్ర్యం తీరుతుంది. వ్యవసాయంలో సహకారపద్ధతి మరీమంచిది. మానవుడు కేవలం భౌతికావసరాలను తీర్చుకోటమేగాక వుద్వేగ, వైజ్ఞానిక అవసరాలు తృప్తిపరచుకోవాలి. జీవన రంగంలో యీ తృప్తి యివ్వగలిగింది. రమణీయమైన లలిత కళలు మాత్రమే.

సమాజం వ్యక్తులకంటే పెద్దది, విశిష్టమైనవి. వ్యక్తి తన ప్రతిభను వెల్లడించుకోటానికి తోడ్పడేది సమాజమే. సాంఘిక జీవనంలో ఒక్కొక్క వ్యక్తి విశిష్టమైనవాడే. వ్యక్తులు సమాజంకోసం, సమాజం వ్యక్తికోసం పనిచేయాలి. అలాంటిదే చైతన్య సమాజం.

వ్యక్తి స్వేచ్ఛ, స్వాతంత్ర్యం అతి ముఖ్యమైనవి. మత విశ్వాసం, మానవత ఈ విషయాలనే నొక్కి చెబుతున్నయ్. ఈ వ్యవస్థ ఒక్క ప్రజాస్వామ్యంలోనే సాధ్యం. భారత సమాజంలో వ్యక్తి ప్రతిష్ట, గౌరవం సమాజపరంగానే వస్తున్నయ్. స్వేచ్ఛ, సృజనాత్మకశక్తి అనేవి మానవ విలువలలో వున్నతమైనవి. కనుక నియంతృత్వం, ఫాసిజం వ్యక్తి పెంపుదలకు ఆటంకాలు. ఏ వ్యవస్థ అయినాసరే మరీ పెద్దదైతే, కేంద్రీకృతమై మూసబోసే ఏకీకరణ విధానాలకు దారితీస్తుంది. చిన్న సంస్థ లనేకం వుండాలి. అన్నిటిమధ్య సమన్వయం వుంటేసరి.

భారతీయులు స్వయంశక్తిపై నిలబడి పురోగమించాలి. అప్పుడే స్వేచ్ఛ లభిస్తుంది. ఆర్థిక స్వాతంత్ర్యం సాంఘిక స్వేచ్ఛ ముందు లభిస్తే, రాజకీయస్వాతంత్ర్యం దానంతట అదే వస్తుంది.

పాశ్చాత్య దేశాల్లో వ్యక్తి స్వేచ్ఛ హరించిపోయే రాజకీయవిధానాలు వచ్చాయి. జాతిని కొలవటం ఆచారమైంది. అది మానవ ప్రగతికి నిరోధం. భారతదేశంలో రాజకీయ బ్రిటీష్ ప్రజలపట్ల ద్వేషంగా మారరాదు. నిర్మాణాత్మక పోరాటంద్వారా స్వాతంత్ర్యం సాధించుకోవాలి.

రమణీయతత్వం

కళ అంటే ఏమిటి అని ప్రశ్నించుకొని, వాస్తవానికి సృజనాత్మక మానవుని స్పందన అని నిర్వచించాడు. వ్యక్తి

తనను తాను గుర్తించటమే కళ అన్నాడు. ఈ విషయంలో టాగోర్ పై భారత రసవాదమేగాక, ప్లేటో అనంతరవాదాలు, హెగెల్ తత్వం, 19వ శతాబ్దపు వుద్వేగ సిద్ధాంతాలు ప్రభావం చూపెట్టాయి. కళను ప్రకృతికి దూరంగా, ఆత్మీయంగా రవీంద్రుడు భావించలేదు. సామాన్యానుభవంలో గుర్తించ లేని విశేషాలను ప్రకృతిలో చూడగలగడమే కళ స్వభావ మన్నాడు. ప్రకృతి చైతన్యత, ఆత్మచైతన్యత రెండూ కళలో ప్రతిబింబిస్తయ్. కళ మనిషిని ప్రకృతికి సన్నిహితుడిని చేస్తుంది.

రవీంద్రుని దృష్టిలో మానవుని ధ్యేయం అనంతంలో లీనంగావటం కాదు అనంత సత్యాన్ని తెలుసుకోటమే మనిషి లక్ష్యం. భారతదేశంలో మానవుడు దైవం వేరుకాదు, దేవాలయాల్లో దేవుడు యిండ్లల్లోనూ వున్నాడు. మన వ్యక్తిత్వంలో అంతర్భాగంగా సుఖదుఃఖాలు, భయం, ఆశ్చర్యం, రాగద్వేషాలు వుంటూ, మనతో తదాత్మ్యం చెంది, మన వుద్వేగాలలో భాగమై, బంధువులుగా కలసిపోవటం మన ప్రత్యేకత అంటాడు టాగోర్. వ్యక్తిత్వపు చైతన్యం వెల్లడించటానికి కళ వుపకరిస్తుంది. కళావస్తువు విశ్వం. ఈ జగత్తు మనతో పాటే పెంపొంది, మారుతుంది. అది లేనిదే వ్యక్తిత్వంలేదు. ప్రకృతికి మానవునికిగల సంబంధం టాగోర్ లో వ్యక్తంగావటం ఆతని జీవితంలో ఒకవిధంగా పరకాష్ఠ. మానవుడు ప్రకృతిలో మమగడ సాగించాలనే కాంక్ష, ఈ బంధాన్ని అట్టిపెడుతుంది. మానవుని వ్యక్తిత్వాన్ని, బాహ్య ప్రపంచాన్ని మమగుపరచే మబ్బుల్ని కళ తొలగించి, యిరువురినీ ఐక్యపరుస్తుంది.

రవీంద్రుడు పేర్కొనే వుద్యోగాలు కేవలం శారీరకమైనవి కావు. తనను తాను బంధవిముక్తి చేసుకోగలవాడే కళాత్మకుడు. ప్రకృతినుండి వుద్యోగాలు పొంది, వెల్లడించటంలో రాగద్వేషాతీతంగా నైతిక ప్రవృత్తిని చూపగలిగితే అదే చక్కని కళ.

రవీంద్రుని కళాసిద్ధాంతపు సారాంశ మేమంటే శాస్త్రజ్ఞునివలె కవికూడా నిష్పాక్షికంగా, స్వార్థరహితంగా వుంటూనే తన వుద్యోగాల ద్వారా జగత్తులోని వస్తువులను ప్రేమించగలగాలి. విజ్ఞానంలో కళలోనూ శారీరకమైన వుద్యోగాలు రాని వ్యకుండా రమణీయత, తాత్త్విక దృష్టి అలవరచుకోవాలి. ప్రపంచంలో సుఖదుఃఖాలపట్ల రమణీయదృష్టి అలవరచుకుంటే వాటివలన శారీరక ఉద్వేగాలు కలగవు.

రవీంద్రుని దృష్టి రమణీయమైనది. రమణీయం, వాస్తవం సుందరం అనే వాటిలో అతనికి విచక్షణలేదు. ప్రకృతి తనను పిలుస్తున్నట్లు, తాను స్పందిస్తున్నట్లు రవీంద్రుడు భావించేవాడు. రమణీయ భావంకూడా ఠాగోర్‌కు వాస్తవమే. కవి జ్ఞానం వుద్యోగంలో విజ్ఞానం వున్నాయంటాడు పాఠకుడు. కవి వుద్యోగంలో పాలుపంచుకుంటాడు. అంటే బాహ్యా, అంతరం విభాగాలను జ్ఞానంలో వుంటాయని ఠాగోర్ అంగీకరించడు. మనం బాహ్యాం అనుకునే పరిధిలో అంతరచైతన్యత ఎంతో ప్రధాన పాత్ర వహిస్తుందంటాడు. మన మనసు ప్రకృతికి ప్రతిబింబం అనుకుంటాం. కాని అది సృజనకూడా. కళారాధకుని భావనలు, ఉద్వేగాలు మానవా

ళిలో ఒక భాగమే. శాశ్వతము, ఆదర్శము, విశ్వమానవ భావన చూపటమే వ్యక్తుల సాధనలో కనబడుతుంటుంది. ఆది మానవునిలోని అనంతదృష్టి వ్యక్తీకరణ అన్నమాట.

భారతదేశంలో భావాలు, వుద్వేగాలు, అహోమయం, పులుముడు వాదాలు, అత్యుత్తమ వ్యక్తిత్వాలు మొదలైన మంచిచెడు లన్నిటికీ ప్రతిబింబం రవీంద్రుడు. అందుకే ఠాగోర్ అందరిని ఆకర్షించగలిగాడు ఐరోపాలో అత్యుత్తమ విలువలను కావాలంటూ, గర్హించదగిన విషయాలు విడమరచి చూడగలిగాడు. అలాగే ప్రాచ్యంలో గతంలో స్వీకరించగలిగిన మంచిని పేరొక్కన్నాడు. ఆంగ్లం, సంస్కృతం అభ్యసించాడు. ప్రాచ్య పాశ్చాత్యాలను మేళవించాలని ఆక్రందించిన వుత్తమ కవి రవీంద్రుడు. జాతీయ వాదాన్ని అధిగమించి మానవత కావాలని నొక్కి చెప్పాడు. రవీంద్రుని మత దృష్టి అతన్ని మానవతకు తీసుకెళ్ళింది. జీవితంలో పూర్ణదృష్టి అలవరచుకోవాలని దైవాన్ని బ్రతుకుబాటలో యిముడ్చుకోవాలని సంకల్పించాడు. విశ్వంలోని అనంత తత్త్వాన్ని భాషలో యిమిడ్చి మానవులకు అందించిన కవి. ఇక్కడే రవీంద్రునిలో పులుముడువాదం కనిపిస్తుంది. అయితే యీ పులుముడు వుగ్రమత వాదంలోకి దిగక, ప్రకృతి రమణీయంలో వ్యక్తంగావటం అదృష్టం. ప్రకృతిలోగల నియమబద్ధతను మానవునిలో స్పందించుకోవాలనే దృష్టి రవీంద్రుని ప్రకృతి కవిని చేసింది. దానికి సాధనాలుగా సాహిత్యాన్ని కళను చక్కగా వినియోగించుకున్నాడు. విశ్వభారతి ఒక విధంగా రవీంద్రుని వ్యక్తిత్వపు బాహ్యరూపం అనొచ్చు.

జా తీ య త

జాతీయవాదం గురించి దేశం యావత్తు గుడ్డిగా, వుద్వేగంగా, వివేచనారహితంగా ప్రవాహంలో పడి కొట్టుకపోతున్న రోజుల్లో రవీంద్రుడు స్వతంత్రించి, ఆలోచనాపరుడుగా మాట్లాడాడు. జాతిని అతిగా గౌరవించటం, కొలవటం ప్రమాదకరమన్నాడు. ఈ ధోరణి వుగ్రరూపమెత్తి వున్మత్త ప్రవృతికి దారితీస్తుందన్నాడు. ప్రజల్ని, జాతిని వేరుచేసి చూడమన్నాడు. ఆంగ్లపాలనను వ్యతిరేకించవచ్చు. కాని ఆంగ్లేయులనుకాదు. ద్వేషం దేపింపదగినది. విశ్వంలో ప్రజలు యెక్కడున్నా ప్రజలే. ఎవరికీ చేతనైనంత వారు కృషిచేస్తూ విశ్వమానవ దృష్టి అలవరచుకోవాలి. ఈ విషయంలో సంకుచిత దృష్టి అటు పాచ్యంతోనూ యిటు పాశ్చాత్యులలోనూ వున్నది. రంగు, మతం, కులం బట్టి మానవులను విచక్షణతో చూస్తున్నారు. ఈ బలహీనతల్ని పోగొట్టుకోవాలి. సమాజాలను రాజ్యాలుగా మార్చి జాతీయత పేరుతో తీవ్ర వాదాలను రూపొందించటాన్ని ఠాగోర్ ఖండించాడు. ఇటలీలో ఫాసిజాన్నికూడా ఈ దృష్టిలోనే ఖండిస్తూనే మాంచెస్టర్ గార్డియన్‌లో వ్రాశాడు. ప్రాచ్య పాశ్చాత్యాలు కలసిపోవాలన్నాడు. మానవులను మానవులే దండయాత్రచేసి సామ్రాజ్యాలు స్థాపించటాన్ని గ్వాంచాడు. ఠాగోర్ జాతీయవాదం దేశీయులకు మ్రింగుడుపడని సిద్ధాంతమైంది.

REFERENCE BOOKS

1. Rabindranath Tagore, A Centenary Volume Sahitya Akademi, New Delhi 1961.

2. Edward Thompson, Rabindranath Tagore, 1948, Oxford.

3. Rabindranath Tagore, Sadhana Essays and Lectures 1913 Macmillan, London.

4. ,, My Reminiscences, Macmillan London 1917

5. ,, Nationalism, 1917, Macmillan, London.

6. ,, Personality 1917, Macmillan, London.

7. ,, Greater India, 1921, S. Ganesan, Madras.

8. ,, Creative Unity 1922, Macmillan, London.

9. ,, The Religin of Man 1931, George Allen & Unbrin London.

10. ,, Man 1937, Andhra University, Waltair.

11. ,, Crisis in Civilization, 1941, Visva Bharati.

మోతిలాల్ నెహ్రూ

సాంఘిక కట్టుబాట్లను భేదించి, స్వశక్తిపై నిలబడి, విలాసవంతమైన జీవితం గడుపుతూ స్వాతంత్ర్యోద్యమంలో ప్రవేశించి అచిరకాలంలో నాయకుడైన మోతీలాల్ రాజకీయ జీవితం గమనార్హం.

1861 మే 6వ తేది ఢిల్లీలో గంగాధర్‌కు జన్మించిన మోతీలాల్ తన అన్న నందలాల్ ఆధ్వర్యంలో పెరిగాడు. ప్రాథమిక విద్య మహమ్మదన్ ముక్తాబ్‌లో చేస్తూ, పర్షియన్, ఆరబిక్ అభ్యసించాడు. కాన్పూరు ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశ పరీక్ష ఉత్తీర్ణుడై, అలహాబాద్ మూర్ సెంట్రల్ కళాశాలలో పట్టభద్రుడై, న్యాయశాస్త్రాభ్యాసం చేశాడు. 1882లో స్వరూప్ రాణితో వివాహంకాగా, మరుసటి సంవత్సరమే కాన్పూరులో న్యాయవాది వృత్తి ప్రారంభించాడు. పిమ్మట కొద్దిరోజులకే అలహాబాద్ హైకోర్టులో వృత్తి చేపట్టాడు. చిన్నప్పటినుండీ ఆచారాలు, సంప్రదాయాలు పాటించని వ్యక్తి. 1899లో లండన్‌నుండి తిరిగివచ్చినప్పుడు ప్రాయశ్చిత్తం చేసుకోటానికి నిరాకరించాడు. ఆంగ్లేయులతో, మహమ్మదీయులతో సహపంక్తి భోజనం చేయటం, ఇంట్లో స్త్రీలకు పరదా పాటించకపోవటం అనాడు విప్లవంక్రిందే భావించేవారు.

మోతీలాల్ రాజకీయాసక్తి చాలా ఆలస్యంగానే ప్రారంభమైంది. 1906 లో మొట్టమొదట కాంగ్రెసులో చేరినా, మరుసటి సంవత్సరానికిగాని బాగా ప్రవేశించలేదు. అలహాబాద్‌లో సంయుక్త రాష్ట్ర సమావేశానికి అధ్యక్షత వహించాడు. పిమ్మట యేడు సంవత్సరాలపాటు ఆ సభకు అధ్యక్షుడుగా కొనసాగాడు. 1910 లో ఉత్తరప్రదేశ్ శాసనసభ సభ్యుడయ్యాడు. కాని మోతీలాల్ నాయకత్వ లక్షణాలు బయటపడటానికి చాలాకాలం పట్టింది. 1917 లో హోంరూల్ లీగ్ వుద్యమంలో ప్రవేశించి రాజకీయాలపట్ల బాగా ఆసక్తి కనబరచాడు. లీడర్, ఇండిపెండెంట్ అనే పత్రికలపట్ల బాగా ఆసక్తి చూపి, వ్యాసాలు వ్రాసేవాడు. అప్పటినుండీ మోతిలాల్ అఖిలభారత నాయకుడుగా చలామణి అవుతూ ప్రధానపాత్ర వహించాడు. కౌన్సిల్ సభ్యుడుగా హిందూ ముస్లిం ఐక్యతకు, స్త్రీలకు సమాన హక్కులకు పోరాడాడు. 1919లో బ్రిటీష్ పాలకులు పంజాబ్ రాష్ట్రంలో ప్రజల పట్ల గావించిన అత్యాచారాల పట్ల దిగ్భ్రమచెంది, న్యాయవాద వృత్తి వదలి, పూర్తిగా రాజకీయాల్లోదిగాడు.

పారిస్ నుండి దుస్తులు శుభ్రం చేయించి తెప్పించుకుంటూ అతివిలాసంగా గడిపిన మోతీలాల్ గాంధీ ప్రారంభించిన సహాయ నిరాకరణోద్యమంలో దిగి, ఖద్దరు ధరించి, విలాసాలు మాని జీవితాన్ని మార్చుకున్నాడు. అలహాబాద్ పౌరులకు; ఉత్తర ప్రదేశ్‌లోనూ యీ మార్పు చాలామందిని ఆకర్షించి, ఆయన పట్ల గౌరవాన్ని యినుమడింప

జేసింది. ఉద్యమంలో తన తోపాటు కుటుంబ సభ్యులంతా చేరి, అరెస్టుగావటం దీనికి మరీ గౌరవాన్ని అపాదించి పెట్టింది.

1921 డిసెంబరు 6 న మోతీలాల్ తొలిసారిగా అరెస్టు అయ్యాడు విదేశీ వస్తు బహిష్కరణకు. విడుదల కాగానే కాంగ్రెసు కార్యదర్శిగా, దేశంలో పర్యటించి ప్రచారం ప్రారంభించాడు.

కౌన్సిల్‌లో ప్రవేశించాలనే తీర్మానం ఓడిపోవటం, చిత్త రంజన్‌దాస్ తోడ్పడంవలన యిరువురూ కలసి స్వరాజ్యపార్టీ స్థాపించారు. మోతీలాల్ ఆ పార్టీకి కార్యదర్శి. 1924 నుండి 1930 వరకూ కేంద్ర శాసనసభలో మోతీలాల్ స్వరాజ్య పక్షానికి నాయకుడు. 1925 లో చిత్తరంజన్‌దాస్ మరణా నంతరం ఆయనే భారం నిర్వహించాడు. బాధ్యతాయుత మైన భారత పాలన కావాలంటూ కౌన్సిల్‌లో తీర్మానం ప్రవేశపెట్టి, అది ఆమోదించకపోతే, రాజీనామాచేసి, సహాయ నిరాకరణోద్యమాన్ని తీవ్రతరం చేస్తానని హెచ్చరించాడు మోతీలాల్. బ్రిటీష్ ప్రభుత్వ ధోరణికి నిరసనగా మొట్ట మొదట సభనుండి బయటకు నడచిన సంప్రదాయాన్ని నెలకొ ల్పింది మోతీలాల్ (1926 మార్చి 8). 1927 లో సైమన్ కమిషన్‌కు సంస్కరణల నివేదిక సమర్పించాడు.

1928 లో కలకత్తా కాంగ్రెస్ అధ్యక్షుడుగా డొమీని యన్ ప్రతిపత్తికావాలని నినాదం యిచ్చి. సంవత్సరంలోగా యిది ఆమోదించకపోతే స్వాతంత్ర్యం కోరతామని చెప్పాడు

మోతీలాల్. ఒక విధంగా యీ అధ్యక్షోపన్యాసం మోతీలాల్ భావాలకు అద్దంవంటిది. మతం వేర్పాటుకు తావిస్తున్నదని, ఎవరి మతాన్ని వారు అట్టిపెట్టుకోవాలని, రాజకీయాలనుండి మతాన్ని వేరుచేయాలని ముందుమాపుతో సూచించినది మోతీలాలే! సాంఘిక రంగంలోకూడా అంటరానితనం పోగొట్టాలని, స్త్రీల పరదాపద్ధతి మంచిదికాదని, సమాన హక్కులు యివ్వాలని ఆక్రందించిన మోతీలాల్ ముందుచూపు, సెక్యులర్ ధోరణి గమనించదగ్గది. అలహాబాద్‌లో 'ఆనంద భవన్' కాంగ్రెసు కార్యాలయానికి యివ్వటంతో మోతీలాల్ త్యాగాన్ని అందరూ హర్షించారు. జీవితాంతంలోనూ ఆరు మాసాలు జైలుశిక్ష అనుభవించిన మోతీలాల్ విశేష సాహసి. 1931 లో ఆయన మరణించాడు.

మోతీలాల్ ముందుచూపుకు ఒక విషయం ప్రస్తావించాలి. గాంధి నాయకత్వాన్ని, గొప్పతనాన్ని బాగా ఆకళింపు చేసుకున్న మోతీలాల్, తన ఏకైక కుమారుడు జవహర్‌లాల్‌ను గాంధి నాయకత్వంక్రింద వుంచటం చెప్పుకోదగినదే. తాను స్వరాజ్య పార్టీలో వున్నా గాంధి ఆశీర్వచనాలను పొందటం, తరచు సంప్రదించటం చివరకు గాంధీ తమ కుటుంబ ఆంతరంగికుడు గావటం విచిత్రం.

నెహ్రూ నివేదికలో మోతీలాల్ ప్రతిభ ద్యోతకమైంది. హింసను నిరసిస్తూ, అతివాదాన్ని ఖండిస్తూ, రాజ్యాంగబద్ధంగా పోరాటానికి అనుకూలంగా ప్రవర్తించాడాయన. సాంఘిక మార్పుల ప్రాతిపదికతో రాజకీయ

సంస్కరణలు జరగాలనే శాస్త్రీయ ధోరణి అవలంభించిన మోతీలాల్ నాయకత్వం ఒక దశాబ్దానికి మించి దేశంలో లేక పోవటం విచారకరం.

REFERENCE BOOKS

1. **Upendra, Ch. Bhattacharya,**
Shovendu Sundar Chakravarty } Compilers
Pandit Motilal Nehru, 1931 Modern Book Agency
10 College Square, Calcutta.

2. **K. D. Malaviya,** Pandit Motilal Nehru
1919 Law Journal Press, Allahabad.

వీర వినాయక్ దామోదర్ సావర్కార్

బ్రిటిష్ ప్రభుత్వాన్ని కూలద్రోయటానికి యే మార్గ మైనా అనుసరించాలనే వుగ్రవాదంతో ప్రారంభించి, మత తిరోగమనం ప్రోదిచేసి, సంస్కరణలనూ సంఘటనలనూ ముడి పెట్టిన సావర్కార్ దేశంలో యువతరంవారిని వుత్తేజితుల గావించాడు.

జన్మించింది సంప్రదాయబద్ధమైన మహారాష్ట్ర బ్రాహ్మణ కుటుంబంలో 1883 మే 28. తండ్రి దామోదర్ పంత్, తల్లి రాధాభాయి చిత్పవన వంశీయులు. నాసిక్ సమీ పంలోని భాగూరు స్వగ్రామం. అక్కడే ప్రాథమిక విద్యా భ్యాసంకూడా. అనూచానంగా వస్తున్న ఆచారాలు, అల వాట్లు చదువు అబ్బగా, ఈర్ష్యలు, ద్వేషాలుకూడా అలవడి నయ్. 1893లో 10 యేండ్లకే గ్రామంలో మసీదుపై రాళ్లు రువ్వటం, ముస్లిం బాలురతో కలహాలతో జీవితంలో సాహస చర్యలు ప్రారంభించాడు సావర్కార్. తల్లి కలరాతో తండ్రి ప్లేగుతో మరణించగా అన్నల అజమాయిషీలో పెరిగిన సావర్కార్ సాహస కృత్యాలలో, విరోచిత చర్యలలో వుత్సాహం చూపించాడు. నాసిక్ హైస్కూళ్లు విద్యాభ్యా సంలో రచనలు వుపక్రమించి, స్నేహితులను కూడగట్టి 'మిత్ర మేళ' ప్రారంభించాడు. ఇదే వుత్తరోత్తరా రహస్య సంస్థగా పెంపొంది, అరాచక చర్యలకు నిలయమైంది. కుర్రవాళ్ళకు

శిక్షణ యిచ్చి, కసరత్తు నేర్పి, వీరులుగా తయారుచేసి పోరాటాలకు సిద్ధంచేయటం సావర్కార్ ఆశయం. బ్రిటీష్ ముస్లిం లపై కక్ష తీర్చుకోటానికి వీరిని వుపయోగించాలని సంకల్పం. ఈ విధంగా చిన్నతనంనుండే సుశిక్షితుడైన కార్యకర్తగా నాయకుడుగా, వుగ్రవాదిగా, రచయితగా, వక్తగా రూపొందాడు. మహారాష్ట్ర గొప్పతనం శ్లాఘిస్తూ, పిష్వాల వీరోచిత గాధలు, శివాజి చరిత్ర చదివి వుత్తేజితుడై, తన వ్యాసాల్లో అవి వ్రాసేవాడు. మెట్రిక్ ఉత్తీర్ణుడుగాక పూర్వమే వివాహం చేసుకున్న సావర్కార్ ఆరిక పరిస్థితిలో ఆదుకునే సంబంధం తెచ్చుకున్నాడు. 1902 లో పూనా ఫెర్గూసన్ కళాశాలలో చేరి, పూర్వపు వాసనల ననుసరించి ఒక ముఠా తయారుచేసి, కట్టుబొట్టులో ఒకే తీరు తెన్నులు అవలంబింపజేసి, తన ప్రభావాన్ని విద్యార్థి నాయకుడుగా చూపాడు. అప్పుడు సంభవించిన విదేశీ వస్త్ర దహనకాండలో ప్రధాన పాత్ర వహించి 10 రూపాయల శిక్షతో కళాశాలనుండి వెళ్ళగొట్టబడినా 1905లో బి.ఏ. లో ఉత్తీర్ణుడయ్యాడు. ఆయన వ్రాసిన 'తానాజీ' 'బాజీప్రభు' గేయాలు నిషేధానికి గురియైనవి. 1904లో న్యాయశాస్త్రం మొదటి సంవత్సరం పూర్తిచేస్తూనే రహస్య సంఘం మాత్రం కొనసాగిస్తూ 'అభినవ భారత్' అనే సంస్థతో కార్యకలాపాలు నిర్వర్తిస్తుండేవాడు. 'విహారి' అనే పత్రికలో వ్యాసాలు వ్రాయటంతోపాటు ఉపన్యాసాలిస్తూ ప్రచారం చేస్తూ ఉత్తేజితంగా వుండేవాడు.

లండన్ భారతీయ సంఘాన్ని స్థాపించి విద్యార్థులకు సహాయం చేస్తున్న పండిట్ శ్యాంజీ కృష్ణవర్మ యిచ్చిన

స్కాలర్‌షిప్‌తో తిలక్, పరంజిపే సిఫారసులతో 1906 లో లండన్ వెళ్ళాడు సావర్కార్. అక్కడి ఇండియా హౌస్ సావర్కార్ ఆధీనంలోకి రాగా ఫ్రీ ఇండియా సొసైటి పెట్టి, భాయి పరమానంద, లాల్ హరిదయాళ్ వంటి విప్లవకారుల్ని తయారుచేస్తూ, ప్రచారం చేస్తూ, గందరగోళం సృష్టించటంతోపాటు, బ్రిటీష్ ప్రభుత్వాన్ని కూలద్రోయటానికై పిస్టల్స్, ఆయుధాలు, మందులు, ఉత్తేజపరచే గ్రంథాలు ఇండియాకు పంపిస్తుండేవాడు 1857 సిపాయి తిరుగుబాటు వజ్రోత్సవం జరిపాడు. 1907 మే 10 న. వీటన్నిటితో లండన్‌లో గూడచారులు సావర్కార్‌పై కన్ను వేసివుంచారు. సావర్కార్ పెట్టిన అభినవ భారత్ రహస్యాలు 1909 జూన్‌లో ఇండియాలో వెల్లడైనయ్. సావర్కార్ వ్రాసిన ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం 1857' అనే మరాఠి గ్రంథం ఆంగ్లంలోకి అనువదించబడి హాలండ్‌లో అచ్చై స్వదేశానికి రహస్యంగా చేరటంతో కొంత కలవరం బయలుదేరింది. పారిస్‌లో విశ్రాంతికై వెళ్ళిన సావర్కార్ బ్రిటీష్ ప్రభుత్వంవారు భారతదేశంలో తమ సంస్థలపై జరుపుతున్న చర్యలకు నిరసనగా యేదో చెయ్యాలని, స్నేహితుల సలహా పాటించకుండా ఇంగ్లండ్ తిరిగివచ్చి, అరెస్టు గావించబడ్డాడు. అంతకుపూర్వమే సావర్కార్ సంఘం సర్ విలియం కర్జన్ వెలీ అనే అతన్ని లండన్‌లో చంపటం, చంపిన ధింగ్రాని ఉరితీయటం, అతన్ని సావర్కార్ సమర్థించటం జరిగింది. 1910 మార్చి 13 న అరెస్టు గావించబడిన సావర్కార్ అక్కడే, అసలు విచారణ స్వదేశంలో జరపాలనగా, ఓడలో తీసుకొస్తుండగా

తప్పించుకోటానికై సముద్రంలో దూకి ఈదుకుంటూ ఫ్రెంచి దేశపు ఒడ్డు చేరాడు. కాని వెంటబడిన బ్రిటీష్ పోలీస్‌కు తిరిగి అప్పగించబడటంతో ఇండియాకు తీసుకరాబడ్డాడు. విచారణలో జన్మాంతర శిక్షపొంది అండమాన్‌కు పంపబడ్డాడు. ఆయన ఆస్తికూడా ప్రభుత్వం స్వాధీనపరచుకొన్నది. జైల్లో కవిత్వం వ్రాసుకున్నాడు. ఖైదీల హక్కులకై పోరాడాడు.

భారతనాయకుల ఆందోళన ఒత్తిడివలన 1923 లో సావర్కార్‌ను విడుదల చేశారు. రాజకీయాల్లో పాల్గొన గూడదని, రత్నగిరి జిల్లాలోనే వుండాలని ఆంక్షలు విధించారు. ఆ జిల్లాలో అంటువ్యాధి ప్రబలగా నాసిక్ వచ్చాడు. అప్పటి నుండీ సావర్కార్ తన దృష్టి అంతా సాంఘిక సంస్కరణలపై కేంద్రీకరించి, హిందూ సంఘటనకు కృషి ప్రారంభించాడు. 1923 లో 'హిందూత్వ' అనే గ్రంథం ప్రచురించాడు. ఆర్. ఎస్. ఎస్. స్థాపకుడు హెడ్గివర్, అంబేద్కర్, గాంధి మొదలైన వారాయన్ను కలుసుకుని చర్చలు జరిపారు.

1934 లో సావర్కార్ రెండు వారాలపాటు అరెస్టు గావించబడి, కలహాలతో ఆయన కేమీ సంబంధం లేదని తెలిసి విడుదల చేయబడ్డాడు.

మళ్ళీ రాజకీయ జీవితం ఆరంభించాడు. దేశానికి పూర్తి స్వాతంత్ర్యం అన్నది ఆతని నినాదం. ముస్లి వ్యతిరేకత ఆతనిలో అప్పటికే తీవ్రతరమైంది. కాంగ్రెసును విమర్శిస్తూ, 1939 లో హిందూ మహాసభ అధ్యక్షుడయ్యాడు. 1942 వరకూ అందులో వున్నాడు. అఖండ భారత్‌కు అంగీ

కరి స్తే క్విట్ యిండియాలో చేరతామన్నాడు. 1943 జులై 27న జిన్నాపై జరిగిన హత్యాప్రయత్నాన్ని ఖండిస్తూ దేశంలో రాజ్యాంగబద్ధంగానూ, దేశం వెలుపల విప్లవ పూరితంగానూ వుండాలన్నాడు. ఆరోగ్యం క్షీణించిన సావర్కార్ హిందూ మహాసభ అధ్యక్ష పదవికి 1942లో రాజీనామా యిచ్చాడు. గాంధి హత్యజరిగినపుడు ఆయన్ను అరెస్టుచేసి, ఆ కుట్రలో సావర్కార్ కు సంబధంలేదని వదలేశారు.

సావర్కర్ భావాలు

విజ్ఞానశాస్త్రంలోని కార్యకారణ పద్ధతి అంగీకరించాలని, ఎందుకు నిలబడని ఛాందసాలు, మూఢనమ్మకాలు త్యజించాలని చెబుతూ హిందూ ఆచారాలలో అనేక సంస్కరణలకై సావర్కార్ కృషిచేశాడు. వేదాలు పవిత్రగ్రంథాలంటున్నా మంటే అవి మార్చటానికి వీల్లేనివనీ, అపౌరుషేయాలనీ అర్థంకాదని, మానవుల చరిత్రలో తొలి గ్రంథాలుగా మాత్రమే వాటి స్థానం అన్నాడు. అది సనాతన హిందువులకు పునాది పెకలించే చావుదెబ్బ. [1]అలాగేవర్ణాలు కురిపించడానికి యజ్ఞాలు చేస్తే ప్రయోజనంలేదన్నాడు, కొన్ని విషయాలలో విజ్ఞాన శాస్త్రం కార్యకారణ సంబంధాలను విడమరచి చెప్పిన తర్వాత కూడా యింకా పాత మౌఢ్యాలు అనుసరించటం అర్థరహిత మన్నాడు. ఇదికూడా హిందువులకు కొరుకుడుపడని విషయమే ఆవును కాపాడటమంటే మనుషుల్ని యీసడించటం కాదు. అవు ల్నితిని మనుషుల్ని రక్షించాల్సి వస్తే అలాగే చెయ్యాలి అంటూ అవు పవిత్రత అనే విషయంలో అర్థరహిత వాదాన్ని

---

1. Savarkar and His Times D. Keer 1950, A. V. Keer, Bombay. p. 183-184.

బహిర్గత పరచాడు. కులం పాటించకూడ దన్నాడు. అంటరాని తనం రూపుమాసి పోవాలంటూ, పిల్లి, కుక్కను గౌరవిస్తూ మనుషుల్ని అంటరాని వారుగా చూసే హిందువులను యీ సడించుకున్నాడు.[1] అంటు వ్యాధులువ్యాపించినప్పుడు సాంఘిక సేవచేశాడు. అందరితో కలసి భోజనాలు చేసేవాడు. సాంఘిక సంస్కరణల వరకూ సావర్కార్ భావాలు విప్లవపూరితమైనవే హిందూత్వం సావర్కార్ ముఖ్య నినాదం. ఏమార్గాన్ని అనుసరించినాసరే దేశానికి పూర్తి స్వాతంత్ర్యం కావాలంటూ అఖండ్ భారత్ నినాదంకూడా యిచ్చాడు. హిందువులు, ముస్లింలు రెండు జాతులనే వాదన చేస్తూ, జిన్నా ద్విజాతి సిద్ధాంతాన్ని యీయనా చెప్పాడు, పరోక్షంగా అఖండ్ భారత్ వాదాన్ని తానే ఖండించుకున్నాడు. [2]ఎవరు హిందువు? అనే ప్రశ్న వేసి, భారతవర్షాన్ని పవిత్రభూమిగా, పితృభూమిగా తన మతానికి ప్రాతిపదికగా గుర్తించినవాడు అని నిర్వచించాడు. హిందువులు ఒకజాతి. హిందూ రాష్ట్రంలోగల ప్రజలకు ఒకే భాష. రక్తం, చరిత్ర, సంస్కృతి దేశం వుంటాయన్నాడు. [3]అన్నిటికంటే ముందు భారతీయులమని భావించే వారంతా సంఘటితం కావాలన్నాడు. హిందువులలో పునరుజ్జీవనం కోరాడు. రాజకీయాలన్ని హైందవపరంగా హిందువులందరూ వీరసైనికులు కావాలని నినదించాడు. సంఘటన అనేది మూల

---

1. Ibid. pp. 160.
2. Hindu Rastra Darshan, V. D. Savarkar. 1949, L. G. Khare, Bombay. p. 26.
3. Hindutva 1942 Poona, V. G. Ketkar. p. 4, 116.

సూత్రంగా ప్రతి పాదించి హిందువులు హైందవేతరులను వివాహం చేసుకోటం పట్ల సావర్కార్ విముఖత చూపటం ఆశ్చర్యకరం. అక్కడ సంస్కరణ వాదాన్ని విస్తృత పరచలేదు. హిందువులకు ఒక ప్రత్యేక పథకం కూడా ఆయన ఆపేక్షించాడు. 1947 ఆగష్టు 15 న రెండు జెండాలు ఎగురవేశాడు, స్వేచ్ఛా భారతంలో ప్రాథమిక హక్కులు వుండాలంటూనే. ముస్లింలను మాత్రం అనుమానాస్పదంగానే చూడాలన్నాడు. స్త్రీలు అన్నిరంగాల్లో ప్రవేశించినా, సున్నితత్వం పోగొట్టుకుండా వుండే రీతులు చూచుకోవాలన్నాడు. సంస్కరణ, తిరోగమనం కలిపేసి కొంత దూరం మాత్రమే హేతు మార్గావలంబన చేశాడు సావర్కార్.

REFERENCE BOOKS

1. **V. D. Savarkar** Hindutva 1942 V. G. Ketkar, Poona.

2. ,, Hindu Rashtra Darshan, 1949 L. G. Khare, Bombay.

3. ,, Historical Statements, 1967 Popular Prakasan, Bombay.

5. **Dhananjay Keer** Savarkar and His times 1950 A. V. Keer, Bombay.

చిత్తరంజన్ దాస్

బ్రహ్మసమాజికుడై నా నాస్తికుడుగా జీవితం ప్రారంభించి జాతీయవాదంతో ఆస్తికత్వం రంగరించి. వుద్రేకాలు హింసలేని అతివాదిగా రాజకీయాలు కొనసాగించిన నాయకుడు చిత్తరంజన్ దాసు.

తండ్రి భువన మోహన్ కవి. తల్లి నిస్తరిణిదేవి చాదస్తం లేని బ్రహ్మ సమాజికురాలు. 1870లో జన్మించిన చిత్తరంజన్ దాసు భవానిపూర్ లండన్ మిషనరీ సొసైటీఇన్‌స్టిట్యూట్‌లో ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తిచేసి, 1886 నాటికి ప్రవేశ పరీక్ష గట్టెక్కి, ప్రెసిడెన్సీ కళాశాలలో వున్నత విద్యాభ్యాసం గావించాడు ఇక్కడే విద్యార్థి సంఘంలో ప్రధాన పాత్ర వహిస్తూ సురేంద్రనాథ్ బెనర్జీ వుపన్యాసాలచే ప్రేరేపితుడయ్యాడు. బెంగాలి భాషకూడా ప్రవేశపెట్టమని ఆందోళన ప్రారంభించాడు. 1890లో పట్టభద్రుడై లండన్ వెళ్ళి ఐ. సి. ఎస్. పరీక్ష తప్పి న్యాయశాస్త్రి భ్యాసం చేశాడు. 1893లో కలకత్తాలో హైకోర్టులో న్యాయవృత్తి ప్రారంభించాడయినా హేమిలి మధ్య.

తండ్రి కవిత్వ వాసనలు అబ్బగా తానూ రచనలు చేయ నారభించాడు. 1895లో అయన ప్రథమ కవితాసంపుటి ప్రచురితమైంది. చిత్తరంజన్ కవిత్వంలో తొలిదశ నాస్తిక భావాలు వుండటమే గాక. ఆకవిత్వం బాగుండేది కూడా.

తర్వాత వైష్ణవ ప్రభావంతోనూ, బ్రహ్మ సమాజానికి వ్రాసిన కవిత ఆయన్ను వుత్తమ కవిగా అట్టి పెట్టలేదు. 1897 లో వివాహం చేసుకున్నాడు. ఆయన భావాలు నాస్తికంగావటం వలన పౌరోహిత్యం చేయటానికి నిరాకరించారు బ్రహ్మ సమాజికులు. 1897 నుండి 1905 యించు మించు వూరకే కాలం వెళ్ళ బుచ్చాడవవచ్చు. కవిత్వం జాస్తిగా వ్రాసింది యీ వ్యవధిలోనే. 1906లో కాంగ్రెస్ రాజకీయాల పట్ల ఆసక్తి చూపుతుండగా, తండ్రి చేసిన అప్పులు తీర్చలేక దివాలా పత్రం దాఖలా చేశాడు. ఆర్థికంగా తీవ్రసంక్షోభం అది. కాని త్వరలోనే మామ ఆస్తి వచ్చిపడి చిత్తరంజన్ కోలుకున్నాడు. తండ్రి అప్పులుతీర్చటానికి 1914 నాటికి గాని వీలుచిక్కలేదు దాస్‌కు.

బెంగాల్‌లో ముమ్మరంగా సాగుతున్న జాతీయ విప్లవ సందర్భంగా కొన్ని కేసుల్లో చిత్తరంజన్ పేరు ప్రఖ్యాతలు తెచ్చు కున్నాడు. అరవింద ఘోష్ కేసులో అందులో ముఖ్యమైనది 1906 నుండి 1917 వరకూ చిత్తరంజన్ రాజకీయాలను ప్రేతుక స్థానంలో నుండే తిలకించాడు. అని బి సెంట్ ప్రారంభించిన హోంరూల్ లీగ్‌తో చిత్తరంజన్ కూడా రంగంలో ప్రవేశించాడు. బెంగాల్ రాష్ట్ర సభకు అధ్యక్షత వహించాడు. మాంటేగ్–చెంస్ఫర్డ్ సంస్కరణలను వ్యతిరేకించాడు. గాంధి ప్రారంభించిన సహాయ నిరాకరణోద్యమాన్ని కలకత్తా కాంగ్రెసు (1920) లో వ్యతిరేకించాడు. కాని మూడు మాసాల అనంతరం నాగపూర్‌లో గాంధితో జరిగిన చర్చలలో యిరువురూ ఒడంబడికకు రావటం, చిత్తరంజన్

బాహాటంగా సహాయనిరాకరణోద్యమాన్ని బలపరచటం చూచినవారు అవిజయమంతా గాంధికే యిచ్చారు. అప్పటి వరకు విలాసాలకు అలవాటు పడిన చిత్తరంజన్, అన్నిటినీ త్యజించి రాజకీయ సన్యాసిగానే జీవించాడు ఈ విషయంలో మోతిలాల్ ,చి తరంజన్ యించు మించు ఒకటే:

చిత్తరంజన్ నియంతృత్వ మనస్తత్వం గలవాడు. ఛలోక్తులను సహించలేక పోయేవాడు తన మాటకు యెదురు భరించేవాడుకాదు. బెంగాల్ రాష్ట్రానికి తిరుగులేని నాయకుడయ్యాడు. సురేంద్రనాథ్ బెనర్జీ చూస్తుండగా అడుగున బడిపోయాడు. త్వరలోనే గాంధిని వ్యతిరేకిస్తూ, కౌన్సిల్ ఎన్నికలలో పోటీచేయాలని నిశ్చయించాడు. మోతిలాల్ కూడా సహకరించాడు. కౌన్సిల్స్‌లో ప్రవేశించి ప్రభుత్వాన్ని పడగొట్టాలని, సహాయనిరాకరణ చేయాలని దాసుసంకల్పం. కాంగ్రెసు తొలుత వ్యతిరేకించినా, తర్వాత పరోక్షంగా అమోదాన్ని తెలుపటం దాసుకు విజయమే. అప్పటికే ఆయన మోతిలాల్ కార్యదర్శిగా, తన అధ్యక్షతన స్వరాజ్యపార్టీ స్థాపించాడు. (1923) సాంఘిక సంస్కరణలు, బ్రిటిష్ సామ్రాజ్యంలో డొమినియన్ ప్రతిపత్తి, స్వేచ్ఛా వ్యాపారం అనేవి స్వరాజ్య పార్టిలక్ష్యాలు. అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు అధ్యక్షుగాపనిచేశాడు 1923లోనే. అధిక సంఖ్యలో స్వరాజ్యపార్టీ వారు కౌన్సిల్స్‌లో రావటమేగాక, మంత్రులనియామకం, మంత్రుల జీతం వ్యతిరేకిస్తూ పాలనా వ్యవస్థలో ఆటంకాలు తీసుకరాగలిగింది స్వరాజ్య పార్టీ. అంతకు మించి నిర్మాణాత్మకంగా ఆపార్టీకి యేపధకంలేదు. కాంగ్రెసు

కూడా 1924లో యీపార్టీని తమ అనుబంధ సంస్థగా గుర్తించింది. దయామయమైన నిరంకుశత్వం. ఇనుపపాలనా చట్రం పోవాలని చిత్తరంజన్ వాదన, భారత దేశానికి స్వయం పాలన హక్కు,శక్తి వున్నదని నొక్కిచెప్పాడు. సంస్కరణలు త్వరగా జరగాలనే తహతహ ఆయనకు మిన్నగా వుండేది, ఆతొందరలో చెడుకూడా గమనించ లేకపోయేవాడు. 1924లో ఒక ఐరోపీయుని హత్యచేసిన బెంగాలీ యువకుని సమర్థించాడు. విప్లవం పేరుతో రహస్య కలాపాలు సాగిస్తున్న వారికి అనుకోకుండా అండగా నిలబాడ్డాడు, తర్వాత తన తప్పు గ్రహించి హింసాయుతమైన చర్యల్ని ఖండించాడు. 1921లో పాఠశాలలు మూత పడినప్పుడూ, కౌన్సిల్‌లో వ్యతిరేకించి నప్పుడూ ప్రత్యామ్నాయం ఆలోచించకుండానే దాసు కార్యక్రమాల్ని చేపట్టాడు. జీవితం చివరదశలో రాజకీయాల్లో ప్రవేశించినందున ఫలితాలు త్వరగా చూడాలనే తొందర ఆయనకు సహజంగా వుండేది. ఆయన దేశభక్తిలో సంకుచిత త్వం కనిపించింది. సర్వమానవసౌభ్రాతృత్వం కావాలనే రవీంద్రనాథ్‌తో యీ విషయమై వాదనకు దిగటం గమనించదగినది.[1] ఆగ్రహం ఆపుకోలేని నాయకుడు చిత్తరంజన్. జీవితం తొలిదశలో సంప్రదాయాలు భేధించినా, వృద్ధాప్యంలో మళ్ళీ ఛాందస పద్ధతులు అలవరచుకున్నాడు. చివరిరోజుల్లో మాత్రం సాత్వికుడై, వుద్యోగాన్ని అణుచుకున్నాడు. 1925 జూన్ 16 న డార్జ

---

1. Life and Times of C. R. Das : Prithwis Chandra Roy, Oxford University Press, London 1927. p. 236

లింగ్‌లో మరణించాడు. సుభాస్‌చంద్రబోసు కొన్నాళ్ళు చిత్తరంజన్‌వద్ద శిక్షణ పొందాడు, కలకత్తా మేయరుగా కొద్ది కాలం వున్నాడు. ఫార్వర్డ్ అనే దిన పత్రిక కూడా స్థాపించాడు.

REFERENCE BOOKS

1. **Prithwis Chandra Ray** Life and Times of C. R, Das - Oxford University Press, London, 1927.

2. **Speeches of Mr. C. R. Das** Banerjee Das & Co. Calcutta 1918.

ఫిరోజ్‌షా మెహతా

బ్రిటిష్‌వారు భారతదేశాన్ని పాలించటం దైవేచ్ఛ అని నమ్మిన నాయకులలో ఫిరోజ్‌షామెహతా ప్రముఖుడు. ఆయన కార్యకలాపాలన్నీ బొంబాయి కార్పొరేషన్, లెజిస్లేటివ్ కౌన్సిల్, విశ్వవిద్యాలయానికి పరిమితమైనయ్. 1845 ఆగస్ట్ 4 న బొంబాయిలో ఒక పార్సీకుటుంబంలో జన్మించిన ఫిరోజ్‌షా, బొంబాయి ఎల్‌ఫిన్‌స్టన్ కళాశాలలో బి. ఎ. వరకు చదివాడు. అక్కడే ఎం. ఎ. వుత్తీర్ణుడై, లా చదవటానికి ఇంగ్లండ్ వెళ్లాడు. 4 సంవత్సరాల లండన్ జీవితంలో లా పూర్తిచేసి. ప్రాంచినేర్చి, మిరాబో విప్లవభావాలకు వుత్తేజితుడై, 1868 లో స్వదేశానికి తిరిగివచ్చి. ప్రాక్టీసుపెట్టాడు. బాగా రెండుచేతులలో సంపాదించాడు. అలవాట్లలో విలాస పురుషుడు. ఆరోగ్యం అంతంత మాత్రమే. అయితే దాదాభాయి ప్రభావంతో రాజకీయాల వాసనలు అబ్బినయ్. ఈస్ట్ యిండియా అసోసియేషన్ బొంబాయి శాఖకు కార్యదర్శి అయ్యాడు. 1872 లో బొంబాయి మునిసిపల్ కార్పొరేషన్ సభ్యుడై. సంస్కరణలకు ప్రయత్నించాడు. పౌరపాలనలో చాలా శ్రద్ధవహించాడు.

1885 లో కాంగ్రెస్ స్థాపించబడటంలో ఫిరోజ్‌షా పాత్రికూడా బాగానే వున్నది. 1886 లో బొంబాయి లెజిస్లేటివ్ కౌన్సిల్‌కు నియమితుడై, 1892 లో ఎన్నికయ్యాడు.

తన 15 సంవత్సరాల సభ్యత్వంలో చాలా మార్పులకు కారణ భూతుడయ్యాడు. 1889 జులైలో బొంబాయి విశ్వవిద్యా లయ ఆర్ట్స్‌ఫాకల్టీస్‌కు డీన్‌గా నియమితుడయ్యాడు.

మెడిసన్ చదవటానికి స్త్రీలకు మేటి అర్హత చాలు నని, పురుషులకు మాత్రం ప్రివియస్ పరీక్ష అవసరమని వాదించి, గేలి చేయించుకున్నాడు. ఈ విషయంలో ఫిరోజ్‌షా తీర్మానం ఓడిపోయింది.

మెహతా మంచివక్త. వ్యంగ్యం, దూషణ, ఎత్తి పొడుపులతో నిబిడీకృతమై వుండేది ఆయన వుపన్యాసం. ఆంగ్ల సామ్రాజ్యంపట్ల విధేయతలో తాము ఆంగ్లో - యిండియన్ల కంటె మెరుగని చెబుతుండేవాడు.

భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడుగా 1890 లో ఎన్నికయ్యాడు. ల వ బొంబాయి రాష్ట్రీసభకు అధ్యక్షుడుగా 1892 లో వున్నాడు. 1893 అక్టోబరులో సుప్రిం లెజిస్లేటివ్ కౌన్సిల్‌కు ఎన్నికయ్యాడు. 1904 లో మెహతాకు నైట్ కమాండర్ షిప్ ఆఫ్‌ది ఆర్డర్ ఆఫ్‌ది ఇండియన్ ఎంపైర్ బిరుదు ప్రదానం గావించబడటం ఆ రోజుల్లో ఘనకీర్తిక్రింద లెక్క. 1907 సూరత్ కాంగ్రెస్‌లో మితవాదిగా తనపాత్ర నిర్వహించి, అతివాదుల దూషణలకు గురయ్యాడు. 1910 లో కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఎన్నికై, రాజీనామా చేయటంలో ఆంతర్యం యింకా బాగా తెలియలేదు. 1911 లో తన కులాభిమానం వీడలేక, మిత్రుల ఒత్తిడి కాదనలేక పార్సీ పంచాయత్ ట్రస్టీగా పోటీచేసి ఓడిపోయాడు. అదే సంవత్సరం జార్జి రాజు

రాక సందర్భంగా బొంబాయి కార్పొరేషన్ అధ్యక్షుడై వుచితరీతిన స్వాగతం సమర్పించాడు. బొంబాయి విశ్వవిద్యాలయ వైస్‌ఛాన్సలర్‌గా జీవితాంతంలో నియమించబడినా ఆట్టే చేయలేకపోయాడు. 1914 నవంబరు 5 న చనిపోయాడు.

చరిత్రగతి దైవేచ్ఛ ననుసరించి వుంటుందని నమ్మిన వ్యక్తి ఫిరోజ్‌షా, తాత్కాలిక అంధకారంనుండి చివరకు వెలుగు వస్తుందంటాడు. భారతదేశంలో బ్రిటిష్ పాలనద్వారా వ్యక్తి స్వేచ్ఛ, శాస్త్రీయ విజ్ఞానం రావటం కేవలం దైవాను గ్రహం తప్ప మరేదీకాదు మెహతా దృష్టిలో, ఈ గుణపాఠం ఆకళింపు చేసుకుంటే కాలానుగుణంగా అన్నీ సంక్రమిస్తాయని భారతీయులకు సలహా యిచ్చాడు. ఒకప్రక్క హేతువు, విజ్ఞానం, రాజ్యాంగం, ఆధునిక విద్య కావాలంటూనే మరోవైపు అంతా భగవదేచ్ఛ అనటం ఆనాటి కాంగ్రెస్ మితవాద నాయకులకు, ముఖ్యంగా మెహతాకు అభ్యాసమైంది. చరిత్ర గతి ఎల్లప్పుడూ పురోగమనానికే దారి తీస్తుందంటాడు. చరిత్రలో పునరావృతం వుండదు. ఉంటుందనుకునేవారు పొరపాటు పడినట్లే. గతంనుండి పాఠాలు నేర్చుకొని భవిష్యత్తును తీర్చి దిద్దుకోవాలి అని ఫిరోజ్‌షా చెప్పాడు.

భారతదేశాన్ని ఆంగ్లేయులు బలవంతంగా కత్తితో జయించలేదు. దీనికి గాఢమైన కారణాలు వున్నయ్. నైతిక వైజ్ఞానిక విలువలవలన ఇంగ్లండ్ జయించిందిగాని కేవలం బల ప్రయోగం వలనకాదు. కనుక ఇంగ్లండ్ పాలనలో యీ విషయం గమనించాలి. ఇండియాను బలప్రయోగంతో పాలించా

లంకే ఆంగ్లేయులలోనే వ్యతిరేకత వస్తుంది. పొరుగుదేశాలు విరోధులౌతాయి. సైనిక ఖర్చు అనవసరంగా పెరిగి, దేశ సంపద వృధా అవుతుంది. ఆంగ్లేయులకు రాజ్యపాలన, సంస్కృతి వున్నయ్. ఉత్తమ సంప్రదాయాలున్నయ్. కనుక భారతదేశానికి న్యాయం చేకూర్చగలరని మెహతా కలలు గన్నాడు. వాగిపట్ల ఆయనకు యించుమించు మూఢనమ్మకం వుండేది.

బ్రిటిష్ సామ్రాజ్యం శాశ్వతమని నమ్మిన నాయకుడు ఫిరోజ్‌షా. కనుచూపు మేరలో స్వాతంత్ర్యానికి అవకాశంలేని రోజుల్లో మెహతా అభిప్రాయాలు అలాంటివి.

స్థానిక పురపాలనలో అనుభవజ్ఞుడుగా వికేంద్రీకరణ కావాలని చెప్పాడు ఫిరోజ్‌షా. ఎన్నికైన ప్రతినిధులకు స్వేచ్ఛ, అధికారం లేకుంటే నిరుత్సాహం వస్తుందనీ కనుక స్థానిక పాలనలో అదుపుతో కూడిన బాధ్యతలు, హక్కులు వుండాలని వాదించాడు. స్థానికపాలన అప్పుడే జయప్రదమౌతుం దన్నాడు.

విద్యారంగంలో ఆసక్తి చూపడమేగాక, బాధ్యతగల పదవులు నిర్వహించిన మెహతా నైతిక విలువలతోగూడిన విద్య కావాలని నొక్కి చెప్పటం విశేషం. దేశసంపదాభివృద్ధికి విద్య దీర్ఘకాలికంగా యెంతో తోడ్పడుతుందని ముందు చూపుతో చెప్పాడు. ఛిన్నవిప్లవం, ఐరోపా సంస్కృతివలన బాగా ప్రభావితుడైన ఫిరోజ్‌షా భావాలు విద్యారంగంలో గమనార్హాలు. సంస్కృతం మనదేశానికి నిరుపయోగమని

ధైర్యంగాచెప్పిన తొలినాయకులలో ఒకడు ఫిరోజ్ షా* సంస్కర్తలలో రామమోహన్‌రాయ్ యీ ధోరణే వ్యక్తపరచాడు గదా.

---

*Speeches and writings of Sri Pherozeshah Mehta p 7

REFERENCE BOOKS

1. **Homi Modi,** Pherozeshah Mehta 1963 Asia Publishing Home, Bombay.

2. **C. Y. Chintamani (ed.)** Speeches and Writings of Sir Pherozeshah Mehta, 1905. The Indian Press, Allahabad.

లాలాలజపతిరాయ్

ఆర్యసమాజ్‌ను అతివాద రాజకీయాలను రంగరించి జాతీయ వుగ్రవాదిగా, పంజాబ్ కేసరిగా పేకొందిన లజపతి రాయ్ విచిత్ర పరిస్థితులలో బాల్యావస్థ గడిపాడు. అతని తండ్రి లాలారాధాకిషన్ కారణాంతరాలచే యిస్లాం మతాచారాలను పాటిసూ నమాజ్ చేయటం, వుపవాసం మొదలైనవి అనుసరించేవాడు. తల్లి సిక్కు సంప్రదాయంలో పెరిగి, హైందవాచారాలన్నిటిని భర్తకు తెలియకుండా పాటిస్తూ, మధ్య మధ్య శిశువుకు గురై య్యేది. ఈ వైవిధ్యపు తల్లిదండ్రులకు లజపతి జన్మించాడు 1865 లో. పంజాబ్‌లోని జాగ్రాన్ అనే చిన్నపట్టణం స్వస్థలం. భారత కుటుంబాలలో తండ్రిపై తండారు గనుక చిన్నతనంలో లజపతి తండ్రిని అనుసరించటం, ఆరబిక్ నేర్చుకోటం తప్పలేదు. పాఠశాలలో సర్ష్మీన్ సరేసరి. ఉర్దూతోపాటుకొరాన్‌కూడా వల్లెవేయించాడుతండ్రి. తల్లి దండ్రుల భిన్నమార్గాలు కుమారునిపై చాలా ప్రభావాన్ని చూపెట్టి వుండాలి. తండ్రిలేని సమయాల్లో తల్లిచేసే హైందవపూజలు, పాటించే ఆచారాలు గమనించాడు. రూపార్, లాహోర్, ఢిల్లీలో లాలాలజపతి చదువుసాగింది. లూధియానా మిషనరీ పాఠశాలలో కొన్నాళ్ళు క్రైస్తవ ప్రభావం చూచాడు. 1877 లో అంటే పన్నెండున్నర యేళ్ళకే వివాహమైంది. లాహోర్ లో లా చదువి జూనియర్ ప్లీడర్ అర్హతపొందాడు తల్లిదండ్రుల సంప్రదాయాలకు

భిన్నంగా లాహోర్ లో పండిత శివనారాయణ అగ్నిహోత్రి ప్రయత్నంవలన లజపతి బ్రహ్మసమాజ్ లో అయిష్టంగా సభ్యుడయ్యాడు. ఇంతపరకూ ఒకభాగం. లాహోర్ లో హంసిరాజ్, గురుదత్త విద్యార్థి, రాయ్‌శివనాథ్ అనే స్నేహితుల సాంగత్యంతో ఆర్యసమాజ్ కు సన్నిహితుడైన లజపతి తండ్రి భయంతో అంటీ అంటనట్లు ప్రవర్తించినా, మనస్సు దానిపై లగ్నంచేశాడు. లజపతి భావనలకు ప్రోదిచేసే హిందీ ఉరూ భాషావాదన 1882 లో రాగా, మతపరంగా చర్చ జరిగి, లజపతి హిందీపక్షం వహించాడు. అది అతని జాతీయతకు నాంది పలికింది. తొలిసారి వేదిక ఎక్కి వుపన్యాసం యిచ్చాడు. ఆర్యసమాజ్ లో సభ్యుడై ప్రధానపాత్ర వహిస్తూ, దయానంద పేర లాహోర్ లో ఒక కళాశాల స్థాపించటంలో కృషిచేశాడు 1885 లో. ఇది ఆర్యసమాజ్ ప్రచార సాధనంగా పనిచేసింది. ఆర్యసమాజ్ భావాలను విద్యారంగంలో ప్రవేశపెట్టాలనే ధోరణి ప్రబలంగా వున్న రోజులవి. దయానంద అనంతరం అచిరకాలంలోనే ఆహార నియమాదుల విషయమై కలహాలు రాగా, ఆర్యసమాజ్ చీలిపోయింది. లజపతి మాంసాహారి. తటస్థవై ఖరి అవలంబించి, చిన్నవిషయాలకు కలహాలు వద్దన్నాడు. హిస్సార్ లో లా' ప్రాక్టీసు చేస్తున్న లజపతి, లాహోర్ ప్రవాసంవెళ్ళి, పూర్తిగా రాజకీయాల్లో ప్రవేశించాడు.

సురేంద్రనాథ్ బెనర్జీ వుపన్యాసాలు, ఇటలీ నాయకుడు 'మజినీ' జీవితచరిత్రలతో వుత్తేజితుడై రాజకీయాల్లో ప్రవేశించిన లజపతి, మొదటినుండీ వుగ్రవాదే. జాతీయత అతిగా

వుండేది. ఆర్యసమాజ్ వలన ముస్లిం వ్యతిరేకత అంటింది. కాంగ్రెస్ సంస్థను వ్యతిరేకించినందుకు సర్ సయ్యద్ అహమ్మద్‌కు బహిరంగ లేఖలువ్రాసి మెప్పుపొందాడు. 1887 కాంగ్రెస్ సమావేశం మద్రాసులో జరిగినప్పుడు, మౌనంగా పాల్గొన్న లజపతి, సంవత్సరం తిరుగకపూర్వమే కాంగ్రెస్‌లో ముఖ్యపాత్ర వహించటానికి పూనుకున్నాడు. కాంగ్రెస్ పెద్దల ఆంగ్లేయ ధోరణిపై విరుచుకపడ్డాడు. ముస్లింలను దువ్వ ప్రయత్నించటం వృధా అంటూ ఆర్యసమాజ్ ధోరణి బయట పెట్టాడు. కాని క్రమేణా రాజకీయాలలో ఆసక్తిపోయి, కొన్నాళ్ళుపాటు స్తబ్ధతలో వున్నాడు (1893–1900). మజిని, శివాజి, దయానంద, గారిబాల్డి కృష్ణ చరిత్రలు వ్రాశాడు, రాజకీయాలలో అంతగా వుత్సాహంలేనిరోజుల్లో, ఈ రచనలబట్టి ఆయన జాతీయ, దేశభక్తి వుత్సాహం వెల్లడైంది. తరచు అనారోగ్యంతో బాధపడుతూ, పంజాబ్‌లో కరువు కాటకాలలో ఆర్యసమాజ్ పక్షాన ఎంతో సేవచేశాడు.

1900 లాహోర్ కాంగ్రెస్‌లో తీర్మాన ప్రతిపాదిస్తూ పారిశ్రామిక, విద్యావిషయాలు చర్చించటానికి ఒకపూట కేటాయించాలన్నాడు. పారిశ్రామిక సంఘసభ్యుడుగా, విద్యా సంఘ సభ్యుడుగా చర్చలలో వుత్సాహం చూపాడు. స్వదేశీ వాదన చేస్తూ స్వయంకృషి స్వశక్తిపై ఆధారపడటం అవసరమని లజపతి వాదించాడు కాంగ్రెస్ సంవత్సరాని కొకమారు జరిగే జాతర అన్నాడు. కీర్తికండూతితో కొందరు నాయకులు కూడటం తప్ప యింకేమి లేదన్నాడు. ఆడంబరాలను వెక్కిరించేవాడు. తీర్మానాలతో రాజకీయ సంస్కరణలు

సాధించామనే భ్రమలో కాంగ్రెస్ వ్యవహరిస్తున్నట్లు పేర్కొన్నాడు. రాజ్యాంగబద్ధమైన ఆందోళన గాక యింకా త్యాగాలకు సిద్ధపడాలన్నాడు. హిందూముస్లిం ఐక్యతా ప్రయత్నాన్ని వ్యతిరేకించాడు. కాంగ్రెస్ హిందూసంస్థగా వుండాలన్నాడు. *నేషనల్ సోషల్ కాన్ఫరెన్సునుకూడా యిలాంటి ప్రయత్నాలు చేసినందుకు దుయ్యబట్టాడు.

1901 లో కలకత్తా కాంగ్రెసు సమావేశం తన తీర్మానం అమలు పరచనందుకు ఆగ్రహించిన లజపతిరాయ్ కాంగ్రెస్‌లో అంతర్యుద్ధం కావాలన్నాడు. ఇండియసులంతా ఒకే భాష, ఒకే మతం, ఒకే చరిత్ర, ఒకే భవిష్యత్తును పంచుకోవాలంటూ షాసిస్టుధోరణి అవలంబించాడు.

ఇంగ్లండు ప్రజలకు భారతీయుల విషయమైనచ్చ చెప్పటానికి కాంగ్రెస్ పక్షంగా వెళ్ళినవారిలో లజపతికూడా వున్నాడు 1905 లో. హెన్రీ హిండ్‌మన్ నాయకత్వాన గల సోషల్ డెమొక్రటిక్ ఫెడరేషన్ సహాయం అర్థించాడు. ఆంగ్లేయుల జాతి అహంకారాన్ని గర్హిస్తూ లిబరల్స్ సభలలో వుపన్యాసాలిచ్చాడు. రెండునెలలపాటు అమెరికా వెళ్ళి ప్రచారంచేసి వచ్చాడు. ఆంగ్లేయులనుండి యెలాంటి సహాయమూ లభించదని తన పర్యటన అనుభవంగా లజపతి తెలుసుకున్నాడు. హిందువులను ముస్లింలను ఐక్యం కావలసిందంటూ పిలుపు

---

* Moderates and Extramists in the Indian Nationalist Movement, Daniel Argov, Asia, Bombay, 1967 (p. 88)

యిచ్చాడు. రక్తం చిందించాలన్నాడు. ఈ వుపన్యాస ఫలితంగా రెండేళ్ళ అనంతరం బ్రిటిష్‌వారు ఆయన్ను నిర్బంధించారు. ప్రిన్స్ ఆఫ్ వేల్స్‌కు స్వాగతం పలకాలనే కాంగ్రెస్ తీర్మానాన్ని 1905 బెనారెస్‌లో వ్యతిరేకించి, కలహం రాకుండా వుండేందుకు- తీర్మాన సమయంలో గైరుహాజరయ్యాడు. బెంగాల్ విభజనను విదేశీవస్తు బహిష్కరణోద్యమంగా మార్చాలని లజపతి విజ్ఞప్తి చేశాడు. కాంగ్రెస్‌లో వుగ్రవాదులుగా, జాతీయ వాదులుగా చలామణి అవుతున్న వారిలో లజపతి ప్రముఖుడు. 1906 లో అతివాదుల అభ్యర్థిగా కాంగ్రెస్ అధ్యక్షస్థానానికి దాదాభాయితో పోటీచేశాడు.

భారతదేశపు నూతనమతంగా స్వదేశీ వుద్యమం, విదేశీ వస్తు బహిష్కరణ జరగాలని లజపతి బోధించాడు. విదేశీయుల పాలనక్రింద వున్నవారిని దేశభక్తులుగా వుండమనటం అర్థరహితమన్నాడు. రాజు వుత్సవాలను జరపటం గర్హించాడు. జాతివిముక్తికి భయంకర వుగ్రహింసాచర్యల్ని సమర్థించాడు. లజపతిని ప్రమాదకర నాయకునిగా బ్రిటిష్ ప్రభుత్వం గుర్తించింది. 1907 లో లజపతిరాయ్ అరెస్టుఆయి, విడుదల చేయబడ్డాడు. సూరత్ కాంగ్రెసులో ఆయన పేరు అధ్యక్ష స్థానానికి ప్రతిపాదించబడింది. కాని సంస్థ చీలటానికి సాధనగా వుపయోగపడటంలో యిష్టంలేక లజపతి నిరాకరించాడు. అతివాదుల్ని సంస్థనుండి తొలగించవద్దని మితవాదులకు విజ్ఞప్తి చేశాడు.

1908 నుండీ 1914 వరకూ లజపతిరాయ్ అతివాద రాజకీయాలకు స్వస్తిచెప్పి, కరువు నివారణ, అంటరానితనం

నిర్మూలన, హిందూముస్లిం కలహాల విషయంలో కృషి సాగించాడు. ఉగ్రవాదం పనిచేయదని అప్పటికే ఆయన గ్రహించాడు. గతాన్ని తిరగదోడటంలోగాని, కేవలం పాశ్చాత్య లోకాన్ని అనుసరించటంలోగాని భారతదేశానికి భవిష్యత్తు లేదంటూ అంటరానితనం పాటించినంతకాలం, దేశంలో ఐక్యత అసాధ్యమన్నాడు. క్రైస్తవులుగా మారటానికి హిందువుల దురాచారమైన అంటరానితనం ఒక ప్రబలకారణమని గ్రహించాడు. ప్రజలను అజ్ఞానంనుండి కాపాడటానికి విద్య ఒక్కటే శరణ్యమన్నాడు.

హిందూముస్లిం సంబంధాల విషయంలో లజపతి తరచు తన భావాలు వ్యక్తపరుస్తుండేవాడు. ఐక్యత కావాలని అప్పుడప్పుడు అంటున్నా, మొత్తంమీద ముస్లిం వ్యతిరేకత హెచ్చుగా చూపెట్టేవాడు. ముస్లింలకు ప్రత్యేక ఎన్నిక స్థానాలు కేటాయించినప్పుడు (1909) హిందువులకు కూడా పంజాబ్‌లో అలాంటి యేర్పాటు అడిగాడు. ఆంగ్లేయులు యిరువురికీ శత్రువులు గనుక, హిందూముస్లింలు ఐక్యంకావాలంటూ, హిందువుల సభలలో మాత్రం యీనినాదం వదలేయమని సలహాయిచ్చేవాడు. హిందూప్రాథమిక విద్యాలీగ్‌ను యేర్పరచటమేగాక, ఉర్దూ సాహిత్యాన్ని బహిష్కరించమని సంకుచితంగా సలహా యిచ్చాడు 1911 లో.

---

1. Modern Review 1909 July p. 4. "The Depressed classes".
2 Indian Review 1909 Dec. p. 932

ఇంగ్లండ్‌లో కొంతకాలం వుండివద్దామని 1914 లో వెళ్ళిన లజపతిని ఆరు సంవత్సరాలవరకు బ్రిటిష్ ప్రభుత్వం రానివ్వనందున అమెరికా వెళ్ళి యధాశక్తి ప్రచారం చేశాడు. 1914 లో కాంగ్రెస్ అధ్యక్షస్థానానికి ఆయనపేరు ప్రతిపాదించబడగా, తానికా కాంగ్రెస్ వారితో కలియలేక పోతున్నాను గనుక ప్రతిపాదన నిరాకరిస్తున్నానన్నాడు. ఆయన పేరును మస్లిం ప్రతినిధులు వ్యతిరేకించారు. విదేశాల్లో వున్నాడు గనుక ఆ ప్రతిపాదన విరమించారు.

మొదటి ప్రపంచయుద్ధంలో బ్రిటన్‌ను సమర్థించ కూడదన్నాడు. లజపతి. హింసాచర్యల్ని ఆఫీసర్లపై కాంబులు వేయటాన్ని సమర్థించాడు. రహస్య సంఘాలకు డబ్బు లేనందుకు విచారించాడు. న్యూయార్క్‌లో జర్మనీ అనుకూల భారత విప్లవకారులతో చేరటానికి నిరాకరించాడు లజపతి రాయ్. జర్మనీ సహాయం స్వీకరించటానికి నిరాకరించాడు. ఒక విదేశపాలన పోగొట్టటానికి మరొక విదేశసహాయం స్వీకరించటంలోగల లోపాన్ని గ్రహించాడు రాయ్. అమెరికాలోని భారత విప్లవకారులు డబ్బు, లాభనష్టాలు బేరీజువేస్తారని, విలాసపరులని, ఎం. ఎన్. రాయ్ మాత్రం అందుకు మినహాయింపు అని, అందువలన అతనిపై తనకు గౌరవం వున్నదని వ్రాశాడు * యుద్ధానంతరం దేశంలో రక్తపాతంజరిగి, 1857 విప్లవం పూర్తిగావించబడుతుందని ఆశించాడు. అతివాద మితవాద కాంగ్రెస్ పక్షాలు రెండూ బ్రిటిష్ ప్రభుత్వం పోవాలనుకోటంలేదని విమర్శించాడు.

---

* Autobiographical Writings (Ed.) Vijayachandra Joshi, Lajpat Rai, University Publishers, Delhi, 1965. p. 218

1920 ఫిబ్రవరిలో భారతదేశానికి తిరిగి వచ్చిన లజపతి కలకత్తా కాంగ్రెస్ ప్రత్యేక సమావేశానికి అధ్యక్షుడయ్యాడు. హోంరూల్ లీగ్‌ను సమర్థిస్తూ, మాంటేగ్ - ఛెంస్ఫర్డ్ సంస్కరణల్ని బలపరచినందుకు కాంగ్రెస్‌ను విమర్శించాడు. క్రమేణా లజపతిరాయ్ అభిప్రాయాలు మార్చుకుంటూ, సైనిక విప్లవ పోరాటానికి భారతీయులు పరిపక్వదశకు రాలేదని, హింస పనికిరాదని, గాంధినాయకత్వాన్ని అనుసరించమని సలహా యిచ్చాడు * గతంనుండి వేర్పిరణపొంది, హిందువులు ముస్లింలు ఐక్యత కావాలన్నాడు మరలా. ఉర్దూభాషపై ద్వేషాన్ని ఆపి, హిందీవాదన మాని, హిందూస్తాని కావాలని కొత్తవాదన చేశాడు. కలకత్తా కాంగ్రెస్‌లో గాంధి సహాయ నిరాకరణ వుద్యమవాదనపట్ల హెచ్చరిక చేస్తూ, ప్రభుత్వాన్ని స్థంభింపజేయటంలో అది తోడ్పడక పోవచ్చు అన్నాడు. గాంధికి వ్యతిరేకంగా సి. ఆర్. దాస్, మదనమోహన్ మాలావీయాతో కలసి వ్యతిరేకపక్షం స్థాపించాలనే ప్రయత్నం నాగపూర్ కాంగ్రెస్‌లో చేశాడు. సహాయ నిరాకరణ వుద్యమాన్ని సమర్థించాడు. 1922 లో జైలుకుపోయి 1923 లో విడుదలయ్యాడు. సహాయ నిరాకరణోద్యమం విఫలమైనందుకు గాంధిని విమర్శిస్తూ, హిందూ–ముస్లిం ఐక్యత సమస్యలలో కూరుకపోయాడని గాంధిని దుయ్యబట్టాడు. ముస్లింలకు హెచ్చు సౌకర్యాలు రావటాన్ని విమర్శించాడు 1925 లో. వీర హైందవతత్వాన్ని అవలంబించాడు అప్పటినుండి, కేంద్ర

---

* A Collection of Lajpat Rai Writings 'India's will to Freedom" Madras 1921. pp. 59–60

శాసనసభకు 1926 లో ఎన్నికై, స్వరాజ్యపార్టీలో వుపనాయకుడుగా చేరి యిమడలేక, మదనమోహన మాలవీయాతో కలసి స్వతంత్రపార్టీ (ఇండిపెండెంట్) స్థాపించి, ముస్లిం సభ్యులను వ్యతిరేకిస్తూ వచ్చాడు. ఖిలాఫత్ వుద్యమంవలన ముస్లిం లలో సంకుచిత తత్త్వం ప్రబలిందన్నాడు. పంజాబ్‌ను విభజించి, హిందూముస్లింలకు పంచాలన్నాడు. దేశంలో ముస్లింలు అధికంగావున్న రాష్ట్రాలలో యిలాగే విభజన జరగాలన్నాడు. ఆయితే దేశంమాత్రం ఒకటిగానే వుండాలని ఆశించాడు. వాదనలో దూరపుచూపు లేనందున అలా చెప్పాడు లజపతి రాయ్. అయితే హిందూరాజ్, ముస్లింరాజ్‌ను వ్యతిరేకిస్తూ, ప్రజాస్వామిక రాజ్యం కావాలనటం విశేషం.*

సైమన్ కమిషన్ రాకకు వ్యతిరేకంగా లాహోర్‌లో జరిగిన నిరసన వూరేగింపులో లాఠీదెబ్బలు తిని 1928 నవంబరు 17 న లజపతిరాయ్ చనిపోయాడు. ప్రజాస్వామ్య భారత దేశం కాంక్షిస్తూ స్వాతంత్ర్యానికి ప్రాణాలర్పించిన లజపతి రాయ్ గొప్ప ధైర్యసాహసాలు గలవాడు. విశేషంగా గ్రంథ రచన చేశాడు. ఉద్రేకంవలన వాదనలలో పొందిక లోపించినా చిత్తశుద్ధిగల ఆర్యసమాజ్ వాదిగా ఆదర్శాలు నిలబడిన నాయకుడు.

లజపతిరాయ్ భావాలు

ఆర్యసమాజ్ ఆశయాలే లజపతిరాయ్ భావాలు. విగిలిన విషయాలలో, కొన్ని సొంత అభిప్రాయాలున్నవి.

---

* Modern Review, p. 741, December 1928.

అందులో జాతీయవాదం ముఖ్యం. బ్రిటిష్‌వారు భారతదేశాన్ని గెలవటంలో అధర్మసూత్రాలు అవలంబించారు. 1857 సిపాయి తిరుగుబాటు జాతీయతకు పరాకాష్ఠ. అశువులు బాసిన వీరులు జాతీయతకు బాటలు వేశారు. కనుక జాతీయ పోరాటాన్ని అణచప్రయత్నిస్తే యింకా విజృంభిస్తుంది. భారతదేశానికి హోంరూల్ రాజకీయ పరిష్కారంగా ఆయన భావించాడు. ఆర్థికంగా భారతీయులు పీల్చి పిప్పిచేయబడుతున్నారని బాధపడ్డాడు.

జాతి అత్యున్నతమైనదంటూ, రాజ్యంకూడా జాతికి లొంగుబాటేనన్నాడు. లజపతిరాయ్‌లో అప్పుడప్పుడూ సామ్యవాద ఆశయాలు తొంగిచూచాయి. 1920 లో భారత కార్మిక సంఘాధ్యక్షుడుగా కార్మికులలో ఐక్యత, యజమానితో సహకరించి పనిచేయవలసిన అగత్యం, ఆర్థిక రాజకీయ హక్కులు గుర్తించవలసిన అవసరం వేరొక్కన్నాడు. కమ్యూనిజం (బోల్షివిజం) దేశంలో రాకుండా వుండాలంటే ఆర్థికరంగంలో దోపిడీపద్ధతి అరికట్టాలన్నాడు. బీదరికాన్ని కమ్యూనిస్టులు తమపార్టీ ప్రయోజనాలకు వినియోగించుకునే ప్రమాదాన్ని 1920 లోనే లజపతి గ్రహించి హెచ్చరించటం విశేషం.

REFERENCE BOOKS

1. **Lajpat Rai** Autobiographical Writings (Ed.) Vijayachandra Joshi, University Publishers, Delhi, 1965.

2. **Daniel Argov** Moderates and Extramists in the Indian Nationalist Movement 1883–1920 Asia, Bombay 1967.

3. **Lala Lajpat Rai** India's Will to Freedom 1921 Ganesh & Co. Madras.

4. **Lala Lajpat Rai** The Call to Young India 1921 Ganesh & Co. Madras.

5. **Lajpat Rai** A History of the Arya Samaj 1967 Longmans, London (Ed. Ram Sharma).

మహమ్మద్ ఇక్బాల్

కవిత్వంనుండి రాజకీయాల్లోకి ప్రవేశించి, పాకిస్తాన్ భావాన్ని ఎందించి, చివరకు తత్త్వవేత్తగా మిగిలిన ఇక్బాల్ ప్రాయికంగా భారతీయ కవి.

1877 లో ఒక మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన (సియాల్‌కోట) ఇక్బాల్ చిన్నప్పటినుండీ చురుకైన విద్యార్థిగా స్కాటిష్‌మిషన్ పాఠశాలలలో చదివి, తర్వాత ఎం. ఎ. పూర్తిచేశాడు. లాహోర్ ప్రభుత్వ కళాశాలలో చరిత్ర, తత్త్వం లెక్చరర్ గాచేరి, క్రమేణా ఆంగ్లం, తత్త్వంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా స్థాయి పెంచుకున్నాడు. చదువుకునే రోజుల్లో సయ్యద్ మీర్ హసన్, ఆర్నాల్డ్ ప్రభావం ఇతనిపై బాగా వుండేది. అన్న సహాయంతో ఇంగ్లండ్ వెళ్ళి మూడేళ్ళ పాటు కేంబ్రిడ్జ్‌లో విద్యాభ్యాసం చేశాడు. అక్కడ మెక్టాగర్ట్, వార్డ్‌ల తత్త్వంచే ప్రభావితుడయ్యాడు. జర్మనీ వెళ్ళి మ్యూనిచ్ విశ్వవిద్యాలయంలో పర్షియన్ ధ్యాన తత్త్వంపై పి హెచ్. డి పట్టా స్వీకరించి, లండన్‌లో లా చదివాడు. అక్కడే విశ్వవిద్యాలయంలో ఆరబిక్ భాషాచార్యుడుగా కొంతకాలం పనిచేసి, 1908 లో స్వదేశానికి వచ్చి ప్రాక్టీసు ప్రారంభించాడు.

అప్పటికే ఇక్బాల్ కవితారచన చేస్తుండేవాడు. 1901 నుండి 1905 వరకు ఆయన కవిత ఊహా జగత్తులో,

ప్రకృతి రామణీయకతపై, ప్రేమగురించి వుండేది. పిమ్మట 1908 వరకు సొంత ఆలోచనలు భావాలు ఎక్కువగా కవితలో ద్యోతకమయ్యేవి. ఉర్దూ, పర్షియన్ భాషల్లో కవిత్వం ప్రాసేవాడు. ఆయన కవితా రచనలలో యీ అవృత్తం భిన్నరీతుల్లో వుండేది. ముస్లింల పతనావస్థ మళ్ళీ ఔన్నత్యం పొందాలనే కాంక్ష, హిమాలయ పర్వత సౌందర్యం. భారతదేశ సమైక్యత, తత్త్వం, ప్రజాస్వామ్యంపై అపనమ్మకం, ఆత్మవికాసంపై నొక్కు, హిందూ - ముస్లిం ఐక్యత మొదలైన వెన్నో స్వీకరించాడు.

1908 నుండీ 1938 లో చనిపోయేవరకు కవితా రచనలు చేస్తూనే, మధ్య మధ్యలో రాజకీయాల్లోకి తొంగిచూచాడు.

1922 లో బ్రిటిష్ ప్రభుత్వం ఇక్బాల్‌కు నైట్‌హుడ్ యిచ్చి సత్కరించింది. 1926 లో శాసనసభ్యుడయ్యాడు. 1928-29 లో ఇస్లాంపై మద్రాసులో ఉపన్యాసాలిచ్చాడు. 1930 లో ముస్లింలీగ్ అధ్యక్షుడుగా తొలిసారి పాకిస్తాన్ భావాన్ని వెల్లడించాడు. లండన్‌లో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ముస్లిం ప్రతినిధిగా పాల్గొన్నాడు. 1938 లో మరణించాడు.

ఇక్బాల్ రాజకీయ జీవితం యేమంత ప్రధానంకాదు. రాజకీయాలలోతుపాతులు తెలుసుకొని ఆయన రంగంలో ప్రవేశించలేదు కూడా. 1932 లో ముస్సొలినీని సందర్శించి ఆకర్షితుడై అతన్ని, హిట్లర్‌ను శ్లాఘించాడు, సోషలిజాన్ని

మార్క్సును, సోవియట్ యూనియన్‌ను పొగిడాడు. టర్కీకి అనుకూలంగా బ్రిటన్‌కు వ్యతిరేకంగా మాట్లాడాడు. సామ్రాజ్యవాదాన్ని ఖండిస్తూ, ప్రజాస్వామ్యంలో పెట్టుబడిదోపిడీని గర్హించాడు. ఇస్లాంసోషలిజాన్ని వాంఛిస్తుందన్నాడు. వ్యక్తి దైవంగా మారటం ఆదర్శం అన్నాడు. నేటి మానవుని కన్నా బలశాలి, ధీశాలి అయిన అతిమానవుడు ఆవిర్భవించాలంటూ, అందుకు ఆచరణ ముఖ్యమన్నాడు. ప్రాచ్యుల జడత్వాల్ని, పాశ్చాత్యుల వుద్వేగాన్ని యీసడించాడు అనుకరణ కూడదన్నాడు. సోవియట్ రష్యాలో జరిగేది దైవేచ్ఛ అన్నాడు.

ఇంతటి పరస్పర భావాలు వెల్లడించటానికి కారణం ఆయన అపకృతే. పైగా వీటిలో బాగా పరిజ్ఞానం వున్నవాడు కూడా కాదు. కనుక ఆ విషయాలు యింతటితో వదలేసి ఆయన తత్త్వం పరిశీలించటం వుచితం.

ఇక్బాల్ తత్త్వం

ఇక్బాల్ తత్త్వంలో ఆత్మ లేక జీవి ప్రధానస్థానం ఆక్రమిస్తాడు. దానిచుట్టూ మిగిలిన సిద్ధాంతం అల్లాడు. జీవితం కేవలం ధ్యానమయం మాత్రమేకాదు ఇస్లాం దృష్ట్యా జీవితం అనుభవించదగినది. కనుక అలాంటి జీవితానికి వుపకరించే చైతన్య, సృజనాత్మక, ఆధునిక నైతిక సంపద అవసరం. మానవుడు దైవప్రతినిధిగాని, భానిస కాడు. మానవునిలో దైవం వున్నది. జీవితం మతం. ప్రపంచం మసీదు. సంపూర్ణ జీవనం మానవధ్యేయం. దైవేతరంగా దేనికీమానవుడు భయపడ

నక్కరలేదు. పారమార్థికమనీ, అలౌకికమనీ మానవునికిదై వాన్ని దూరంచేసే విధానాలు గర్హనీయమైనవి. దై వాన్ని సాధించుకుంటూనే వ్యక్తి త్వాన్ని అట్టిపెట్టుకోవచ్చు.

ఇక్బాల్ తత్త్వం జీవితానికి ఆదర్శాలు, లక్ష్యాలు చూపింది పై విధంగా, జీవి తన చై తన్యావస్థనే ప్రపంచంలో జొప్పిస్తాడు. ఆద్యంతాలు చై తన్యావస్థ వుందంటూ ఇక్బాల్ కాలం గురించి కొంత చర్చ చేశాడు. కాలం అంటే వాస్తవికత అన్నాడు. కార్యకారణ పద్ధతిలో కాలం యిమడదన్నాడు. వరుసక్రమాన్ని కాలంగా భావించటం పొరపాటన్నాడు. కాలంలో స్వేచ్ఛగా జరిగేసృష్టి జీవితమంటే వాస్తవికతలో అనుక్షణము అనూహ్యమైన కొత్తసత్యాలు సృష్టింపబడుతుంటయ్. జరిగే సృష్టి అంతా ప్రయోజకరమైనదే, భవిష్యత్తు వైపుకు పురోగమించేది.

ఇలా తాత్త్విక విషయాలు చెప్పటంలో ఇక్బాల్‌పై కొంత బెర్గ్‌సన్, నిషిల ప్రభావంవున్నా కొత్తఆలోచనలు చేశాడు కూడా. కాని ఆధునిక సాపేక్షతా సిద్ధాంత విషయాలుగాని, ఇతర విజ్ఞాన శాస్త్రీయ పరిశోధనా ఫలితాలు గాని ఆయన గ్రహించలేదు.

తాత్త్వికరంగంలో ఇక్బాల్ నిలబడటం కష్టం, కవిగా ఆయన ప్రాధాన్యత చిరకాలం వుండొచ్చు. భారతదేశంలో ఠా గోర్ తర్వాత కవిత్వంతో ఎందరినో ఆకర్షించి, భారత దేశాన్ని పాశ్చాత్యలోకానికి పరిచయం చేసిన ప్రముఖుడుగా ఇక్బాల్‌ను పేర్కొనవచ్చు.

REFERENCE BOOKS

1. **Iqbal** Reconstruction of Philosophy in Islam

2. **Iqbal** Eminent Mussalmans
G. A. Natesan & Co Madras-1926

3. **Mir Valiuddin** The Quranic Sufism
Motilal Banarsidass, Delhi 1959

సుభాస్ చంద్రబోసు

యోగాభ్యాసంలో విఫలుడై, దేశభక్తిలో ఫాసిస్టు ప్రమాదాన్ని సైతం గమనించక జీవితాన్ని అతివాదానికి అంకితం చేసిన సుభాస్ చంద్రబోసు భారతీయులలో చాలామందికి ఆకర్షణీయమైన నాయకుడు.

జానకీనాథ్, ప్రభావతి దంపతులకు తొమ్మిదవ సంతానంగా 1897 జనవరి 23 న కటక్‌లో జన్మించిన సుభాస్ తల్లిదండ్రులనుండి తొలిసంతానం పొందవలసిన ఆప్యాయతల్ని కోల్పోయాడు, బాప్టిస్ట్ మిషన్ వారి ప్రొటెస్టెంట్ పాఠశాలలో ప్రాథమిక విద్యాభ్యాసం చేస్తూ ఆంగ్లభాలురతో పరిచయం పొందాడు. చదువులో రాణించినా, ఆటల్లో 'వెనుకబడిన' జాతివాడే. ఈ పాఠశాలలోవున్న ఏడేళ్ళలో ఆంగ్ల విద్యాప్రభావం అంతంత మాత్రంగానే నిలచింది. పైగా ఆంగ్లేయులపై ఒకవిధమైన అసూయ, ద్వేషం అంకురించాయి. గృహాంలో అంతగా ఆప్యాయత లేకపోవటం, పాఠశాలలో కృత్రిమ వాతావరణం, ఆటలో ఆసక్తి కొరవడటం వీటన్నిటి వలన ఒక పూత కావలసివచ్చింది సుభాస్‌కు. యాదృచ్ఛికంగా వివేకానంద రచనలు లభించిగా చదివి, ఆకర్షితుడై ఆసక్తి పెంచుకొని, లోతుకు వెళ్ళాడు. వివేకానందుని వుద్వేగం సుభాస్ వుద్రేకానికి సరిపడింది. దానితో ఆచరణకు వుపక్రమించి యోగాభ్యాసం ఆరంభించాడు. తల్లిదండ్రుల పాదా

లకు రోజూ నమస్కరించటం మొదలుపెడితే వారికీ ఆశ్చర్యం వేసింది. ఇదంతా యెందుకు చేసాడంటే, సుభాస్‌లో విపరీత కామప్రవృత్తి మళ్ళించటానికని ఆయన రచనలే చెబుతవి.*

కటక్‌లో వుండగా బోసు యోగాభ్యాసం, ఆధ్యాత్మికలో చూపిన ఆసక్తి రాజకీయాలో కనబరచలేదు. ఒకవిధంగా సమకాలీన పరిస్థితుల్లో వెనుకబడి వుండేవాడు కూడా. 1912 లో ఒక విద్యార్థి చే తన్మయపూరితమైన వుపన్యాసం విని వుత్తేజితుడయ్యాడు. బాంబులు వేయటం, అతివాదుల చర్యలు మొదలైనవన్నీ లీలగా వింటుండేవాడు. మనసు యోగాభ్యాసంపై లగ్నం చేయటానికి కృతనిశ్చయమైన వయస్సు అది. 1913 లో మెట్రిక్ వుత్తీర్ణుడై కలకత్తాలో వున్నతవిద్యకై పంపబడ్డాడు. అప్పటికి యింకా ఆధ్యాత్మిక చింతన వదలలేదు. కామం అణచుకుంటేగాని ముక్తి లేదని గట్టిగా నమ్మాడు. కనుక దృష్టి ఎప్పుడూ కామం ఎలా అణచటమా అనే. ప్రెసిడెన్సీ కళాశాలలో చేరాడు. అక్కడ వివేకానంద భావాలుగల మఠాతో చేరాడు. సాంఘికసేవ చేయాలని సంకల్పించి, యథాశక్తి అవకాశం వచ్చినప్పుడు చేస్తుండేవారు. 1914 వేసవి సెలవులలో ఒక గురువు కావాలని అన్వేషిస్తూ ఉత్తర హిందూదేశం, హిమాలయాలు పర్యటించి విఫలుడై తిరిగి వచ్చాడు.

కలకత్తాలో బ్రిటిష్‌పౌరుల ప్రవర్తనవలన వారిపట్ల జుగుప్స, కోపం పెరిగినయ్ బోసుకు. రైళ్ళలో, కార్లలో,

---

* Subhas Chandra Bose, an Indian Pilgrim P 48
Asia Publishing House Newyark 1965

ట్రాంలో భారతీయులపట్ల బ్రిటిష్‌వారి ప్రవర్తన అతన్ని వుడు కెత్తించినవి. ఇవన్నీ బాగా వుత్తరోత్తరా బ్రిటిష్‌వారిపై తిరగబడటానికి పునాదులుగా వుపకరించాయి. 1915 లో ఇంటర్మీడియేట్ ఉత్తర్ణుడై తత్త్వశాస్త్రం చదవటానికి ఆనర్స్‌లో ప్రవేశించాడు. అప్పుడే తొలిగా వ్యాసరచన చేశాడు. ఒకసమ్మెలో పాల్గొన్న కారణంగా కళాశాలనుండి బహిష్కరించబడ్డాడు. 1917 జులై లో మరలా చేరేవరకూ సాంఘిక సేవలో కాలక్షేపం చేశాడు.

ఆటలో ఆసక్తిలేని లోటు తీర్చుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసేందుకు బోసు ప్రాంతీయ సైనికదళంలో చేరి కొద్దికాలంపాటు రైఫిల్ శిక్షణపొంది, యోగాభ్యాసానికి మించిన వుత్తేజం పొందాడు. ఇది బహుళ బోసు సైనిక మనస్తత్వానికి నాంది అనొచ్చు. 1919 లో బి ఎ. ఉత్తీర్ణుడై, ఎం. ఎ లో చేరి మనస్తత్వశాస్త్రం చదువుదా మనకుంటుండగా ఇంగ్లండ్ వెళ్లే అవకాశం లభించింది. కేంబ్రిడ్జ్‌లో చేరాడు. భారతదేశపు పరిస్థితులకు యింగ్లండ్‌లో లిబరల్ ధోరణికగల తేడా చదువులో గమనించి, ఆనందించాడు. నమ్మకం లేదనుకున్న ఐ. సి. ఎస్ లో ఉత్తీర్ణుడయ్యాడు. కాని వుద్యోగం చేయటానికి విముఖతచూపి, దేశస్వాతంత్ర్యానికై దీక్ష బూనటం విశేషం.

ఇంగ్లండ్‌లో వుండగా బోసు తాత్వికభావాలలో చాలా మార్పు వచ్చింది. శంకరాద్వైతంలో నమ్మకం పడలింది. సాధించలేనిది వదలేయాలనే ధోరణి అవలంబించాడు ఆధ్యాత్మికతలో ప్రేమ ముఖ్యమని గ్రహించాడు.

ఇంగ్లండ్‌లో వుండగా బోసు తాత్త్విక భావాలలో చాలా మార్పువచ్చింది. శంకరాద్వైతంలో నమ్మకం సడలింది. సాధించలేనిది వదలేయాలనే ధోరణి అవలంబించాడు. ఆధ్యాత్మికతలో ప్రేమ ముఖ్యమని గ్రహించాడు.

1921 లో బోసు స్వదేశానికి తిరిగి వచ్చాడు. గాంధీతో భేటీ వేశాడు. అసంతృప్తి చెందాడు. గాంధిలో మానసిక స్పష్టత లోపించిందనుకున్నాడు సహాయ నిరాకరణోద్యమాన్ని విరమించిన గాంధీని నిరసించాడు. అలాంటి సమయంలో చిత్తరంజన్ దాసుతో పరిచయం యేర్పడమేగాక, ఆయనకు సన్నిహితుడై, భావాలపట్ల ఆకర్షితుడై, తనకు తగిన నాయకుడు లభించినట్లు తృప్తి చెందాడు. కాని 1925 లోనే సి. ఆర్. దాసు చనిపోవటంతో బోసుకు ఆధారంపోయి, స్వశక్తిపై నిలబడవలసివచ్చింది. బ్రిటిష్‌వారికి బద్ధవ్యతిరేకిగా అతివాదిగా రూపొందిన బోసు, గాంధేయ పథాన్నెగాక, అరవిందుని పుదుచ్చేరి ఆశ్రమ విధానాలను సైతం తీవ్రంగా విమర్శించాడు. కార్యాచరణ లోపించిదన్నాడు. అహింస కేవలం ఒక మార్గంగా చూడాలేగాని, అదొక్కటే శరణ్యంగా భావించరాదని బోసు వుద్దేశం.

1929 లో బోసు ఒకతీర్మానం ప్రతిపాదిస్తూ, కాంగ్రెసు కేవలం స్వాతంత్ర్య తీర్మానాలుచేసి ప్రయోజనంలేదని, లక్ష్యసాధనకై బ్రిటిష్ ప్రభుత్వానికి ప్రత్యామ్నాయంగా దేశీయ ప్రభుత్వాలు స్థాపించాలన్నాడు. ఆయన తీర్మానం ఓడిపోయింది. గాంధి ఆగ్రహానికి గురైన బోసుకు కాంగ్రెసు కార్యవర్గంలో స్థానంకూడా లేదు. అప్పుడే కాంగ్రెస్ డెమొక్ర

టిక్ పార్టీ స్థాపించాడు గాని, కొద్దిరోజులకే జైలుకు వెళ్ళటంతో అది కాస్తా పోయింది. అనారోగ్యంగా వున్న బోసు విశ్రాంతికై వియన్నా వెళ్ళి, మిమి షెంకెర్‌తో పరిచయం యేర్పరచుకున్నాడు, ఆమెను ప్రేమించాడు. ఈవిషయం రహస్యంగానే వుంచాడు. తర్వాత జైల్లోనుండి పారిపోయి జర్మనీ వచ్చినప్పుడు ఆమెను వివాహం చేసుకున్నాడు. వియన్నాలో వుండగా సహాయ నిరాకరణోద్యమాన్ని మరొక మారు గాంధి విరమింప జేశాడని విని, గాంధి నాయకత్వం పోవాలన్నాడు. సైనికచర్యలు అవలంబించాలన్నాడు. గాంధి జాతీయ నాయకుడుగా, ప్రపంచ బోధకుడుగా ద్విపాత్ర వహించటంతో చిక్కు వస్తున్నదని ప్రాశాడు. *దేశానికి తిరిగి వచ్చిన బోసు 1938 లో కాంగ్రెసు అధ్యక్షుడుగా ఎన్ని కయ్యాడు. వామపక్షాల ఐక్యత జరుగుతుందని భావించారు గాని అదేమి ఫలించలేదు. 1939 లో మళ్ళీ బోసు పోటిచేసి, గాంధి అభ్యర్థి పట్టాభి సీతారామయ్యను ఓడించాడు. కాని కాంగ్రెసును వదలిపోటానికి గాంధీ సిద్ధపడగా, భయపడిన బోసు, తానే రాజీనామాయిచ్చి, ఫార్వర్డ్ బ్లాక్ స్థాపించాడు. గాంధిమాత్రం ఒకవైపు బోసు నాయకత్వాన్ని వ్యతిరేకిస్తూనే, మరొకప్రక్క బోసు గుణగణాలను శ్లాఘిస్తుండే వాడు. కాంగ్రెసులోని పులుముడువాదాన్ని తొలగించి, వామపక్షాలన్నిటినీ కూడగట్టాలని బోసు సంకల్పించాడు ఫార్వర్డ్ బ్లాక్ ద్వారా. అదొక చారిత్రక సంఘటనగా భావించి, దినదినాభివృద్ధి చెందుతుందని ఆశించాడు. కాని అదంతా నిరాశే

---

* Indian Struggle P P 229-30

అయింది. ఫాసిస్టు వ్యవస్థగా ఫార్వర్డ్‌బ్లాక్ రూపొందుతుందనే విమర్శలను బోసు తీవ్రంగా గర్హించాడు.

రెండవ ప్రపంచయుద్ధం భారతదేశానికి స్వర్ణయుగంగా భావించిన బోసు (బ్రిటిష్‌వారి ఆగ్రహానికి గురై, జైల్లో పడ్డాడు. అనారోగ్యంవలన ఆయన స్వగృహంలోనే నిర్బంధించగా (1940 డిసెంబరు) తప్పించుకొని (1941 జనవరి 27) మారువేషాల్లో కాబూల్ వెళ్ళి రష్యా వర్తమానాలకు ఎదురు చూచి నిరాశచెంది, బెర్లిన్ చేరుకున్నాడు. ఇంచుమించు ఒక సంవతర్సరంపాటు బోసు బెర్లిన్ నివాసం రహస్యంగానే వుంచారు. బెర్లిన్‌లో రాయబారి హోదా గౌరవం లభించిన బోసు ఫ్రీయిండియా కమిటీ స్థాపించాడు. జర్మనీ ఆక్రమిత ప్రాంతంలోని భారత సైనికులతో ఒక దళాన్ని తయారు చేయాలని బోసు ఉవ్విళ్ళూరాడు. ఆజాద్ హింద్ రేడియో స్థాపించి ఇండియాకు ప్రసారం ప్రారంభించాడు. భారత సైనికులలో కదలిక తెచ్చి, బ్రిటిష్‌వారిని కలవర పెట్టాడు. 1942 ఫిబ్రవరి 27 న ప్రారంభించిన బోసు ప్రసారాలు చాలా గందరగోళం తెచ్చిపెట్టాయి బ్రిటిష్‌వారికి. హిట్లర్‌కు సన్నిహితుడైన బోసు జర్మనీసైనిక శిక్షణ పొందాడు. *భారత సైనికదళం ప్రారంభించాలని, ఖైదీలుగా పట్టుబడి ఆక్సిస్ యాకు తీసుకరాబడిన 17 వేలమంది భారత సైనికులను కలసి, వారికి వుపన్యాసాలు యిచ్చాడు. హిట్లర్ శత్రువుకాదనీ, మిత్రులుగా పోరాడుదామని చెప్పాడు. అయినా శివవంతు మాత్రమే బోసు సైన్యంలో చేరటానికి సంసిద్ధతచూపారు.

* The Ochere Robe P P 50

బోసు సైన్యంలో చేరినవారికి సౌకర్యాల ఆశ చూపినా, చివరకు 3 వేలమందే వచ్చారు. 14 వేలమంది ఖైదీలుగా వుండటానికి నిశ్చయించుకున్నారు. బోసు సైన్యంగా చేరినవారు వంటవాళ్లు, డ్రైవర్లు, కూలిపని చేసేవారే. కనీసం ఒక్క కమిషన్డ్ ఆఫీసరైనా చేరలేదు. చేరినవారితోనే బోసు సైనిక చర్యలు ప్రారంభించాడు. కాని భారతీయ సైనికులను జర్మన్ సైనికులు వేరుగా చూడటమేగాక, అవమానించేవారుకూడా. 1943 లో ఏమైందో తెలియదుగాని బోసు జర్మనీ వదలి సబ్‌మేరిన్‌లో సింగపూర్ వెళ్ళాడు. అంతకు పూర్వం 1942 లో ఫ్రాలన్ ఎమిలి షెంకిల్‌ను జర్మనీలో వివాహమాడాడు.

ఆగ్నేయాసియాలో గల భారత వర్తకులు, కూలీలు బోసుపట ఆదరాభిమానాలు విపరీతంగా చూపారు. జపాను బాగా మద్దత్తు యిచ్చింది. 1943 జులై 4 న సింగపూర్ చేరిన బోసును "నేతాజీ" అని ఆహ్వానించారు. అక్కడ 60 వేలమంది సైన్యంతోఅజాద్ హిందూఫౌజు స్థాపించాడు. వీరిలో చాలామంది ఫిల్మ్ర ఆఫీసర్లు, జనరల్ స్టాఫ్ వున్నారు. 'చలో ఢిల్లీ' నినాదం యిచ్చాడు. జైహింద్ అనేదికూడా బోసు వాడిన నినాదమే. సైన్యంలో గాంధి, నెహ్రూ, ఆజాద్, ఝాన్సిదళాలు యేర్పరచాడు.

1943 అక్టోబరు 21 న స్వేచ్ఛాభారత తాత్కాలిక ప్రభుత్వాన్ని యేర్పరుస్తన్నట్లు బోసు ప్రకటించాడు. దానిని జర్మనీ, జపాన్‌లు గుర్తించాయి. గాంధి నాయకత్వాన్ని బోసు గుర్తించాడు. 1944 ఫిబ్రవరినుండి బోసు సైన్యం కదన రంగంలో దిగింది. భారత సరిహద్దులవరకూ వచ్చి ఆగి

పోయింది. జపాన్ విమానసహాయం లభించలేదు. వాతావరణం అనుకూలించలేదు. ఆహారం అందలేదు. వెనక్కు వెళ్లపలసివచ్చింది. 1945 ఏప్రిల్‌లో బాంగ్‌కాక్‌కు కేంద్ర స్థానం మార్చిన బోసు సైన్యం చిన్నాభిన్నమై పోయింది. బ్రిటిష్ ప్రభుత్వం యిస్తానన్న తాత్కాలిక ప్రభుత్వ పగ్గాలు పాదనల్ని తృణీకరించమన్నాడు బోసు. భారతదేశానికి రష్యా సహాయపడుతుందని 1945 మే 25 న చెప్పాడు. 1945 ఆగస్ట్ 18 న టోకియో వెడుతూ విమాన ప్రమాదంలో ఫార్మోజావద్ద మరణించాడు. ఆయన బ్రతికేవున్నాడని చాలా అనుమానాలు వెల్లడికాగా, భారత ప్రభుత్వం ఒక సంఘాన్ని నియమించింది. బోసు మరణాన్ని ఆ సంఘం ధృవపరచింది. (1956)

బోసు భావాలు

విద్యార్థిదశలో వేదాంతం చదివిన బోసు వివేకానందుని కార్యాచరణ వాదంపట్ల ఆకర్షితుడై శంకరాద్వైతంలోని మాయసిద్ధాంతం తృణీకరించాడు కొంతవరకు. అరవిందుని ప్రభావం తొలిదశలో వున్నా రాను రాను పుదుచ్చేరి ఆశ్రమ జీవితాన్ని విమర్శించాడు.

ప్రకృతి, చరిత్ర చూస్తుంటే అభివృద్ధి వున్నదనీ స్పష్టమౌతున్నదని, మానవులు ముందడుగు వేస్తున్నారని. యిదంతా శారీరకనైతిక అవసరం దృష్ట్యా జరుగుతున్నదని బోసు నమ్మాడు. హెగెల్ చెప్పిన సిద్ధాంత, ప్రతిసిద్ధాంత, సమన్వయ తర్కాన్ని బోసు శ్లాఘించాడు. ప్రకృతి ధర్మం ప్రేమ అని బోసు తత్త్వం. ఇది క్రమేణా బహిర్గతమౌ

తున్నది. మానవ జీవితంలో సారాంశం కూడా ప్రేమ అని, అదే వాస్తవం అంటాడు.

తాత్త్విక భావాలు పరిపక్వత చెందక పూర్వమే బోసు రాజకీయాల్లోకి వెళ్ళినందున, పిమ్మట అతనికి వ్యవధిచాల్లేదు. కనుక బోసు రాజకీయ భావాలే పరిశీనార్హంగా భావించాలి. తాత్త్విక ప్రస్తావనకు అంత ప్రాముఖ్యత నివ్వనవసరంలేదు.

భారత చరిత్రను పరిశీలించిన అనంతరం బోసు కొన్ని నిర్ణయాల కొచ్చాడు. చరిత్రలో ఒడిదుడుకులు తప్పవు. దేశం భౌతికంగా వైజ్ఞానికంగా అలసిపోతే పతనం సంభవిస్తుంది, కొత్తరక్తం ప్రవేశించి, కొత్తభావాలు ప్రభావం చూపితే పురోగతి తిరిగి వస్తుంది. సైనిక, వైజ్ఞానిక రంగంలో వున్నతస్థాయిగల వారున్నచోట కొత్తదశ వస్తుంది. భారతదేశంలో విదేశీప్రభావం ఎప్పటికప్పుడు ఇమిడిపోయింది. బహుశ బ్రిటిష్‌వారే యిందుకు మినహాయింపు. అయితే భారతీయులు ఆధునిక విజ్ఞానాన్ని అశ్రద్ధచేసినందున, అతిగా అహింసను పాటించినందున తృప్తి అనేది తమ జీవనత్వంగా స్వీకరించినందువలన దేశానికి ఓటమి సంభవించిందని బోసు వుద్దేశం. హిందూముస్లిం ఐక్యతనుకూడా బోసు కావాలన్నాడు. దేశంలో బెంగాల్ మాత్రం విశిష్టమైన దన్నాడు.

రాజకీయాల్లో ధైర్యసాహసాలు, వాస్తవికత అవసరమని బోసు వుద్దేశం. కనుకనే గాంధి మతపరమైన అహింసావాదాన్ని మెచ్చుకోలేకపోయాడు. స్వాతంత్ర్య సాధనకు శ్రమించాలనీ, నిష్కామకర్మ కావాలనీ చెప్పాడు. దేశానికి

సోషలిజం కావాలంటూ వామపక్షాల ఐక్యత వాంఛించాడు. ఫార్వర్డ్‌బ్లాక్ స్థాపించటంలో కూడా ఆయన వుద్దేశం యిదే. నేటి వామపక్షాల ప్రణాళికలెన్నో ఆయన ప్రతిపాదించాడు. బోసు వుద్వేగవాది. దేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించటానికి జపాన్, జర్మనీ సహాయం స్వీకరించటానికి సిద్ధపడి. ఫాసిస్టు ప్రమాదాన్ని గమనించలేదు హింసాయుత ధోరణిలో నమ్మకం వుండటమేగాక నాయకుని గొప్పతనంలో విశ్వాసం వుండటం గమనార్హం. భారత తాత్కాలిక ప్రభుత్వాన్ని ప్రకటించినప్పుడు బోసు తానే అన్నిపదవులకూ నేతగా నిర్ణయించటం ఫాసిస్టు మనస్తత్వపు లక్షణమే. బ్రిష్ సామ్రాజ్యవాదాన్ని దేశంనుండి తొలగించాలనే ఆవేదనలో వెనంపై నుండి పొయ్యిలో దూకాడు. ఫాసిజం, కమ్యూనిజంలో గల భావాలను స్వీకరించి భారతదేశం సమన్వయం చూపాలని బోసు భావన. 1931 లో గాంధి ఇటలీ వెళ్ళినప్పుడు ముస్సోలినీని కలుసుకోపోవటం విచారకరమని బోసు అభిప్రాయపడ్డాడు. జపాన్, జర్మనీ వ్యతిరేకచర్యలు, తీర్మానాలు కాంగ్రెసు చేస్తుంటే బోసు అయిష్టత చూపేవాడు.

అజాద్ హింద్ ఫౌజు భారతదేశాన్ని విముక్తి చేస్తుందని బోసు నమ్మాడు. జపాన్ సహాయంతో దేశం విముక్తి అయిన తర్వాత, భారతదేశాన్ని జపాన్ స్వేచ్ఛగా వదలేస్తుందని బోసు నమ్మకం. జర్మనీ జపాన్ నిష్క్రమకర్మలో అంత విశ్వాసం బోసుకు ఆయన పథకం ఫలించకపోవటం భారత ప్రజాస్వామ్య అదృష్టం.

REFERENCE BOOKS

1. **Subhas Chandra Bose,** An Indian Pilgrim, Asia Publishing House, New york 1965

2. **Subhas Chandra Bose,** The Indian Struggle

3. **Agchananda Bharati,** The Ochere Robe 1961 George Allen and Unwin, London

మహమ్మద్ అలీ జిన్నా

సెక్యులరిస్ట్ జిన్నా ముస్లింలీగ్ నాయకుడు గావటం రాజకీయ చదరంగం కాగా, మతపరమైన దేశానికి అధిపతి గావటం చారిత్రిక సంఘటన. భారతజాతీయ పోరాటంలో జిన్నా విశిష్టస్థానాన్ని పొందాడు. కాంగ్రెసు సెక్యులర్ సంస్థ గావటానికి జిన్నా పోరాటం దోహదం చేయటం విచిత్రంగా కనిపించినా వాస్తవం కూడా.

తోళ్ళవ్యాపారి జిన్నా పూంజా పుత్రుడు మహమ్మద్ అలీజిన్నా 1876 డిసెంబరు 25 న కరాచిలో జన్మించి, ప్రాథమిక విద్య అక్కడే ముగించవలసివున్నా, మంచి చదువుకై బొంబాయిలో గోకుల్‌దాస్ పాఠశాలకు పంపించబడ్డాడు. తల్లి దండ్రులకు దూరంగా వుంటూ బాల్యంనుండే పెరగటం వలన స్వతంత్ర ధోరణిగాక, ధైర్యసాహసాలు, సొంత కృషిపై నిలబడగలగటం వంటి లక్షణాలు అబ్బటం సహజం. బహుశ జిన్నా వీటన్నిటినీ అలవరచుకునే వాడేమోగాని, మరలా కరాచీకి పిలిపించి, సింద్ మదరసాహైస్కూలులో చేర్పించబడటంతో కొంతవరకే వ్యక్తిత్వంపై సొంత ప్రభావంవున్నది. అక్కడే మిషన్ స్కూల్లో మెట్రిక్ చదివి, న్యాయశాస్త్ర అభ్యాసానికై యింగ్లండ్ వెళ్ళాడు 1892 లో. అక్కడవున్న నాలుగేళ్ళలో చొరవతో పనిచేస్తూ చదువుకుంటూ, సమయానికి వచ్చిన ఎన్నికలలో దాదాభాయి నౌరోజిపక్షాన ప్రచా

రం కూడా చేశాడు. వారిద్దరిమధ్య సన్నిహిత సంబంధం యేర్పడటమేగాక, భారతదేశానికి తిరిగి వచ్చిన తర్వాత నౌరోజి కార్యదర్శిగా పనిచేశాడు కూడా. ఇంగ్లండ్‌లో షేక్స్‌పియర్ నాటకాలువేసి, సాహిత్యాభిలాష పెంపొందించుకున్నాడు. కావలసిన పట్టా పుచ్చుకుని 1896 లో స్వదేశానికి తిరిగివచ్చి, కరాచీ బదులు బొంబాయిలో న్యాయవాదవృత్తిలో దిగాడు. అప్పటికే తండ్రి ఆర్థిక యిబ్బందులకు లోను గావటం, కొత్తగా రావటంతో ప్రాక్టీసు లేకపోవటం, ఎవరిదగ్గరా అసిస్టెంట్‌గా చేరకపోవటం యివన్నీ జిన్నా జీవితపు లోతు పాతుల్ని బాగా కాచి వడిపోయటానికి దారి తీసాయి. 1900 లో తాత్కాలికంగా మాజిస్ట్రేట్ పదవి స్వీకరించి, మామూలువృత్తి కొనసాగిస్తూ, నౌరోజి, గోఖలేగార్లకు సన్నిహితుడయ్యాడు. రాజకీయాల్లో ఆసక్తి చూపుతూ 1909 లో బొంబాయి ప్రసిడెన్సీనుండి ముస్లింల అభ్యర్థిగా నెగ్గాడు. మతపరంగా తాను గెలిచినా, అదేపద్ధతి స్థానికసంస్థలకు విస్తృత పరచటానికి అంగీకరించ లేదాయన.

గోపాలకృష్ణ గోఖలే ప్రవేశపెట్టిన ప్రాథమిక విద్యా బిల్లును సమర్థిస్తూ కౌన్సిలో ప్రసంగించాడు 1912 లో. గోఖలే దృష్టిలో జిన్నా గొప్ప జాతీయవాది మాత్రమేగాక, హిందూ—ముస్లిం ఐక్యతకు వారధివంటివాడు కూడా.

1913 లో ఇంగ్లండ్ వెళ్ళి, సెంట్రల్ అసోసియేషన్ స్థాపించటంలో భారతీయ ముస్లిం విద్యార్థులకు తోడ్పడటమే గాక, లాంచనప్రాయంగా ముస్లింలీగ్‌లో చేరాడు జిన్నా. కౌన్సిల్ సంస్కరణల విషయమై 1914 లో మరోపర్యాయం

ఇంగ్లండ్ వెళ్ళాడు. 1915 నాటికి ముస్లింలు జిన్నాను తమ నాయకుడుగా గుర్తించటం ప్రారంభించారు, దానికి చిహ్నంగా ముస్లింలీగ్ విద్యార్థులు ఒక సంఘాన్ని ప్రారంభించటానికి జిన్నాను బొంబాయి ఆహ్వానించటం అంత ముఖ్య విషయం కాకపోవచ్చు గాని. జిన్నాలో మార్పుకు నాంది పలికింది. అదే సమయానికి గోఖలే మరణించటంతో కాంగ్రెస్ లో జిన్నాకు సన్నిహితుడు లోపించాడు. అయినా జిన్నా కాంగ్రెస్‌లో ప్రముఖవ్యక్తిగా కొనసాగటమేగాక, కరాచి, ఆగ్రా కాంగ్రెస్ సమావేశాల్లో ఐక్యతకు కూడా ప్రయత్నించాడు. 1918 లో ముస్లింలు జిన్నాను మరొకమారు తమ అభ్యర్థిగా కౌన్సిల్‌కు యెన్నుకున్నారు. ఆ సంవత్సరంలో అహమ్మదాబాద్‌లో జరిగిన బొంబాయిరాష్ట్ర సమావేశ అధ్యక్షత స్థానంనుండి హిందూ-ముస్లిం ఐక్యత కాంక్షించాడాయన. లక్నోలో జరిగిన ముస్లింలీగ్ సమావేశంలో కూడా యిలాంటి ఐక్యతనే జిన్నా నొక్కిచెప్పటం గమనార్హం. ఒక విధంగా యీ సంవత్సరం జిన్నా జీవితంలో విశేషమైనది. ముస్లింలీగ్, కాంగ్రెసు కలసి ఒక ఒప్పందానికి వచ్చి, తమ తీర్మానాలను వుమ్మడిగా ప్రభుత్వానికి సమర్పించారు. ఐక్యతా నినాదం ప్రతిధ్వనించింది. జిన్నా ప్రముఖపాత్ర వహించాడు నిస్సందేహంగా.

హోం రూల్ లీగ్ పోరాటంలో అని బిసెంట్ అరెస్టు కాగా, ప్రభుత్వ దమననీతి తీవ్రంగా ఖండించిన జిన్నా అప్పటికీ ఐక్యతకై కాంక్షిస్తూనే వున్నాడు. కాని థియోసఫీవారు రాజకీయాల్లోకి ప్రవేశించటమే గాక, మతాన్ని ప్రార్థనల్ని

తెచ్చిపెట్టారు. దక్షిణాదిలో హిందూమత ప్రార్థనలు రాజకీయాల్లో రంగరించారు. ముస్లింలకు కాంగ్రెసుకూ పొరపొచ్చాల యేర్పడటానికీ జిన్నా దూరంగావటానికీ నాంది పలికింది.

జిన్నా రాజ్యాంగబద్ధంగా పోరాడాలనే వ్యక్తి. గాంధి రాజకీయాల్లో ప్రవేశించి 1920 లో సహకార నిరాకరణ తీర్మానం తెచ్చేసరికి వ్యవహారం తిరకాసులో పడింది. ఈ పంథాను జిన్నా వ్యతిరేకించాడు. రాజకీయ కార్యక్రమం చేపట్టాలిగాని, యిలాంటి మార్గాలు కూడదని జిన్నా వుద్దేశం. ముస్లింలీగ్ జిన్నాను అనుసరించింది.

1928 లో నెహ్రూ సంఘం సూచించిన జనాభా ప్రాతిపదికపై స్థానాల కేటాయింపు పద్ధతిని జిన్నా వ్యతిరేకించాడు. కాంగ్రెసు హిందువుల సంస్థ అనే విమర్శ ప్రారంభించి, ముస్లింల ఏకైకసంస్థ ముస్లింలీగ్ అన్నాడు. ముస్లింలు అల్పసంఖ్యాకులనటం అర్థరహితమనీ, ఒక ప్రత్యేక సంస్కృతి, మతవిధానం, నాగరకత, భాష, ఆచారాలుగల ముస్లింలు కూడా ఒకజాతి అని జిన్నా సిద్ధాంతీకరించాడు. ముస్లింల పట్ల బ్రిటిష్ ప్రభుత్వం పక్షపాతంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపించాడు. 1930 లో గాంధి ప్రారంభించిన పౌరుల సహాయ నిరాకరణోద్యమాన్ని జిన్నా వ్యతిరేకించాడు. అధిక సంఖ్యాక ముస్లింలు జిన్నానే అనుసరించారు.

పాకిస్తాన్ కావాలనే నినాదం 1930 లో ఇక్బాల్ యిచ్చినా, దాన్ని ద్విజాతి సిద్ధాంతంగా ప్రచారంచేసి, రాజ

కీయ సమస్య చేసింది జిన్నా. 1939 లో కాంగ్రెసు మంత్రులు రాజీనామా చేసివప్పుడు 'విముక్తి దినం' జరిపారు. జిన్నావర్గం. 1940 లో ద్విజాతి సిద్ధాంత ప్రతిపాదనచేస్తూ పాకిస్తాన్ యేర్ప డాలని. జిన్నా నొక్కిచెప్పాడు. అలా కాకుండా ప్రజా స్వామ్యం పేరుతో ముస్లింలపై పెత్తనం చెలాయించే హిందూ రాజ్యం అక్కరలేదన్నాడు. మానవుని జీవితంలో అన్ని రంగా లను ఆక్రమించిన హిలదూ, ఇస్లాం మతాలు పొందికగా వుండ టం అసంభవమని జిన్నా వుద్దేశం. ఒకేజాతిగా హిందువులు ముస్లింలు మనగలగటం కల మాత్రమే నన్నాడు. కనుక స్వాతంత్ర్యానికి నిబంధనగా ముస్లింల రాజ్యం కావాలని పట్టు బట్టాడు. నెహ్రూ, అశోకమెహతా, రాజేంద్రప్రసాద్ ప్రభృ తులు ద్విజాతి సిద్ధాంతాన్ని యెదుర్కున్నారు. మౌలానా అబుల్ కలం ఆజాద్ జాతీయవాదిగా పాకిస్తాన్ నిర్మాణాన్ని వ్యతిరేకించాడు.

సెక్యులర్ భావాలతో రాజకీయ జీవితం ప్రారంభించిన జిన్నా జాతిని మతపరంగా నిర్వచించి, ముస్లిం జాతిని చాలా వెనక్కు నెట్టాడు. హిందువులు ప్రత్యేకజాతి అని హిందూ మహాసభ అంటే దానికి ప్రతిగా ముస్లింలీగ్ సిద్ధాంతాన్ని జిన్నా ప్రవేశపెట్టాడు. కాని కాంగ్రెసు దీనివలన సెక్యులర్ భావాలను దృఢపరచటం జరిగింది. ద్విజాతి సిద్ధాంతంపై జిన్నా గట్టిపట్టు బట్టటంవలన 1944 సెప్టెంబరులో గాంధీతో జరిపిన వుత్తర ప్రత్యుత్తరాలలో కూడా యిదే ప్రాతిపదిక అంగీకరించమన్నాడుజిన్నా.

1942 లో గాంధి యిచ్చిన క్విట్ యిండియా నినాదం, ఆ పిమ్మట జరిగిన వుద్యమం వృధాఅని, ముస్లింల పాకిస్తాన్ కోరిక పెడదారిన పట్టించి, బ్రిటిష్‌వారిని నమ్మించటానికి వేసిన యెత్తు అని జిన్నా విమర్శిస్తూ. రాజకీయంగా మరీ దిగజారి పోయాడు. యుద్ధంలో ముస్లింలు అందజేయదలచిన సహాయాన్ని బ్రిటిష్ ప్రభుత్వం సద్వినియోగపరచలేదని జిన్నా భావించాడు.

1947 తో పాకిస్తాన్‌కు జిన్నా అధిపతి గావటం సహజ సంఘటన. కాని ఇండియా సెక్యులర్ రాజ్యం కాగా, సెక్యులర్ జిన్నా మతపరమైన రాజ్యంగా పాకిస్తాన్‌ను మార్చటం ఆశ్చర్యకరం. రాజకీయాల ఆటల విలాసాలు అలా వుంటయ్.

REFERENCE BOOKS

1 **Matlubul Hasan Saiyid–** Mohammad Ali Zinnah Shaik Muhammad Ashraf, Kashmiri Bazaar, Lahore, 1945.

2. **Jamil-ud-din Ahmed (ed.)** Some Recent Speeches and Writings of Mr. Jinnah 2 Vol. 1947 Muhammad Ashraf, Lahore.

శ్యాంప్రసాద్ముఖర్జీ

శ్యాంప్రసాద్ముఖర్జీ 1901 జులై 7 న కలకత్తాలో జన్మించాడు. తండ్రి అశుతోష్ముఖర్జి, తల్లి జోగమాయా దేవి. తండ్రినుండి శ్యాంప్రసాద్ జాతీయవాదాన్ని, సనాతన మత ధర్మాన్ని, స్వేచ్ఛను పుణికి పుచ్చుకున్నాడు. ఆలవాట్లు ఆధునికమైనా, ఆచారాలు సనాతనం అవి శ్యాంప్రసాద్‌కూ అబ్బినయ్. మిత్తర్ ఇన్‌స్టిట్యూట్‌లో చదువుతూ, తండ్రి క్రమశిక్షణ ఆడుగడుగునా పాటిస్తూ పెరిగిన శ్యాంప్రసాద్‌కు స్నేహితులను నిర్ణయించటంలోనూ తండ్రి పెత్తనం వహించాడు.' ఇంచుమించు తన ఆంతరంగిక కార్యదర్శిగా అశుతోష్ కుమారుడిని వినియోగించి రక్షణయిచ్చి, పాశ్చాత్య సంస్కృతి అంటకుండా కాపాడటంలో అతి జాగ్రత్తపడ్డాడు. చివరకు దుస్తులుకూడా భారతీయత కనపడేటట్లు ధరించేవాడు. అన్నిటా తండ్రిని అనుసరించాడు. మెట్రిక్ ఉత్తీర్ణుడై, ప్రసిడెన్సీ కళాశాలలో (1917) చేరి, తండ్రికి మరింత సేవలు చేశాడు. 1919 లో ఇంటర్మీడియిట్ పాసై, కళాశాలపత్రిక కార్యదర్శి అయ్యాడు. 1921 లో బి. ఎ. 1923 లో బెంగాలీభాషతో ఎం. ఎ. ఉత్తీర్ణుడయ్యాడు. ఎం. ఎ. చదువుతుండగా సుధా దేవిని వివాహమాడాడు. తరువాత న్యాయశాస్త్రం చదివి (1924) కలకత్తా హైకోర్టులో న్యాయవాదవృత్తి ప్రారంభించాడు. రచనలు పాగిస్తూ, 'వంగవాణి' అనే పత్రిక స్థాపిం

చాడు. కొద్దికాలంపాటు 'దినేషనలిస్ట్' అన్ దినపత్రిక కూడా నడిపాడు. ఆ సంవత్సరమే తండ్రి చనిపోగా, సిండికేట్ సభ్యుడుగా కలకత్తా విశ్వవిద్యాలయ పాలనలో ప్రవేశించాడు. ఇంగ్లండ్ వెళ్ళి లా చదివాడు. కలకత్తా విశ్వవిద్యాలయంలో ఆర్ట్స్ ఫాకల్టీడీన్‌గా, వైస్ ఛాన్సలర్ గా విద్యారంగంలో కృషి చేశాడు. 1927 లో కలకత్తాకు తిరిగివచ్చి, విశ్వవిద్యాలయం నుండి కాంగ్రెసు అభ్యర్థిగా బెంగాల్ శాసనసభకు యెన్ని కయ్యాడు. (1929) కాంగ్రెసు తీర్మానాన్ని అనుసరించి శాసనసభకు రాజీనామాయిచ్చి, స్వతంత్రుడుగా మళ్ళీ యెన్ని కయ్యాడు. 33 వ సంవత్సరంలో కలకత్తా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ గా నియమితుడై విద్యారంగంలో కొన్ని సంస్కరణలు తలపెట్టాడు. బెంగాలీభాషను ప్రోత్సహించటం ముఖ్యమైనది.

శ్యాంప్రసాద్ముఖర్జి వైస్ ఛాన్సలర్ పదవి అనంతరం రాజకీయాలో ప్రవేశించాడు. ఒకపర్యాయం కాంగ్రెస్ నుండి వైదొలగి స్వతంత్రుడుగా పోటీచేసి నెగ్గినవ్యక్తి గనుక, తన భావాలకు అనుకూలమైన పథంకోసం అన్వేషించ ప్రారంభించాడు. అప్పుడే జన్మశిఖనుండి విడుదలై వీర్ సావర్కార్ కలకత్తారాగా ఆయన పరిచయంతో ప్రీతిచెంది హిందూమహా సభలో చేరాడు. త్వరలోనే ఉపాధ్యక్షుడయ్యాడు. సావర్కర్ కు అస్వస్థతగా వున్నప్పుడు అధ్యక్షుడుగానూ పనిచేస్తూ దేశవ్యాప్తంగా పర్యటించాడు ఆర్. ఎస్. ఎస్. ను శ్లాఘిస్తూ, సన్నిహిత సంబంధం పెట్టుకుంటుండేవాడు. బెంగాల్ శాసన సభ యెన్నికలలో ముస్లింలీగ్ ను ఓడించటానికి సుభాస్ చంద్ర

బోస్‌తో కలశాడు. ముస్లింలీగ్ మంత్రివర్గాన్ని పడగొట్ట టానికి మరొక ముస్లింను సమర్థించాడు. ఫజల్ హక్ మంత్రి వర్గంలో ఆర్థికమంత్రి అయ్యాడు. రాజకీయాల్లో ప్రవేశిస్తూనే మతతత్వంతో ప్రవర్తించిన శ్యాంప్రసాద్ తుదివరకూ అలాగే వున్నాడు. ముస్లిం వ్యతిరేకత ఆయన ప్రాతిపదిక. మంత్రిగా వుంటూనే హిందూమహాసభ సమావేశాలో పాల్గొనబోయి, నిషేధాజ్ఞలను వుల్లంఘించినందుకు పొరుగురాష్ట్రమైన బీహార్‌లో అరెస్టు గావించబడి అరాచక రాజకీయాలకు ఆనాడే నాంది పలికాడు. బ్రిటిష్ ప్రభుత్వ దమననీతికి నిదర్శనగా మంత్రిపదవికి రాజీనామా యిచ్చాడు. రాజగోపాలాచారి సూచించిన దేశవిభజన సూత్రాన్ని తృణీకరించాడు. హిందూ మహాసభ అధ్యక్షుడుగా ముస్లిం వ్యతిరేకతను తీవ్రతరం చేశాడు. భారతరాజ్యాంగ సభకు సభ్యుడుగా 1946 లో యెన్నుకోబడ్డాడు. నెహ్రూ ఆహ్వానంపై తొలి మంత్రి వర్గంలో పరిశ్రమలశాఖ నిర్వహించాడు. ఈలోపు 1948 లో గాంధి హత్య గావించటంతో హిందూమహాసభ దెబ్బతిన్నది. ఆర్. ఎస్. ఎస్. నిషేధించబడింది. మత రాజకీయాలకు తాత్కాలికంగా విరామం వచ్చింది. పాకిస్తాన్ పరిధానితో సంప్రదింపులు జరిపి ఒడంబడికకు రావటం యిష్టంలేని శ్యాం ప్రసాద్, నెహ్రూ ధోరణికి నిరసనగా మంత్రిపదవికి రాజీ నామా యిచ్చి బయటపడి, రాజకీయ వేదికపై అన్వేషించ ప్రారంభించారు. హిందూమహాసభవలన గిట్టుబాటుకాదని గ్రహించాడు. ఆర్. ఎస్. ఎస్. నాయకులతో కార్యకర్తలతో సంప్రదించి, భారతీయ జనసంఘ్ స్థాపించాడు. తొలి ఎన్నిక

లకు కొద్దిరోజులు ముందుగా స్థాపించిన యీకొత్తపార్టీకి ప్రథమ అధ్యక్షుడుగా శ్యాంప్రసాద్ వున్నాడు. రాజకీయాల్లో మన గలగటంకోసం 'హిందూ'పదం స్థానే భారతీయ పెట్టి, ఆర్. ఎస్. ఎస్. కు ఒక రాజకీయరంగాన్ని కల్పించిన ఖ్యాతి శ్యాంప్రసాద్‌కు దక్కాలి. జనసంఘ్‌లో ఆర్. ఎస్. ఎస్, ఒత్తిడి, ప్రభావం గుర్తించాడు. పార్లమెంటు సభ్యుడుగా శ్యాంప్రసాద్ ముస్లిం వ్యతిరేకతను కొనసాగిస్తూ, నెహ్రూ ప్రభుత్వాన్ని దుయ్యబడుతూ ప్రభుత్వం ముస్లింలపట్ల, పాకిస్తాన్ పట్ల వుదాశీనత వహిస్తున్నదనేవాడు. 1958 లో కాశ్మీర్‌లో పరిస్థితి చూడబోయి, నిషేధాజ్ఞల ఫలితంగా కారాగారంలో పడి, అనారోగ్యంలో చనిపోయాడు.

ఆగ్నేయాసియా దేశాలు పర్యటించిన శ్యాంప్రసాద్, బౌద్ధవుత్సవాలలో పాల్గొని, తన అభిప్రాయాలు యధాశక్తి ప్రచారంచేశాడు. చిన్నవయసులోనే యేర్పరచుకొన్న హిందువుల ఔన్నత్యం, ముస్లిం వ్యతిరేకత వెన్నాడగా, అవే జీవితలక్ష్యాలుగా కొనసాగించాడు. హైందవ సంస్కృతి గొప్పదని, ఉత్తమమైనదని నమ్మాడు. చదువులో అదే బోధించాలన్నాడు. ముస్లింల ప్రవర్తన, రాజకీయాలలో తన ఆలోచన విస్తృతం చేసుకోటానికి ఆయనకు సావకాశం దొరకలేదు.

భారతదేశం 'జగత్‌గురువు'గా పూర్వం వుండేదని, మళ్ళీ వుండాలని నమ్మటమేగాక, బుద్ధుడిని 10 వ అవతారంగా నమ్మినవ్యక్తి శ్యాంప్రసాద్.*

---

* పై గ్రంథంలో 184 పుట.

REFERENCE BOOKS

1. **Balraj Madhok - Portrait of a Martyr**
1969 Jaico Publishing House Bombay,

జవహర్ లాల్ నెహ్రూ

రాజకీయాలలో రామణీయకత చవిచూచి, ప్రజలను సమ్మోహనుల గావించి, తిరుగులేని నాయకుడుగా 15 సంవత్సరాలపాటు ప్రధానిగా చలామణి అయిన జవహర్ లాల్ జీవితం వెలుగునీడల మిశ్రితం.

మోతీలాల్ నెహ్రూ మొదటి భార్య, బిడ్డ చనిపోయారు. రెండవ భార్య స్వరూపరాణికి పుట్టిన, ప్రథమ సంతానం ప్రతకలేదు. అలాంటి సమయంలో జవహర్ లాల్ జన్మించాడు. (1889 నవంబరు 14) అప్పటికే అలహాబాద్‌లో మోతీలాల్ విపరీతంగా ఆర్జిస్తున్నాడు న్యాయవాదిగా. ఇంచుమించు కోటీశ్వరుని కుటుంబంలో పుట్టిన జవహర్ లాల్ ముద్దుగా పెంచబడటంలో ఆశ్చర్యంలేదు. పైగా ఆయన తర్వాత 11 ఏళ్ళకుగాని విజయలక్ష్మి పుట్టలేదు. కుమారుడు కష్టం అంటే యేమిటో చూడగూడదని సిద్ధార్థుని పెంచినట్లు, మోతీలాల్ కూడా జవహర్‌ను పెంచాడు. ఐరోపీయుల కాలనీలోకి మారి, ఇంట్లో దాసీలతో సహా పాశ్చాత్య మయం చేశాడు. అందుకే జవహర్ లాల్ బాల్యావస్థ పాశ్చాత్యంగానే సాగింది. మోతీలాల్ ఇంటో సంపన్నతలోపాటు సెక్యులర్ ధోరణికూడా వుండేది. ఇవన్నీ జవహర్‌కు అబ్బినయ్. అతనికి 15 ఏళ్ళవరకు ఇంట్లోనే చదువు, అదీ ఆంగ్లంలో. కనుక బడి వాతావరణం, తోటివారితో కలసి మెలసి తిరగటం

మొదలైన పరిస్థితులెన్నో లేకుండా పోయినయ్. జవహర్ బాల్యాన్నే హితులంతా పెద్దవారే. మోతీలాల్ పట్ల భక్తి, భయం, గౌరవం, అభిమానం అన్నీ వుండేవి జవహర్‌కు. వీటితోపాటు అహం, గర్వంకూడా వచ్చాయి. తండ్రిదగ్గర లేని చొరవ, ఆప్యాయత తల్లి వద్ద చూరగొన్నాడు. చిన్నప్పటి నుండీ ఆరోగ్యంగా వుండేవాడు. చదువు యింట్లోకాగా ఈత, టెన్నిస్, క్రికెట్, గుర్రపుస్వారి మొదలైన అభ్యాసాలు అలవరచుకున్నాడు. తరచు గంగాస్నానం చేస్తూ, పదిమందితోపాటు ముక్కుమూసుకుని మునగటంలో ఆనందం పొందేవాడు. గంగానది అంటే మతాభిమానంలేదు. చిన్నప్పటి నుండి పుట్టి పెరిగిన చోటుపై అందరికీ వుండే అభిజాత్యమే జవహర్‌కు అలహాబాద్, గంగానదిపై నా గలదు. మతపరమైన ఆచారాలు, పూజా పునస్కారాలు స్త్రీల గొడవగా పరిగణించేవాడు.

నెహ్రూ చిన్నప్పుడే ముబారక్ అలీ ద్వారా వీరోచిత గాథలు విని ఉవ్విళ్ళూరాడు. ఇంట్లో ఫెర్డినాండ్ టి. బ్రూక్స్ దగ్గర శుశ్రూషచేసి గ్రంథపఠనాసక్తి, విజ్ఞాన శాస్త్రాభిమానం, వీటన్నింటికీమించి రమణీయతపట్ల యిష్టత పెంచుకున్నాడు. ఇవి తరువాత జీవితంలో గాఢమైన ముద్రవేసినయ్.

1905 లో జవహర్‌లాల్ ఇంగ్లండ్‌లోని హారో పాఠశాలలో చేరాడు. రెండేళ్ళ హారో జీవితం సాధారణంగా సాగింది. 1907 లో కేంబ్రిడ్జిలో చేరిన తర్వాత మనోవికాసం బాగా పెంపొందటం ఆరంభమైంది. ప్రకృతిశాస్త్రం, రసాయనిక, భూగర్భ, వృక్షశాస్త్రాలతోపాటు సాహిత్యం, తత్త్వం,

ఆర్థిక రాజకీయ విషయాలు ఆసక్తితో చదివాడు. జీవితం అనుభవించదగినదే సూత్రంపై మంచినమ్మకం యేర్పడింది. కేంబ్రిడ్జి విద్యాభ్యాసానంతరం ఇన్నర్ టెంపుల్‌లో న్యాయ శాస్త్రం చదివి న్యాయవాదిగా 1912 లో స్వదేశానికి తిరిగి వచ్చాడు. అప్పటికి జవహర్‌లాల్ యింకా భారతజాతీ యోద్యమంలో ఆసక్తి కనబరచలేదు. తండ్రికి సహాయం చేస్తూ చిన్న న్యాయవాదిగా 8 సంవత్సరాలు అనామకుడు గానేగడిపాడు. వృత్తిలో రాణించే లక్షణాలేవీ కనిపించ లేదు.

28 సంవత్సరాలకు కమలను వివాహం చేసుకున్నాడు. తల్లి దండ్రులు మాట్లాడి యేర్పాటుచేసిన సంప్రదాయబద్ధ మైన పెండ్లి అది. కమల సనాతనురాలు. నెహ్రూ జీవితానికి క్రమేణా అలవాటు పడింది. వివాహం అయిన సంవత్సరానికే ఇందిర పుట్టింది. అదే వారి సంతానం. ఆ తర్వాత జీవితాంతం కమల అనారోగ్యంతోనే బాధపడింది.

అనిబిసెంట్ ప్రారంభించిన హోంరూల్ లీగ్‌పట్ల జవ హర్‌లాల్ ఆసక్తి చూపడమేగాక, అలహాబాద్‌లో థియోసఫీ సమావేశాలకు వెళ్ళటం మోతీలాల్‌కు తెలిసినా వుదాశీనత వహించాడు. రాజకీయాలలో ప్రవేశించటానికి జవహర్‌లాల్ యింకా ముందుకు రాలేదు.

గాంధి రాజకీయాల్లో ప్రవేశించి సహాయ నిరాకర ణోద్యమం ప్రకటించినప్పుడు జవహర్‌లాల్ ఆకర్షితు డయ్యాడు. మోతీలాల్ అది తెలిసి మండిపడ్డాడు. తండ్రికి

జంకినా తనధోరణి మార్చుకోటానికి జవహర్ సిద్ధంగాలేదు. తండ్రి కుమారుల మధ్య శీతలయుద్ధం సంవత్సరంన్నర సాగిన అనంతరం, చివరకు గాంధీ జోక్యంతో మోతీలాల్ మెత్త బడ్డాడు. రాజ్యాంబద్ధంగా నడవాలనీ, ఉగ్రవాదంతో ప్రభుత్వాన్ని పడగొట్టాలనే రెండు పద్ధతులకు మధ్యమార్గంగా గాంధి పంథా నెహ్రూకు నచ్చింది.

1920 లో కొందరు రైతుల కోర్కెపై నెహ్రూ పల్లెప్రాంతాల్ని సందర్శించాడు. ఇంచుమించు సిద్ధార్థునిలో కలిగినమార్పు జవహర్‌లాల్‌లోనూ కలిగింది. జమిందారు భోగం అనుభవిస్తున్న జవహర్ పల్లె జీవితం చూచి ఆశ్చర్య పోయాడు. ఆయన అప్పటినుండీ సామాన్యుల ఉద్ధరణ కాంక్షించాడు. బహుశ ఉత్తరోత్తరామార్క్సిజంపట్ల మొగ్గు చూపటానికి యిది నాంది అనొచ్చు.

ఉత్తరప్రదేశ్ రాష్ట్రకాంగ్రెసు కార్యదర్శిగా గాంధి పిలుపును అందుకొని సత్యాగ్రహంచేసి తొలిసారి కారాగార వాసం ఆరుమాసాలు అనుభవించాడు. 1921 లో, 1922 లో అలహాబాద్ వస్త్రాలయాలు ఫికెటింగ్ చేసి మళ్ళీ జైలు కెళ్ళాడు.

అప్పటివరకూ జవహర్‌లాల్ కాంగ్రెసులో అప్రధానంగానే మెలిగాడు. మోతీలాల్ కుమారుడుగానే ఆయన గుర్తించబడ్డాడు. కాని తొలిసారి కౌన్సిల్ ఎన్నికలు వచ్చినప్పుడు రాజీచేయటానికి జవహర్ ప్రధానపాత్ర వహించి, తండ్రి నీడనుండి వెలుగులోకి వచ్చాడు. కాంగ్రెసు నాయ

కులను సన్నిహితంగా తెలుసుకున్నాడు. క్రమేణా తండ్రికి దూరమై గాంధికి సన్నిహితుడుగా జొచ్చాడు.

1923 లో అకాళీల దళం పరిశీలించటానికి స్వదేశీ సంస్థానం 'జైతో' వెళ్ళి. ఉత్తర్వులు ధిక్కరించి, అవమానాలపాలై. జైలు అనుభవించి స్వదేశీపాలన చవి చూచాడు, సామాన్య ఖైదీగా, తొలిసారిగా మతకల్లోలాలపట్ల తీవ్రఆందోళన చెందాడు సెక్యులరిస్ట్ నెహ్రూ.

అదే సంవత్సరం అలహాబాద్ మునిసివల్ కౌన్సిల్ అధ్యక్షుడై, ఎడ్లబండిపై నగరంచూస్తూ, తండ్రి ఆగ్రహానికి మరోసారి గురైయ్యాడు. 1925 లో భార్య క్షయవ్యాధి చికిత్సకు స్విజర్లాండ్ వెళ్ళాడు. 1927 వరకు ఐరోపాలోవుంటూ అనేక దేశాలతోపాటు. మాస్కో వెళ్ళి కొత్తభావాలు సంతరించుకున్నాడు. మాస్కోలో ఎం. ఎన్. రాయ్‌తో పరిచయం యేర్పడింది. ఆకర్షితుడయ్యాడు. సాంఘిక న్యాయం. సమానత్వం, పేదరికం పోవటం మొదలైనవి రష్యాలోచూచి. మార్క్సిస్టు భావాలపట్ల ఆసక్తి యినుమడించగా, 1928 లో స్వదేశానికి తిరిగొచ్చాడు. అప్పటినుండీ కాంగ్రెసులో విదేశీ విధానాల తీర్మానాలు వ్రాస్తుండేవాడు. ఆయన దుందుడుకు భావాలు అపరిపక్వంగా వున్నాయని గాంధి హెచ్చరించటమే గాక, తననుండి దూరమౌతున్నట్లు సూచించాడు గాంధీ. నెహ్రూ కొంచెం వెనుకంజవేశాడు. స్వాతంత్ర్యోద్యమంలో సోషలిజాన్ని రంగరించిన తొలినాయకుడు నెహ్రూ, అప్పుడే అలహాబాద్ సత్యాగ్రహంలో లాఠీదెబ్బలు తిన్నాడు. ఆయన కుటుంబం కూడా అందులో పాల్గొన్నది.

నెహ్రూ ఐరోపానుండి తిరిగి వచ్చేసరికి సుభాష్ చంద్ర బోసు కాంగ్రెసు అతివాద రాజకీయంలో ప్రవేశించాడు. నెహ్రూ, బోసులు కలిసారు. డొమినియన్ ప్రతిపత్తి కావాలని మోతీలాల్, గాంధీలు కోరుతుంటే, పూర్తిస్వాతంత్ర్యం కావాలని బోసు, నెహ్రూలు పట్టుబట్టారు. నెహ్రూ కార్యదర్శిగా ఆలిండియా కాన్సిల్ యేర్పరచి, కాంగ్రెసుచేత పూర్ణస్వరాజ్యం కావాలనటానికి వత్తిడి తెచ్చారు. ఇది తాత్కాలిక కాన్సిల్. కాని నెహ్రూ చివరవరకూ నిలబడటం, తెగిందాకా లాగటం అలవాటులేని నాయకుడు. కనుక తుదకు గాంధీకి లొంగిపోయాడు అయిష్టంగానే. ఒక సంవత్సరం లోపుగా పూర్తిస్వాతంత్ర్యం యివ్వకపోతే సివిల్ డిజోబిడియన్, చేస్తామనే గాంధి తీర్మానంతో నెహ్రూ చల్లబడిపోయాడు. ఉద్రేకంలో బోసుతోనూ, మానసికంగా గాంధితోనూ కలసిన నెహ్రూ యిరువురిమధ్య కొంతకాలం వూగిసలాడి పోయాడు. తండ్రి, గాంధీలమధ్య కూడా ఆయన పరిస్థితి యిదే. చివరకు తండ్రిని, బోసును త్యజించి గాంధీతో నిలబడటం విశేషం.

కాంగ్రెసుకు తొలిసారి అధ్యక్షుడుగా ఎన్నికై, తండ్రి నుండి చార్జిపుచ్చుకోటం ఆహ్లాదకరంగా కనిపించింది చూచేవారికి. గాంధి యిచ్చిన ఉప్పు సత్యాగ్రహం పిలుపు ననుసరించి. అలహాబాద్‌నుండి కార్యకర్తలకు సూచనలిస్తూ, సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు అరెస్టు అయ్యాడు. జైలునుండి కుమారికి లేఖలు వ్రాశాడు ప్రపంచం గురించి ప్రపంచంలో పురోభివృద్ధి నిత్యమూ జరుగుతున్నదని, నాయకు

డనేవాడు ఒక విశిష్టపాత్ర వహించాలని సమాజంలో చలనం వుంటుందనీ యీ లేఖలలో తన అభిప్రాయాలుగా వెల్లడించాడు. మోతీలాల్ ఆ సంవత్సరంలో మరణించాడు. నెహ్రూ జీవితంలో తండ్రిస్థానం గాంధికి దక్కింది. ఆ యేడాది కరాచి కాంగ్రెసులో ముఖ్యమైన తీర్మానాలనేకం ఎం. ఎన్. రాయ్ ప్రభావంతో ప్రవేశపెట్టాడు. పన్నులు ఎగగొట్టాలనే కార్యక్రమం చేపట్టడంతో ఆరవసారి జైలుశిక్ష అనుభవించాడు.

ఆలోచనలో మార్క్సిస్టుగా ఆచరణలో ప్రజాస్వామికుడుగా నెహ్రూ వైవిధ్యం కనబరిచాడు. వామపక్షాలకు ప్రోత్సాహకారిగా ఆవిర్భవించాడు. కమ్యూనలిజాన్ని మాత్రం అనుక్షణం ఖండించాడు.

తండ్రి అండన పెరిగిన నెహ్రూ అన్నిటికీ తండ్రిపై ఆధారపడటం యిష్టంలేక ఒకానొక సందర్భంలో తానూ సంపాదించాలని ప్రయత్నించాడు. కాని తండ్రి అడ్డొచ్చి ఆ ప్రయత్నాన్ని విరమింపజేశాడు, తండ్రి మరణించిన అనంతరం నగలు, ఆస్తి అమ్మివేశాడు.

1934 లో బీహారు భూకంపం వచ్చి వేలాదిప్రజలు నిరాశ్రయులై బాధ పడుతుంటే గాంధి నిర్హేతుకంగా, అదంతా అంటరానితనం ఆచరణ ఫలితమని చెప్పటంవలన నెహ్రూ, ఠాగోర్‌తోపాటు ఖండించాడు.

ఉద్రేకపూరితమైన ఉపన్యాసాలిచ్చినందుకు 1934 లో మళ్ళీ అరెస్టు. జైల్లో స్వీయగాధ రచనచేశాడు.

1926 ఫిబ్రవరి 28 న భార్య మరణించటంతో నెహ్రూ జీవితంలో తీరనివెలితి యేర్పడింది. మళ్ళీ కాంగ్రెసు అధ్యక్షు డయ్యాడు. కుడి, యెడమ పక్షాలన్నీ ఆయన్ను వారి వారి కారణాలవలన మద్దత్తు యిచ్చారు. 1927 లో మైజ్‌పూర్ కాంగ్రెసు అధ్యక్షుడుగా యెన్నికయ్యాడు. దేశమంతా పర్యటించి. కాంగ్రెసు ఎన్నికలలో గెలవటానికి బాగా తోడ్పడ్డాడు.

ప్రప్రథమంగా జాతీయ ప్రణాళికా సంఘాధ్యక్షుడై, భవిష్యత్తులో ప్రణాళికా పథకానికి నాంది పలికాడు. అనధికార రాయిబారిగా బర్మా, మలయా పర్యటించాడు. మళ్ళీ గాంధి, బోసు మధ్య పొరపొచ్చాలు రావటంతో నెహ్రూ మధ్యవర్తిత్వం జరపటానికి ప్రయత్నించి విఫలుడయ్యాడు. కాని చివరకు గాంధిపక్షం వహించాడు. ఐరోపా సందర్శించి ఫ్రాన్స్, ఇంగ్లండ్ వైఖరిని ఖండించాడు. ఫాసిజాన్నికూడా వ్యతిరేకించాడు. తొలిరోజుల్లో యుద్ధఅనుకూలంగా, ఫాసిజానికి వ్యతిరేకంగా ఎం. ఎన్. రాయ్ సమావేశాలు జరుపగా ఆయన్ను కాంగ్రెసునుండి బహిష్కరించాడు. సిద్ధాంతాలు అర్థంగాని రోజులవి. కాని త్వరలోనే ఫాసిజానికి వ్యతిరేక నిర్ణయం గైకొన్నాడు. 1940 లో గాంధిపథకం ప్రకారం వ్యక్తి సత్యాగ్రహం చేయబోగా ముందే అరెస్టు అయ్యాడు. 1942లో నెహ్రూను తనవారసుడుగా గాంధి ప్రకటించటంతో నెహ్రూ జీవితంలో కొత్త అధ్యాయమనొచ్చు. 1945 జూన్ 15 వరకు జైలు నివాసంచేస్తూ డిస్కవరీ ఆఫ్ ఇండియా వ్రాశాడు.

1946 లో షేక్‌అబ్దుల్లా పఱాన వాదంచటానికి కాశ్మీర్ వెళ్ళి, అజాద్ కోరికపై తిరిగినచ్చి, వై ప్రాయి ఆహ్వానంపై తాత్కాలిక ప్రధాని అయ్యాడు. అక్కడనుండి నెహ్రూ చరిత్ర అంతా అధికారచరిత్ర అనొచ్చు. దేశవిభజనకు అంగీకరించిన నెహ్రూ, మతపరమైన కలహాలు నిరోధించటానికి తీవ్రయత్నం చేశాడు. హిందూరాజ్య భావన ప్రతిఘటించి, సెక్యులర్ భావానికి ప్రాతిపదికలు పాిరంభించాడు.

1948 లో గాంధి హత్యచేయబడగా పసివానివలె విలపించాడు. రాజకీయ జీవితంలో ఏకాకి అయ్యాడు. సొంత కాళ్ళపై నిలబడ్డాడు. రాజ్యాంగసభలో లక్ష్యాలు రూపొందించే తీర్మానంపట్ల చక్కనిపాత్ర వహించాడు. ప్రణాళికా సంఘాన్ని యేర్పరచాడు. 1951 లో దేశవ్యాప్తంగా నిర్విరామపర్యటన సలిపి. కాంగ్రెసును గెలిపించటంలో ప్రధాన పాత్ర వహించాడు.

నెహ్రూ తొలి మంత్రివర్గంలో కాంగ్రెసుకు భిన్నమైన అనేకమందిని చేర్చుకున్నాడు. కాని కాలక్రమేణా వారంతా తొలగిపోయారు. శ్యాంప్రసాద్‌ముఖర్జీ, కె. సి. నియోగి, జాన్‌మత్తయ్, అంబేద్కర్, సి. డి. దేశముఖ్ గారలు తేర్కొనదగినవారు. కృష్ణమీనన్, గుల్జారిలాల్ నందా, లాల్ బహదూర్ శాస్త్రి, రఫీఅహమ్మద్ కిద్వాయ్, గోవిందవల్లభ పంత్, గారలు సన్నిహితులయ్యారు. ఆంతరంగిక వ్యవహారాల్లో కుమారి ఇందిర. మత్తయ్యగారలు ప్రముఖ సానం ఆక్రమించారు.

నెహ్రూ పాలన చాలా ఒడిదుడుకులు యెదుర్కొన్నది. భాషారాష్ట్ర సమస్య, జాతీయభాష ఆందోళన, ముఖ్యమైనవి. ప్రజల ఆందోళనకు లొంగి తొలిరాష్ట్రంగా ఆంధ్రను యేర్పరచటానికి అంగీకరించాడు. దానితో భాషారాష్ట్ర పునర్విభజన సంఘం యేర్పరచవలసి వచ్చింది.

ప్రణాళికా సంఘాధ్యక్షుడు అన్ని నిర్ణయాలకు నెహ్రూ తుది బాధ్యత వహించాడు.

విదేశీవిధానంలో కొత్త పుంతలుతొక్కి, అలీనపద్ధతి అవలంబించి, అనుకోకుండా కమ్యూనిస్టు కూటమికి చేరువయ్యాడు. చైనా దురాక్రమణ జరిగేటంతవరకు పొరపాటు గ్రహించలేదు. భారత కమ్యూనిస్టులను, కమ్యూనల్ పక్షాలను సదా వ్యతిరేకించాడు నెహ్రూ.

చైనా దురాక్రమణ అనంతరంగాని నెహ్రూ నాయకత్వంలో బిగువు సడలలేదు. అది నెహ్రూకు పెద్ద షాక్ నెహ్రూ చేతుల్లో దేశం సురక్షితంగా లేదని కృపలానీ అంటే కంటతడి పెట్టుకున్నాడు నెహ్రూ ఆయన దేశాభిమానం అలాంటిది.

నెహ్రూ భావాలు

భారతదేశంలో సామాన్య ప్రజలు, మేధావులుకూడా నెహ్రూపట్ల ఆకర్షితులై, ఆయన నాయకత్వాన్ని ఆమోదించి, విశేష ప్రేమాదరాభిమానాలు చూపారు. తదనుగుణంగా నెహ్రూ ప్రజల భావాలను మన్నిస్తూ, అభిప్రాయాలు గౌరవిస్తూ వచ్చాడు. ఇచ్చి పుచ్చుకునే యీ ధోరణివలన

జవహర్‌లాల్ 15 సంవత్సరాలు పదవిలోనూ తిరుగులేని నాయకుడుగానే చలామణి అయ్యాడు. ఇలా నెహ్రూపట్ల సమ్మోహితులు గావటానికి తగిన లక్షణాలనేకం ప్రజలు, విజ్ఞానులు ఆయనలో తిలకించారు. అత్యంత ఆధునిక ప్రజాస్వామిక విలువలు కావాలని, సామాన్య హైతుకూలీలు, పేదలు పైకి రావాలని, నెహ్రూ చిత్తశుద్ధితో ఆకాంక్షించాడు. తన రచనల ద్వారా, ఉపన్యాసాలలో యీ భావాలు స్పష్టంగా వ్యక్తపరచాడు. రామణీయకతల్ని అభిలషించే వ్యక్తి ఆయన. తరచు ప్రజల అభిప్రాయాలకు తల ఒగ్గేవాడు తనకు అయిష్టమైనా సరే. ఈ విధంగా పరిశీలిస్తే నెహ్రూలో పరస్పర విరుద్ధత్వాలెన్నో కనిపిస్తయ్.

కాని నెహ్రూ ప్రాముఖ్యంగా ప్రజాస్వామిక వాది. కనుకనే తన హయాంలో ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా ప్రజాస్వామికధోరణి మాత్రం సన్నగిల్లనివ్వలేదు. ప్రజాస్వామికవ్యవస్థ అట్టిపెట్టటంలో నెహ్రూపాత్ర శ్లాఘనీయం. తిరుగులేని నాయకుడు అధికారాన్ని దుర్వినియోగపరచి నియంతగావటం సులభం. నెహ్రూ ఏ మరుపాటున కూడా అలాంటి ఆలోచన రానివ్వక పోవటం ఆయన మనస్తత్వానికి ప్రతిబింబం. ఇంచుమించు ఆ బాటనే తరువాత వారు పయనిస్తున్నారనవచ్చు.

నెహ్రూ మొదటినుండీ సెక్యులరిస్టు. మతంజోలికి ప్రభుత్వం పోగూడదనే విధానాన్ని ఆమోదించి ఆచరించినవాడు. మతం స్థానాన్ని, ప్రాధాన్యతను కళలకు, మానవత్వానికి అది చేసినసేవ నెహ్రూ గుర్తించాడు. కాని భిన్నమతాలు, అభిప్రాయాలు గలచోట ఎవరి ధోరణిలో వారు వుండాలంచే

మతాన్ని వ్యక్తిగతంగా వుంచితేనే శ్రేయస్కరమనే సెక్యులర్ సూత్రాన్ని నెహ్రూ బాగా అవగాహన చేసుకున్నాడు. ఆచరించాడు.

దేశానికి నెహ్రూ చూపిన మార్గాలలో పేర్కొనదగినది ప్రణాళికాపద్ధతి. ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛను కాపాడుకుంటూ, సాంఘిక న్యాయంకోసం ఆ[redacted]ళికద్వారా ప్రయత్నించటంలో అనేక జటిల సమస్యలను జవహర్ లాల్ ఎదుర్కొన్నాడు. ప్రణాళికా సంఘాన్ని యేర్పరచి, అది పెను భూతంవలె పెరిగిపోవటం గమనించి విమర్శించాడు. ప్రథమ ప్రణాళికలో చేసిన లోపాల్ని ద్వితీయ ప్రణాళికలో సవరించటానికి ప్రయత్నించాడు. అన్నీ ప్రభుత్వమే చేయాలనే ధోరణిగల భారత దేశంలో ప్రణాళికద్వారా ప్రజల్ని సమాజసేవకు పురికొల్పటంలో నెహ్రూ కొంతవరకైనా కృత కృత్యుడు కాలేకపోలేదు. ప్రణాళికా రచనలో రష్యాను అనుకరించటంవలన ఒకవైపునా, ప్రజల్ని బలవంతంగా పనిచేయించే అవకాశం లేనందున మరొకప్రక్క ప్రణాళిక విఫలమౌతున్నదని నెహ్రూ గుర్తించక పోలేదు. ఇలాంటప్పుడే జవహర్ లాల్ నియంతిగా మారవలసింది. అలా జరగకపోవటం ఆయన స్వేచ్ఛా ప్రియత్వానికి గీటురాయి. దేశప్రబల అదృష్టం కూడా. భారతదేశాన్ని శాస్త్రీయ సాంకేతిక విజ్ఞానంద్వారా ఆధునికం చేయాలని నెహ్రూ వుబలాటపడటం గమనార్హం.

నెహ్రూ మతం

మతం అవగా యేమిటి అని ప్రశ్నించి, తనస్వీయ

గాధలో సమాధానం చెబుతూ జవహర్‌లాల్ వ్యక్తి అంతర వికాసం, తాను మంచిదని నమ్మిన ధోరణిలో చిత్తం మలచు కోటం అనుకోవచ్చు నంటూ, ఆ నమ్మకం చర్చనీయాంశ మన్నాడు. కాని మతమంటే అంతరాభివృద్ధి అనీ, దాని బాహ్యారూపమే బయట మార్పులనీ నెహ్రూ చెప్పాడు. *అంత[redacted]వ్యాపరిస్థితులు అనుకూలించాలనీ, స్వేచ్ఛ వుండాలనీ, తగిన వ్యవస్థ అవసరమనీ నెహ్రూ నమ్మాడు. కాని మతం పేరుతో సంఘటితంగా వుండాలనటం భయానక మంటూ, అలాంటి మతాన్ని తుడిచెయ్యాలన్నాడు. భారత దేశంలో వున్నవే అలాంటివని నెహ్రూకు బాగా తెలుసు. సాంఘికాభివృద్ధికి సంఘటితమతం ఆటంకమని నెహ్రూకంటె ఎక్కువగా తెలిసినవారు లేరేమో రాజకీయాల్లో. జీవితంలో అనేక పర్యాయాలు మతంపేరిట జరిగిన ఘోరకృత్యాలు కళ్ళారాచూచి, విభ్రాంతిచెంది, శాంతి ప్రయత్నాలు చేసిన వాడు నెహ్రూ.

జవహర్‌లాల్ ప్రధానంగా హేతుధోరణిగల నాయకుడు. రాజకీయాలలో కూడా యిదేపద్ధతి. కావాలన్నాడు. గాంధి నిర్హేతుకంగా ప్రవర్తించినప్పుడు కేవలం బాధపడటమే గాక, ఖండించాడు కూడా. బీహార్‌లో భూకంపంవచ్చి ప్రజలు బాధ పడుతున్నప్పుడు, అంటరానితనం పాటించిన పాపానికి దేవుడు విధించిన శిక్ష అని గాంధి అంటే, వివేచనాత్మకుడుగా

---

* Autobiography P 379 Allied, Bombay (1962)

నెహూ్రి ఆమాటల్ని గర్హించాడు. శాస్త్రీయ పద్ధతికి వ్యతిరేకంగా భావించటం అనూహ్యమన్నాడు. 1 మతధోర ణిని అంగీకరి స్తే వున్నదంతా ఆమోదించాలి. మార్పు అసహజ మౌతుంది.2ఇది గ్రహించిన నెహూ్రి ప్రపంచాన్ని హేతుబద్ధంగా తిరుగు బాటు చేయటం ఆదర్శమని, మౌఢ్యాలను కట్టుదిట్టం చేసేమతం అంటే నెహూ్రి చిరాకుపడేవాడు.A అంతమాత్రాన 'మతం' పూర్తిగా పోవాలని నెహూ్రి అభిమతంకాదు. వ్యక్తి జీవితంలో మతప్రాధాన్యత (ఆయన కారణంగా) గుర్తించాడు. మతాన్ని సంఘటిత పరిచటమంటే కొద్దిమంది స్వార్థపరుల నాయకత్వాన మార్పు, అభివృద్ధికి చెవిన పెట్టటమని భావించి, నెహూ్రి అలాంటి సంఘటిత మతాన్ని ఖండించాడు.

ఒకదేవుడు, శక్తివుంటాయని, నెహూ్రి అంగీకరించ లేదు. వ్యక్తిగతంగా దేవుడు వుంటాడనేది ఆశ్చర్యకరమైన విషయం అన్నాడు. ఇలాంటివి వ్యక్తులకు ప్రేరణ కలిగించ టంపట్ల మరీ ఆశ్చర్యచకితుడయ్యాడు. 3 అలాగే గ్రంథాలకు దైవత్వాన్ని ఆపాదించటం కూడా నెహూ్రికు అయిష్టమే. విచిత్రమేమంటే యీనమ్మకాలన్నీ గూడుకట్టుకొనివున్న ఆధిక సంఖ్యాకుల మధ్య ఆకర్షణీయమైన నాయకుడుగా 15 సంవత్సరాలు మనగలిగాడు. కారణమేమంటే నెహూ్రి దేశ భక్తి, భారత సంస్కృతిపట్ల అభిమానం శంకించవీల్లేనిది గనుక. కొన్నిపర్యాయాలు యీ ప్రజలమధ్య తాను ఏకాకినని

---

1. Ibid p. 490
2. Ibid p. 536
3. The Discovery of India p. 12

నెహ్రూ భావించకపోలేదు.1 కాని భారతసంస్కృతికి తానూ వారసుడినని, అందలి ఔన్నత్యంలో భాగం పంచుకోటానికి తానూ అర్హుడనని నెహ్రూ గర్వించాడు. 2 హిందూముస్లిం భేదంతో గత సంస్కృతి ఒక్క జాతిదనే భావన గర్హించటంలో, యీ సంపద అందరిదని నొక్కి చెప్పటంలో నెహ్రూ అలసిపోలేదు.3

దైవసాన్నిధ్యంలో చేరటానికి ప్రయత్నించే మానవుడు సాధారణంగా తన విషయమే చూచుకుంటాడని, సమాజపు మంచిచెడ్డలపట్ల ఆసక్తి చూపడని, నైతిక విలువలను పట్టించుకోడని నెహ్రూ వుద్దేశం. ఉద్వేగం, అనుభూతి, వ్యక్తిగత అనుభవం-యివన్నీ మానవునిలో ప్రధానపాత్ర వహిస్తాయని నెహ్రూ గుర్తించకపోలేదు. వర్గాలను కూడగట్టి, రెచ్చగొట్టే మతాలకన్నా శాస్త్రీయత, మానవత కావాలని నెహ్రూ ఆకాంక్షించాడు.

సంఘటిత మతంపై నెహ్రూ కత్తిగట్టి జీవితాంతం పని చేశాడు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, జనసంఘ్, హిందూ మహాసభవంటి హిందూమత సంస్థలను, ముస్లింలీగ్‌వంటి పక్షాలను నిరంతరం ఖండించాడు.

ఉన్నతభావాలు ఎక్కడ వున్నా స్వీకరించాలనే ధోరణి అవలంబించి బుద్ధుని బోధనలు, అశోకుని పాలనావిధానంలో

---

1. Autobiography p. 374
2. The Discovery of India p, 19
3. Ibid p. 295, 342

కొన్నిరీతులు అవలంబించాడు. మతసౌనాన్ని విర్వచించి, అవసరమైనచోట తగిన స్థానమిచ్చి, లేనిచోట గర్హించి, నిల బడిన ధిరోధాత్తుడు నెహ్రూ.

నెహ్రూ విదేశీ విధానం

స్వాతంత్రోద్యమంలో సామ్రాజ్యవాదాన్ని, వలసవా దాన్ని వ్యతిరేకిస్తూ, సోషలిజాన్ని కాంక్షిస్తూ పోరాడిన నెహ్రూ, కాంగ్రెసు తీర్మానాలలో విదేశీ విషయాలలో ప్రధానభూమిక వహించాడు. ఆయన భావాలు ఆచరణలో పెట్టటానికి ప్రధాన మంత్రిత్వం అక్కరకొచ్చింది. విదేశాంగ శాఖను స్వయంగా నిర్వహించాడు తొలిదశలో దేశాభివృద్ధి త్వరితంగా జరగాలంటే శాంతి అవసరమని నెహ్రూ నమ్మకం. కనుక యేకూటమిలోనూ చేరకుండా అలీనవిధానాన్ని అవలం బించటానికి నిశ్చయించాడు. కామన్ వెల్త్‌లో మాత్రం భారత దేశం కొనసాగటానికి అంగీకరించాడు. అమెరికా రష్యాల మధ్య అనేకదేశాలు రెండు కూటములుగా చీలినవి. ఆసియా ఆఫ్రికా ఖండాలలో మాత్రం కొత్తగా చీలినవి. ఆసియా ఆఫ్రికాఖండాలలో మాత్రంకొత్తగా స్వాతంత్ర్యం పొందుతున్న దేశాలు తమ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకున్నవి. అలాంటి దేశాలన్నిటినీ కూడగట్టి మూడవకూటమిగా కాక, ఒక శాంతి యుత ప్రాంతంగా రూపొందించాలని నెహ్రూ వుద్దేశం. ఈ భావంపట్ల సర్వత్రాహర్షం వెల్లడైంది. నెహ్రూ ప్రపంచ నాయకులలో ఒకడుగా పేరుపొందాడు. అలీనరాజ్యాలలో కీలకపాత్ర వహించాడు. కాని అనుకున్నట్లుగా ప్రశాంత

పరిస్థితి కొనసాగలేదు. భారతదేశం అనేక గడ్డుసమస్యలు యెదు ర్కొనవలసివచ్చింది. పాకిస్తాన్. గోవా, కాశ్మీర్ వంటివి నిరంత రం కలతపెట్టాయి. చైనాను గుర్తించమని నెహ్రూ ఐకరాజ్య సమితిని కోరాడు. చైనాతో కలసి 'పంచశీల' సూత్రాలు రూపొందించాడు. పొరుగుదేశాల ఆంతరంగిక వ్యవహారా లలో జోక్యం కూడదని, దేశసరిహద్దులు గౌరవించాలని నొక్కి చెప్పారు. కాని ఆచరణలో అలీనత్వం పాశ్చాత్య లోకానికి వ్యతిరేకంగానూ, కమ్యూనిస్టులకు అనుకూలంగానూ పరిణ మించింది. సూయజ్ కాలువను ఇంగ్లండ్-ఫ్రెంచివారు ఆక్ర మించినప్పుడు ఆగ్రహావేశపరుడైన నెహ్రూ హంగరీలో ప్రజల పోరాటపు విప్లవతత్వాన్ని గుర్తించి, రష్యాను ఖండించ టంలో తటపటాయించాడు. 1958 లో, టిబెట్టును చైనా ఆక్రమించినపుడుకూడా నెహ్రూ సాహసించి కమ్యూనిస్టు దురాక్రమణను ఖండించలేకపోయాడు. అయితే దలైలామా పారిపోయి భారతదేశంలో తల దాచుకోటానికి వచ్చినపుడు. చైనాకు యిష్టంలేదని తెలిసీ ఆశ్రయం యిచ్చాడు. నెహ్రూ ఉపన్యాసాలలో అమెరికా వ్యతిరేకత. రష్యా అనుకూలత సూచనప్రాయంగా కనిపిస్తుండేది.

నెహ్రూ విదేశీవిధానంలో పెద్దమచ్చ చైనా విషయం, భారతదేశపు సరిహద్దులలో కొంత భాగాన్ని చైనా ఆక్రమిస్తుం దని నెహ్రూ ఊహించలేదు. చైనాను గుర్తించాలని నొక్కి చెబుతూ, ఆసియాలో అదొక మహత్తర శక్తిగా భావించి దానితో స్నేహసౌభాగ్యత్వాలు కాంక్షించాడు. ఈ ధోర ణిలో చైనాపాత విస్మరించాడు. ఆసియా ఆఫ్రికా దేశాలను

తనవైపు ఆకర్షించటానికి చైనా ప్రయత్నాలు గమనించలేదు. ఫలితంగా 1962 లో చైనా దండెత్తి వచ్చినపుడు ఆసియా ఆఫ్రికా దేశాలు బాహాటంగా భారతదేశాన్ని బలబరచలేదు. చివరకుపాశ్చాత్య రాజ్యాలనుండి, రష్యానుండి ఆయుధాలసహాయాన్ని అర్థించవలసివచ్చింది నెహ్రూకు ఆదొక అశనిపాతం. చైనాను ఖండించటంలో, దేశరక్షణ కాపాడటంలో నెహ్రూ సమయస్ఫూర్తి చూపినా, ఆయన ఆరోగ్యంపై యీ ప్రభావం స్పష్టంగాకనిపించింది. దేశంలో నెహ్రూను గర్హిస్తూ తీవ్రవిమర్శలు వచ్చాయి. అదికూడానెహ్రూకు దుర్భరమైంది. ఆయన నాయకత్వపు పటుత్వం తొలిసారిగా పటాపంచలు గావటం ప్రారంభమైంది. తాను ఆశించిన శాంతియుత ప్రపంచపు కలలన్నీ వమ్మైఅయినట్లు నెహ్రూ గ్రహించాడు. సమయానికి ఆదుకునే స్నేహితులు ఎవరో తెలుసుకున్నాడు. ప్రజలలో అతని విశ్వాసం అచంచలమైంది. కనుకనే తనకు సన్నిహితుడు సలహాదారు అయిన కృష్ణమీనన్‌ను చైనా పోరాటంలో తొలగించి ప్రజల్ని తృప్తి పరచగలిగాడు. టిటో, నాసర్, నెహ్రూలు అలీనవిధాన నాయకులుగా వేరొందినా, పొసగని పంథా అవలంబించే నాయకులే వారంతా.

స్వాతంత్ర్యానంతరం భారత విదేశాంగ విధానం రూపురేఖలు దిద్దుకున్నది. నెహ్రూ చేతుల్లో, భారతదేశపు వేరు ప్రఖ్యాతులకు, అపఖ్యాతికీ నెహ్రూ బాధ్యుడు అనొచ్చు.

నెహ్రూ వ్యక్తిత్వము

నెహ్రూ ఆధునిక వ్యక్తి. ఆకర్షణీయమైన లక్షణాలు గలవాడు. నీతిమంతుడు. ఆదర్శాలు నమ్మినవాడు. కాని తన గుణాలేవీ రాణించవీల్లేని స్థితిలో శిక్షణ పొందాడు. కావాలని గాంధి నాయకత్వాన్ని ఆమోదించాడు. అలా చేయటంలో ఆయన వ్యక్తిత్వం మరుగునబడి, పేరుకై అర్రులు చాచినట్లు స్పష్టపడింది. మౌఢ్యాన్ని హేతువునూ ఒక కాడికి గట్టి బండి నడిపే ప్రయత్నం నెహ్రూది. గాంధి అనంతరంగాని నెహ్రూ తన నిజవ్యక్తిత్వాన్ని వెల్లడించ వీల్లేకపోయింది. కాని అప్పటికీ నెహ్రూ పెద్దపదవిలో వుంటటంవలన చాలా వరకు అయోమయ వాదనలతో రాజీపడక తప్పలేదు. అధికార రాజకీయపు చదరంగంలో అనేక నిబంధనలు పాటించక తప్పదు. నెహ్రూ మంచితనం, చిత్తశుద్ధి అధికార రాజకీయాల్లో యిమడలేదు. కనుక అనేక విషయాలలో తలఒగ్గి నటించకతప్పలేదు. పార్టీ రాజకీయాల విషవలయపు క్రీడారంగంలో చిక్కుకున్న నెహ్రూ బయట బడలేక పోయాడు. ఆలోచనవుండి కూడా అనుభూతికీ లొంగిపోవలసి వచ్చింది నెహ్రూకు.

నెహ్రూ మంచివక్త. ఆయన ఉపన్యాసాలలో భావోద్రేకం బాగా కవిపించేది. వేలాది ప్రజలకు వాత్తుకపోయే రీతిలో వుపన్యసించేవాడు. అలాగే మేధావులకు నచ్చే ప్రసంగాలూ చేసేవాడు. నెహ్రూ చక్కని రచయితకూడా. జైలు జీవితంలో కుమార్తె ఇందిరకు లేఖలు, స్వీయగాధ, ప్రపంచ

చరిత్ర పరిశీలన, భారత పరిశోధన ప్రారంభాడు. ఆవిగాక ఉత్తరాలు, ఉపన్యాసాలెన్నో క్రోడీకరించి ప్రచురింపబడినవి. సులభశైలి, ఆకర్షణీయంగా చెప్పటం. చక్కనిభాష, వాత్తుక పోయే ఉపమానాలు నెహ్రూ సొత్తు. రచన లన్నిటిలో స్వీయగాధ రంగరించాడు. తన ఆవేదనలు, అనుభూతులు, ఆలోచనలు పొందుపరిచాడు. క్రమపద్ధతిలో చరిత్రగా యేదీ రచించకపోయినా అనేక విషయాలు శ్రద్ధగా పరిశీలించ గలిగాడు. అముద్రితంగావున్న అనేక లేఖలు యింకా క్రోడీకరిస్తున్నారు.

నెహ్రూ నిష్క్రమణతో భారత రాజకీయ రంగంలో గొప్ప ఆకర్షణ పోయింది. అధికారంలో వుంటూ, ప్రజల మధ్య అంతగా తిరిగి, వారిని సమ్మోహితులు గావించిన నాయకుడు లేడు.

REFERENCE BOOKS

1. **Jawaharlal Nehru :** The Discovery of India, The Signet Prers, Calcutta 1946.
2. **-do-** Letters from a father to his daughter.
3. **-do-** Toward freedom : The Autobiography of Jawaharlal Nehru.
4. **Jawaharlal Nehru's Speeches :** Publication Division Govt. of India, New Delhi 3 Vol.
5. **Michael Brecher :** Nehru A Political Biography Oxford, London 1959.
6. **A. B. Shah (ed.) :** Nehru – A critical Tribute Manaktalas 1965 Bombay.

సోషలిస్టు ఉద్యమాలు

1934 నాటికి గాంధి శాసనోల్లంఘనోద్యమాన్ని విరమించటం, స్వరాజ్యపార్టీని ఎన్నికలలో పోటీ చేయటానికి కాంగ్రెసు ఆమోదించటంతో నిరుత్సాహపడిన కొందరు కాంగ్రెసు సోషలిస్టు పార్టీని స్థాపించారు. అప్పటికే బీహార్‌లో ఒక సోషలిస్టు విభాగం ఏర్పడి, 1930 నుండీ ,కృషిచేస్తున్నది. 1932-33 నాటికి నాసిక్, పూనాలలో జయప్రకాశ్ నారాయణ నాయకత్వాన సోషలిస్టు విభాగాలు రూపొందాయి. సోషలిస్టు పార్టి ఏర్పడేనాటికి మూడు ముఠాలున్నవి. మార్క్స్‌స్టులుగా జయప్రకాశ్, నరేంద్రదేవ్‌లు, డెమొక్రటిక్ సోషలిస్టులుగా మసాని, అశోక్ మెహతాలు, గాంధేయులుగా లోహియా, అచ్యుత పట్వర్ధన్‌లు ఉన్నారు. వీరంతా మార్క్సిజానికే పరిమితంగాని లెని నిజంతో నిమిత్తంలేనివారు. కార్మిక నియంతృత్వానికి వ్యతిరేకులు. వీరి దృష్టిలో గాంధి ఒక సంస్కర్త మాత్రమే. 1934 లో ఏర్పడిన కాంగ్రెస్ సోషలిస్టు పార్టీని కాంగ్రెసువారు ఆహ్వానించారు. రాయ్‌వర్గం వారంతా ఈ కొత్త పక్షంలో చేరారు. ఇందుకు మసాని, పురుషోత్తం త్రికందాసులు వ్యతిరేకులు. 1934 లో తొలి పార్టీ సమావేశం బొంబాయిలో జరిగింది. రాజ్యాంగసభ కావాలని రాయ్‌వర్గం చేసిన సూచన పార్టీ ఆమోదించింది. జైల్లో వుంటూనే ఎం.ఎన్. రాయ్ పార్టీ కార్యక్రమాలపై తన ప్రభావం ప్రసరింప

చేశాడు. సోషలిస్టులు ఈవాడు అది గుర్తించటంలేదు. జైలు నుండి రాయ్ పార్టికి ఉత్తరాలు వ్రాస్తూ ప్రత్యేకపార్టీ వద్దని, క్రమేణా కాంగ్రెసు మితవాదవర్గాలు అజమాయిషీ చేసే పరిమాదం ఉందనీ హెచ్చరించాడు. 1939 నాటికిగాని ఈ సత్యాన్ని పార్టీ గుర్తించలేదు. కమ్యూనిస్టుపార్టీ 1934 నాటికి నిషేధంలో ఉన్నది. కమ్యూనిస్టులంతా వ్యక్తిగతంగా సోషలిస్ట్ పార్టీలో చేరారు. అయినా వారి పరిత్యేకతను కోల్పోకుండా జాగర్తపడుతూ వచ్చారు. సోషలిస్ట్ వర్గం గానే తప్ప, పార్టీగా వద్దని రాయ్ సలహాయిస్తూ వచ్చాడు. జాతీయైక్యతకు, వలస వ్యతిరేక పోరాటాలపై నా దృష్టి కేంద్రీకరించమన్నాడు. 1935 జూన్‌లో జరిగిన గుజరాత్ పార్టీ మహాసభలో రాయ్‌తో ఏకాభిప్రాయం వెలిబుచ్చుతూ నరేంద్ర దేవ్ మాట్లాడాడు. అయితే పార్టీని రద్దుచేసుకోటానికి యిష్టపడలేదు. 1936 లో జరిగిన మీరట్ పార్టీ మహాసభ రాయ్ అభిప్రాయాన్ని ఆమోదించింది. దీర్ఘకాలిక, తక్షణ లక్ష్యాలను విడమరచి చూడటానికి అంగీకరించింది.

1937 లో సోషలిస్ పార్టీనుండి మూకాలుగా బయటకు రావాలని రాయిస్టులు తీర్మానించుకున్నారు. జయప్రకాశ్ ఆశ్చర్యపోయి రాయ్‌ను విమర్శించాడు. జవహర్‌లాల్ నెహ్రూ ఆదినుండి యీ పార్టీకి సానుభూతి చూపిస్తున్నా ఎన్నడూ అందులో సభ్యత్వం పుచ్చుకోలేదు. సోషలిస్ట్ పార్టీని చీలదీయటానికి రాయ్‌వర్గం కుట్రపన్నినట్లు మసాని ఆరోపిస్తూ, ఒక పత్రాన్ని చదివాడు. కాని అది తమదికాదని రజని, ఛాల్లెస్ వంటి రాయిస్టులు త్రోసిపుచ్చారు. 1937 నాటికి ఇ.ఎం.ఎస్.

నంబూద్రిపాద్, సజ్జాద్‌జహీర్‌లు సోషలిస్టుపార్టీ కార్యాల యంలో పాతుకపోయారు. కమ్యూనిస్టులు సోషలిస్ట్ పార్టీని ఆక్రమించుకోటానికి కుట్రపన్నారంటూ మసాని కొన్ని ఆధా రాలు బయటపెట్టాడు. అప్పటినుండి కమ్యూనిస్టులను చేర్చు కోరాదని, పార్టీనుండి వారిని పంపేయాలని తీర్మానించు కున్నారు. అప్పటికే కిసాన్, ట్రేడ్‌యూనియన్‌లో బాగా ప్రాబల్యం పొందిన కమ్యూనిస్టులు సోషలిస్ట్ పార్టీని బాగా బలహీనపరచగలిగారు. కమ్యూనిస్టుపార్టీని వెళ్ళగొట్టటానికని లోహియా, అశోక్ మెహతా, మసాని, అచ్యుత పట్వర్ధన్‌లు 1939 లో కార్యవర్గానికి రాజీనామా యిచ్చారు. అంతవరకు కమ్యూనిస్టులపట్ల సానుభూతితో వున్న జయప్రకాశ్ కూడా వారిని తొలగించటానికి ఆమోదించాడు. అసలు కమ్యూనిస్టు లను తొలిదశలో చేర్చుకోటానికి జయప్రకాశ్ నారాయణే కారణం.

గాంధీకి ప్రత్యామ్నాయ నాయకత్వాన్ని పెంపొందించ మని సోషలిస్ట్ పార్టీకి ఎం. ఎన్. రాయ్ సలహా చెబుతూ వచ్చాడు. 1936 లో నెహ్రూ తమపార్టీకి అధ్యక్షుని చేయా లనే సోషసిస్టుల ప్రయత్నాన్ని గాంధీ పడనివ్వలేదు.

లక్నో కాంగ్రెసు సమావేశంలో సోషలిస్ట్‌పార్టీ కాంగ్రె సుకు అనుబంధం కావాలనే తీర్మానం వీగిపోయింది. నెహ్రూ సోషలిస్ట్‌పార్టీని బలపరిచాడు. ప్రజలతో సన్నిహిత సంబంధం వుండాలనే రాయ్ తీర్మానం నెగ్గింది.

స్వరాజ్యపార్టీ కొత్తవలస విధానానికి మద్దత్తు చేకూర్చు తుందనీ, రాజీపడుతుందనీ, అయితే ఎన్నికలలో పాల్గొనటం

వలన రాడికల్ కార్యక్రమాలకు ఆనుకూల్యత చేకూరుతుందని రాయ్ అభిప్రాయపడ్డాడు. సోషలిస్టులు వ్యతిరేకించారు. సోషలిస్టుల వ్యతిరేకతను లెక్కించక, కాంగ్రెసు అధికారాన్ని 1937 లో స్వీకరించింది.

క్రమశిక్షణకోసం కాంగ్రెసు నియమ నిబంధనావళి ఆమోదించాలనే తీర్మానంవలన, ఎ. ఐ. సి. సి. కార్యాలయ కార్యదర్శిగావున్న లోహియా, జడ్. ఎ. అహమ్మద్‌లు రాజీ రాజీనామా ఇవ్వాల్సి వచ్చింది. గాంధేయ సూత్రాలపై నమ్మకం వెల్లడించే తీర్మానాన్ని త్రిపురీ కాంగ్రెస్‌లో పంత్ ప్రవేశపెట్టగా సోషలిస్ట్‌లు తాటస్థ్యం వహించారు. వామపక్షాలన్నీ ఐక్యం కావాలనే రాయ్ ప్రతిపాదనను సోషలిస్టులు అంగీకరించినా, గాంధీ నాయకత్వ విషయంలో రాజీపడ్డారు. ఈ విషయంలో సోషలిస్ట్ వర్గం తప్పుచేసిందని మధులిమాయే విమర్శించాడు. (సోషలిస్ట్ పార్టీ పరిణామం – పుట 1) బోసును బలపరచవలసిందిగా గాంధీని కోరుతూ రాయ్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సోషలిస్టులు బలపరచలేదు. ఆ విధంగా వామ పక్ష ఐక్యతకు సోషలిస్టులు, కమ్యూనిస్టులు కలసిరాలేదు. తరువాత వామపక్ష ఐక్యసంఘటన ఏర్పాటులో చేరిన సోషలిస్టులు, వెన్వెంటనే తొలిగి పోయారు.

రాంఘర్ కాంగ్రెసు మహాసభలో వామపక్షాల తరఫున ఎం. ఎన్. రాయ్ పోటీచేశాడు. గాంధేయ పక్షంలో ఆజాద్ ఉన్నాడు. సోషలిస్ట్‌లు రాయ్‌ని బలపరచలేదు.

క్విట్ ఇండియా వుద్యమంలో సోషలిస్టులు ప్రముఖ పాత్ర వహించి, బ్రిటిష్ వారితో యెలాంటి ఒడంబడిక అయినా

సరే చేసుకోటానికి విరాకరించారు. నాయకులందరు జైళ్ళ నుండి 1946లో గాని బయటకు రాలేదు. జయప్రకాశ్, లోహియా కూడా విడుదలచేయబడ్డారు. రాజ్యాంగ సభ యేర్పరచటానికి కాంగ్రెసు అంగీకరించటం యిష్టంలేని జయ ప్రకాశ్ విమర్శలకు దిగి, పోరాటం సాగించాలన్నాడు. అయినా నెహ్రూ కోరికపై 1946 సెప్టెంబరులో కార్య వర్గ సభ్యుడుగా కాంగ్రెసులో బాధ్యతల్ని అమోదించాడు జయప్రకాశ్. కాని కార్యదర్శిగా సోషలిస్టు యెన్నిక కానం దుకు నిరసనగా రాజీనామా చేసాడు.

1946 లో కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీపై గల నిషేధం తొలగించబడింది. 1947 ఫిబ్రవరి 28 నుండి మార్చి 1 వరకు కాన్పూరులో తొలిసమావేశం జరిపి, ప్రజాస్వామ్యం లేకుండా సోషలిజం సాధ్యంకాదనేది మార్క్స్ జపు మూలసూత్రం అని విడమరచారు.

స్వాతంత్ర్యానంతరం కాంగ్రెసు ఒక తీర్మానంచేస్తూ యితర రాజకీయ పక్షాలలో ఎవరూ సభ్యులుగా వుంటూ కాం గ్రెసులోనూ కొనసాగటానికి వీల్లేదన్నది. దానితో కాంగ్రె సును వశపరచుకోలేమని భావించిన సోషలిస్టులు తెగతెంపులు చేసుకొని వేరేమార్గం చూచుకోక తప్పందికాదు. ప్రజా స్వామిక వ్యతిరేక పక్షంగానూ పాత్ర వహించాలని సోషలిస్ట్ పార్టీ సంకల్పించింది.

కాంగ్రెసు సోషలిస్టు పార్టీలో అందరూ సభ్యులుగా చేర టానికి అర్హులుకాదు. భారతజాతీయ కాంగ్రెసు సభ్యులై వుం డాలి. ఇతర రాజకీయ, మతపక్షాలతో సంబంధంగలవారై

వుండకూడదు. కొత్తగాచేరినసభ్యుడు రాష్ట్రీపార్టీలో మూడు మాసాలపాటు సంతృప్తికరంగా పనిచేస్తే, అప్పుడు అతన్ని పూర్తిగా స్వీకరిస్తారు. లేకుంటే నిరాకరించవచ్చు. వారానికి పధ్నాలుగు గంటలపాటు సభ్యుడు పార్టీ పనిచేయాలి. తొలి దశలో యీ నిబంధనలన్నీ కమ్యూనిస్టు వాసనలుగలవి. ఈ పార్టీ లక్ష్యాలు :

1. ఆర్థికాభివృద్ధి ప్రణాళిక ప్రభుత్వ అజమాయిషీలో వుంటుంది.

2, ఉత్పత్తి పంపిణీ, మారకం అన్నీకల్సిమేణా సమాజ పరమౌతాయి

3. ఉత్పత్తిదారులకే అధికారం బదిలీచేయబడుతుంది.

4. విదేశీ వర్తకం రాజ్యపరమౌతుంది.

5. భూస్వాములు, సంస్థానాధీశులు, దోపిడీదారుల తొలగింపు

6. రైతుల కార్మికుల అప్పులు తొలగిస్తారు.

7. రైతులకు భూమి పంపిణీ.

8. సహకార ససుష్టి వ్యవసాయ క్షేత్రాల్ని ప్రభుత్వమే. ప్రోత్సహిస్తుంది.

9. మతాలకు మద్దత్తు, విచక్షణ వుండదు. కులం, వర్గం గుర్తించబడవు.

10. పనిచేసే హక్కు అందరికీ యివ్వటం.

సోషలిస్టులను కాంగ్రెసులోనే అట్టిపెట్టాలని గాంధి భావించి, 1947 లో కాంగ్రెసు అధ్యక్షస్థానానికి జయప్రకాశ్

నారాయణ, నరేంద్రదేవ్ వేర్లను సూచించాడు. ప్రభుత్వ స్థానాల్లో కూడా సోషలిసులు వుండాలని ఆయన వుద్దేశం. ఈ విధానంవలన సోషలిస్టులు కాంగ్రెసునుండి బయట బడలేక పోయారు. కాని కాంగ్రెసులో సోషలిస్టులు వుండటాన్ని వ్యతిరేకిస్తూ వల్లభాయిపటేల్, ఎస్. కె. పాటిల్, గోవింద వల్లభపంత్, హరేకృష్ణ మెహతాబ్, రాజేంద్రప్రసాద్ గారలు తమ ధోరణి వ్యక్తపరచారు. గాంది హత్య అనంతరం వీరిది పైచేయికాగా సోషలిస్టులు తప్పనిసరిగా బయట పడాల్సి వచ్చింది.

అప్పటికే సోషలిసు నాయకత్వంలో మూడు ధోరణులు వెల్లడై నయ్. మార్క్సిజాన్ని వాంఛిస్తూ జయప్రకాశ్, నరేంద్రదేవ్‌లు; సోషల్ ప్రజాస్వామ్యాన్ని కోరుతూ మీనూ మసాని, అశోక్ మెహతాలు; అహింస, వికేంద్రీకరణ మొదలైన గాంధేయ పద్ధతులతో సోషలిజం కావాలని రామమనోహర్ లోహియా, అచ్యుతపట్వర్ధన్‌లు వున్నారు. నెహ్రూతోనూ, కాంగ్రెస్‌తోనూ నిస్పృహచెందిన లోహియా, సోషలిస్టుపార్టీకి ఉజ్జ్వల భవిష్యత్తువుందని వూహించిన అశోక మెహతా, తప్పనిసరై బయటబడిన జయప్రకాశ్‌గార లుండటంవలన సోషలిస్టు సంస్థలో ఐక్యత కుదరలేదు. కాంగ్రెసులో యితర రాజకీయ పక్షాలను నిషేధిస్తూ తీర్మానం చేయటంలో, 1948 మార్చిలో నాసిక్ సమావేశం కాంగ్రెసునుండి చీలి సోషలిస్టుపార్టీగా రూపొందటానికి నిశ్చయించుకున్నది.

అశోకమెహతా, జయప్రకాశ్, లోహియాలు గాంధి తత్వాన్ని మార్క్సిజాన్ని పెనవేసి, ఆచరణ సాధ్యమైన కార్య

క్రమాన్ని చేపట్టాలని నిశ్చయించారు. డెమొక్రటిక్ సోషలిజం లక్ష్యంగా పేర్కొన్నారు. పార్టీ సభ్యత్వం అందరికీ వుండాలని నిశ్చయించారు. 1949 నాటికి ప్రజాస్వామిక రాజ్యాంగాన్ని పార్టి ఆమోదించింది. అయితే పార్టీ అదుపు అంతా నాయకులే చేయటం, నాయకులను పీరారాధనచేసే కార్యకర్తలుండటం పరిధాన లోపాలుగా వున్నయ్. కేంద్రీ నాయకుల పెత్తనం తిరుగులేనిదిగా సాగింది. ముఠాలు వుండేవి. చీలికలు పెరిగాయి. నాయకులనుండి వచ్చే యే ప్రతిపాదనా ఎవరూ చేపట్టేవారు కాదు.

ప్రథమ ఎన్నికలకై సోషలిస్టు ప్రణాళికను ప్రజల ముందుంచారు. 1951 జులై 4 న గ్రామం. ప్రాంతం, రాష్ట్రం. కేంద్రం అనే నాలుగు పునాదులపై నిర్మాణం జరుగుతుందని, జమిందారీ పద్ధతిరద్దుచేసి, ఆహారవిధానానికిఅత్యంతప్రాముఖ్యత నిచ్చి, పారిశ్రామికీకరణ అభివృద్ధి చేయటానికి యీ ప్రణాళిక పథకం చూపింది. కాంగ్రెసును తీవ్రంగా విమర్శించింది. కాంగ్రెసు తర్వాత ఆధికస్థానాలో అభ్యర్థులమ నిలబెట్టగలిగింది. ఓట్లు వచ్చినా సీట్లు రాకపోవటంతో నిస్పృహ నిరాశలు జనించాయి. పరిదాన ప్రతిపక్షంగా ఆవిర్భవిస్తామని ఆశించిన సోషలిస్టులు ఆ ఖ్యాతిని కమ్యూనిస్టులకిచ్చి, స్వయం పరిశీలనకు ఉపక్రమించారు. .1952 మే 23-27 లో. ఆశోక మెహతా, ప్రేమ్‌భాసిన్‌ల నివేదిక చర్చించారు. నరేంద్రదేవ్ స్థానే లోహియా అధ్యక్ష స్థానంలోవుండి సోషలిజం హింసను, విడనాడి, ప్రజాస్వామికంగా సాగాలనటం చర్చలలో వుద్రేకత తెచ్చింది. జయప్రకాశ్ కూడా లోహియా ధోరణిని సమర్థిం

చాడు. తిరోగమన మతపక్షాలైన హిందూమహాసభ, జనసంఘ్ రామరాజ్య పరిషత్‌లతో యెలాంటి సంబంధం పెట్టుకోగూడ దని లోహియా నొక్కి వక్కాణించాడు. అయితే సోషలిజం భారతీయ విధానంగా రూపొందించటానికి అనువుగా కిసాన్ మజ్దూర్ ప్రజాపార్టీ, షెడ్యూల్డ్ కులాల ఫెడరేషన్, ఫార్వర్డ్‌బ్లాక్, రివల్యూషనరీ సోషలిస్ట్‌పార్టీ, పెజంట్స్ అండ్ వర్కర్స్ పార్టీ, రివల్యూషనరీ కమ్యూనిస్టు పార్టీతో పొత్తు కుదుర్చుకోవచ్చని లోహియా వుద్దేశం. ఎన్నికల ఓటమిని చర్చించిన అనంతరం కిసాన్‌మజ్దూర్ ప్రజాపార్టీతో పొత్తు విషయం చర్చలు జరిపారు. ఎన్నికలముందు జరిపిన విఫల ప్రయత్నం తిరిగి కొనసాగించారు. 1948 నుండి 1952 నాటికి సోషలిసుపార్టీ నాయకత్వంలో చాలా మార్పులు వచ్చాయి. మసాని, యూసఫ్ మెహరాలీ, కమలాదేవి, అచ్యుతపట్వర్ధన్ గారలు తొలగిపోయారు. అరుణా అసఫాలీ తన వర్గంతో సహా కమ్యూనిస్టులలో చేరింది.

ముందు పార్లమెంటులో కలసి పనిచేయటానికి ఒడంబడిక కుదుర్చుకున్న సోషలిస్ట్ కిసాన్ మజ్దూర్ ప్రజాపార్టీలు, 1952 సెప్టెంబరు 26,27 లో బొంబాయిలో సమావేశమై కలిసి పోటానికి నిర్ణయించుకున్నారు. కొత్తపార్టీకి ప్రజా సోషలిస్ట్ పార్టీ అని నామకరణం చేశారు. కృపలానీ అధ్యక్షుడుగా, అశోక్ మెహతా కార్యదర్శిగా సరికొత్త కార్యవర్గం వచ్చింది. వీరిలో ఫార్వర్డ్ బ్లాక్ కూడా చేరింది. దేశంలో క్రమేణా రెండు పక్షాలు యేర్పడతాయనీ, సనాతను లంతా

కాంగ్రెసులోనూ, అభివృద్ధి కాముకులంతా తమలోనూ చేరతా రని పి. ఎస్. పి భావించింది.

1953 లో కాంగ్రెసు, పి. ఎస్. పి. సహకరించి పని చేయాలంటూ నెహ్రూ జయప్రకాశ్‌లు చర్చలు జరిపారు. జయప్రకాశ్ నారాయణ అశోక్ మెహతాలు సహకరించటానికి మెత్తబడ్డారు. అసలు చర్చలకు హాజరుకావటానికి గూడా లోహియా ఒప్పుకోలేదు. నరేంద్రదేవ్, కృపలానీ కూడా సహకారానికి విముఖత చూపారు. ఓడంబడికకై 14 సూత్రాల కార్యక్రమాన్ని రూపొందించి, నెహ్రూకు పంపగా ఆయన శీతకన్ను వేశాడు. అంతటితో సహకారానికి స్వస్తిపలికారు యిరుపక్షాలవారూ.

1953 జూన్ 14-18 న పి. ఎస్. పి. బేతుల్‌లో ప్రత్యేక సమావేశం జరిపి సహకార చర్చలను సమీక్షించింది. బాధ్యతాయుతమైన సహకారం యివ్వాలని అశోకమెహతా, జయప్రకాశ్ గారలు తద్వ్యతిరేకంగా లోహియా నిలబడ్డారు. లోహియా వుగ్రవిమర్శకు నిరసనగా జయప్రకాశ్, అశోక మెహతా, మరికొందరు పార్టీలో తమ పదవులకు రాజీనామా యిచ్చారు. కాని లోహియా స్వయంగా కోరటంతో మళ్ళీ ఉపసంహరించుకున్నారు. లోహియా, అశోక మెహతాలు కార్యదర్శులుగా ఒకసంఘాన్ని వేసి కార్యక్రమాన్ని రూపొందించ మన్నారు. అప్పటికే జయప్రకాశ్ నారాయణ భూదానోద్య మం పట్ల మొగ్గు చూపుతున్నాడు. అదికూడా విమర్శలకు తావిచ్చింది.

అదే సంవత్సరం అలహాబాద్‌లో జరిగిన సమావేశం వుమ్మడి మంత్రివర్గాలు, ఐక్యసంఘటనలు వ్యతిరేకిస్తూ, అత్యవసర పరిస్థితిలో మాత్రం కేంద్రంలో జాతీయ మంత్రివర్గం యేర్పరచవచ్చని తీర్మానించింది. ఇది లోహియాకు విజయంగా భావించిన జయప్రకాశ్ ఆయన్నే కార్యదర్శిగా పరితి పాదించాడు. కృపలానీ అధ్యక్షుడుగా వున్నాడు. జయప్రకాశ్ రాజకీయాలనుండి దూరమై భూదానోద్యమంలో భాగా పాల్గొనటానికి అది నాంది. కాంగ్రెసుకు కమ్యూనిస్టులకు సమాన దూరంలో వుంటూ, అత్యవసర ఆవశ్యకతను నిరూపించాలని లోహియా సిద్ధాంతం.

తిరువాన్కూరు – కొచ్చిన్ రాష్ట్రంలో కాంగ్రెసు ప్రభుత్వం ఓడిపోగా జరిగిన వుపఎన్నికలలో (1954 ఫిబ్రవరి) పి. ఎస్. పి. కి 19 స్థానాలే వచ్చినా, సంకీర్ణ మంత్రివర్గాన్ని యేర్పరచటానికి నిరాకరించింది. కాంగ్రెసు మద్దత్తుతో సోషలిస్టు మంత్రివర్గాన్ని యేర్పరచింది కమ్యూనిస్టు రవాణా సమ్మెను, తమిళనాడు కాంగ్రెసు 'విముక్తిదినం' జరపటంతో కొట్లాటలు సంభవించగా పోలీస్ జరిపిన కాల్పులవలన నలుగురు మరణించారు. అప్పటికే సోషలిస్టులు అపఖ్యాతిపాలయ్యారు. పరితిదానికీ కాంగ్రెసుపై ఆధారపడక తప్పలేదు. ఈ సమయంలో కాల్పులు జరగటంతో అలహాబాదు జైల్లోవున్న కార్యదర్శి లోహియా మంత్రివర్గాన్ని రాజీనామా ఇవ్వమన్నాడు అది జరగనందున తానే కార్యదర్శిగా రాజీనామా ఇచ్చాడు. లోహియా తన సహచరులను తీవ్రంగా విమర్శించగా, లోహియా ఏకపక్ష ధోరణిని వారు నిరసించారు. 1954 నవం

బరు 26-29 లో నాగపూర్ లో జరిగిన ప్రత్యేక సమావేశం కొత్త కార్యవర్గాన్ని యెన్నుకోటానికై నరేంద్రదేవ్‌ను అధ్యక్షుడుగా నిర్ణయించింది. నూతన కార్యవర్గంలో వుండటానికి లోహియావర్గం నిరాకరించారు. పార్టీలో చీలికలు బయటపడ్డాయి.

ఆవడి కాంగ్రెసు సోషలిస్ట్ పాటర్న్ ఆఫ్ సొసైటీ తీర్మానం చేయగా, ఆహ్వానిస్తు అశోక్ మెహతా, వెక్కిరిస్తూ మధులిమాయే అభిప్రాయాలు వ్యక్తపరచారు. మధులిమాయే అతిధోరణివలన ఒక సంవత్సరంపాటు ఆయన్ను పార్టీనుండి బహిష్కరించారు. మధులిమాయే పక్షాన లోహియా వుగ్ర సోషలిస్టులందరూ ఐక్యం కావాలంటూ నినాదం యిచ్చాడు. పార్టీ హెచ్చరికలు తృణీకరించి ప్రవర్తించిన లోహియాను కూడా బహిష్కరించారు 1955 జులైలో. లోహియా అనుచరులు చీలి స్థానికపార్టీలు స్థాపించుకున్నారు. సోషలిస్టులు స్తంభించి పోయారని, వారికి భిన్నంగా కొత్తపార్టీ పెట్టామని లోహియా చెప్పగా, నిర్మాణాత్మక విధానంలేని వ్యతిరేక వాదిగా ఆయన్ను పార్టీ విమర్శించింది.

1955 డిసెంబరు 26-30 లో గయలో జరిగిన సమావేశం నరేంద్రదేవ్ విధానాన్ని చర్చించింది. అప్పటికే పార్టీ చీలింది. కొందరు కాంగ్రెస్‌లో, కొందరు లోహియాతో కలసిపోయారు. 1956 ఫిబ్రవరిలో నరేంద్రదేవ్ మరణించారు. ఆయన సమర్పించిన ముసాయిదా విధానాన్ని పార్టీ ఆమోదించింది. కాంగ్రెస్, కమ్యూనిస్ట్, కమ్యూనల్ పక్షా

లతో పొత్తు పెట్టుకోగూడదని పారి తీర్మానించింది. అశోక మెహతా, పురుషోత్తమదాస్ త్రికందాసు గారలు నరేంద్ర దేవ్ పరిణాళికను క్యతిరేకించారు. కృపలానీ కూడా యించు మించు ఆ ధోరణే అవలంభించాడు. జయప్రకాశ్ పూర్తిగా భూదానానికి అంకితమయ్యాడు.

లోహియా అనుచరులంతా హైదరాబాద్‌లో సమావేశమై సోషలిస్టుపార్టీని స్థాపించారు. (1955 డిసెంబరు 28 1956 జనవరి 1) ప్రజాస్వామికంగా, శాంతియుతంగా సోషలిస్ట్ సమాజాన్ని స్థాపించాలని నిశ్చయించారు. పాత నిబంధనావళిని పునరుద్ధరించారు. ఏడేళ్ళలో అధికారానికి రాగాలని ఒక పథకాన్ని రూపొందించారు.

సాధారణ యెన్నికలు సమీపించేసరికి పార్టిలో చీలిక మరీ పెరిగింది. కాంగ్రెసుతో యెలాంటి పొత్తు వుండకూడదని జయప్రకాశ్, హెచ్. వి. కామత్‌లు పట్టుబట్టగా, కమ్యూనిస్టులు బలపడగూడదని అశోక్ మెహతా వాదించుకున్నారు. కాంగ్రెసును కమ్యూనిస్టులను సమానదూరంలో వుంచాలన్న పార్టీ ధోరణి పోయి, జయప్రకాశ్ అనుకోకుండా, కాంగ్రెసు వ్యతిరేకధోరణిలో కమ్యూనిస్టులకు సమీపంగా జరిగాడు. ఎన్నికలలో కాంగ్రెసేతర పక్షాలతో పొత్తు కుదుర్చుకోటానికి అధిక సంఖ్యాక రాష్ట్రాల పార్టీలకు అనుమతియిచ్చారు. 500 మంది సభ్యులైనా కనీసం వుంటేనే పార్టీ అభ్యర్థిని పెట్టాలని తీర్మానించారు. కనీసం ఓటర్లలో ఒక శాతం (1%) పార్టీ సభ్యులుంటేగాని అభ్యర్థిని పెట్టరాదని సోషలిస్ట్ పార్టీ

(లోహియాపథం) నిశ్చయించింది. 1956 డిసెంబరు 29 న జరిగిన సోషలిస్ట్‌పార్టీ సమావేశంలో (మధ్యప్రదేశ్ ప్రహ్లాదనగర్) అధ్యక్షస్థానాన్ని లోహియా నిరాకరించగా గోపాల నారాయణ సక్సేనాను ఎన్నుకున్నారు. జాతీయ పార్టీగా అప్పటికి గుర్తింపురాలేదు. శాసనసభలకు 52 స్థానాలు, పార్లమెంటుకు 8 స్థానాలు మాత్రం సోషలిస్టపార్టీ గెలుచుకున్నది.

ప్రజాసోషలిస్ట్‌పార్టీ ఎన్నికలలో ముస్లింలీగ్ నుండి (కేరళ) కమ్యూనిస్టులవరకు ఎవరితో పీలై తే వారితో పొత్తు కుదుర్చుకున్నది. శాసనసభలలో 196, పార్లమెంటులో 19 స్థానాలు గెలిచింది. 1957 సాధారణ ఎన్నికలలో. ప్రజాసోషలిస్ట్‌పార్టీ సోషలిస్ట్‌పార్టీ చీలికల ఫలితంగా కమ్యూనిస్టులు బాగా అవకాశాన్ని వినియోగించుకున్నారు. సోషలిస్టు కార్యక్రమాలు చాలా కాంగ్రెసుపార్టీ అవలంబించటం కూడా మరొక కారణం. కాంగ్రెసు కమ్యూనిస్టుల మధ్య సోషలిస్టుల భావాల విశిష్టత పలచబడింది.

1957 లో జయప్రకాశ్ ప్రజాసోషలిస్టపార్టీకి రాజీనామా యిచ్చాడు. అప్పటివరకూ ఆయన సలహాలు యించుమించు అధికార పూర్వకంగానే సాగినయ్. 1959 అక్టోబరు 16 న బొంబాయిలో పార్టీ సమావేశమై దేశాభివృద్ధికి 14 సూత్రాలు ప్రతిపాదించింది.

ప్రజాసోషలిస్ట్ పార్టీ సంయుక్త సోషలిస్ట్ పార్టీ కలిసిపోవాలనే ప్రతిపాదనలు అప్పుడప్పుడువచ్చి చర్చలు

జరిగినా అవన్ని విఫలమై, రెండుపార్టీలూ కొన్ని రాష్ట్రాల పార్టీలుగా మాత్రమే మిగిలాయి.

కేరళ, ఉత్తరప్రదేశ్, బీహార్ సంకీర్ణ మంత్రివర్గాల్లో సోషలిస్టుపార్టీ చేరినా ఏమీ సాధించలేకపోగా, మిగిలిన పార్టీల వలె ప్రవర్తించాయి.

1971 లో జరిగిన పార్లమెంటు మధ్యంతర ఎన్నికలలో ఇందిరాగాంధీ నాయకత్వానికి వ్యతిరేకంగా స్వతంత్ర, జన సంఘ్, సోషలిస్టు పార్టీలు కలిసాయి. సోషలిస్టులలో ఒకవర్గం ఈ కలియికను వ్యతిరేకించింది. ఈకలియిక దార్లంతా ఇందిరా వ్యతిరేక నినాదాలు, దూషణలు తప్ప నిర్మాణాత్మక కార్యక్రమాన్ని ప్రజల ముందుంచ లేకపోయారు. లోహియా వర్గానికి నెహ్రూ కుటుంబం ఒక పెనుభూతంగా, ఎలర్జీగా కనిపించింది. ఎన్నికలలో వీరంతా పూర్తిగా ఓడిపోయారు. వెంటనే కలయిక విచ్ఛిన్నమయింది. సోషలిస్టులో, సోషలిజం చాలా తక్కువ పాళ్ళని అర్థమయింది. ఆ తరువాత పి. యస్. పి., యస్. యస్. పి., కలసిపోయాయి. అయితే దేశంలో కొందరు సోషలిస్టులు చెదురు మదురుగా మిగిలారు గాని, సోషలిస్టు ఉద్యమం ఇంచు మించు నామరూపాలు లేకుండా పోయింది. కాంగ్రెస్‌పార్టీ సోషలిస్టు నినాదాలను చేపట్టి అటు కమ్యూనిస్టులను, ఇటు సోషలిస్టులను, బాగా దెబ్బతీసింది.

కమ్యూనిస్టు ఉద్యమాలు

రష్యా విప్లవం గమనించిన కొందరు భారతీయుల్లో మార్క్సిస్టు సిద్ధాంతాల ఆకర్షణ 1918 లోనే ప్రారంభమైంది. కాని పార్టీ పెట్టే సాహసం చేయలేకపోయారు. భారతకమ్యూనిస్టుపార్టీ తొలుత రష్యాలోని తాష్కెంట్‌లో జనించింది. దీనికి పితామహుడు ఎం. ఎన్. రాయ్. 1920 నుండీ ఇండియాకు పుంఖాను పుంఖంగా సాహిత్యాన్ని పంపించి, భావ ప్రచారం సాగించాడు రాయ్. ఇంటర్నేషనల్ ప్రెస్‌కరెస్పాండెన్స్, దివాన్‌గార్డ్ ఆఫ్ ఇండియన్ ఇండిపెండెన్స్ పత్రికలను నావికులద్వారా దేశంలోకి గుప్పింపజేశాడు. ఉత్తర ప్రత్యుత్తరాల ద్వారా అనేకమందిని ప్రభావితుల్ని చేశాడు.

1920 లో అనేకమంది భారతీయ ముస్లింలు, టర్కీపోటానికి కాలినడకన బయలుదేరారు. వారిలో కొందరిని చిక్కించుకొని, తాష్కెంట్‌లో 1920 సెప్టెంబరునుండి రాయ్ శిక్షణయిచ్చాడు. ఆసియాలో విప్లవచర్యలు కొన సాగించటానికై తాష్కెంట్‌లో రాయ్ స్థాపించిన సెంట్రల్ ఏషియాటిక్ బ్యూరో అట్లా పని ప్రారంభించింది. అయితే ఇండియానుండి వచ్చిన వారిలో కొద్దిమందే ఉపయోగపడ్డారు. ఆ కొద్దిమందితోనే 1920 నవంబరులో పరివాస కమ్యూనిస్టు పార్టీని ఏర్పరచాడు. దీని కార్యదర్శి

మహమ్మద్ షఫిక్. ఇందులో తొలిసభ్యులుగా అవనిముఖర్జి, అతనిభార్య రోసా, రాయ్ అతనిభార్య ఎవిలిన్, ముసూద్ అలీషా, అబ్దుల్‌రబ్, త్రిముల్ ఆచార్య, షేకత్ ఉస్మాని, అబ్దుల్లాసబ్దర్ గారలున్నారు. కాని సోవియట్ యూనియన్‌కు ఆఫ్ఘనిస్తాన్‌కు మధ్యగల దారివాడు కోటానికి ఆఫ్ఘనిస్తాన్ ప్రభుత్వం నిరాకరించినందువలన, తాషెక్కంట్ నుండి మాస్కోకు పార్టీని తరలించారు. 1921 జనవరినుండి భారత దేశంలో కమ్యూనిస్ట్ కార్యకలాపాలన్నీ ఎం. ఎన్. రాయ్ ద్వారా సాగించాలని, ఐరోపాలో వున్న వీరేంద్రనాథ్ ఛటోపాధ్యాయ ద్వారా కాదని నిశ్చయమైంది. 1921 ఎప్రిల్‌లో మాస్కోలో కమ్యూనిసు యూనివర్సిటీ ఆఫ్ టాయిలర్స్ ఆఫ్ ఈస్ట్ స్థాపించారు. తాషెక్కంట్‌లో శిక్షణ పొందిన వారికి మాస్కోలో ఉన్నత శిక్షణ యిచ్చారు. భారత కమ్యూనిస్టు పార్టీని ఇక్కడ పునర్వ్యవస్థీకరించారు.

1922 ఏప్రిల్ నుండి ఎం. ఎన్. రాయ్ బెర్లిన్ కేంద్రంగా, ఇండియాకు తన రచనల్ని, పత్రికల్ని, డబ్బును పంపించాడు. అయితే రామ్‌చరన్‌లాల్ శర్మ అనే మాజీబెంగాలీ బొల్షెవిస్ట్‌ద్వారా రాయ్ డబ్బు పంపిస్తుంటే, పాండిచ్చేరీలో వుంటున్న అతను, తరచు ఆ డబ్బు కాజేస్తుండేవాడు. అయినప్పటికీ జీవన్‌లాల్ ఛటర్జి, జోగేష్‌ఛటర్జి, గోపేంద్రనాథ్ చక్రవర్తి, ధరణిమొహర్ గోస్వామి, నళినీకుమార్‌దాస్ గుప్తల సహకారంతో రాయ్ భారతదేశంలో తొలికమ్యూనిస్టు కార్యకలాపాల్ని సాగించాడు.

ఇదిగాక, కార్మికోద్యమంలో కాంగ్రెసు వారంతగా పట్టించుకోనందున ఎం. ఎన్. రాయ్, అనేక కార్మికనాయకులను పరిచయం చేసుకొని, సాహిత్యం పంపుతూ, వీరితో సన్నిహితంగా వుండే నిమిత్తం బెర్లిన్‌లో లేబర్ సమాచార బ్యూరోను స్థాపించాడు. భారతదేశంలో 1917 లో స్థాపితమైన ఆల్ యిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు, కమ్యూనిస్టు కార్యకలాపాలకు బాగా ఉపకరించింది. దీనిద్వారా బోల్షివిక్ సూత్రాలు దేశంలో వ్యాపించ నారంభించాయి. అయితే యీ సంఘ ప్రభావం చాలా పరిమితంగానే నిలచింది.

1922 నాటికి దేశంలో కమ్యూనిస్టు సంఘాలు అక్కడక్కడా ప్రారంభమైనయ్. బొంబాయిలో ఎస్. ఎ. డాంగే, కలకత్తాలో ముజఫర్ అహమ్మద్, మద్రాసులో ఎం. శింగరవేలు చెట్టియార్, లాహోర్‌లో గులాంహుస్సేన్, ఉత్తర ప్రదేశ్‌లో షౌకత్ ఉస్మాని నాయకత్వాన కమ్యూనిస్టుపార్టీ మొలకెత్తింది. 1928 నుండే కమ్యూనిస్టులు ట్రేడ్ యూనియన్‌లో చొచ్చుక ప్రారంభించారు. 1922 నవంబరునాటికి కామింటర్న్‌నుండి భారత కమ్యూనిస్టుపార్టీ కార్యకలాపాలకు డబ్బు అందుతూ వచ్చింది. ఆ యేడు ట్రేడ్ యూనియన్లకు 70 వేల పౌండ్లు, పార్టీకి 35 వేల పౌన్లు, డాంగే వారపత్రిక "సోషలిస్ట్"కు 15 వేల పౌండ్లు, అలదాయి.

1922 లో గాంధీ తన సహాయ నిరాకరణోద్యమం నిలిపేయటం కూడా కమ్యూనిస్టులకు బాగా ఉపకరించింది. 1922 లో తాష్కెంట్‌నుండి, మాస్కోనుండి శిక్షణపొందిన

కమ్యూనిస్టులు దేశంలో ప్రవేశించారు. ప్రభుత్వం వీరందరినీ అరెస్ట్ చేసింది.

కమ్యూనిస్టు ఎత్తుగడలు ఎట్లా వుండాలో 1922 లో రాయ్ సూచించాడు. భారత జాతీయ కాంగ్రెసులోనే విశాల ప్రాతిపదికపై, వామపక్షాలతో కూడిన ఒక పార్టీని స్థాపించాలి. దానిని రహస్య కమ్యూనిస్టు కేంద్రం అజమాయిషి చెయ్యాలి. ఈ ప్రాతిపదికపై ఇండియన్ సోషలిస్ట్ పార్టీ స్థాపించాలని డాంగే చేసిన ప్రయత్నం సఫలం కాలేదు.

ముజఫర్ అహమ్మదుకు కూడా అట్లాగే రాయ్ వ్రాశాడు. అయితే 1924 లో కాన్పూరు కుట్రకేసులో డాంగే, ముజఫర్, నళినీదాస్ గుప్తా, షౌకత్ ఉస్మానిగారలు అరెస్టు ఆయ్యారు. దీనివలన ట్రేడ్ యూనియన్ ఉద్యమం దెబ్బతిన్నది కమ్యూనిస్టు ఉద్యమం వెనుకంజవేసింది. తనను వదలేస్తే, ప్రభుత్వక్షేమానికై తన పలుకుబడిని వినియోగిస్తానని డాంగే వ్రాసుకున్నట్లుగా ఒకలేఖను మార్క్సిస్టులు 1964 లో బయటపెట్టారు. అది సరియైనది కాదన్నాడు డాంగే.

1924 సెప్టెంబరు 1 న సత్యభక్త కమ్యూనిస్టు మహా సభకు 78 మంది సభ్యులు హాజరయ్యారు. అయితే ఆ సమావేశంలో సత్యభక్త వాదిస్తూ, కమ్యూనిస్టు పార్టీకి రష్యాతో సంబంధం వుండరాదనీ, భారతీయ పార్టీగా వుండాలనీ వాదించాడు. అతనివాదన నెగ్గలేదు. రాయ్ అతన్ని ప్రభుత్వగూఢచారిగా తరువాత పేర్కొన్నాడు.

రాయ్ కోరిన ప్రకారం 1925 లో బెంగాల్ లో తొలి వర్కర్స్ అండ్ పెజంట్స్ పార్టీ నిర్మాణం జరిగింది. అయితే ప్రభుత్వం ఇట్లాంటి కమ్యూనిస్టు చర్యల్ని బహిరంగంగా సహించదని, జాగ్రత్తగా వుండమని రాయ్ హెచ్చరిస్తూ వచ్చాడు. పార్టీ కేంద్ర కార్యాలయం బొంబాయి నుండి ఢిల్లీకి మార్చినప్పుడు కూడా, అది సరైన నిర్ణయం కాదని రాయ్ విమర్శించాడు. 1982 మధ్యలో రాయ్ ఒక సూచనచేస్తూ, కమ్యూనిస్టు పార్టీ పేరును వర్కర్స్ అండ్ పెజంట్స్ పార్టీగా మార్చమని సూచించాడు. దేశంలోవున్న విప్లవశక్తుల్ని కలుపుక రమ్మన్నాడు. కాని పార్టీ నిర్మాణాన్ని విస్మరించ వద్దన్నాడు.

భారత కమ్యూనిస్టులకు తోడ్పడేనిమిత్తం 1926 లో ఇంగ్లండ్ నుండి ఫిలిప్ శ్ాప్రాట్ పుస్తక విక్రేతగా వచ్చాడు. కార్మికోద్యమావకాశాల్ని కమ్యూనిస్టులు అభ్రద్ధచేయటం గమనించిన ష్రాప్రాట్, రంగంలోకి దిగి నిర్విరామకృషి చేశాడు. అతని కృషి వలన కార్మికోద్యమానికి జీవం వచ్చింది.

1927 మార్చిలో కమ్యూనిస్టు కార్య వర్గం ఢిల్లీలో సమావేశమై, కమ్యూనిస్టుపార్టీ ఎట్లాగూ పనిచేయటం లేదు గనుక, రాయ్ కోరిన ప్రకారం రద్దు చేయనవసరం లేదన్నారు. రెండు మాసాల అనంతరం కమ్యూనిస్టు పార్టీని పునర్వ్యవస్థీకరించారు. కొమింటర్న్‌తో అనుబంధం కోరాలని తీర్మానించారు. కాంగ్రెస్‌లో రాడికల్ వర్గాన్ని పెంపొందించాలనుకున్నారు.

బొంబాయి, షోలాపూర్, కాన్పూరు, జంషెడ్‌పూర్ కలకత్తాలలో కార్మికోద్యమం బాగా పుంజుకున్నది. 1928 డిసెంబరులో అఖిలభారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెసును చేజిక్కించు కోవాలని కమ్యూనిస్టులు చేసిన ప్రయత్నం వమ్ము అయింది. కొద్ది తేడాతో ఓడిపోయారు. అయితే కార్యవర్గం లోకి చేరగలిగారు.

1928 సెప్టెంబరులో జరిగిన ఆరవ కొమింటర్న్ కాంగ్రెసుకు ఇండియా నుండి ఏడుగురు సభ్యులు వెళ్ళారుమాస్కోకు. అందులో మసూద్ అలీషా, వాబీబ్ అహమ్మద్ నసీన్ అనేవారు బ్రిటిష్ గూఢచారులనే పేరిట మాస్కోలో కాల్చేశారు. మాస్కో నుండి తిరిగి వచ్చిన అనంతరం పౌకత్ ఉస్మానీని పార్టీ బహిష్కరించింది. అప్పటికే ఎం. ఎన్. రాయ్‌ను మాస్కో బహిష్కరించింది.

అఖిలభారత వర్కర్స్ అండ్ పెజంట్స్ పార్టీ తొలి మహాసభ 1929 డిసెంబరు 21,-24 న కలకత్తాలో జరిగినప్పుడు కాంగ్రెసును వశపరచు కోవాలనే ప్రయత్నం విరమించినట్లు తీర్మానించి, మితవాద కాంగ్రెసు ధోరణిని గర్హించారు. ఆ యేడు డిసెంబరులో జి. అధికారి వచ్చిచేరి, కమ్యూనిస్టుపార్టీని పునర్వ్యవస్థీకరించాలన్నాడు. భారత కమ్యూనిసుపార్టీ అంతర్జాతీయ పార్టీ విధానాలను అనుసరించనందుకు మాస్కో తీవ్రంగా విమర్శించింది. కాంగ్రెసు పార్టీతోనూ, ఇండిపెండెంట్ లీగ్‌తోనూ ఎట్లాంటి సంబంధాలు పెట్టుకోరాదని మాస్కో ఆదేశాలిచ్చింది. 1930 లో జరగనున్న శాసనోల్లంఘ

నోద్యమాన్ని కేవలం ప్రజలవ తిడికిలొంగి చేస్తున్న నాటకంగా కమ్యూనిస్టులు కొట్టి పారేశారు. గాంధి, నెహ్రూ, బోసులను తీవ్రంగా విమర్శించారు.

1927 డిసెంబరు 30 న కమ్యూనిస్ట్ పార్టీ నుద్దేశించి రాయ్ వ్రాసిన జాబునొక దానిని బ్రిటిష్ ప్రభుత్వం బయట పెట్టింది. అందులో కమ్యూనిస్టు పార్టిని కొమింటర్న్‌తోను, వర్కర్స్ అండ్ పజంట్స్ పార్టిని లీగ్‌తోనూ అనుబంధం అయి, సామ్రాజ్య వాదంపై పోరాడమని వున్నది. ఆ తరువాత బ్రిటిష్‌వారు పబ్లిక్ సేఫ్టీ బిల్లును ఆమోదించి, కమ్యూనిస్టులపై విరుచుక పడ్డారు. మీరట్ కుట్రకేసుక్రింద కమ్యూనిస్టు ప్రముఖులనందరినీ జైలు పాలు చేశారు. 4 ఏళ్లు జరిగిన ఈ విచారణ వలన కమ్యూనిస్టు ప్రాబల్యం పెరిగి, అనేక మంది యువకులు ఆకర్షితులయ్యారు. అయితే కమ్యూనిస్టుల అతి వాదధోరణి వలన కార్మికోద్యమం మూడుగా చీలిపోయింది. 1931 లో A. I. T. U. C. కమ్యూనిస్టు ప్రాబల్యంనుండి జారి పోయింది.

1932 నుండీ కమ్యూనిస్ట్ పార్టీ ప్రాబల్యం దిన దినం క్షీణించ జొచ్చింది. ఏకాకిగా వుండొద్దని, అయితే వామ జాతీయ సంస్కర్తలను బహిర్గతం చేయమని మాస్కో సలహాలనిస్తూ వచ్చింది. ప్రజా ఉద్యమాలను, ఎత్తుగడలను అర్థం చేసుకోనందుకు కమ్యూనిస్టు పార్టీ మాస్కోలో తీవ్ర విమర్శకు గురైంది. మీరట్ కేసునుండి తొలిగా విడుదల అయిన అధికారి కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీని ఏర్పరచి, దాని తాత్కాలిక

అధ్యక్షుడుగా, నిర్మాణ కార్యక్రమాలకు ఉపక్రమించాడు. 1933 చివరకు కమ్యూనిస్టులు మళ్ళీ రాయిస్టులతో కలసి కార్మికోద్యమాల్లో కృషి సాగించారు. 1934 మధ్యలో కమ్యూనిస్టు పార్టీని బ్రిటిష్‌వారు నిషేదించారు. అనుబంధ సంస్థలకు కూడా యీ నిషేదాన్ని విస్తరించారు. 1935 లో మాస్కోవారు తమ విధానంలోని తప్పిదాన్ని సరిదిద్ది, కాంగ్రెసుతో సహకరించమని మళ్ళీ ఆదేశాలిచ్చారు.

కమ్యూనిస్టులు ఒక్కరొక్కరే వ్యక్తిగతంగా కాంగ్రెసు సోషలిస్టు పార్టీలో చేరారు 1936 లో. కాంగ్రెసు సోషలిస్టు పార్టీని స్థాపించినప్పుడు కమ్యూనిస్టులు తీవ్రంగా విమర్శించినా, కార్మికోద్యమంలో త్వరలోనే సహకరించి పనిచేయ నారంభించారు. కమ్యూనిస్టులను సభ్యులుగా చేర్చుకోటాన్ని నిషేధిస్తూ సోషలిస్టు పార్టీ తీర్మానించి, 1936 లో ఆ నిషేదాన్ని తొలగించింది. కాంగ్రెసు సోషలిస్టు పార్టీలో చేరిన కమ్యూనిస్టులు తమ ప్రత్యేక ఉనికిని జాగ్రత్తగా అట్టిపెట్టుకుంటూ వచ్చారు. క్రమేణా సోషలిస్ట్ పార్టీని ఆక్రమించుకునే ప్రయత్నం చేశారు. ఈ పార్టీని ఆక్రమించి, నాశనం చేయాలనే ఓక పత్రాన్ని మసాని బయటపెట్టగా, 1937 ఆగష్టు నుండి కమ్యూనిస్టుల్ని చేర్చుకోరాదని తీర్మానించారు. అంతకు ముందే చేరినవారిని ఉండనిచ్చారు. 1939 నుండీ కమ్యూనిస్టులు రాయ్‌పై అయినదానికీ కానిదానికీ దూషిస్తూ వచ్చారు. వామపక్ష ఐక్యసంఘటనకై రాయ్ చేసిన ప్రయత్నం కమ్యూనిస్టులు పడనివ్వలేదు.

త్రిపురి కాంగ్రెసులో వామపక్ష నాయకుడుగా వున్న బోసును కమ్యూనిస్టులు బలపరచలేదు.

1939 లో రెండవ ప్రపంచయుద్ధం ఆరంభమైనప్పుడు కమ్యూనిస్టులు దాన్నొక సామ్రాజ్యవాదకూటాల పోరాటంగా చిత్రించి, అదే అదనుగా వలస వ్యతిరేక విప్లవాన్ని ఉధృతం చేయాలనుకున్నారు. సోవియట్ యూనియన్‌పై జర్మనీ 1941 లో దాడిచేసే వరకూ కమ్యూనిస్టులు యిదేధోరణి అవలంబించారు. ఆ తరువాత యిది ప్రజాయుద్ధం అన్నారు. అప్పటివరకూ అంతర్జాతీయ గీతం ఆలాపించే క్రెమ్లిన్ యుద్ధం నుండి జాతీయగీతం ప్రారంభించి, జాతీయ కమ్యూనిజానికి నాంది పలికింది.

1940 లో కమ్యూనిస్టుల్ని సోషలిస్టు పార్టీ బహిష్కరించింది. అయితే నాటికి వివిధ నిర్మాణ శాఖల్లో కమ్యూనిస్టుల ప్రాబల్యం వేర్లు పాతుకుపోయింది. అదీగాక యుద్ధ సమయంలో కమ్యూనిస్టులపై ప్రభుత్వం నిషేదం తొలగించటం వలన, వివిధ నిర్మాణాలలో వారు బాగా నిలదొక్కుకున్నారు. జైళ్ళనుండి నాయకులు తిరిగి వచ్చేసరికి కాంగ్రెసు సోషలిస్టు పార్టీలవారు, తమ వ్యవస్థల్ని మళ్ళీ మొదలెత్తుకోవాల్సి వచ్చింది!

ద్వితీయ ప్రపంచ సంగ్రామాంతంలో గాంధీకి కమ్యూనిస్టు కార్యదర్శి పి. సి. జోషికి ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగిన అనంతరం, కాంగ్రెసు పార్టీ కమ్యూనిస్టులను తొలగించాలని,

సంజాయిషీ అడుగుతుంది. ఈలోపు కమ్యూనిస్టులే కాంగ్రెసు నుండి వైదొలగుతారు.

1946లో జరిగిన ఎన్నికల్లో మూడవ పార్టీగా కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించింది. పి. సి. జోషి నాయకత్వంపై రణదివే, అధికారి వంటివారు తిరుగుబాటు ప్రారంభించారు. అప్పుడు ఏర్పడిన నెహ్రూ ప్రభుత్వానికి కమ్యూనిస్టుపార్టి విధేయ పూర్వక సహకారం యిచ్చారు. పి. సి. జోషి నాయకత్వాన్ని ఆంధ్ర, తెలంగాణా పార్టీలు ప్రశ్నించాయి. 1948 ఫిబ్రవరి నాటికి జోషిస్థానే రణదివే కార్యదర్శి అయ్యాడు. నెహ్రూ ప్రభుత్వాన్ని బాహాటంగా విమర్శించ నారంభించారు. రణదివే నాయకత్వాన కమ్యూనిస్టు పార్టీ తిరుగుబాటు పోరాటకార్యక్రమం చేపట్టింది. నెహ్రూ ప్రభుత్వం వెంటనే ప్రముఖ నాయకులందరినీ జైలుపాలు చేసింది రణదివే దుందుడుకు నాయకత్వాన్ని జోషి తీవ్రంగా విమర్శిస్తూవచ్చాడు. ఆజయ్‌ఘోష్ డాంగేలు కూడా రణదివేను విమర్శించారు. తెలంగాణాలో కమ్యూనిస్టుల నాయకత్వాన నైజాం వ్యతిరేకపోరాటం కొన్ని జిల్లాలలో సఫలమైంది. ఆంధ్రపార్టీకూడా ఈ పోరాటానికి మద్దత్తు యిచ్చింది. ఆంధ్రపార్టీ మావో ఆచరణ సిద్ధాంతాలపట్ల సుముఖత ప్రకటించింది. తెలంగాణా వంటి పోరాటం ఆంధ్రలో తేవాలని ప్రయత్నించిన కమ్యూనిస్టు పార్టీ, తరువాత ప్రజలు తమకు సహకరించ లేదన్నారు. 1950 మేనాటికి రణదివే స్థానే చంద్ర రాజేశ్వరరావు పార్టీ కార్యదర్శి అయ్యాడు. రణదివే వలె రాజేశ్వరరావుకూడా దుందుకుడుగా వున్నదంటూ పి. సి. జోషి తీవ్ర విమర్శ చేశాడు. 1951 మే

నాటికి చుండ్ర రాజేశ్వరరావు స్థానే అజయ్‌ఘోష్ కార్యదర్శి అయ్యాడు. మొత్తంమీద 1948 నుండి 51 వరకు సాయుధ తిరుగుబాటు కార్యక్రమాలు చేపట్టిన కమ్యూనిస్టు పార్టీ స్వయంకృతాపరాధాల్ని అంగీకరించింది. కాని ఆంధ్ర. బెంగాల్. బొంబాయి రాష్ట్రాలలో కమ్యూనిస్టుల ప్రాబల్యం బాగా పాదుకున్నది. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ప్రకాశం నాయకత్వాన మంత్రివర్గం ఏర్పాటు చేయాలని కమ్యూనిస్టులు విఫల ప్రయత్నం గావించారు.

1953 డిసెంబరు 27 నుండి 1954 జనవరి 4 వరకు మధురైలో సమావేశమైన కమ్యూనిస్టు పార్టీ తీవ్రచర్చలతో విభేదాలను జయటపెట్టుకున్నది. మరో ప్రక్క నెహ్రూప్రభుత్వం విదేశీ తటస్థవిధానాన్ని అవలంబిస్తూ వచ్చింది. 1954 జూన్‌లో చౌఎన్‌లై భారతదేశం వచ్చిన ఫలితంగా పంచశీల సూత్రాలు వచ్చాయి. నెహ్రూ ప్రభుత్వం సంస్కరణ వాదాన్ని అవలంబిస్తున్నదని పి. రామమూర్తి విమర్శిస్తే రష్యావెళ్ళి వచ్చిన అజయ ఘోష్ నెహ్రూ ప్రభుత్వం పూరిందిగనుక, బల పరచాలన్నాడు. చైనా పర్యటించి వచ్చిన నెహ్రూ భారత కమ్యూనిస్టులను తీవ్రంగా విమర్శిస్తూ మాట్లాడాడు.

1956 లో ఆంధ్రలో జరిగిన మధ్యంతర ఎన్నికలలో ప్రభుత్వాన్ని చేపట్టినట్లే కమ్యూనిస్టులు భావించారు కానిదారుణంగా ఓడిపోయారు. ఆ తర్వాత పార్టీలో చీలికలు వెరిసోయాయి, ఇదిట్లావుండగా సోవియట్ నాయకులు బుల్గానిన్ క్రుశ్చేవ్‌లు భారత పర్యటన చేయటంతో కమ్యూనిస్టు పార్టీ

మరీ దెబ్బతిన్నది. వారు వచ్చే విషయం పార్టీకి తెలుపలేదు కూడా. 1956 లో స్టాలిన్ కిరాతక కృత్యాల గురించిన కృశ్చేవ్ నివేదిక వెల్లడి గావటంతో కమ్యూనిస్టులు మరీ యిబ్బందిలో పడారు.

1957 ఏప్రిల్‌లో జరిగిన ఎన్నికలలో తొలిసారిగా కేరళలో కమ్యూనిస్టులు అధికారానికి వచ్చారు. రాజ్యాంగ బద్ధంగా ఎన్నికలలో గెలిచి అధికారం చేపట్టటంతో వారి ఆలోచనలో చాలా మార్పులు వచ్చాయి. ఆచరణలో ఎన్నో యిబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. కేరళలో పాలన సాఫీగా సాగలేదు. చట్టం విఫలమైందనేది వారిపై ప్రధాన ఫిర్యాదు. ఇందిరాగాంధి కూడా పర్యటించి, కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని తొలగించాలన్నది. ప్రదర్శకులపై కాల్పులు జరపాల్సివస్తే, ప్రభుత్వాన్ని రాజీనామా యివ్వమంటా మన్నాడు పార్లమెంట్‌లో డాంగే. అచిరకాలంలోనే పెద్ద ఆందోళన జరిగిన కారణంగా కేరళలో కమ్యూనిస్టు పాలన, నంబూద్రిపాద్ అజమాయిషి రద్దు అయింది.

కమ్యూనిస్టు ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యా చట్టానికి నిరసనగా కేరళలో 7 వేల పాఠశాలలు తిరిగి తెరవమని సమ్మె చేశారు 1959 మే లో. కాంగ్రెసు పార్టీ ఆందోళనను పరాకాష్ఠకు తీసుకెళ్ళింది. హింస వికటాట్టహాసం చేయగా 1959 ఆగస్ట్‌లో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని రాష్ట్రపతి పాలన ప్రవేశపెట్టింది. అయితే 1960 ఫిబ్రవరిలో జరిగిన ఉపఎన్నికలలో కమ్యూనిస్టులు బాగా ఓడిపోయారు.

కాంగ్రెసు, ప్రజా సోషలిస్ట్ పార్టీ, ముస్లింలీగ్‌లు ఐక్యమయ్యాయి.

కమ్యూనిస్టు పార్టీ కేరళ, బెంగాల్ రాష్ట్రాలలో పాదుకొనిపోయింది. అలాంటి సమయంలో చైనా-యిండియా సరిహద్దు పోరాటం వచ్చింది. మక్‌మోహన్ రేఖ దాటి చైనా భారత భూ భాగాన్ని ఆక్రమించటంతో కమ్యూనిస్టు పార్టీలో తీవ్ర అభిప్రాయభేదాలు యేర్పడినయ్. రష్యా అనుకూలవర్గం చైనా దురాక్రమణను ఖండించగా, చైనా మద్దత్తుదారులు చైనాతో యిండియా సంప్రదింపులకు దిగాలన్నారు. ఈ చీలిక కొంతకాలం పార్టీ లోపలే అణగివుంటూ 1964 లో బాగా బయటపడింది. 1959 లో ప్రారంభమైన పొరపొచ్చాలు చివరకు కమ్యూనిస్టు పార్టీని రెండుగా చీల్చాయి. భారత కమ్యూనిస్టు పార్టీ డాంగే నాయకత్వాన రష్యా అనుకూలవర్గంగా చలామణి అవుతున్నది. (C. P. I.) చైనాకు దగ్గరగా ఆలోచించే వర్గం కమ్యూనిస్టు–మార్క్సిస్టు పక్షమైంది (C P I-M). కమ్యూనిస్టు నాయకులు, కార్యకర్తలు అన్నిరంగాల్లోనూ బాగా చీలిపోయారు. కార్మిక సంఘాలలోనూ యీ చీలిక 1969 నాటికి పూర్తి అయింది.

1967 లో జరిగిన సాధారణ యెన్నికలలో కేరళ రాష్ట్రం మార్క్సిస్టు నాయకత్వాన నంబూద్రిపాద్ ముఖ్యమంత్రిగా అధికారం కమ్యూనిస్టులకు అప్పగించింది. బెంగాల్‌లో ఐక్య సంఘటనలు తప్పలేదు. బీహార్‌లోనూ అంతే. చివరకు జనసంఘ్‌తో కలసి తాత్కాలికంగా మంత్రి

వర్గంలో చేరారు కమ్యూనిస్టులు బీహార్‌లో, బెంగాల్‌లో మంత్రివర్గాన్ని పడగొట్టటంలో కమ్యూనిస్టులు ప్రముఖపాత్ర వహించారు. తర్వాత జరిగిన ఉప ఎన్నికలలో మార్క్సిస్టులు ఏకపక్షంగా అధికసంఖ్యలో నెగ్గినా మంత్రివర్గాన్ని యేర్పాటు చేయటానికి యితరపక్షాల సహాయం తప్పలేదు. అయితే ముఖ్యమైన హోంశాఖ స్వీకరించి జ్యోతిబసు తన మార్క్సిస్టు శాఖ ప్రాబల్యాన్ని అట్టిపెట్టటంలో కృషి చేశాడు. కాని బెంగాల్ రాష్ట్రం అరాచకం గావటంతో ముఖ్యమంత్రిగా వుంటున్న అజయ్ ముఖర్జీ సహనం కోల్పోయి రాజీనామా యిచ్చాడు. మార్క్సిస్టులను విమర్శించటంలో భారత కమ్యూనిస్టులు అగ్రతాంబూలం వహించారు. కేరళలోకూడా నంబూద్రిపాద్ నాయకత్వాన్ని పడగొట్టి ప్రత్యామ్నాయంగా అధికారంలోకి రావటంలో భారత కమ్యూనిస్టులు జయించారు. అచ్యుతమీనన్ ముఖ్యమంత్రిగా కొత్త అధికారాన్ని స్వీకరించారు.

చైనాకు పూర్తిగా అనుకూలవర్గంవారు కొందరు అసలు పార్లమెంటరీ ప్రజాస్వామిక వ్యవస్థనే దుయ్యబడుతూ, ప్రత్యక్ష పోరాటంతో అధికారాన్ని చేబట్టాలని గెరిల్లా పద్ధతి అవలంభించారు. చారు మజుందార్, కానూ సన్యాల్, తరిమెల నాగిరెడ్డి మొదలైనవారు నాయకత్వం వహించారు. పశ్చిమ బెంగాల్‌లో నక్సల్ బరీ అనే కుగ్రామంలో ప్రారంభమై, తూర్పుకోస్తా ప్రాంతమంతా వీరి గెరిల్లా పోరాటం ప్రాకింది. మార్క్సిస్టులు వుండగా పశ్చిమ బెంగాల్‌లో వీరిపట్ల పూర్తి వుదాశీనత వహించటంతో వారెన్నో కీలకస్థావరాలు యేర్ప

రచుకున్నారు. విద్యార్థులను, యువకులను ఆకర్షించారు. పశ్చిమ బెంగాల్, ఆంధ్ర, కేరళలో మనుషుల్ని చంపే వుద్యమం చేపట్టారు. యువకుల ఉత్సాహాన్ని యీ విధంగా వినియోగించారు. శాసన సభలోగల తమ సానాలకు రాజీ నామా యిచ్చి రంగంలోకి దిగారు. లాటిన్ అమెరికాలో, క్యూబాలో జరిగిన గెరిల్లా పద్ధతులచే ప్రేరేపితులయ్యారు.

అయితే ఈ విప్లవ సాయుధపోరాటం అంచనా వేయటంలో నక్సలైట్ కమ్యూనిస్టులు పొరపాటు పడ్డారు. ఆధునిక ప్రభుత్వ యంత్రాంగాల బలగాన్ని అంచనా వేయలేకపోయారు. ప్రజలలో తగినంత ప్రచారంగాని, సానుభూతిగాని లేకుండా ఉద్రేకపడి తుపాకి పట్టారు. పశ్చిమ బెంగాల్‌లో నక్సల్‌బరీ ప్రాంతం, ఆంధ్రలో శ్రీకాకుళం ఏజన్సీ ప్రాంతం, విముక్తి పొందినట్లుగా ప్రకటించారు. కాని అచిరకాలంలోనే ప్రభుత్వం ప్రత్యేక పోలీసు బలగంతో చాలామందిని వశం చేసుకున్నది. మరికొందరిని కాల్చివేసింది. ఉద్యమంలో అవలంభించవలసిన మార్గాలను గురించి అనేక బేధాభిప్రాయాలేర్పడి, చీలికలు వచ్చి అనేకముఠాలుగా వేరైపోయారు. చారూ ముజుందారును నాయకత్వంనుంచి తొలిగించామన్నారు. ఆ తరువాత కొద్దికాలానికే అతను పట్టుబడి చనిపోయాడు. ఈ ఉద్యమానికి చైనా మద్దత్తుకూడా లేకుండా పోయింది. మార్క్సిస్టులు, వీరికి బద్ధ వ్యతిరేకులుకాగా కమూనిస్టులు నిరుత్సాహపడిన నక్సలైట్ ఉద్యమకారుల్ని ఆకర్షించే ప్రయత్నాలు చేసారు ఏమైనా నక్సలైట్ ఉద్య

మం వలన ప్రభుత్వం కళ్ళుతెరిచి గిరిజన సంక్షేమ పథకాలు చేపట్టింది అంతవరకూ నక్సలైట్ విజయంగానే భావించవచ్చు.

కాంగ్రెస్ చీలి ఇందిరా వర్గం. నిజలింగప్ప వర్గంగా హోరాహోరీగా సిగపట్లు పట్టుకుంటున్న రోజులలో (1970) మితవాద నాయకత్వాన్ని విచ్ఛినం చేయాలనే తలంపుతో ఉభయ కమ్యూనిస్టు పార్టీలు పార్లమెంటులోను, బయట ఇందిరాగాంధి నాయకత్వాన్ని బలపరిచాయి. 1971 పార్లమెంట్ మధ్యంతర ఎన్నికలు వచ్చేసరికి మార్క్సిస్టులు సొంత కాళ్ళపై నిలబడగా, కమ్యూనిస్టులు అధికార కాంగ్రెస్‌ను ఆశ్రయించారు. అయినప్పటికీ. వారికి అంతగా ప్రయోజనం చేకూరలేదు. కాంగ్రెస్‌లో తమ వర్గాలను కొందరిని చేర్చటం ద్వారా లోనుండి పార్టీని వశవరచుకోవాలనే దృష్టి కమ్యూనిస్టు పార్టీకి ఉండి ఉండవచ్చు. ఏ కారణంగా నైతేనేమి చాలామంది మాజీ కమ్యూనిస్టులు కాంగ్రెస్‌లో చేరారు. అధికారాన్నికూడా చేపట్టారు. మార్క్సిస్టులు ఇందిరాగాంధి నాయకత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తుంటే, కమ్యూనిస్టులు బాగా ఆమెకు సహకరించారు. కాని వీరి సహకారంపై ఆధార పడకుండానే కాంగ్రెస్ పార్టీకి లోక్‌సభలో 2/3 వంతు స్థానాలు లభించాయి. కమ్యూనిస్టు పార్టీవారు ముమ్మాపణ పూర్వకంగా తమ చర్యలను సమర్థించుకోచూసారు. కేరళలో కమ్యూనిస్టు పార్టీ కొద్ది స్థానాలే సంపాయించుకున్నా, కాంగ్రెస్ బలంతో అధికారంలోకి వచ్చారు. కాంగ్రెస్‌తో తెగతెంపులు చేసుకుంటే ఆ ఒక్కరాష్ట్రంలోకూడా ప్రాబల్యం పోతుందని ఊహించుకున్నారు. 1972 శాసన సభల ఎన్నికలలో

ఉభయ కమ్యూనిస్టు పార్టీల స్థితి మెరుగుపడలేదు. పశ్చిమ బెంగాల్‌లో మార్క్సిస్టు పార్టీ అధికారంలో ఉండగా చేసిన ఘోరకృత్యాల్ని కాంగ్రెస్ వారు ఇంచుమించు అదేరీతిలో మార్క్సిస్టుల కప్పగించారు. ఆ రాష్ట్రం కాంగ్రెస్‌కు దక్కటంతో మార్క్సిస్టు పార్టీ రెండు, మూడు రాష్ట్రాల పార్టీగా మిగిలిపోయింది.

బంగ్లాదేశ్ విముక్తి పోరాటంలో రష్యాతో ఒడంబడిక చేసుకున్న భారతదేశం, ఇందిరాగాంధీ నాయకత్వాన కమ్యూనిస్టు పార్టీని దెబ్బతీసింది. కాంగ్రెస్‌ను బలపరచటంద్వారా, తాము పెరగాలనుకున్న కమ్యూనిస్టు పార్టీ కరి మిగిన వెలగపండు వలె తయారైయింది. కనుక తమ ఉనికిని కాపాడుకోటానికి శాంతియుత ఆందోళన, తాత్కాలికంగా చేసారు కమ్యూనిస్టులు. రష్యాతో విదేశాల సంబంధాలవరకూ సన్నిహితంగా ఉంటున్న ఇందిరాగాంధీ దేశంలో కమ్యూనిస్టు వ్యతిరేకిగానే నిలబడింది. కమ్యూనిస్టులు చేసిన స్వయంకృతాపరాధాలలో ఇది ఇటీవలది.

స్వాతంత్ర్యానంతరం దేశంలో అనేక సమస్యలపట్ల ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయటంలో కమ్యూనిస్టు పార్టీ పోరాటాలు చాల తోడ్పడ్డాయి. పరిశ్రమల జాతీయకరణ, గుప్త వ్యాపారాలకు వ్యతిరేకత, భూ సంస్కరణలు మొదలైన సమస్యలలో కమ్యూనిస్టు పార్టీ పాత్ర ప్రశంసనీయమైనది. రాను రాను క్షీణించిపోతున్న ఈ పార్టీ ప్రజలకు కొత్తదారి చూపిస్తుదనే ఆశ లేదు.

REFERENCE BOOKS

1. **Victor M. Fic,** Peaceful transition to Communism in India strategy of the Communist Party, 1969 Nachiketa Publications, Bombay.

2. **Overstreet, Windmiller,** Communism in India 1959, University of California.

3 **John H. Kautsky,** Moscow and the Communist Party of India 1956 Wiley, New York.

4. **M. R. Masani,** The Communist Party in India 1954 Derek Verschoyle.

5. **M. Weiner,** Party Politics in India 1957 Princeton N. J., Princeton University Press.

6. **Myself and the Communist Party of India 1920-1929,** Muzaffar Ahmed (1970).

7. **Documents of The History of The Communist Party of India,** Edited by G. Adhikari, Vol. One, 1971 (P. P. H.)

8. వీర తెలంగాణా, నా అనుభవాలు—జ్ఞాపకాలు రావి నారాయణరెడ్డి, విశాలాంధ్ర ప్రచురణ. (1972)

9. **J. P. Haithcox,** Communism and Nationalism in India – Oxford (1971).

సర్వోదయం

గాంధి, వినోబా, జయప్రకాశ్ గారలు భారతదేశంలో సర్వోదయ సిద్ధాంతాన్ని ప్రతిపాదించి, ప్రచారం చేసి, ఆచరణలో చూపటానికి ప్రయత్నించారు. తాత్త్విక భావానికి రాజకీయ ఆర్థిక సిద్ధాంతాలు జోడించి సర్వోదయ 'మతాన్ని' సృష్టించారు.

మానవుడు మంచివాడు. పరిస్థితుల ప్రభావం వలన అంటిన చెడు సులభంగా తొలగించవచ్చు. ఆ మంచితనాన్ని వెలికితెచ్చి, పెంచటం సర్వోదయ లక్ష్యం. స్వయంకృషివలన కొందరిలో, ఇతరుల విజ్ఞప్తిచేత కొందరిలో, సత్యాగ్రహం, నిరాహారం, సహాయనిరాకరణ వంటి అహింసాయుత పద్ధతులతో మానవునిలో మార్పు తేవటం సాధ్యం. హింసను ఎట్టి పరిస్థితులలోనూ సర్వోదయం అంగీకరించదు నైతికంగానూ, ఆచరణరీత్యానూ అహింసాయుతమార్గమే సరైనది అని వీరి మూలసిద్ధాంతం.

మానవుని మంచితనం గర్భితంగా వుంటే దానిని కప్పి పుచ్చేవి యేవి? రాజ్యం, ప్రభుత్వం, పార్టీలు, చట్టాలు, యెన్నికలు అంటుంది సర్వోదయం. ప్రధానమైన దోషా లన్నిటికీ మూలం రాజ్యం. ఇందులో మానవుడిని బలవంత పెట్టి పనులుచేసే విధానం యిమిడివుంటుంది. వత్తిడి హింసకు దారి తీస్తుంది. పరిపాలనా చట్రంలో మనిషి స్వేచ్ఛ

కోల్పోతాడు. మానవుడు ఐచ్ఛికంగా వికసించే రీతుల్ని అధిక సంఖ్యాకుల పాలన వమ్ము చేస్తుంది. సారాంశ మేమంటే ప్రభుత్వం అనే సంస్థ అనవసరం. అది చాలా కృత్రిమమైనది. రాజ్యాంగాలు, చట్టాలు స్వేచ్ఛను కాపాడజాలవు.

పార్టీలు ప్రజల్ని మూకలుగా తయారుచేస్తయ్. అధికారం కోసం పార్టీ అవినీతి పనులెన్నో చేస్తుంది. ప్రజాస్వామ్యంలో విలువలను పార్టీలు అట్టిపెట్టవు పార్టీ ప్రజాస్వామ్యం కేవలం లాంఛనప్రాయమైనది. ఎన్నికలు ఒక పెద్ద తమాషా. ప్రజలలో పెచ్చుమంది యేమీ తెలియకుండానే ఓటు వేస్తారుగాని, అంతకుమించి పాల్గొనటంలేదు. పైగా ప్రజలలో విపరీతమైన చీలికలను కల్పించటానికి పార్టీలు బాగా తోడ్పడుతున్నయ్.

చట్టాలన్నీ అర్థరహితమైనవి. ప్రజలలో మార్పు రాకుండా ఎన్ని శాసనాలు చేసినా వాటికి విలువలేదు. ప్రజల్లో స్వేచ్ఛని చంపటానికి, తగాదాలు పెంచటానికి, వ్యక్తిత్వం మృగ్యమై, గుడ్డిగా అనుసరించటానికే శాసనాలు వుపకరిస్తయ్. వీటికితోడు హక్కులకై అన్వేషించటం, న్యాయస్థానాలకు పని కల్పించటం అవివేకం. పేచీలను పెంచి పోషించే పద్ధతులు అట్టిపెట్టటానికే యీ చట్టాలు పనికి వస్తున్నయ్.

సర్వోదయ సిద్ధాంతం నేటి రాజకీయ విధానాలను తీవ్రంగా విమర్శించటమే గాక, మార్గాంతరాలు చూపింది. వ్యక్తులందరూ స్వేచ్ఛగా సమానంగా నివసించే రామరాజ్యం

ోపిడీ అరికట్టి, మానవుడు పొందికగా పెంపొందుతాడు. ఉత్పత్తికీ వినిమయానికీ దగ్గర సంబంధం కలుగుతుంది. పైగా ధనంతో పనిలేకుండా పోతుంది. నాణాల అవసరం బదులు వస్తు మార్పిడీ వంటి పద్ధతులు రూపొందుతాయి. పెట్టుబడికి వినియోగపడకుండా మూలిగేధనం లేకుండా పోతుంది. ద్రవ్యోల్బణం వంటి చిక్కు పరిస్థితులకు ఆస్కారం వుండదు. వడ్డీ వ్యాపారం నశిస్తుంది.

సమానత్వం సాధించటానికి కొద్దిమంది వున్నవారు త్యాగం చెయ్యవలసి వుంటుంది. అయితే ఎవరినీ బలవంత పెట్టకుండా సమానత్వం సాధించటానికి సర్వోదయం ధర్మకర్తృత్వ సిద్ధాంతాన్ని ప్రతిపాదించింది. తన ఆస్తికి తానే ధర్మకర్తగా వుంటూ సమాజానికి సేవచేసే విధానాన్ని గాంధి సూచించాడు. అలా లేనివారికి నచ్చచెప్పాలనీ, అప్పటికీ లొంగకపోతే సత్యాగ్రహం ద్వారా సాధించాలనీ బోధించాడు. ధర్మకర్తృత్వం కేవలం తాత్కాలికమే. క్రమేణా గ్రామదానం సాధించి, గ్రామంలో ఆస్తిఅంతా గ్రామస్థుల పరమయ్యే పద్ధతులు అమలుజరిగితే అప్పుడు ధర్మకర్త అవసరం వుండదు. కనుక ధర్మకర్తృత్వం గ్రామదానానికి ప్రథమ సోపానంగా భావించవచ్చు.

గ్రామదానం తుది లక్ష్యం. దానికి ముందు అనేక మెట్లు వున్నయ్. ధర్మకర్తృత్వం తర్వాత, భూదానం పేర్కొనదగినది. తాను దున్నుకోగా మిగిలివున్న భూమిని, సాగుచేయలేని భూమిని దానం యివ్వమని వినోభా నినాదం యిచ్చాడు. 1951 లో తెలంగాణా ప్రాంతంలో పర్యటిస్తూ

యాదృచ్ఛికంగా ఒక గ్రామంలో భూదానం లభించటంతో వినోబా భావే యీ ఆశయాన్ని సిద్ధాంతీకరించాడు. ప్రభుత్వాలు కూడా భూదానానికి తోడ్పడినవి. ప్రభుత్వానికి బకాయిలు లేని భూములిని దానంగా స్వీకరిస్తారు. దీనికి ఖర్చులు యేమీ వుండవు. ఆ గ్రామంలో సహకార సంఘం వుంటే దానం యివ్వబడిన భూమి ఆ సంఘానికి సమర్పిస్తారు. ఆలా దానం చేయబడిన భూమి ఒక దశాబ్దంపాటు తిరిగి అమ్ముకోరాదు. మూడేళ్ళ వరకూ ఆ భూమిపై పన్ను వెయ్యరు. అయితే మొదటి రెండేళ్ళలో భూమిని సాగులోకి తేవాలి. కుటుంబానికి ఆరెకరాలకు మించి దానం యివ్వరు. దున్నేవాడికే భూమి అని. సాగు చేయగల భూమికి మించి వుండగూడదనే సూత్రంపై యీ భూదానోద్యమం ఆధారపడి వుంది. పంచభూతాల్లో భూమికూడా వున్నదనీ, అది భగవంతుని దనీ, ఏ ఒక్కరిసొత్తు కాదనేది వినోబా మూలసూత్రం. ఉన్నవాడు లేనివాడికై త్యాగం చేయాలనే సూత్రాన్ని బీదవాళ్ళకు సైతం వర్తింపజేస్తాడు వినోభా. ప్రభుత్వాలు ఆదాయ పరిమితులుపెట్టి సాధించగలిగినదాన్ని భూదానం ద్వారా సాధించాలని సర్వోదయ లక్ష్యం.

భూ దానంతో ఆగక వినోబా మరికొన్ని అడుగులు ముందుకువేసి సంపత్తిదానం చేయమన్నాడు. కనీసం వున్న దానిలో ఆరవ వంతు దానం చేయమంటూ, చేతి వృత్తులను ప్రోత్సహించే వారికి యిది మినహాయించ మన్నాడు.

గ్రామదానం సర్వోదయంలో పరాకాష్ఠ. గ్రామంలో భూమి అంతా పంచాయితీ పెత్తనంకిందవుంటుంది. ఏ ఇస్తి

వరి సొంతమూకాదు. శక్తికొలదీ సహకారాసికి యిచ్చి, అవసరాలకొద్దీ స్వీకరించటం అనే సూత్రం అమలు జరుగుతుంది. ఈ భావాన్ని ముందుగా అంగీకరించినవారు తమ సంపదను కలపి గ్రామ పరివారంగా ఏర్పడి, మిగిలినవారికి ఆదర్శంగా వుండాలన్నారు. 1957 నాటికి 3541 గ్రామాలు దానంగా లభించాయి. కొన్ని గ్రామాలలో ఆదర్శంగా పరిశోధనలు చేసి చూపారు. చాలా వ్యయంతోకూడిన విషయమని రుజువైంది.

సర్వోదయ సిద్ధాంతం ఆకర్షణీయమైన స్వప్నంగా కనిపిస్తుంది. కొంత అయోమయ సిద్ధాంతం కలగాపులగంగా చేశారు. మానవులందరూ భగవంతుని సృష్టి వలన మంచివారనే ప్రధాన ప్రాతిపదిక మొదటిదోషం. ఆధునిక రాజ్యం. దాని పరిమితులు, ప్రపంచంలో యితర దేశాలతో సంబంధాలు గమనించలేదు. ఇంచుమించు అసంభవమైన స్వయం సంపూర్ణ వాదాన్ని తెచ్చిపెట్టి నేటి పరిస్థితులు, అవసరాలు విస్మరించారు. ఒత్తిడిలేని సమిష్టిజీవనం వినటానికి ఆదర్శప్రాయంగా వున్నా ఆచరణలో అసాధ్యమని నియంతృత్వ దేశాల వ్యవస్థలు కూడా రుజువు చేసాయి. పార్టీలను విమర్శించటంలో సర్వోదయ సిద్ధాంతం చూపినంత వుత్సుకత మార్గాంతరాలను సూపటంలో లేదు. జీవితానికి అవధులు యేర్పరచిన సిద్ధాంతాలు కాలానికి యెదురీదినట్లే. ఆధ్యాత్మిక పులుముడుతో కలిసిన సర్వోదయం సఫలం కాజాలదని వినోబా జీవితకాలంలోనే తేలిపోయింది.

REFERENCE BOOKS

1. **Jayaprakash Narayan :** Socialism Sarvodaya an Democracy, Asia Bombay 1964.

2. **Adi H. Doctor :** Sarvodaya, a Political an Economic Study, Asia Bombay 1967.

3. **Vinoba :** Bhoodan Yajna, 1957 Navajivar Ahmedabad.

4 **Vinoba :** Revolutionary Sarvodaya, 1964 Bharatiya Vidya Bhavan, Bombay.

మోహన్‌దాస్ కరంచంద్ గాంధి

గాంధీని మహాత్మునిగా కాక మానవునిగా పరిశీలిస్తే వెలుగునీడలు కనిపిస్తాయి. ఆవునుండి ఆయుర్వేదంవరకు అన్ని సమస్యలలో పరిష్కార మార్గాన్వేషణ చేసిన గాంధి ఆచరణ వాది. గాంధి ఆద్యంతాలు రాజకీయ చతురజ్ఞుడు మిగిలినవన్నీ భిన్న కారణాలుగా చేపట్టాడు. కాంగ్రెస్ పార్టీలో యించుమించు నియంతగా ప్రవర్తించి ఉద్యమాన్ని నడపిన గాంధి జీవిత విశేషాలు తరచి చూస్తేగాని ఆయన వ్యక్తిత్వపు లోతు పాతులు అవగాహన కావు.

1869 అక్టోబరు 2న పోరుబందరు (గుజరాత్) లో, వైష్ణవ, జైన సంప్రదాయాలు గల వైశ్యకుటుంబంలో గాంధి జన్మించాడు. తల్లిచాటు పిల్లవాడుగా పెరిగినగాంధి తండ్రితో పాటు రాజకోటకు వస్తాడు. అక్కడే విద్యాభ్యాసం. గాంధి విద్యారంగంలో సాధారణ వ్యక్తి. అందరి పిల్లలవలె అన్ని విషయాల పట్ల ఆసక్తి కనబరచాడు. పాఠశాలలో ఇతనికి రాజకోట పోలీస్ ఛీఫ్ కుమారుడు షేక్ మెహతాబ్ స్నేహితుడయ్యాడు. గాంధీపై మెహతాబ్ ప్రభావం చాలా వున్నది. ఆ స్నేహంలో గాంధి బీడీలు త్రాగాడు, మాంసాహారం రుచి చూచాడు, వ్యభిచార గృహాలు సందర్శించాడు.

1882లో గాంధికి కస్తూరిబాతో వివాహమైంది. అది బాల్య వివాహం. అప్పటికి గాంధీకి 13 ఏండ్లు, కస్తూరిబాకు

8 ఏండ్లు, పెండ్లిజరిగిన మూడేళ్ళకే తన తండ్రికి పెద్ద జబ్బు చేయగా రాత్రి బవళ్ళు దగ్గరుండి గాంధి సేవ చేశాడు. చని పోయే రోజున, అంతవరకూ శుశ్రూష చేస్తున్న గాంధి భార్య వద్దకు వెళ్తాడు. వారిరువురు కలసి వుండగా, తండ్రి మరణ వార్త అతనికితెలుస్తుంది. అప్పటికే భార్య గర్భిణి కామ్ పై గాంధికి విరక్తి, జుగుప్స జనించటానికి, తండ్రి మరణ సమయంలో తాను ఆపనిలో నిమగ్నమై వుండటం కొంత కారణం. ఆదిగాక గాంధి బాల్య యవనదశ అంతా కామ పూరితమే. కస్తూరిబా తరచు గాంధి బాధ పడలేక పుట్టింటికి వెడితే ఇతను వెంటనే వెళ్ళి ఆమెను స్వగృహానికి తెస్తుండే వాడు. యవ్వన ప్రాయానికే అన్నీ ఉడిగిపోయిన గాంధి, ఉత్తరోత్తరా, వివాహితుల్ని కూడా బ్రహ్మచర్యం అవలంబించమని సలహా యిచ్చాడు.

1888లో సమల్ దాస్ కళాశాలలో ప్రవేశించి, మూడు మాసాలకే తిలోదకాలిచ్చాడు. అప్పటికే హరిలాల్ పుట్టాడు. ఆ సెప్టెంబరులో ఇంగ్లాండ్ ప్రయాణం తలపెట్టాడు. తల్లి అతన్ని జైన దేవాలయానికి తీసుకెళ్ళి మాంసాహారం ముట్టనని ప్రమాణం చేయించింది. బొంబాయిలో కులపెద్దలకు కూడా గాంధి సంజాయిషి చెప్పుకుని లండన్ బయలు దేరాడు. ఈ విధంగా మాంసాహారం ముట్టక పోటానికి చేసిన ప్రతిన వలననే గాని ఐచ్ఛికంగా మాత్రం కాదు.

ఇంగ్లండ్‌లో పెద్దమనిషిగా రాణించాలనే తలంపుతో గాంధీ వేయని వేషం లేదు. డాన్స్ నేర్వప్రయత్నించాడు.

అడుగులు తడబడ్డాయి. వయొలిన్ నేర్వదలిస్తే స్వరాలుఇంపుగా పలకలేదు. వక్తృత్వంతో గుర్తింపుకై యత్నించి విఫలుడయ్యాడు. అత్యంత ఆధునాతన విలాస వస్త్రాలు ధరించాడు. ఫాషన్లు అనుకరించాడు. ఆంగ్ల వనితలు అయనను ప్రేమిస్తే తనకు పెండ్లి అయినట్లు ముందుగా చెప్పలేదు! ఇట్లా అన్నీ చవిచూచి, దేనిలో కూడ రాణించలేక అందని ద్రాక్ష పండ్లు పుల్లన అన్నాడు. ఆ తరువాత గీతాపారాయణం చేశాడు. బైబిల్ చదివాడు. శాఖాహార వాసంచేశాడు, పొదుపుచేశాడు. అతిసామాన్యంగా నివశించాడు తొలిసారి లండన్ మెట్రిక్ తప్పాడు. అప్పటికే బ్లావటిస్కీ, అనిబిసెంట్‌తో, కించిత్తు పరిచయమైంది. మరుసటి 'సంవత్సరం నష్టపరిహారానికై గట్టిగా చదివి లండన్ మెట్రిక్ ఉత్తీర్ణుడయ్యాడు. 1891లో బార్‌లో ప్రవేశించి, జూన్‌లో ఇంటికి తిరిగి వచ్చేసరికి తల్లి కూడా మరణించింది. లండన్‌లో వుండగా తన భార్యకు షేక్ మెహతాబ్ ద్వారా ఉత్తరాలు పంపిస్తుండేవాడు. అతనే అది చింపి, చదివి వినిపించాల్సి వచ్చేది. చదువురాని కస్తూరిబాకు అక్షరాభ్యాసం చేయాలని గాంధి తొలుత చేసిన ప్రయత్నాలన్నీ విఫలమైనయ్.

1892 మే లో గాంధి అడ్వకేట్‌గా కథియవాడ్‌లో ప్రాక్టీసు ఆరంభిస్తే అదీ సాఫల్యం కాలేదు. మరుసటి యేడు దక్షిణాఫ్రికా నుండి దాదాఅబ్దుల్లా అండ్ కంపెనీ పిలుపు అందుకొని మూటాముల్లె కట్టి పయనమయ్యాడు. అదీగాంధి జీవితానికి మలుపు. అతనితో పాటే షేక్ మెహతాబ్ కూడా వెళ్ళాడు. రాను రాను మెహతాబ్ ప్రవర్తన హద్దుమీరి గాంధీకి దుర్భరంకాగా అతన్ని ఒక దళలో వెళ్ళగొట్టాడు. అయితే

చిన్నతనం నుండీ మెహతాబ్‌తో గల సన్నిహితత్వం వలన తరువాత హిందూ ముస్లిం ఐక్యతకు గాంధీ కృషి చేయటంలో శాల్య స్నేహితపు గాఢ ముద్రలు పనిచేశాయి.

1893 నుండీ 1914 వరకూ దక్షణాఫ్రికాలో వుంటూ, మధ్య మధ్య ఇండియాకు వచ్చి వెడుతున్న గాంధికి, అక్కడ కావలసినంత పరిశోధనావకాశాలు లభించాయి. జాతి విచక్షణ అంటే ఏమిటో ప్రత్యక్షంగా చూడటమే గాక అనుభవించిన గాంధి దక్షిణాఫ్రికాలో భారతీయుల కోసం నల్లవారికొరకు పోరాటం తలపెట్టాడు. ఆ పోరాటాల్లో అయనకు అనేక ఎదురు దెబ్బలు తగిలాయి, పట్టుదలగా, కూలిబారిస్టర్ గా తనఆచరణ కార్యక్రమాన్ని నిర్వర్తించాడు. ఇందులో ప్రధాన మైనవి సత్యాగ్రహం, హక్కుల యాత్రలు, అహింసా పోరాటాలు ఇక్కడ వుండగానే రస్కిన్. థోరో, టాల్‌స్టాయి రచనలచే ప్రభావితు డయ్యాడు. రాజకీయాల్లో గోపాలకృష్ణ గోఖలేను గురువుగా భావించాడు. తన రాజకీయ ఆలోచనలు గ్రంథస్థంచేశాడు. 1909లో ఒకసారి ఇంగ్లండ్ నుండి దక్షిణాఫ్రికాకు తిరిగివస్తూ హింద్ స్వరాజ్య వ్రాశాడు. తానూహించే స్వరాజ్యంలో పరిశ్రమలు, వికేంద్రీకరణ ఎట్లావుండాలో వేరొకన్నాడు. ఆ భావాలు చివర వరకూ గాంధి మార్చుకోలేదు. 1902లో ఒకసారి రాజ్‌కోట వచ్చి ప్రాక్టీసు పెట్టాలని ప్రయత్నించి విఫలుడయ్యాడు.

1901 కలకత్తా కాంగ్రెస్ సమావేశంలో పాల్గొన్నాడు. అయినా గాంధీని మించిన ఏమాపేమీలు రంగంలో వున్నం

దున, అతను మళ్ళీ దక్షిణాఫ్రికా వెళ్ళిపోయాడు. అక్కడ పోరాటాల్లో జైలు శిక్షలు అనుభవించాడు. తనకు గల నమ్మకాలనన్నింటినీ తన కుటుంబ సభ్యులపై నియంతగా రుద్ది, ప్రయోగాలు చేశాడు. అట్లాంటి ప్రయత్నాలలోనే పెద్దకుమారునితో పేచీ వచ్చింది 1911లో. చివరకు అతను గాంధీకి ఎదురు తిరిగి వెళ్ళిపోయి ఒక ముస్లింను వివాహం చేసుకున్నాడు కూడా.

గాంధి దక్షిణాఫ్రికాలో ఉండగా అతని పోరాటాల గురించి భారతదేశంలో వార్తలు బాగా ప్రాకాయి. మధ్య మధ్య గాంధి యిండియాకు వచ్చినపుడు అక్కడి భారతీయుల కష్టాలు చెపుతుండే వాడు. కాని చివరకు తన పోరాట ఫలితం అంతగాలేదని గాంధీ గ్రహించాడు. 1914లో ప్లూరసీవచ్చింది. ఇంట గెలిచి రచ్చ గెలవాల్సిందే ననుకొని స్వదేశానికి బయలు దేరాడు. 1915 సుండి ఆశ్రమం పెట్టాడు. గాంధి వచ్చేనాటికి పరిస్థితులు పాగా పక్వానికి వచ్చి వున్నయ్. 1916లో జరిగిన లక్నో కాంగ్రెస్‌లో మళ్ళీ అతివాదులు మితవాదులు కలసి పోయారు. జిన్నాకూడా సుహృద్భావంతో వున్నాడు. అయితే తిలక్ బాగా వృద్ధు డయ్యాడు. కాంగ్రెస్‌ను ప్రజల సంస్థగా మార్చటానికి అనుకూల పరిస్థితులు వున్నయ్. పైగా యుద్ధపు రోజులు.

అయినా గాంధి తొందరపడలేదు. కాంగ్రెస్‌లో నామ మాత్రంగానే వుంటూ వచ్చాడు. కాని రెండు సంఘటనలు గాంధీకి కలసి వచ్చాయి. ఒకటి 1917లో చంపదాన్ కార్మికుల

నీలమ్ము సమస్య, రెండోది అహమ్మదాబాద్ మిల్లు కార్మికుల సమస్య. అహమ్మదాబాద్ సమస్య ప్రధానంగా స్వీకరించిన గాంధీ సత్యాగ్రహ ఆయుధం ద్వారా అఖిలభారత ప్రచారం పొందాడు. అహమ్మదాబాద్ బాగా కేంద్ర స్థానంలో వుండటం, మిల్లు యజమానుల సోదరి ఆయన పక్షాన నిలబడటం గాంధీకి కలసివచ్చాయి. ఆ పోరాటంలో విజయుడై నగాంధి ఉత్సాహంగా కాంగ్రెసు రాజకీయాల్లో ప్రవేశించాడు.

1919 కాంగ్రెసు సమావేశంలో గాంధీని మహాత్ముడుగా మోతీలాల్ నెహ్రూ ముద్ర వేశాడు. అప్పటినుండి గాంధీని మనిషిగా చూడటం తగ్గిపోయింది. 1921లో మహాత్ముడైన గాంధి తన అంతర్వాణి ప్రబోధిస్తున్నట్లు అందరూ సహకరిస్తే, ఒక్క యేడాదిలో స్వరాజ్యం వస్తుందన్నాడు. విదేశీ వస్త్ర బహిష్కరణ ప్రారంభమైంది. గాంధీ పిలుపుననుసరించి అందరూ ఖద్దరు వడకటం ప్రారంభించారు. ఆ యేడు వత్సలహాలు జరిగాయి. మూక శాసనోల్లంఘనోద్యమం జరిగింది. 1922లో చౌరాచౌరి కలహాలు జరిగాయి. కాని స్వరాజ్యం కనుచూపు మేరలో కనిపించలేదు. గాంధీకి ఆరేండ్లజైలు శిక్ష పడింది. అంతరాత్మ విఫలమైంది.

మత పరంగా విదేశాల్లో వచ్చిన ఖిలాఫత్ ఉద్యమాన్ని భుజాన వేసుకొని హిందూ-ముస్లిం ఐక్యతకై విఫలప్రయత్నం చేశాడు గాంధీ. 1924లో హిందూ-ముస్లిం ఐక్యతకై 21 రోజులు నిరాహారదీక్ష పూనాడు. గాంధి నాయకత్వం దెబ్బతిన్నది స్వరాజ్య పార్టీ ముందుకొచ్చింది. 1929 వరకు గాంధీ యించుమించు ఏమీ చేయలేక పోయాడు.

మళ్ళీ లాహోర్ కాంగ్రెస్ కొంత జీవం పోసింది. పూర్తి స్వాతంత్ర్యం కావాలని తీర్మానించారు, 1930 మార్చి 12 నుండి గాంధి దండి ఉప్పుయాత్రబయలుదేరాడు. దేశాన్ని యావత్తు ఆ ఉద్యమం కదిలించి వేసింది. సామాన్యుడు సైతం ఇందులో పాల్గొన్నాడు. ఆ విధంగా కాంగ్రెస్‌ను ప్రజల సంస్థగా మార్చటానికి గాంధి చేపట్టిన ఉద్యమాలే కారణం.

రెండు రౌండ్ టేబుల్ సమావేశాల ఫలితంగా, ముస్లింలకు, హరిజనులకు ప్రత్యేక శాసన స్థానాలు కేటాయించారు ముస్లింల విషయం అంగీకరించిన గాంధీ, హరిజనులపట్ల ఒప్పుకోక ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించాడు పూనాలో. డాక్టర్ అంబేత్కర్ మెడలు వంచి, ఆ ప్రయత్నం విరమింప జేసి, గాంధి బ్రతికాడు. ఇది 1932 నాటి విషయం. అంట రానితనం పోగొట్టటానికి గాంధీ జీవితమంతా కృషిచేశాడన్న విషయం విస్మరించరానిది. అందులో విఫలమయ్యాడనేది వేరే విషయం గాంధీని చంపటానికి హిందూ సనాతనులు 1935 నుండీఉపక్రమించారు. 1935జూన్ 25న పూనాలో గాంధీపై విసిరిన బాంబు తప్పిపోయింది

1934లో బీహారులో పెద్దభూకంపం వచ్చింది. అంట రాని తనం అందుకు కారణం అన్నాడు గాంధి, జవహర్‌లాల్ నెహ్రూ, రవీంద్రనాథ్ ఠాగోర్‌లు గాంధీని తీవ్రంగా నిరసించారు. గాంధీ భావాలు చాలా విషయాల్లో అశాస్త్రీయమైనవే.

కాంగ్రెసులో గాంధీ ప్రవేశించినది మొదలు యించు యించు నియంతగానేవుంటూ వచ్చాడు. ఎంతభిన్నాభిప్రాయా

లున్న వారైనా, చివరకు గాంధీ అభిప్రాయం అంగీకరించే వారు. బహుశగాంధీ వ్యతిరేకతను తట్టుకొని నిలబడలేక అట్లా చేశారేమో. అందులో జవహర్‌లాల్ నెహ్రూ చెప్పుకోదగిన వ్యక్తి. గాంధీకి వ్యతిరేకంగా నిలబడి గాంధీ అభ్యర్థిని ఓడించిన సుభాస్‌చంద్రబోస్ కూడా చివరకు గాంధీకి లొంగిపోయాడు. ఆ తరువాత కొద్ది కాలానికే 1939లో వామ పక్షా లన్నిటినీ కాంగ్రెసు నుండి నిష్క్రమింప జేశాడు గాంధి.

గాంధి చేపట్టిన చివరి ప్రజా పోరాటం క్విట్ ఇండియా ఉద్యమం 1942లో. ఇది చివరకు హింసాయుతంగా మారింది కూడా. రెండో ప్రపంచ యుద్ధంలో ఫాసిస్టు తత్వాన్ని సరిగా గ్రహించని గాంధి, ఆర్థికంగా బ్రిటిష్ వారు తీసిస్తున్న విషయం కూడా కనిపెట్టలేదు. సత్యాగ్రహాలతోనే స్వాతంత్ర్యం సాధించ వచ్చుననే భ్రమలోనే ఉండేవాడు. యుద్ధానంతరం సిమ్లా సమావేశంలో అనధికారిగా పాల్గొన్న గాంధీ, స్వాతంత్ర్యానికై దేశ విభజనకు అంగీకరించ తప్పలేదు. స్వాతంత్ర్యం వచ్చిన దేశంలో గాంధి కలలు పండలేదు. ఆయన చూస్తుండగానే హిందూ-ముస్లింల మధ్య రక్తం ప్రవహించింది. అది ఆపాలని తూర్పు బెంగాల్ పర్యటించాడు. వర్గసామరస్యాలకు నిరాహార దీక్షలు పూనాడు. అయినా ప్రయోజనం సాధించ లేక పోయాడు. చనిపోయేనాటికి గాంధి నిరాశాపరుడు. ఆయన "ఈశ్వర - అల్లా తేరేనాం" విధానం పనిచేయలేదు. చివరిరోజుల్లో తనతప్పును గ్రహించిన గాంధీ, సెక్యులరిజం ప్రబోధించాడు. మతం వ్యక్తి పరంగా వుండాలన్నాడు. కాని చాలా ఆలశ్యంగా గాంధీ ఆ మాటలు చెప్పాడు. సాంస్కృతిక

భేదాలు గ్రహించకుండా మానవుడిలో ఆధునిక వైజ్ఞానిక ఆలోచన తీసుకు రాకుండానే. సామరస్యం సాధించాలను కున్నాడు. అది వీలుకాలేదు. పైగా అటు హిందువులకు ఇటు ముస్లింలకు విరోధి అయ్యాడు. 1948 జనవరి 30న ఛాందస హిందువు పిస్తోలుకు బలిఅయ్యాడు. అదీ హిందూ - ముస్లిం ఐక్యతా నినాద ఫలితం!

గాంధి ప్రధానంగా మానవతా వాది, ఆచరణవాది. మతాన్ని, జాతీయ వాదాన్ని ఆధారంగా రాజకీయాల్లో పరిష్కారానికి పూనుకొన్నందున విపరీత పరిణామాలకు దారి తీసింది. సాంస్కృతిక భేదాభిప్రాయాలు గమనించకుండా మత సామరస్యత సాధించాలనటం గాంధీ అశాస్త్రీయ ధోరణికి నిదర్శనం. గాంధి విజ్ఞాన శాస్త్రాలను అంతగా చదువుకోలేదు, వాటి పద్ధతి వలన ప్రభావితుడు కాలేదు. కాని కొన్ని మానవ విలువల్ని ఆయన నమ్మాడు మనిషిని మంచి మార్గాన నడిపించ వచ్చునని విశ్వసించాడు. అన్ని మతాల్లోని ఉన్నతా దర్శాలను సాధనాలుగా ప్రయోగించాడు. కాని దారుణంగా విఫల మయ్యాడు.

గాంధి రాజకీయ రంగంలోకి వచ్చిన అనంతరమే కాంగ్రెసు నేలపై కాళ్ళు పెట్టింది. ప్రజల భాషలో మాట్లాడింది. గాంధీ అందుకు కారణం.

గాంధి ఎంతో క్లిష్టమైన వ్యక్తిత్వం గలవ్యక్తి. ఆయన మహాత్ముడూ కాదు. పాపాత్ముడూ కాదు, కేవలం మానవుడు. ఆ దృష్టితో గమనిస్తే చరిత్రలో ఆయన పాత్రను అవగాహన చేసుకోవచ్చు.

REFERENCE BOOKS

1. **M. K. Gandhi :** An Autobiography Navajivan Publishing House, Ahmedabad 1956.

2. **Robert Payre :** The Life and Death of Mahatma Gandhi, The Bodley Head, London 1969.

3. **Ranjee Shahani :** Mr Gandhi The Macmillan Company, New York 1961.

4. **Mahadeva Prasad :** Social Philosophy of Mahatma Gandhi Viswavidyalaya Prakasham, Gorakhpur 1958.

5. **Nirmal Kumar Bose & P. H. Patwardhan :** Gandhi in Indian Politics Lalvani, Bombay 1967.

6. **M. P. Sinha (ed) :** Contemporary relevence of Gandhi Nachiketa, Bombay 1970.

7. **B. R. Ambedkar :** Gandhi and Gandhism Bheem Patrika Publications, Jullundur 1970.

8. **Shriman Narayana (ed.) :** The Selected Works of Mahatma Gandhi (Vols. 6) 1969 Navajivan Publishing House, Ahmedabad.

ఎం. ఎన్. రా య్

ఎం. ఎన్. రాయ్‌ని గురించి అర్థం చేసుకున్న దాని కంటే, అపార్థం చేసుకున్నదే మన దేశంలో ఎక్కువ. భిన్న కారణాలుగా కమ్యూనిస్టులు, జాతీయ వాదులు రాయ్‌పై చేసిన దుష్ప్రచారం ఇంతా, అంతాకాదు. దీని వలన అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలోను, భారత జాతీయ పోరాటాలలోనూ మహోన్నతమైన అతని పాత్ర మరుగుపడింది.

వంశ పారంపర్యంగా వస్తున్న కులవృత్తి రీత్యా మంత్రాలు వల్లించ వలసిన పౌరోహితుడుగా ఉండవలసిన నరేంద్రనాథ్ భట్టాచార్య (అది తల్లితండ్రులు పెట్టిన పేరు), చిన్నతనంలోనే కెరరిస్ట్ అయ్యాడు. 1893లో కలకత్తాకు 20మైళ్ళ దూరాన అర్కాలియా గ్రామంలో పుట్టిన రాయ్ బాల్యదశ అక్కడికి సమీపంలోని కొడాలియా గ్రామంలో గడిచింది. అక్కడే ప్రాథమిక విద్యాభ్యాసం కొంత జరిగింది. బెంగాల్ కెరరిస్టు ఉద్యమాలు ఆనాటి యువకులను, బాలురను ఆకర్షించినట్లే ఎం. ఎన్. రాయ్‌ని కూడా ఆకర్షించాయి. ఫలితంగా బ్రిటిషు వ్యతిరేక కుట్రకార్యక్రమాలలో పాల్గొనటం ప్రారంభించి 1911లో వావురా కుట్రకేసులో పట్టు పడ్డాడు. కాని పిల్లవాడని వదిలివేసారు. జితేంద్రనాథ్ ముఖర్జీ నాయకత్వాన కెరరిస్టు కార్యక్రమాలలో మళ్ళీ 1915లో పట్టుబడి శిక్షతప్పించుకున్నాడు. జర్మనీ రాయబారి ద్వారా డబ్బు, ఆయుధాలు

సమకూర్చాలని జకార్తా (నాటి బటేవియా) వెళ్ళి ఏర్పాట్లు చేసి వచ్చాడు. కొంత డబ్బు తెచ్చాడు. కాని అనుకున్న ప్రకారం ఆయుధాలు రాకపోయేసరికి, 1915లో మరల జావా వెళ్ళాడు. కాని ఈలోపు బ్రిటిషు వారికి ఈ కుట్ర తెలిసి చాలా మంది పెరరిస్టులనుపట్టుకున్నారు. జతీన్‌ముఖర్జీ చనిపోయాడు. ఇండియాకు అప్పుడు వెళ్ళి ప్రయోజనం లేదని జపాన్ వెళ్ళి రాస్‌బిహారిబోస్‌ను కలిసాడు. అతను సహాయం నిరాకరించగా వైట్ పేరుతో చైనాకు పోయాడు. పెన్‌స్టిన్‌లో బంధించబడి సన్‌యట్‌సేన్ జోక్యంతో విడుదలయ్యాడు. అక్కడ జర్మన్ కాన్సులేట్‌నుకలసి సహాయంపొందలేక పెకింగ్ మీదిగా షాంఘై వచ్చాడు. భగవాన్‌సింగ్ అనే గదర్ పార్టీ విప్లవ కారునితో పరిచయం కలిగింది. మళ్ళీ టోకియో వెళ్ళి గడ్డం పెంచి రోమన్ కేథలిక్ ఫాదరి వేషంలో మార్టిన్ పేరుతో అమెరికా ప్రయాణం కట్టాడు. తాను వెస్ట్‌ఇండీస్ నుండి వస్తున్నట్లు, ఉన్నతమత విద్యకై పారిస్ పోతున్నట్లు నటిస్తూ 1916 జూన్ 15న సాన్‌ఫ్రాన్సిస్కో చేరాడు. అక్కడ ఎం. ఎన్. రాయ్ పేరు పెట్టుకున్నాడు. శాన్‌ఫర్డ్ యూనివర్సిటీలో ఎవలిన్ అనే అమెరికన్ యువతి పరిచయమై రాయ్ మేధస్పట్ల ఆకర్షితురాలయింది. వారిరువురు కలసి న్యూయార్క్ చేరుకున్నారు. భారత విప్లవ కారులైన పెచ్,యల్. గుప్తా, డాక్టర్ చంద్ర చక్రవర్తులను కలిసాడు. ధనగోపాల్ ముఖర్జీతో పరిచయ మయింది. అప్పటికి న్యూయార్క్‌లో ఉంటున్న లాలా లజ పతిరాయ్ ఇతన్ని ఆదరించి, ఆశ్రయమిచ్చాడు. అక్కడే రాయ్ ఎవలిన్ ట్రంట్‌ను వివాహం చేసుకున్నాడు. భారతీయ

ప్లవకారుల్లో చిత్త శుద్ధి గలవాడు విశ్వసనీయమైన వాడు ం. ఎన్. రాయ్ అని లజపతిరాయ్‌కు నమ్మకం కలిగింది ఒక ందర్భంలో లజపతిరాయ్ మాట్లాడుతూ, భారత దేశంలో దేశీ సామ్రాజ్య వాదులు దోచుకోటానికి, దేశీయపెట్టుబడి ారులు దోచుకోటానికి తేడా ఉన్నదిని అంటూ, దేశీయులకు నుకూలంగా మాట్లాడాడు. తొలిసారిగా ఎం.ఎన్. రాయ్‌కు తీయవాదంలో లోపం కలిగించింది. న్యూయార్క్ లైబ్ర లో మార్క్సిజం అధ్యయనం చేశాడు. ఈలోపుగా 1917లో అమెరికా ప్రభుత్వం అతనిపై అరెస్ట్ వారంటు జారీచేసింది. అక్కడి నుండి మెక్సికో పారిపోయాడు. మాన్యూల్ మెండిస్ పేరుతో అమెరికాలోని సానుభూతి పరులతో ఉత్తర ప్రత్యుత్త రాలు జరిపాడు. మెక్సికోలో విప్లవకారులతోను, సోషలిస్టుల తోను, జర్మనీ ఏజంట్లతోను పరిచయమయింది. డాక్టర్ గ్రామి టస్కీ వద్ద స్పానిష్ బాగా అభ్యసించాడు. మెక్సికన్ అధికార పక్షాలతో సన్నిహిత సంబంధాలేర్పడ్డాయి. యల్. హెరాల్డో, ి. మెక్సికో అనే పత్రికలో రచనలు చేసాడు. రష్యానుండి వచ్చిన మైకేల్ బరోడిన్ రాయ్‌తో పరిచయం ఏర్పరుచుకొని, అతనికి గురువై రాయ్‌లో గల మార్క్స్ట్ ఆలోచనలకు పునా రులు గట్టిపరిచాడు. బరోడిన్ మద్దత్తుతో మెక్సికోలో తొలి మ్యూనిస్టు పార్టీ స్థాపించాడు. ఇదంతా గమనించిన లెనిన్ రాయ్‌ను రష్యా ఆహ్వానించగా 1929లో మెక్సికన్ పార్టి ప్రతి ధిగా కొమిన్‌టర్న్ కాంగ్రెసుకు మాస్కో వెళ్ళాడు. తోవలో స్పెయిన్, జర్మనీలలో ఆగి అనేకమందిని కలిసాడు. మాస్కోలో జరిగిన సమావేశంలో (1920 జులై 19 ఆగస్టు 7)

జాతీయ వలస రాజ్యాల విముక్తి పోరాటాలపై లెనిన్ రూపొ
దించిన ముసాయిదాకు ప్రత్యామ్నాయ సిద్ధాంతం రాయ్
ప్రవేశపెట్టాడు. జాతీయోద్యమాలతో, తాత్కాలిక సంబంధ
లను ఐక్య సంఘటనలు ఏర్పరచు కోవాలని లెనిన్ సూచి
చాడు. కాని వలసరాజ్యాలలో విప్లవశక్తులు విజృంభిస్తాయని
జాతీయోద్య మాలను నమ్ముకోవటం కన్నా కమ్యూనిస్టు
పార్టీని స్థాపించి, త్వరగా రైతు-కూలీల సోవియట్లు నేర్పరి
చాలని రాయ్ సూచించాడు వలసరాజ్యాలలో జాతీయోద్య
మాలకు సహకరిస్తే వారు ద్రోహం చేస్తారని రాయ్ వాదం
విప్లవం పైనుండి రావాలని లెనిన్, అడుగునుండి తేవాలని
రాయ్ భేదించారు. ఈ వాదన ఫలితంగా లెనిన్, రాయ్
సిద్ధాంతాలు రెండూ కలిపి కోమిన్ టర్న్ ఆమోదించింది.
కమ్యూనిస్టు ఉద్యమంలో రెండు భిన్న సిద్ధాంతాలు ఆమోదిం
చటం అదే ప్రథమం. ఆఖరు కూడా ఆ విధంగా సునిసిత
మేధాశక్తిని లెనిన్ గుర్తించాడు 1922లో ఇండియా ఇన్
ట్రూన్సిషన్ అనే గ్రంథాన్ని రాయ్ ప్రచురించాడు. భారత
దేశంలో పరిస్థితులను కమ్యూనిస్టు దృక్పథం నుండి పరిశీలించిన
అట్లాంటి గ్రంథం నాటికీ, నేటికీ కమ్యూనిస్టులు మరొకటి
వ్రాయలేక పోయారు.

మాస్కో చేరినప్పటినుండి, భారతదేశంలో కమ్యూనిస్టు
పార్టీని సృష్టించి విప్లవాన్ని సాధించాలని రాయ్ నిర్విరామ
కృషిచేసాడు. పత్రికలు, సాహిత్యం, డబ్బు భారత దేశంలోని
కమ్యూనిస్టు సానుభూతి పరులకు పంపించాడు. తాష్‌కెంట్‌లో
శిక్షణ కేంద్రం పెట్టి భారతదేశంనుండి ఖిలాఫత్ ఉద్యమ సం

ంగా టర్కిపోతున్న ముస్లింలను తీసుకొచ్చి శిక్షణగరిపారు. 960 సెప్టెంబరులో తాష్‌కెంట్‌లో భారతకమ్యూనిస్టు పార్టీని ాపించారు. తరువాత మాస్కోకు తరలి శిక్షణకార్యక్రమాలు క్కడ కొనసాగించారు. బెర్లిన్‌లో లేబర్ సమాచార కేం ం స్థాపించి భారత ట్రేడ్ యూనియన్ ఉద్యమానికి దోహ ం చేసాడు. ఈ విధంగా 1920 నుండి 27 వరకూ భారత మ్యూనిస్టు పార్టీకి నాయకుడుగా, సారధిగా, సలహాదారుగా తామహు డనిపించు కున్నాడు. అంతేగాక బెంగాల్‌లోని ప్లవకారులను, కాంగ్రెస్‌లోని అభ్యుదయ వాదులను ప్రోత్స హించాడు. కాంగ్రెస్‌లో అంతర్భాగంగా, రహస్యంగా మ్యూనిస్టు శాఖను మరొకదానిని ఏర్పాటు చేయమని మొదటి ుండి సలహాఇస్తూవచ్చాడు. 1922లో అంతర్జాతీయ కమ్యూ స్టు ఉద్యమంలో అనేక ఉన్నత పదవులు రాయ్‌కి సంక్రమించి ాయి. సోవియట్ యూనియన్‌లో అత్యంత ప్రధానమైన పిసిడియ్‌కు ఎన్నికైనాడు. కార్యవర్గంలో ఓటు హక్కుగల భ్యుడయ్యాడు.

రాయ్ కమ్యూనిస్టు జీవితంలో 1926వ సంవత్సరం ఒక పిద్ద మలుపు చైనా కమ్యూనిస్టు ఉద్యమానికి సలహాలనిచ్చి. క్కడున్న భారతీయులను అనుకూలం చేసుకోటానికి రాయ్‌ను రికొందరితో కలిపి చైనా పంపించారు. ఇది రాయ్‌పట్ల ాలిన్‌కు గల విశ్వాసానికి నిదర్శనం. అయితే చైనా చేరిన గవాత రాయ్‌కు బరోడిన్‌కు తీవ్రమైన అభిప్రాయ భేదాలు ర్పడినాయి. విప్లవాన్ని తీవ్రతరం చేసి ఊహాన్ ప్రభుత్వం ంద కార్మికుల, రైతుల కోర్కెలను తీర్చవలసిందిగా వత్తిడి

చేసి, బలా బలాలు తేల్చుకోవాలని రాయ్ అభిప్రాయం
తొలుత కమ్యూనిస్ట్ కేంద్ర కమిటీ రాయ్‌ను సమర్థించిం
అయితే బరోడిన్ ఇందుకు అంగీకరించనందువలన స్టాలిన్‌క
టెలిగ్రాం యిచ్చాడు. అతను వీరిద్దరికీ సంధిచేస్తూ ప్రత్యుత్త
మిచ్చాడు. కాని స్టాలిన్ సంధి ప్రతిపాదన అసంభవమని రాయ్
గ్రహించాడు. జులైలో కమ్యూనిస్టు లందరినీ హతమారుస్తూ
ఊహాన్, నాన్‌కింగ్ ప్రభుత్వాలు ఏకమయినాయి. దానితో
రాయ్, బరోడిన్ మిగిలన వారంతా గోబీ ఎడారి మీదిగా
తప్పించుకొని మాస్కో చేరుకున్నారు.

1927లో చైనాలో వైఫల్యానికి కారణ మెవరని తర్జన, భర్జన జరిగింది. ప్రథమంగా చైనా కమ్యూనిస్టు పార్టీ, తరువాత బోడిన్ అన్నాడు మావో. రాయ్‌నుగురించి చెపుతూ అతను వామపక్షీయుడేనని, అయితే ప్రత్యామ్నాయమేమి సూచించ లేదని అభిప్రాయ పడ్డాడు. రష్యాలో ట్రాట్‌స్కీ, బరోడిన్‌ల విమర్శలను తట్టుకొని నిలబడటానికి వీలుగా స్టాలిన్ అణచివేత ప్రారంభించాడు. అది రాయ్‌కి కూడా సోకింది. రాయ్ చైనాలో ఉండగా సమ్యేంద్రనాథ్ టాగూర్ మాస్కో వెళ్ళి రాయ్‌పై చాల పితూరీలు చేసాడు. 1927 సెప్టెంబరులో రష్యాకి తిరిగి వచ్చిన రాయ్‌కు తదితరులకు సరైన స్వాగతం లభించలేదు. అక్టోబరులో రాయ్ బెర్లిన్ వెళ్ళి 1928 ఫిబ్ర
వరిలో తిరిగి మాస్కోకి వచ్చాడు. కోమిన్‌టర్న్ సమావే
శంలో అతని అభిప్రాయాలు చెప్పటానికి అవకాశం యివ్వలేదు.
ఇతలో రాయ్ తీవ్రంగా జబ్బుపడి ఒక హాస్పిటల్లో చేర్చ
బడ్డాడు. అక్కడ నుండి వాళ్ళతోపాటు చైనా కొచ్చిన

లూసీగేస్లర్‌కు ఉత్తరం వ్రాయగా ఆమెవచ్చి అతకష్టంపై రహస్యంగా రాయ్‌ని బెర్లిన్‌తీసుక వెళ్ళింది. సెంట్ మారిట్జ్‌లో విశ్రాంతి తీసుకుంటూ చైనాలో విప్లవం ప్రతివిప్లవాన్ని గురిం చిగ్రంథం వ్రాసాడు.

హగ్ రాత్ బోన్‌తో కలిసి 'ది డిక్లైన్ అండ్ ఫాల్ ఆఫ్ ది బ్రిటిష్ ఏంపైర్ కి" అనేగ్రంథం వ్రాసాడు. బెర్లిన్‌లోఉంటు న్న రాయ్ కమ్యూనిస్టుపార్టీ ధోరణిని విమర్శిస్తూ వ్యాసాలు వ్రాయటం ప్రారంభించాడు. ఆగస్ట్ థాల్ హేమర్‌ను ఇంచు మించు గురువుగా భావిస్తూ ఐక్య సంఘటన విధానాన్ని సమ ర్థిస్తూ వచ్చాడు. ఇదంతా జరగటానికి ఇంచుమించు సంవత్సరం పట్టింది. ఇంటర్ నేషనల్ ప్రెస్ కరస్పాండెన్స్‌లో ఇండియాను గురించి కొమిన్‌టర్న్ ధోరణినివిమర్శిస్తూ వ్యాసాలువ్రాసాడు. 1929 సెప్టెంబరులో కొమిన్‌టర్న్ నుండి రాయ్‌ను బహిష్క రించారు. దీనికి కారణం జర్మనీలోని బ్రాండ్‌లర్ ముఠాతో కలసి పనిచేయటాన్ని పేర్కొన్నారు. 1930 లో రెనెగేడ్ అనే దూషణ ప్రారంభించారు.

స్నేహితుల సలహాలను గూడా పాటించకుండా ఎం.ఎన్. రాయ్ ఇండియా బయలుదేరాడు.రాయ్‌విశ్రాంతి తీసుకుంటూ ఉండగా అతనికి స్టాలిన్ అల్లుడు బ్రిజేష్‌సింగ్ తయాబ్ ఆలీషేక్ అనాదిఖదూరి గార్లు సహాయం చేసారు. రాయ్ ఇండియారాక ముందు తయాబ్‌షేక్ ముందుగా వచ్చి అనేక మందిని కలిసి రాయ్ కార్యక్రమాన్ని వివరించాడు. ఇటలీలో కొంతకాలం గడిపి ఇస్తాంబూల్, బాగ్‌దాద్‌లమీదిగా కరాచీ చేరుకున్న రాయ్ 1930 డిశంబరు 17 న డాక్టర్ మహమూద్ పేరుతో బొంబాయిలో అడుగుపెట్టాడు. వెంటనే ఒక ప్రణాళిక ప్రచు

రించి రాజ్యాంగ సభకావాలని, కమ్యూనిస్టులు జాతీయులతో కలిసి పోరాడాలని కోరాడు. తరువాత రాయ్ అనుచరులు అనేకులు ఒక సంఘంగా ఏర్పడ్డాగు. కొన్నాళ్ళు తర్ ప్రదే శ్‌లో గడిపిన రాయ్ నెహ్రూ ఆతిధ్యంలో అతనితోపాటు అనేక గ్రామాలు పర్యటించాడు. కరాచీ కాంగ్రెస్ సమావే శంలో ప్రాథమిక హక్కుల తీర్మానాన్ని తయారుచేసి నెహ్రూకిచ్చాడు. ఆతీర్మా నాన్ననుసరించి బ్రిటిషువారు రాయ్ ఇండియా కొచ్చాడని అనుమానించి అతని కొరకుగాలించారు. 1931 జులై 21 న బొంబాయిలో పట్టుకోగలిగారు. 12 సంవత్సరాలు జైలు శిక్ష విధించగా అలహాబాద్ హైకోర్టు శిక్ష నాలుగు సంవత్సరాలకు తగ్గించింది. జైలలో ఉండగా రాయ్ విశేషంగా చదివి అనేక గ్రంథాలు వ్రాసాడు. అందులో ఆధునిక విజ్ఞాన శాస్త్రపుతాత్విక ఫలితాలు పేర్కొనదగినది. సోషలిస్ట్‌పార్టి ఏర్పాటును గురించి రాయ్ వ్రాస్తూ కాంగ్రెస్‌లో ఒక భాగంగా ఉండటం శ్రేయస్కరమని సలహా ఇచ్చారు. 1936 లో జైలు నుండి విడుదలైన తరువాత, రాయ్ కాంగ్రెస్‌లో చేరి వామపక్ష ఐక్యతకోసం కృషిచేశాడు. జర్మనీ నుండి అంతకు ముందే ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతున్న ఎలెన్ ఇండియావచ్చి రాయ్‌ని వివాహం చేసుకొని, అతని ఉద్యమానికెంతో తోడ్పడింది. నెహ్రూ, బోస్‌లపై అతనికి కొంత నమ్మకముండేది. గాంధీకి వ్యతిరేకంగా అభ్యుదయ నాయకత్వాన్ని అభివృద్ధి చేయాలని రాయ్ ఉద్దేశం. ప్రజలతో సన్నిహిత సంబంధం పెంపొందించు కోవాలనే రాయ్ సిద్ధాంతం కాంగ్రెస్‌పార్టి ఆహ్వానించింది. మాస్ కాంటాక్ట్ కమిటీ ఏర్పాటయింది. కాంగ్రెస్ పార్టిని ప్రజాస్వామికంచేసి జాతీయ

ోరాటంలో సామాజిక ప్రాతిపదిక విస్తృతం చేయాలనిరాయ్ పతిపాదించాడు. అతని సలహాను ఆమోదించిన గాంధీ, నెహ్రూ మాస్ కాంటాక్ట్ కమిటీకి కార్యదర్శిగా రాయ్‌ని అంగీకరించ దు గాంధీకి వ్యతిరేకంగా బోస్ నిలబడి పట్టాభి సీతారామ య్యను ఓడించినపుడు వామపక్ష ఐక్యతను మంచి అదనుగా వించిన రాయ్ బోసును బలపరిచాడు. కాని బోస్ నిలబడ కపోయాడు. అదీగాక కమ్యూనిస్టులు. సోషలిస్టులు బోస్‌ను బలపరచలేదు గాంధీ నాయకత్వాన్ని రాయ్ ఎదురిస్తుంటే సోషలిస్టులు అతన్ని వ్యతిరేకించారు. తరువాత రాయ్ ఘర్ కాంగ్రెస్ సమావేశంలో మౌలానా అబుల్ కలామ్ అజాద్‌తో రాయ్ కాంగ్రెస్ అధ్యక్షస్థానానికి పోటీచేసాడు.కమ్యూనిస్టులు సోషలిస్టులు రాయ్‌ని వ్యతిరేకించారు. రాయ్ ఓడిపోయాడు. అతను ప్రవేశపెట్టిన రాజ్యాంగ సభ తీర్మానాన్ని రాజేంద్ర ప్రసాద్ మొదలైనవారు వ్యతిరేకిస్తూ గాంధీ నిర్మాణకార్యక్ర మాన్ని సమర్థించారు. గాంధీ ప్రకటించిన సత్యాగ్రహ కార్య క్రమంలో రాయిస్టులు పాల్గొనలేదు.

రెండో ప్రపంచ యుద్ధంలో మొట్ట మొదటగా బ్రిటిషు వారిని బలపరుస్తూ ఇది ఫాసిస్ట్ వ్యతిరేక యుద్ధమని రాయ్ ప్రకటించాడు. బ్రిటిషు వారికి భేషరతుగా సహకరించాలని సంకీర్ణమంత్రివర్గాల కామోదించాలని, యుద్ధానంతరం బ్రిటిషు వారు వెళ్ళిపోక తప్పదని రాయ్ బహిరంగంగా ప్రకటించాడు. కాంగ్రెస్ వారు రాయ్‌పై క్రమశిక్షణ చర్యతీసుకున్నారు.1940 అక్టోబరులో ఎం. ఎన్.రాయ్ రాడికల్ డెమోక్రాటిక్ పిపుల్స్ పార్టీ ప్రారంభించాడు. కార్మిక సంఘంలో గూడా చీలిక వచ్చింది. యుద్ధాన్ని సమర్థిచటానికి రాయ్ పక్షం 13000 రూ

స్వీకరించింది. అప్పటి నుండి కార్మికులలో రాయిస్టుల పలుకుబడి క్షీణించింది. 1942 లో రాయ్ ఒక అధ్యయన శిబిరాన్ని ఏర్పాటుచేసి శాస్త్రీయపద్ధతిలో రాజకీయాలు బోధించనారంభించాడు. యుద్ధానంతరం జరిగిన ఎన్నికలలో రాయిస్టులు ఒక్క సీటు గూడా గెలుచుకోలేక పోయారు. ఆ తరవాత మరొక అధ్యయన శిబిరంపెట్టి పార్టీ వ్యవస్థకు వ్యతిరేకంగా రాయ్ తన సిద్ధాంతాలను పెంపొందించాడు. చాలా మంది సభ్యులకు ఇష్టం లేక పోయినా రాడికల్ డిమోక్రాటిక్ పార్టీ రద్దుకు అంగీకరించారు. అప్పటి నుండి రాడికల్ హ్యూమనిస్ట్ ఉద్యమాన్ని పెంపొందించాడు. మార్క్స జాన్ని పునఃపరిశీలించి నవ్యమానవవాదాన్ని ప్రవేశపెట్టాడు. తన సిద్ధాంతాని కణుగుణంగా చేసిన రచనలలో రీజన్, రొమాంటిసిజమ్ అండ్ రెవల్యూషన్ అనే గ్రంథం అత్యుత్తమమైనది. పార్టీని రద్దు చేసిన తరువాత రాయ్ ఆశించినట్లుగా రాడికల్ హ్యూమనిస్ట్ ఉద్యమం వ్యాపించలేదు. పార్టీ తత్వం బాగావంట బట్టటమే దీనికి కారణమని రాయ్ విమర్శించాడు అంతర్జాతీయహ్యూమనిస్ట్ ఉద్యమంలో ప్రముఖ స్థానాన్నిపొంది, స్నేహితుల కోరికపై స్వీయగాధలు వ్రాస్తూ 1954 జనవరి 25 న డెహరాడూన్‌లో చనిపోయాడు.

1988 లో మళ్ళీ సోవియట్ యూనియన్ ప్రచురించిన విజ్ఞాన సర్వస్వంలో భారత విప్లవకారునిగా ఎం. ఎన్. రాయ్‌ను పేర్కొన్నారు. 35 ఏళ్ళ తర్వాత జరిగిన యీ గుర్తింపులో రష్యా మరెవరిపేరూ ఇండియానుండి గుర్తించలేదు కూడా. ఆ విధంగా చరిత్రలో రాయ్ స్థానం తగినవిధంగా చూపక తప్పలేదు.

ఎం. ఎన్. రాయ్ తత్త్వం

ఆధునిక విజ్ఞాన శాస్త్రం, ప్రాపంచిక అనుభవం నుండి తత్వాన్ని రాబట్టాడు ఎం. ఎన్. రాయ్ దీన్ని ప్రధానంగా ప్రకృతితత్త్వం సామాజిక తత్త్వం అని రెండు భాగాలుగా విభజించి చూడవచ్చు. ప్రకృతి నియమబద్ధమైనది. అనగా కార్య కారణ సంబంధాలతో కూడినది. ప్రకృతిలో ఏ సంఘటన జరిగినా దానికి కారణాలు తెలుసుకోటం సాధ్యమే. మనకు కారణాలు తెలియలేదంటే అదిమన పరిమిత జ్ఞానానికి నిదర్శనమే తప్ప ప్రకృతిలోపం కాదు. ప్రకృతిని గురించిన మనజ్ఞానం ఎప్పుడూ పరిమితంగానే ఉంటుంది.కనుక జ్ఞానాభివృద్ధి అనంతము నిరంతరము ప్రకృతి చైతన్యవంతమైనది. ఉనికిమార్పులతోకూడినది. విజ్ఞానశాస్త్రంలోదిన్నే కాలాకాశ సమ్మిశ్రితం అంటారు. ప్రకృతి మూడు కోణాలతో కూడినది. ఆకాశమైతే అందులో జరిగే మార్పులన్ని కాలానికి చెందినవి. ఇవి రెండూ అనగా ప్రకృతి, అందలి మార్పులు విడదీయరానివి.ఈ మార్పు కూడా నిత్యమూ. సత్యమూ. అయితే ఉష్ణగతి సిద్ధాంతం చెపుతున్న ట్లుగా ప్రకృతిలో జరిగే మార్పంతా క్రమంగా ఉష్ణంనుండి చల్లదనానికి ప్రవహించి కొంత కాలానికి పరిణామ మంతా ఆగిపోతున్నదనేది సరికాదు. ఈ మార్పులు ఏక రీతిలోగాక భిన్నరీతుల్లో ఉండే అవకాశాలుగలవని, కాస్మిక్ కిరణాలు ఇత్యాది ఆధునిక విజ్ఞాన శాస్త్రాల వలన సూచితమవుతున్నది.

ప్రకృతిలో మానవుడు పరిణమించిన ఉన్నత వైజ్ఞానిక మేవి ప్రకృతిలో నియమాలు మానవుల్లోనూ ఉన్నాయి. కార్య కారణ సంబంధాలు మానవునిలో వివేచనగా పనిచేస్తున్నాయి

మానవుని విశిష్టత అతని వివేచనలోనే ఉన్నది. అయితే వివే
చనా రహిత చర్యలు, వాసనలు ప్రేరణలు మానవునిలో లేక
పోలేదు. అంత మాత్రాన మానవుడు వివేచన జీవికాకపోడు.
మానవునిలో గర్భితంగా ఉన్న ఈ వివేచనను పైకి తెచ్చి ఆధి
క్యత వహించేటట్లు చేయటం అవసరం. దీనికి నవ్యమానవవాద
సిద్ధాంతం అని ఎం. ఎన్. రాయ్ నామ కరణం చేసాడు.
మానవుడు కేంద్రంగా ఉండే ఈ సిద్ధాంతంలో మనిషి పరిపూర్ణ
వికాసానికి తోడ్పడేరీతులు పేర్కొన్నాడు. హేతుమంతుడైన
మానవుడు నీతి మంతుడుగా ఉంటాడు. ఆ రెండు లక్షణాలు
ఉంటే సహకార జీవిగా రూపొందుతాడు. అంటే తన స్వేచ్ఛను
కోల్పోకుండా తాను వికసిస్తూ తోటివాని వికాసానికి తోడ్ప
డతాడు. ఇప్పటి వరకూ ఉన్న సిద్ధాంతాలు మానవుణ్ణి
దేనికో దానికి లొంగతీసినవి. మత శాస్త్రాలు దైవం అనే
బూచి చూపి మానవుణ్ణి బెదిరిస్తే, ఫాసిస్ట్, కమ్యూనిస్టు
సిద్ధాంతాలు మానవుణ్ణి రాజ్యానికి బానిసగా, కొరముట్టుగా
చూచాయి. ఆధునిక విజ్ఞాన శాస్త్రం మానవుణి సమైక్యజీవిగా
రూపొందించేటందుకు తోడ్పడుతుంది.

విలువలన్నిటిలోకి స్వేచ్ఛ అతి ప్రధానమైనది. మిగిలిన
విలువలన్నీ అందులో నుండి జనిస్తాయి. ఈ విలువలకు పార
మార్థిక ఆధారంగాని రాజ్యమనే బూచి కాని అవసరం లేదు.

ఆధునిక రాజ్యాంగ సిద్ధాంతాలు మనిషిని చెడగొట్ట
టానికి ఉపకరిస్తున్నాయి. మనిషి సంక్షేమానికి తోడ్పడ
వలసిన అధికారం రాను రాను కేంద్రీకృతమై మనిషిని యజ్ఞ
పశువు చేస్తున్నది. పార్టీ వ్యవస్థలు ఈ అధికార కాపత్ర
యంలో బడి, అధికారం రాబట్టుకోటానికి వచ్చిన తరువాత

ట్టి పెట్టు కోటానికి ఏ మార్గాలనైనా అనుసరిస్తున్నారు. కనుక పార్టీ వ్యవస్థ మానవతకు విరుద్ధం. పార్టీలు లేకుండా రాజ్యాలు ఉంటానికి ప్రణాళికలు రూపు పరచటానికి మనిషి వికసించటానికి సాధ్యమయ్యేరీతులన్నవి. దీనికి ప్రజా ఉద్యమం అవసరం. రాజకీయ ఆర్థిక వికేంద్రీకరణ జరగాలి. ప్రజా సామ్యం ప్రజల మధ్య నిలబడాలి. అనగా సార్వభౌమాధికారం ఎవరికీ ఎన్నడూ దత్తం చేయ కూడదు. దీని అంతటికీ ప్రజలలో మానసిక సరిణితికావాలి. నవ్యమానవతా వాదులు ప్రజలలో ఈ సిద్ధాంతాలు ప్రచారం చేయాలి. ఏ సిద్ధాంత విజయమైనా వైజ్ఞానిక ప్రాతిపదికగల విద్యపై ఆధారపడుతుంది. దీనికి ప్రతి బంధకంగా నిలిచే మతం రూపు మాసిపోవాలి. అంటే సమాజం సెక్యులర్ అయితే తప్ప రాజ్యం సెక్యులర్ కాదన్న మాట.

నవ్య మానవతా సిద్ధాంతం రాయ్ దృష్టిలో ఒక మార్గమేగాని వేదంకాదు. వైజ్ఞానికంగావచ్చే అభివృద్ధి దృష్ట్యా ఎప్పటి కప్పుడు సిద్ధాంతాలు పున పరిశీలించు కుంటూ అవసరమైతే మార్చుకుంటూ పురోగమించటం శాస్త్రీయదృక్పథం.

రాయ్ తన సిద్ధాంతాల ప్రతిపాదనలో క్రమత్వాన్ని పెంపొందింపచేసాడు. ఈ పద్ధతి మార్క్సనుండి ఆయనకు పట్టు పడిందనీ. అది సరైనది కాదని ప్రకృతి తత్త్వాన్ని, సామాజిక తత్త్వాన్ని వేరు చేసి చూడాలని రాయ్ విమర్శకులు వేరొక్కంటున్నారు. ఆయన చూపిన కార్య కారణత సంబంధాలు ప్రకృతిలోగాని మానవునిలోగాని ఇదమిత్థమైనది నిర్ధారించటానికి వీలు లేదని కూడా కొన్ని విమర్శలు లేక పోలేదు. అట్లాగే పార్టీలు లేని నిర్మాణాత్మక ప్రజా స్వామ్యాన్ని

కొందరు సందేహిస్తున్నారు. కార్య కారణతకు సంబంధిం
అత్యంత ఆధునికమైన న్యూక్వాంటమ్ సిద్ధాంతాల వరకు
రాయ్ క్షుణ్ణంగా పరిశీలించి తన వాదనకు ఆధారాలు చూ
ట్టాడు. పార్టీలు లేని ప్రజాస్వామ్య వ్యవస్థకు సంబంధించి
రాయ్ చెప్పినది కేవలం అనుభవాధారితమైనది. పార్టీవ్యవస్థపై
ఆయన చేసిన విమర్శలు ఎవరూ కాదన లేక పోయారు. ప్రత్యా
మ్నాయానికి సంబంధించి ఇంతవరకూ ఆచరణ జరగలేదు
గనుక మంచి చెడ్డలు నిర్ధారించటం సాహసమవుతుంది.

ఆధునిక భారతీయ తత్త్వవేత్తలలో విజ్ఞాన శాస్త్రీయ
ధారంగా సిద్ధాంతాలు చెప్పిన ఏకైక వ్యక్తి ఎం. ఎన్. రాయ్
అందులో గుణదోషాల నూట అట్లాఉంచి ఆయన చూపిన
శాస్త్రీయ పద్ధతి అనుసరణీయం.

REFERENCE BOOKS

1. **M. N. Roy's Memoirs :** Allied (1964).
2. **Ed. G. Adhikari :** Documents of the History of CPI (1971).
3. **Muzaffar Ahmed :** Myself and CPI (1970).
4. **Haithcox :** Communism and Nationalism in India 1971.
5. **Robert C. North :** M. N. Roy's Mission in China.
6. **Overstreet & Windmiller :** ~~Commission~~ in India.
7. **J. C. Jahari :** Political Biography of a Revolutionary Philosopher.
8. **M. N. Roy :** Reason Romanticism Revolution Vol.

arties Power Politics.

hilosophical Consequences of Modern Science (Files).

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D. P. R. I.
Acc. No.

0 242

BCI

AqUA101B120

13C

ముఖము ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	AOUA101B120
పుస్తకం పేరు	రామమోహన్ రాయ్ ముండి ఎం ఎన్ రాయ్ వరకు
తారీఖు	31 December 2025
ముందు అట్ట	YES
వెనుక అట్ట	YES
మొత్తం పేజీలు	277
పెద్ద సైజు పేజీలు	NIL
ఖాళీ పేజీలు	
లేని పేజీలు	
తయారు చేసినది	P. Jayalakshmi
పేజీలు విరిచినది	P. Jayalakshmi
స్కాన్ చేసినది	Mandiam
పరీక్ష చేసినది	MADHU MATHI
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	Good